www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

## మే నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు!

12

ఏటీఎం కార్డు సైజులో పంపిణీ.. క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ఫీచర్లు
ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిన వెంటనే పాత వాటి స్థానంలో కొత్తవి
కుటుంబ సభ్యుల జోడింపు, తొలగింపు, స్ప్లిట్ కార్డుల ఆప్షన్లకు అవకాశం
వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలు, హాస్టళ్లకు సన్నబియ్యం
ఈ రబీలో 10 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం: మంత్రి నాదెండ్ల



ఏటీఎం సైజులో ఉన్న స్మార్ట్ రేషన్ కార్డును చూపిస్తున్న మంత్రి మనోహర్

బుధవారం | 2-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 347 |

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం తిథి: పంచమి రా.11:50 తదుపరి షష్ఠి, నక్షత్రం: కృత్తిక ఉ.8.50 తదుపరి రోహిణి, వర్జ్యం: రా.11:38-రా.1:06, దుర్ముహూర్తం: ఉ.11:54-మ.12:43, అమృతఘడియలు:: ఉ.6:39-ఉ.8:06, తె 4:04-5:33, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:12, సూర్యాస్తమయం: 6:25

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## మినహాయింపుల్లేవ్

ప్రతీకార సుంకాలకు వేళయింది.. అన్ని దేశాలపైనా విధిస్తాం

అధ్యక్షుడు ట్రంప్ దీనిపై నేడు ఒక ప్రకటన చేస్తారు
మా వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ 100 శాతం సుంకాలు
కెనడా, జపాన్, ఈయూ దేశాలూ భారీగా విధిస్తున్నాయ్
తీవ్ర పదజాలంతో ధ్వజమెత్తిన వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ
నా వ్యూహం సరైనదే.. ఈయూ సుంకాన్ని 2.5% తగ్గించింది
భారత్ కూడా సిద్ధమైంది.. మరిన్ని దేశాలూ అదే దారిలో: ట్రంప్



వాషింగ్టన్, ఏప్రిల్ 1: తమ ఉత్పత్తులపై భారీగా దిగుమతి సుంకాలు విధిస్తున్న అన్ని దేశాలపైనా ప్రతీకార సుంకాల విధింపునకు సమయం ఆసన్నమైందని.. ఈ విషయంలో తగ్గేదే లేదని, ఏ దేశానికీ మినహాయింపులు ఇచ్చే ప్రసక్తే లేదని అమెరికా తేల్చిచెప్పింది. "అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ 100 శాతం, పాల ఉత్పత్తులపై ఈయూ దేశాలు 50 శాతం, బియ్యంపై జపాన్ 700 శాతం, వెన్న, చీజ్‌పై కెనడా 300 శాతం చొప్పున సుంకాలను విధిస్తున్నాయి" అంటూ కొన్ని దేశాల పేర్లు చెప్పి మరీ వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కారొలిన్ లెవిట్ అత్యంత తీవ్రమైన పదజాలంతో ధ్వజమెత్తారు. ఇవే కాక ఇంకా చాలా దేశాలు తమ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధించడం ద్వారా అనుచిత వాణిజ్య విధానాలకు పాల్పడుతున్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అధిక సుంకాల కారణంగా ఆయా మార్కెట్లలోకి అమెరికా ఉత్పత్తుల దిగుమతి అసాధ్యంగా మారిందని.. దీనివల్ల కొన్ని దశాబ్దాలుగా ఎంతో మంది అమెరికన్లకు ఉపాధి లేకుండా పోయిందని ఆందోళన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో.. ఇకపై ఆయా దేశాలపై రంగాల ఆధారిత సుంకాలు విధిస్తామని ఆమె తేల్చిచెప్పారు. "దురదృష్టవశాత్తూ ఈ దేశాలన్నీ చాలా కాలంగా మా దేశాన్ని దోచుకుంటున్నాయి. ట్రంప్ విధించే కొత్త సుంకాలు అమెరికా వాణిజ్య బంధాల్లో చరిత్రాత్మక మార్పు తెస్తాయి." అని కారొలిన్ పేర్కొన్నారు. ప్రతీకార సుంకాల అమలు నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్టు అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారని.. దీనిపై బుధవారం ఆయన ఒక ప్రకటన చేస్తారని ఆమె

మిగతా 2వ పేజీలో...




## మార్కెట్లో ట్రంప్ సుంకంపం

సెన్సెక్స్ 1,390 పాయింట్లు పతనం
భారీ నష్టాలతో 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభం
23,200 దిగువ స్థాయికి జారిన నిఫ్టీ
రూ.3.44 లక్షల కోట్ల సంపద ఉఫ్

10

## చిన్న కాంట్రాక్టర్లకు చిల్లు!





ఐప్యాక్ పనులకు మాత్రం బిల్లులు

### మేస్త్రిగా మారిన కాంట్రాక్టర్

2014-19 మధ్య పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఒక కాంట్రాక్టరు చిన్న చిన్న పనులు చేశారు. ఆయనకు రావాల్సిన బిల్లుల మొత్తం రూ.30 లక్షలు. దీని కోసం అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. జగన్ సర్కారు పట్టించుకోలేదు. దీంతో కోర్టును ఆశ్రయించారు. అక్కడ ఆయనకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చినా... పైసా విడుదల కాలేదు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు. స్థాయికి మించి అప్పుల్లో మునిగిపోయాడు. కుటుంబాన్ని పోషించడం కోసం ఇప్పుడు తాపీ మేస్త్రిగా పనులకు వెళ్తున్నాడు. ఈయన దయనీయ స్థితిని తోటి కాంట్రాక్టర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా... స్పందన లేదు.

ఎన్నికల ముందు ఐప్యాక్ సూచనలతో పనులు
నేడు రాజకీయ ఒత్తిళ్లతో వాటికి చెల్లింపులు
సర్కారు మారినా... పాత కాంట్రాక్టర్లకు కష్టాలే
2014-19లో చేసిన బిల్లులు ఇంకా పెండింగే
ఇప్పుడు గుంతలు పూడ్చిన తమ్ముళ్లకూ బిల్లుల్లేవ్
రూ.కోటిలోపు బకాయిల చెల్లింపు ఉత్తుత్తిదేనా!?
1200 కోట్లలో సగం జగన్ హయాం పనులకే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు జగన్ సర్కారు చుక్కలు చూపించింది. కోర్టులకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకున్నా బిల్లులు చెల్లించలేదు. ఈ సంగతి అందరికీ తెలిసిందే! మరి ఇప్పుడేం జరుగుతోందో తెలుసా?

'వైసీపీ అధికారంలో లేదు' అనే లోటు ఏమాత్రం తెలియకుండా... జగన్ హయాంలో, కేవలం రాజకీయ కోణంలో

మిగతా 12వ పేజీలో...

### వీవీఐపీ పనులు చేయలేం

వీవీఐపీ ప్రోగ్రామ్... అంటే ముఖ్యమంత్రి పర్యటన సమయంలో కుర్చీలు, బారికేడ్లు, షామియానాల వంటి పనులు చేసే కాంట్రాక్టర్ల బిల్లులు కొన్ని ఐదేళ్లుగా, మరికొన్ని తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. 2014-19లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఈ పనులు చేసిన బిల్లులను జగన్ సర్కారు చెల్లించనే లేదు. ఒక్కొక్కరికి పాతిక లక్షల్లోపే పెండింగ్‌లో ఉంటాయి. ప్రభుత్వం తాజాగా చేసిన ప్రకటన ప్రకారం... వీళ్లందరికీ చెల్లింపులు జరగాలి. కానీ... పైసా రాలేదు. ఇటీవల చంద్రబాబు తణుకు వెళ్లినప్పుడు, అక్కడ పనులు చేయడానికి కాంట్రాక్టర్లెవరూ ముందుకు రాలేదు. అధికారులు నానా తంటాలు పడి వాళ్లనూ వీళ్లను బతిమాలి ఏర్పాట్లు చేయించారు.

గాజువాకలో ఒక కాంట్రాక్టరు 2018 డిసెంబరులో పాఠశాల గదులను నిర్మించారు. బిల్లు రూ.63 లక్షలు. జగన్ ఉన్న ఐదేళ్లూ ఈ బిల్లు క్లియర్ కాలేదు. ఇప్పుడు రూ.కోటిలోపు బిల్లులు చెల్లిస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనతో ఆ కాంట్రాక్టరు తన కష్టం తీరుతుందనుకున్నారు. కానీ... ఇదీ క్లియర్ కాలేదు. ఏడేళ్లుగా అదే కష్టం!



బాపట్ల జిల్లా చినగంజాం మండలం కొత్తగొల్లపాలెంలో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో వృద్ధురాలితో ముచ్చటిస్తున్న సీఎం చంద్రబాబు

నాకు కష్టపడే తత్వం ఉంది. సంపద సృష్టించి పేదలకు పంచే సంకల్పం కూడా ఉంది. అయితే, ఒక్క రోజులోనే అన్నీ పూర్తి కావు. సమయం పడుతుంది. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెడతా. 2029 కల్లా తలసరి ఆదాయాన్ని రూ.5,20,000కు చేరుస్తా. 2047కల్లా దానిని రూ.55 లక్షలకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పని చేస్తున్నా. పేదరికం లేని సమాజాన్ని చూడడమే నా లక్ష్యం.

\- సీఎం చంద్రబాబు

## మా పింఛన్ల ముందు ఆ బటన్లెంత?

పంపిణీ తొలిరోజే 98 శాతం మందికి లబ్ధి
ప్రజలే ఫస్ట్.. ఆ తర్వాతే మిగిలినవన్నీ
2029 కల్లా పేదరిక నిర్మూలనే లక్ష్యం
తలసరి ఆదాయం 5.2 లక్షలకు చేరుస్తా
పీ4ను విమర్శిస్తే సహించేది లేదు
జూన్ చివరికల్లా భారీగా టీచర్ పోస్టుల భర్తీ
సంకల్పమున్నా ఒక్క రోజులో అన్నీకావు
బాపట్ల జిల్లా కొత్తగొల్లపాలెంలో పింఛన్ల పంపిణీ, పీ 4 కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

### రాష్ట్రాన్ని పునర్నిర్మించేవరకు విశ్రమించను: సీఎం

బాపట్ల/పర్చూరు(చీరాల), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : "గతంలో బటన్లు నొక్కి దానినే ఘనతగా చెప్పుకొనేవారు. ఆ బటన్లేవీ మేం ఇప్పుడు ఇస్తున్న పింఛన్లకు సరితూగవు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నెలలో మొదటి తేదీనే ఇంటింటికి వెళ్లి 98 శాతం పింఛన్లు పంపిణీ చేయగలుగుతున్నామని, ఇందుకు అధికార యంత్రాంగాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. మళ్లీ రాష్ట్రాన్ని పునర్నిర్మించే వరకు విశ్రమించేది లేదని స్పష్టంచేశారు. మంగళవారం బాపట్ల జిల్లా చినగంజాం మండల పరిధిలోని కొత్త గొల్లపాలెం గ్రామంలో ఎన్టీఆర్ పింఛన్ల

మిగతా 13వ పేజీలో...



2

## నిత్యానంద సజీవ సమాధి?

హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రాణత్యాగం
మేనల్లుడు సుందరేశ్వరన్ ప్రకటన
విషాదంలో మునిగిపోయిన భక్తగణం
ఆ రూ.4 వేల కోట్ల ఆస్తులు ఎవరికి సొంతం?

## నేడు సీబీజీ ప్లాంట్‌కు భూమిపూజ

మంత్రి లోకేశ్, అనంత్ అంబానీ హాజరు
ప్రకాశం జిల్లా పీసీపల్లిలో సర్వం సిద్ధం

3

## బర్డ్‌ఫ్లూతో రెండేళ్ల చిన్నారి మృతి

నరసరావుపేటలో నిర్ధారణ

14

## బుల్డోజర్ న్యాయం అమానవీయం

'నిలువ నీడ' ప్రాథమిక హక్కులో భాగం
అధికారుల చర్య దౌర్జన్యపూరితం
బాధితులకు 10లక్షల చొప్పున పరిహారం
యూపీ సర్కారుకు సుప్రీంకోర్టు ఆదేశాలు

2

## ఆ అధికారి అహంకారం ఖరీదు 11 కోట్లు!

టోల్ రుసుము పెంచడంలో నిర్లక్ష్యం
ఆర్అండ్‌బీ కాంట్రాక్టర్‌తో దురుసు ధోరణి
నిబంధనలతో కోర్టుకెళ్లిన కాంట్రాక్టర్
కింది స్థాయి నుంచి పైవరకూ గెలుపు
అన్ని కోర్టుల్లోనూ ఓడిన అధికారి వాదన
రూ.8.94 కోట్లు చెల్లించాలన్న కోర్టు
ఈ నెల 15 వరకు గడువు.. లేకపోతే అతిథి గృహం అమ్మివ్వాలని ఆదేశం
రూ.2.06 కోట్ల ఖర్చులతో సహా రూ.11 కోట్ల భారం
2015 నాటి కేసుపై ఆర్అండ్‌బీలో తీవ్ర చర్చ



రోడ్లు భవనాల శాఖలో ఓ అధికారి చూపిన అహంకారం.. ఏకంగా రూ.11 కోట్లకు ఎసరు పెట్టింది. ఓ కాంట్రాక్టర్‌తో లడాయి పెట్టుకుని టోల్ ఫీజు రుసుము పెంచడంలో చూపిన నిర్లక్ష్యం కోర్టు మెట్లు ఎక్కేవరకు సాగింది. ప్రతిస్థాయిలోనూ సదరు అధికారి వాదన వీగిపోయి.. సర్కారు భారీ మూల్యం చెల్లించే వరకు తెచ్చింది. ఈ నెల 15 నాటికి కాంట్రాక్టర్‌కు 2.06 కోట్ల ఖర్చులతో సహా రూ.8.94 కోట్లు చెల్లించాలని కోర్టు తీర్పు చెప్పింది. సొమ్ములు చెల్లించకపోతే అతిథి గృహాన్ని విక్రయించైనా ఇవ్వాలని తెగేసి చెప్పింది.

(అమరావతి/విజయవాడ-ఆంధ్రజ్యోతి)

'కాంట్రాక్టర్ అంటే మా కింద పనిచేసేవాడు. మా చెప్పుచేతల్లో ఉండేవాడు' అని కొందరు ఉన్నతాధికారులు భావిస్తారు. ఈ నేపథ్యంలోనే ఎక్కడా లేని ఇగో, అధికార దర్పాన్ని ప్రదర్శిస్తారు. ఆ తరహా వ్యవహారం రివర్స్ అయితే మాత్రం. తమకు సంబంధం లేదని తప్పించుకుంటారు. అంతిమంగా ప్రభుత్వంపై మోయలేని ఆర్థికభారం మోపుతుంటారు. ఇలాంటి వ్యవహారమే రోడ్లు భవనాల శాఖ(ఆర్ అండ్ బీ)లో వెలుగుచూసింది. ఒప్పందం ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా తన టోల్ ఫీజులు

మిగతా 13వ పేజీలో...



మంగళవారం లోక్‌సభలో నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష సభ్యులు

## వక్ఫ్‌పై ఢీ అంటే ఢీ!

నేడే లోక్‌సభలో బిల్లు
చర్చకు 8 గంటలు కేటాయింపు
బీఏసీ నుంచి ప్రతిపక్షాలు వాకౌట్
మైనారిటీల్లో అనవసర భయాలు సృష్టిస్తున్నారన్న మంత్రి రిజిజు
బిల్లు రాజ్యాంగ విరుద్ధమని సభలోనే చెబుతా: ఒవైసీ
ఎంపీలకు బీజేపీ, కాంగ్రెస్ విప్ జారీ
బిల్లుపై వైఖరి స్పష్టం చేయని నితీశ్
**వక్ఫ్ బిల్లుకు టీడీపీ మద్దతు**
పార్టీ సూచించిన సవరణలకు ఆమోదం నేపథ్యంలో నిర్ణయం


న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుపై అధికార, ప్రతిపక్షాలు అమీతుమీకి సిద్ధమయ్యాయి. ఈ బిల్లును మోదీ ప్రభుత్వం బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. వెంటనే చర్చ కూడా జరుగుతుంది. స్పీకర్ ఓం బిర్లా ఇందుకు 8 గంటల సమయం కేటాయించారు. అయితే బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్న విపక్షాలు.. మంగళవారం జరిగిన సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) సమావేశం నుంచి వాకౌట్ చేశాయి. ముస్లింల హక్కులను లాక్కునేందుకే బీజేపీ ఈ బిల్లును తీసుకొస్తోందని, ఇది రాజ్యాంగవిరుద్ధమని

మిగతా 2వ పేజీలో...

## వివేకా హత్య కేసు విచారణలో ఏం జరుగుతోంది?

ఫైళ్లు తెరవడానికి ఇంకా ఎన్నేళ్లు?

సీబీఐని ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు
19 నెలలుగా ఒకే దశలో కేసు విచారణ
ముందుకు కదలడం లేదని వ్యాఖ్య
పిటిషన్లపై 16న పూర్తిస్థాయి వాదనలు





హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో ఏం జరుగుతోందని తెలంగాణ హైకోర్టు సీబీఐని ప్రశ్నించింది. గత 19 నెలలుగా సీబీఐ కోర్టులో విచారణ ఒకే దశలో ఉందని.. ముందుకు కదలడం లేదని వ్యాఖ్యానించింది. 'సీఆర్పీసీ 207 (ప్రాసిక్యూషన్ పత్రాల కాపీలను నిందితులకు అందజేయడం) దశ దాటడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుంది? సీబీఐ సమర్పించిన హార్డ్‌డిస్క్‌లలోని మొత్తం 13 లక్షల పత్రాలలో దాదాపు 11 లక్షలు తెరవడానికి ఇంకా ఎంత సమయం పడుతుంది' అని అడిగింది. వివేకా హత్య కేసులో నిందితుడైన దస్తగిరికి కడప కోర్టు క్షమాభిక్ష పెడుతూ అప్రూవర్‌గా గుర్తించడాన్ని సవాల్ చేస్తూ.. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న వైఎస్ భాస్కర్‌రెడ్డి, వివేకా పీఏ ఎంవీ కృష్ణారెడ్డి వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. దస్తగిరిని సాక్షిగా గుర్తిస్తూ నాంపల్లి సీబీఐ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ నిందితులు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. మొత్తం మూడు వ్యాజ్యాలపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్

మిగతా 12వ పేజీలో...



2

## చైనాలో ఎగిరే ట్యాక్సీలు!

కమర్షియల్‌గా వినియోగించేందుకు రెండు సంస్థలకు అనుమతులు

## విచారణకు హాజరవ్వాల్సిందే



రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ ప్రభావతికి సుప్రీం ఆదేశం

14

ఇప్పుడు వాస్తవం ఏమిటో తెలియాల్సి ఉందని వ్యాఖ్య
సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌కు నోటీసులు
4 వారాల్లో కౌంటర్ దాఖలుకు సుప్రీం ఆదేశం



## 900 ఔషధాల ధరలు పెంపు

ఫార్మా కంపెనీలకు ఎన్‌పీపీఏ అనుమతి

2

జాబితాలో గుండె జబ్బులు, మధుమేహం, ఇన్‌ఫెక్షన్లకు చికిత్సను అందించే మందులు

## భూకంపాలను ముందే పసిగట్టేస్తా



మయన్మార్ భూకంపం గురించి ముందే చెప్పా
ముందస్తు గుర్తింపునకు ప్రత్యేక అల్గారిథమ్
త్వరలో ధర్మశాల, తవాంగ్‌లో భారీ భూకంపాలు వచ్చే ప్రమాదం

11

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

'ఆంధ్రజ్యోతి'కి యువ ఇంజనీర్ శివ ఇంటర్వ్యూ

# ముద్దుకు రూ.50 వేలు

- వ్యాపారిపై వలపు వల.. రూ.17 లక్షలు వసూలు
- చాట్ డిలీట్ చేసేందుకు అర కోటి డిమాండ్
- ప్రీస్కూల్ నిర్వాహకురాలు, ఇద్దరు రౌడీషీటర్ల అరెస్టు



బెంగళూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఓ వ్యాపారిపై వలపు వల విసిరి.. డబ్బు కోసం బెదిరించిన ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ సహా, ఇద్దరు రౌడీషీటర్లను బెంగళూరు సీసీబీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.బెంగళూరు మహాలక్ష్మి లే అవుట్‌లో శ్రీదేవి అనే యువతి ప్రీ స్కూల్ నిర్వహిస్తోంది. ఇదే ప్రాంతానికి చెందిన వ్యాపారి తన పిల్లలను 2023లో ఆ స్కూల్లో చేర్చారు. ఈ క్రమంలో ఆయనతో శ్రీదేవికి పరిచయమైంది. పాఠశాల నిర్వహణ, ఇతర అవసరాలకు అతని నుంచి రూ2 లక్షలు అప్పుగా తీసుకుని, 2024లో తిరిగి చెల్లిస్తానని హామీ ఇచ్చింది. ఆ తరువాత వారి మధ్య స్నేహం కాస్త ముందుకెళ్లింది. మొదట్లో ఒక ముద్దు పెట్టేందుకు శ్రీదేవి ఏకంగా రూ.50 వేలు వసూలు చేసింది. అప్పుగా తీసుకున్న మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని ఈ ఏడాది జనవరిలో వ్యాపారి అడగడంతో ఏం కావాలో చెబితే.. ఒకేసారి ఫైనాన్స్ వ్యవహారాలు సెటిల్ చేసుకుందామని శ్రీదేవి ప్రతిపాదించింది. లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉందామని చెప్పి.. అత్యవసరంగా రూ.15 లక్షలు అడిగి తీసుకుంది. ఫిబ్రవరిలో మరోసారి డబ్బులు డిమాండ్ చేసింది. దీంతో విసుగు చెందిన వ్యాపారి ఆమెకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో మార్చి 12న వ్యాపారి భార్యకు శ్రీదేవి ఫోన్ చేసి, 'మీ పిల్లల టీసీలు ఇస్తాం. మీ భర్తను పంపండి' అని సూచించింది. ఈ మేరకు ఆయన పాఠశాల వద్దకు వెళ్లేసరికి బిజాపూర్‌కు చెందిన రౌడీషీటర్లు గణేశ్ కాలె, సాగర్ మొరె అక్కడ ఉన్నారు. వాగ్వాదం తరువాత వ్యాపారి ఇంటికి వెళ్లి కోటి రూపాయలు డిమాండ్ చేశారు. చివరకు రూ.20 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అడ్వాన్స్‌గా రూ.1.90 లక్షలు తీసుకుని వదిలేశారు. మార్చి 17న వ్యాపారికి శ్రీదేవి ఫోన్ చేసి రూ.50 లక్షలు ఇస్తే అశ్లీల వీడియోలు, చాటింగ్ డిలీట్ చేస్తానని, లేదంటే నీ భార్యకు పంపుతానని బ్లాక్ మెయిల్ చేసింది. దీంతో వ్యాపారి సీసీబీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు, ప్రీస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవితోపాటు గణేశ్ కాలె, సాగర్ మొరెను అరెస్టు చేశారు.

## బాణసంచా గోదాముల్లో పేలుళ్లు.. 29 మంది మృతి.. 9 మందికి గాయాలు

పాలన్‌పూర్/కోల్‌కతా, ఏప్రిల్ 1: గుజరాత్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరిగిన రెండు వేర్వేరు బాణసంచా ప్రమాదాల్లో 29 మంది మృతిచెందారు. 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. గుజరాత్‌లోని బనస్కాంత జిల్లా దీసా పారిశ్రామిక ప్రాంతంలోని ఓ బాణసంచా గోదాంలో బాయిలర్ పేలి భారీగా మంటలు చెలరేగాయి. మంగళవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో 21 మంది మృతిచెందగా.. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారంతా మధ్యప్రదేశ్‌కు చెందిన వారని ఎస్పీ అక్షయరాజ్ మక్వానా తెలిపారు. గుజరాత్ సీఎం భూపేంద్ర మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. మరో ఘటన పశ్చిమ బెంగాల్ దక్షిణ 24 పరగణా జిల్లాలో జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు పిల్లలు సహా ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మరణించగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. పత్తర్ ప్రతిమా ప్రాంతంలోని చంద్రకాంత్ బెనిక్ అనే వ్యక్తికి చెందిన బాణసంచా కర్మాగారంలో సోమవారం రాత్రి ఈ పేలుడు సంభవించింది.

## రాజకీయాలు నాకు ఫుల్‌టైం జాబ్ కాదు!

- పార్టీ నన్ను యూపీ సీఎంగా కూర్చోబెట్టింది: యోగి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: ఓవైపు ప్రధాని మోదీ రిటైర్మెంట్‌పై ప్రచారం జరుగుతుండగా.. మరోవైపు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా తన రాజకీయ భవిష్యత్ గురించి మాట్లాడారు. భావి ప్రధాని మీరేనా అని మంగళవారం ఓ విలేకరి అడుగగా.. 'నేను రాష్ట్ర సీఎంగా ఉన్నాను. ఉత్తరప్రదేశ్ ప్రజల కోసం పార్టీ నన్నిక్కడ కూర్చోబెట్టింది. రాజకీయాలు నాకు ఫుల్‌టైం జాబ్ కాదు. వాస్తవానికి నేనో యోగిని. కానీ ఇక్కడున్నంత కాలం పనిచేస్తూనే ఉంటా. అయితే దీనికీ ఓ కాలపరిమితి ఉంటుంది' అని వ్యాఖ్యానించారు. కాగా.. 2019 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలోని 80 స్థానాలకు గాను బీజేపీ 33 సీట్లే గెలవడం.. గతం కంటే 29 తగ్గిపోవడంతో యోగిపై ఆ పార్టీ అధిష్ఠానం తీవ్ర అసంతృప్తితో ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ అంశాన్ని ఆయన వద్ద ప్రస్తావించగా.. అధిష్ఠానంతో తనకెలాంటి విభేదాలూ లేవని యోగి స్పష్టంచేశారు.

## బుల్డోజర్ న్యాయం అమానవీయం: సుప్రీం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: అక్రమ నిర్మాణాల పేరుతో ఇళ్లను కూల్చివేస్తూ బుల్డోజర్ న్యాయం అమలు చేస్తున్నందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై మంగళవారం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టబద్ధంగా తగిన ప్రక్రియను పాటించకుండా ఇళ్లను కూల్చివేయడం 'అమానవీయం, అక్రమం' అని వ్యాఖ్యానించింది. ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు వంతున పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ప్రయాగ్‌రాజ్‌లోని లుకేర్‌గంజ్‌లో ప్రయాగ్‌రాజ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీడీఏ) ఇళ్లను కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. "ఇలాంటి కేసులు మన అంతరాత్మను షాక్‌కు గురిచేస్తాయి. అధికారులు దౌర్జన్యపూరితంగా వ్యవహరించి నివాసాలను కూల్చి వేశారు. శిధిల భవనం వద్ద ఓ చిన్న బాలిక దీనంగా నిల్చొని ఉన్న వీడియో వైరల్‌గా మారింది. ఇలాంటి దృశ్యాలు కలచివేస్తాయి. నిలువ నీడను కలిగి ఉండే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో పొందుపరిచిన ప్రాథమిక హక్కులో అంతర్భాగం" అని వ్యాఖ్యానించింది. ఇదిలా ఉండగా, ప్రార్థనా స్థలాల చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలయ్యే కొత్త వ్యాజ్యాలను స్వీకరించబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒకే అంశంపై పలు విచారణలను అంగీకరించబోమని తెలిపింది.

## త్వరలోనే భారత్‌కు వస్తా: సునీతా విలియమ్స్

న్యూయార్క్, ఏప్రిల్ 1: అంతరిక్షం నుంచి చూస్తే భారత్ అద్భుతంగా ఉందని నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ చెప్పారు. త్వరలో తన తండ్రి పుట్టిన భారత్‌కు వెళ్లి అక్కడి ప్రజలతో తన అంతరిక్ష అనుభవాలు పంచుకుంటానని తెలిపారు. తాజాగా ఆమె విల్మోర్‌తో కలసి మీడియాతో మాట్లాడారు. అంతరిక్ష కేంద్రం నుంచి భారత్ ఎలా కనిపిస్తోంది? అని విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆమె.. "అద్భుతంగా ఉంది. హిమాలయాల పైనుంచి మేం వెళ్లిన ప్రతిసారి విల్మోర్ ఫొటోలు తీశారు. ఆ పర్వతాలు అత్యద్భుతం. నా తండ్రి జన్మించిన దేశం వెళతాను. అక్కడి ప్రజలతో మమేకం అవుతాను. త్వరలో చేపట్టే యాక్సియమ్ మిషన్‌లో భారతీయుడు శుభాంశు భాగస్వామి కావడం అద్భుతంగా అనిపిస్తోంది. అతన్ని ఏదో సమయంలో కలుస్తాను. మా అంతరిక్ష అనుభవాలు అందరితో పంచుకుంటాం" అని విలియమ్స్ చెప్పారు. గుజరాత్‌కు చెందిన సునీతా విలియమ్స్ తండ్రి దీపక్ పాండ్యా.. 1958లో మెడిసిన్‌లో రెసిడెన్సీ శిక్షణకు, ఇంటర్న్‌షిప్ కోసం అమెరికాలోని ఓహియోకు వెళ్లారు. సునీతా విలియమ్స్ అక్కడే జన్మించారు.

APPOINTMENTS

SESHADRI RAO
GUDLAVALLERU ENGINEERING COLLEGE
(An Autonomous Institute with Permanent Affiliation to JNTUK, Kakinada)
Seshadri Rao Knowledge Village, GUDLAVALLERU - 521 356. Krishna District, A.P.
Ph: 08674-273737/273888, Website: www.gecgudlavalleru.ac.in

Staff Recruitment

Applications along with bio-data, photocopies of all certificates and pass port size photo are invited from the candidates for the posts of Associate Professors / Assistant Professors in ECE / IOT / CSE / IT / Artificial Intelligence & Data Science / Artificial Intelligence & Machine Learning. Qualification and experience as per AICTE norms. Applications are also invited for the posts of Finance Officer, Estate Manager, Qualified Medical Doctors and Nurses, Resident Wardens for Women & Men Hostels. Applications may be sent on or before 15-04-2025 to careers@gecgudlavalleru.ac.in

SRGEC/Advt/2025, dt. 02-04-2025 Secretary & Correspondent

# వక్ఫ్‌పై ఢీ అంటే ఢీ!



వక్ఫ్ బిల్లును స్పీకర్ ఓం బిర్లాకు సమర్పిస్తున్న జేపీసీ సభ్యులు(ఫైల్)

(మొదటి పేజీ తరువాయి)

అవి ఆరోపిస్తుండగా.. అలాంటిదేమీ జరుగదని.. ముస్లింలలో లేనిపోని భయాందోళనలు సృష్టిస్తున్నారని బీజేపీ విరుచుకుపడుతోంది. గత ఏడాది తీసుకొచ్చిన ఈ వక్ఫ్ సవరణ బిల్లు-2024ను ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి నివేదించిన సంగతి తెలిసిందే. బీజేపీ ఎంపీ జగదంబికా పాల్ నేతృత్వంలోని ఈ కమిటీ పలు సార్లు సమావేశమైంది. ముస్లిం సంఘాలతో, ప్రముఖులతో చర్చించింది. జేపీసీలో విపక్ష సభ్యులు పలు సవరణలు ప్రతిపాదించగా తిరస్కరించింది. టీడీపీ, జేడీయూ సహా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ప్రతిపాదించిన 14 సవరణలను బిల్లులో పొందుపరిచింది. నివేదికను ఇటీవలే స్పీకర్‌కు సమర్పించింది. కొన్ని మార్పులతో సవరణ బిల్లును కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఈ అంశంపై మంగళవారం స్పీకర్ అధ్యక్షతన బీఏసీ సమావేశమైంది. తమ గొంతు నొక్కుతున్నారంటూ విపక్షాలు వాకౌట్ చేశాయి. ప్రతిపక్షాలు చర్చకు అధిక సమయం కేటాయించాలని అడిగాయని.. మణిపూర్ పరిస్థితి, ఓటర్ల ఫొటో గుర్తింపు కార్డుల అంశంపైనా చర్చించాలని కోరాయని.. ప్రభుత్వం పట్టించుకోలేదని లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్ ఆరోపించారు. అయితే చాలా పార్టీలు 4 నుంచి 6 గంటలు చర్చించాలని కోరాయని.. విపక్షాలు 12 గంటలన్నాయని.. చివరకు సభాపతి 8 గంటలు కేటాయించారని.. అయితే సభ కోరితే సమయాన్ని ఆయన పొడిగిస్తారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు వెల్లడించారు. చర్చ నుంచి పారిపోవడానికి రకరకాల సాకులు వెతుకుతున్నాయని విపక్షాలపై మండిపడ్డారు. బుధవారం ప్రశ్నోత్తరాలు పూర్తికాగానే.. మైనారిటీ వ్యవహారాల మంత్రి హోదాలో సభలో తానే బిల్లును ప్రవేశపెడతానని చెప్పారు. బిల్లుపై తప్పుడు సమాచారం వ్యాప్తి చేసి సమాజంలో అశాంతిని రేకెత్తించేందుకు కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఈ బిల్లును క్రైస్తవ సంస్థలు కూడా సమర్థిస్తున్నాయని తెలిపారు. కాగా.. బిల్లును వ్యతిరేకించేందుకు అనుసరించాల్సిన సంయుక్త వ్యూహంపై చర్చించేందుకు 'ఇండీ' కూటమి నేతలు మంగళవారం పార్లమెంటు ప్రాంగణంలో సమావేశమయ్యారు. బిల్లుపై చర్చలో క్రియాశీలంగా పాల్గొనడమే గాక దానికి వ్యతిరేకంగా ఓటేయాలని కూటమి నిర్ణయించినట్లు ఆర్ఎస్పీ ఎంపీ ఎన్కే ప్రేమ్‌చంద్రన్ మీడియాకు చెప్పారు. బుధవారం సభకు హాజరయ్యే ముందు రాహుల్ కాంగ్రెస్ ఎంపీలతో సమావేశం కానున్నారు. వక్ఫ్ బిల్లు ఎలా రాజ్యాంగ విరుద్ధమో తన అభిప్రాయాలను పార్లమెంటు ముందుంచుతానని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. ముస్లింల మతస్వేచ్ఛను హరించేందుకే ఈ బిల్లును తీసుకొస్తున్నారని ఆరోపించారు. 543 మంది సభ్యుల లోక్‌సభలో ప్రస్తుతం 542 మంది ఎంపీలు ఉండగా.. ఎన్డీఏకి 293 మంది, ఇండీ కూటమికి 238 మంది ఉన్నారు. వైసీపీ, ఎంఐఎం సహా ఇతర పార్టీలకు 11 మంది సభ్యులు ఉన్నారు. రాజ్యసభలో మొత్తం 245 మంది సభ్యులు ఉండగా.. 9 ఖాళీల కారణంగా 236 మందే ఉన్నారు. వీరిలో ఎన్డీఏ ఎంపీలు 125 మంది కాగా.. ఇండీ కూటవికి 88 మంది, వైసీపీ, బీజేడీ, బీఆర్ఎస్ సహా ఇతరులకు 23 మంది సభ్యులున్నారు. స్వతంత్రుల మద్దతు కూడగట్టేందుకు కేంద్ర మంత్రులు రంగంలోకి దిగారు. తమ ఎంపీలంతా బుధవారం లోక్‌సభకు హాజరు కావాలని బీజేపీ విప్ జారీచేసింది. బుధవారమే గాక గురు, శుక్రవారాల్లో తప్పక సభకు రావాలని కాంగ్రెస్ కూడా తన ఎంపీలను ఆదేశించింది.

### అలాగైతేనే నితీశ్ మద్దతు?

జేడీయూ సూచించిన మార్పులను జేపీసీ ఆమోదించినా.. ఆ పార్టీ అధినేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్ వక్ఫ్ బిల్లుకు మద్దతుపై ఇంకా తన వైఖరిని స్పష్టం చేయలేదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. దీనిపై జేడీయూ ఎంపీ సంజయ్ ఝా మాట్లాడుతూ.. రాష్ట్రంలో 19 ఏళ్లుగా నితీశ్ ముస్లింల సంక్షేమానికి కృషిచేస్తున్నారని.. వారికి ఇబ్బంది కలిగించే ఎలాంటి చర్యలనూ ఆయన అంగీకరించరని స్పష్టంచేశారు. వక్ఫ్ వ్యవహారాల్లో గతంలో జరిగిన వాటిని తవ్వితీయకూడదని ప్రభుత్వానికి స్పష్టంచేశామని తెలిపారు. ఇందుకు కేంద్రం అంగీకరిస్తేనే మద్దతిస్తామని జేడీయూ షరతు విధించినట్లు సమాచారం.

### బిల్లుకు టీడీపీ, జనసేన మద్దతు

జేపీసీలో సభ్యుడిగా ఉన్న టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు బిల్లులో మూడు మార్పులను ప్రతిపాదించారు. వాటిని ఆమోదించి సవరణ బిల్లులో పొందుపరచినందున ఆ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బిల్లుకు మద్దతు తెలిపేందుకు సభకు హాజరు కావాలని టీడీపీ చీఫ్ విప్ హరీశ్ తమ ఎంపీలకు విప్ జారీచేశారు. పార్లమెంటులో వక్ఫ్ బిల్లుకు మద్దతు తెలపాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా తమ ఎంపీలను ఆదేశించారు.


## దానధర్మాలకు 3,800 కోట్లు

- వీలునామాలో రాసిచ్చిన రతన్ టాటా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటా తన ఆస్తుల్లో సింహభాగం సామాజిక సేవకు, దానధర్మాలకు కేటాయించారు. తన మొత్తం సంపదలో రూ.3,800 కోట్లను తాను నెలకొల్పిన రతన్ టాటా ఎండోమెంట్ ఫౌండేషన్(ఆర్‌టీఈఎఫ్), రతన్ టాటా ఎండోమెంట్ ట్రస్ట్ (ఆర్‌టీఈటీ)కు కేటాయించారు. టాటా సన్స్‌లో రతన్ టాటాకు ఉన్న వాటాలో 70% ఆర్‌టీఈఎఫ్‌కు, మిగిలిన 30% ఆర్‌టీఈటీకి వెళ్తుంది. 2022 ఫిబ్రవరి 23న టాటా గ్రూప్ అధినేత తన చివరి వీలునామాను సిద్ధం చేశారు. టాటా సన్స్‌లో తన వాటాలను ప్రస్తుత వాటాదారుకు తప్ప వేరొకరికి బదిలీ చేయడానికి లేదా విక్రయించడానికి వీల్లేదని తన చివరి వీలునామాలో రతన్ టాటా స్పష్టం చేశారు. బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, వాచీలు, పెయింటింగ్‌లతో పాటు ఇతర ఆస్తుల్లో మూడోవంతును తన ఇద్దరు సవతి సోదరీమణులు షిరీన్ జెబోభోయ్, డీనా జెబోభోయ్ పేరున రాశారు. వాటి విలువ దాదాపు రూ.800 కోట్లు ఉంటుందని అంచనా. టాటాతో అత్యంత సన్నిహితంగా మెలిగిన మాజీ ఉద్యోగి మోహినీ ఎం దత్తా పేరు కూడా వీలునామాలో ప్రస్తావించారు. టాటా, టాటాయేతర కంపెనీలు, గృహాల్లో వాటాలను మినహాయించి, మిగిలిన ఆస్తుల్లో మూడో వంతు వాటాను దత్తా అందుకోనున్నారు. ఆభరణాలతో పాటు తండ్రి నావల్ టాటా నుంచి వారసత్వంగా వచ్చిన జుహూ బంగ్లాలో సగం యాజమాన్య హక్కులను జిమ్మీ టాటా(సోదరుడు) సొంతం చేసుకుంటారు. కాగా, టాటా చివరి వీలునామా ప్రామాణికతను ధ్రువీకరించి, అందులో పేర్కొన్న విధంగా ఆస్తి నిర్వహణకు అనుమతులు కోరుతూ బాంబే హైకోర్టులో గత వారం పిటిషన్ దాఖలైంది.

## లోకం తీరు




## మినహాయింపుల్లేవ్

(మొదటి పేజీ తరువాయి)



వెల్లడించారు. అయితే, ఈ తరహా దూకుడు విధానం అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని ట్రంప్ విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీకార సుంకాలకు సంబంధించి 'విమోచన దినం' పేరిట తాను విధించిన డెడ్‌లైన్ (ఏప్రిల్ 2) సమీపిస్తుండడంతో.. భారతదేశం కొన్ని సుంకాలను గణనీయంగా తగ్గించేందుకు సిద్ధమైందని ట్రంప్ మంగళవారం పేర్కొన్నారు. తాను విధించే ప్రతీకార సుంకాలు.. అమెరికా మిత్రపక్షాలను చైనాకు దగ్గర చేసే అవకాశం ఉందన్న వాదనను ఆయన కొట్టిపారేశారు. తాను అనుసరిస్తున్న వ్యూహంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని.. అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న కార్లపై సుంకాన్ని 2.5 శాతం మేర తగ్గిస్తూ యూరోపియన్ యూనియన్ ఇటీవలే తీసుకున్న నిర్ణయమే ఇందుకు నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. మరికొన్ని దేశాలు కూడా అదే బాటలో నడవబోతున్నాయని ట్రంప్ అన్నారు.

### ట్రేడ్ బారియర్స్ నివేదిక..

ఇతర దేశాల ఉత్పత్తుల దిగుమతులను నిరుత్సాహపరిచేలా పలు దేశాలు అనుసరిస్తున్న పన్ను, పన్నేతర విధానాలు, విధిస్తున్న నియమనిబంధనల జాబితాతో కూడిన 397 పేజీల నివేదికను ట్రంప్ సర్కారు విడుదల చేసింది. '2025 నేషనల్ ట్రేడ్ ఎస్టిమేట్ రిపోర్ట్ ఆన్ ఫారిన్ ట్రేడ్ బారియర్స్' పేరిట రూపొందించిన ఈ నివేదిక ప్రకారం..అమెరికా ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న దేశాల జాబితాలో భారత్ ఉంది. కొన్నిరకాల మద్యాలు, వాల్‌నట్స్ తదితరాలపై భారత్ 100-150% సుంకాలు విధిస్తున్నట్టు అందులో వెల్లడించారు. అర్జెంటీనా, మెక్సికో, తదితర దేశాలు విధిస్తున్న విలువ ఆధారిత పన్నులు అమెరికా దిగుమతులకు భారంగా మారాయని వెల్లడించారు.



## చైనాలో ఎగిరే ట్యాక్సీలు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: ఆ ట్యాక్సీలు దూసుకెళ్లేది రోడ్డు మీద కాదు.. రెక్కలు తొడుక్కొని.. రివ్వున గాల్లోకి ఎగిసి.. ప్రయాణికులకు ప్రత్యేక అనుభూతిని మిగుల్చుతూ గమ్యస్థానాలకు చేరవేస్తాయి! మన దేశంలో ఇంకాస్త సమయం పడుతుందేమో గానీ చైనాలో అధికారికంగా ఈ ఎగిరే ట్యాక్సీలు వచ్చేశాయి. వీటికి పైలెట్ అవసరమే లేదు. డ్రోన్ సాయంతో గాల్లో ప్రయాణిస్తాయి. ఈ ఎయిర్ ట్యాక్సీలను కమర్షియల్ ప్యాసింజర్ సర్వీసుల కోసం వినియోగించుకునేందుకు ఈ హ్యాంగ్, హెఫెయి అనే రెండు ఎయిర్‌లైన్స్ సంస్థలకు చైనా ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు ఈ రెండు కంపెనీలకు ఎయిర్ ఆపరేటర్ సర్టిఫికెట్ జారీ చేసింది. రోడ్డు మార్గం సరిగా లేని మారుమూల ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ ఎయిర్ ట్యాక్సీలు ఎంతో అనుకూలం అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## 900 ఔషధాల ధరల పెంపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ పరిధిలోని 'జాతీయ ఔషధ ధరల సాధికార సంస్థ' (ఎన్‌పీపీఏ) 900కిపైగా ఔషధాల ధరల పెంపునకు అనుమతించింది. మంగళవారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ నిర్ణయంతో.. గుండె జబ్బులు, మధుమేహంతో పాటు పలు కీలక ఇన్‌ఫెక్షన్లకు చికిత్సను అందించే ఔషధాల ధరలు గరిష్ఠంగా 1.74% మేర పెరగనున్నాయి. ఈ వివరాల్ని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లోక్‌సభలో లిఖితపూర్వకంగా వెల్లడించారు. ధరలు పెరగనున్న ఔషధాల జాబితాలో అజిత్రోమైసిన్, అమోక్సిసిలిన్, డైక్లోఫెనాక్, ఇబుప్రొఫెన్, డాపాగ్లిఫ్లోజిన్, మెట్‌ఫార్మిన్ హైడ్రోక్లోరైడ్, గ్లిమ్‌పైరైడ్, అసిక్లోవిర్, హైడ్రాక్సీ క్లోరోక్విన్ మొదలైనవి ఉన్నాయి.

## 600 మంది ఉద్యోగులపై జొమాటో వేటు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగించింది. ఏడాది క్రితం విధుల్లోకి తీసుకున్న వారిలో దాదాపు 600 మంది కస్టమర్ సపోర్ట్ అసోసియేట్స్‌పై హఠాత్తుగా వేటు వేసింది. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, ఒక నెల జీతాన్ని పరిహారంగా చెల్లించి సాగనంపింది. పేలవమైన పని తీరు, సమయపాలన పాటించకపోవడాన్ని కారణంగా చూపి వేటు వేసింది. హైదరాబాద్, గురుగ్రామ్‌లోని కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది ఉద్యోగాలు కోల్పోయారు. దీంతో మిగిలిన సిబ్బంది కూడా ఉద్యోగ భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జొమాటో అసోసియేట్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్(జడ్ఏఏపీ) కింద ఏడాది క్రితం 1500 మందిని జొమాటో ఉద్యోగంలోకి తీసుకుంది. వారిలో 600 మందిపైనే ఇప్పుడు వేటు వేసింది. జొమాటో వృద్ధి రేటు మందగించడం, జొమాటో అనుబంధ విభాగం బ్లింకిట్ నష్టాలు పెరుగుతుండడంతో వాటిని తగ్గించుకునేందుకు జొమాటో ఉద్యోగుల సంఖ్యను తగ్గించిందని కథనాలు వెలువడ్డాయి. కస్టమర్ సపోర్ట్ విభాగాల్లో ఏఐ వినియోగంతో నిర్వహణ ఖర్చులను తగ్గించుకోవాలనే ఆలోచనతోనే జొమాటో సిబ్బందిపై వేటు వేసిందని పేర్కొన్నాయి.

# బాల్యం శిథిలం!



## మయన్మార్ భూకంప మృతుల్లో 1,600 మంది చిన్నారులే

- మరో 3 వేల మందికి గాయాలు
- ఆందోళన వ్యక్తం చేసిన యునిసెఫ్
- మాండలే, సికాయ్‌లో మళ్లీ భూకంపం

నేపిడా(మయన్మార్), ఏప్రిల్ 1: భూప్రకోపంతో విధ్వంసాన్ని చవిచూసిన మయన్మార్‌లో బాల్యం ప్రమాదంలో పడిందని ఐక్య రాజ్య సమితి(ఐరాస) అనుబంధ సంస్థ-- అంతర్జాతీయ బాలల అత్యవసర నిధి(యునిసెఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. మార్చి 28 నాటి భూకంపం.. తదనంతర ప్రకంపనలతో జరిగిన విధ్వంసంలో మరణాల సంఖ్య 3,756కు చేరగా.. మృతుల్లో 1,600 మందికి పైగా బాలలు ఉన్నారని యునిసెఫ్ తెలిపింది. మరో 3,400 మంది చిన్నారులు గాయాలపాలైనట్లు పేర్కొంది. "మయన్మార్ బాలలు ఇప్పుడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. గత ఏడాది నుంచి విపత్తులు బాలల పాలిట శాపంగా మారాయి. గత ఏడాది వచ్చిన యాగీ తుఫాను, ఆ తర్వాత థాయ్‌లాండ్, వియత్నాం వరదలతో మయన్మార్ అతలాకుతలమైంది. అంతర్యుద్ధం కూడా బాల్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మయన్మార్‌లో చిన్నారులను కాపాడాల్సిన అవసరం అంతర్జాతీయ సమాజంపై ఉంది" అని యునిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేథరిన్ అన్నారు.

### నిత్యావసరాలకు కటకట

భూకంప ప్రభావిత మాండలే, సికాయ్ తదితర ప్రాంతాల్లో ప్రజలు రోడ్లపక్కన ఫుట్‌పాత్‌లపై, పార్కుల్లో తాత్కాలిక గుడారాలు వేసుకుని, నివసిస్తున్నారు. అయితే.. తాగునీరు, ఆహారం, ఔషధాలు అందక ఇక్కట్లపాలవుతున్నారు. నిత్యావసరాల ధరలకు రెక్కలు రావడంతో.. చిన్నారుల ఆకలి తీర్చేందుకు ఒక కోడిగుడ్డు కూడా కొనలేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. వివిధ దేశాలు పంపుతున్న సాయం తమకు అందడం లేదని పేర్కొంటున్నారు. చాలా ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా లేక.. రాత్రిళ్లు ప్రజలు పాముకాట్లకు గురవుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. సికిన్ నగరంలో ఆరుగురు పాముకాట్ల బారిన పడ్డారు. కాగా.. మాండలే, సికాయ్ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం 4.7 తీవ్రతతో మరోమారు భూకంపం సంభవించింది. మరోవైపు, అల్పపీడనం తీరాన్ని తాకడంతో.. మయన్మార్‌లో వర్షాలు కురుస్తున్నాయి.

### నలుగురు ఖైదీల మృతి

భూకంపంతో ఓబో జైలు తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే..! ఈ ఘటనలో చాలా మంది ఖైదీలు చనిపోయి ఉంటారని వార్తలు వచ్చినా.. నలుగురు మృతిచెందారని మిలటరీ సర్కారు మంగళవారం ప్రకటించింది. అయితే.. మాండలేతోపాటు మిగతా జైళ్లలో రాజకీయ ఖైదీల పరిస్థితి ఏమిటని ప్రభుత్వ మాజీ అధినేత అంగ్‌సాన్ సూకీ ప్రశ్నించారు. మరోవైపు, అస్త్రాలు లేకుండా యుద్ధం చేస్తున్నట్లుగా పరిస్థితి ఉందని సహాయక బృందాలు వాపోతున్నాయి. థర్మల్ ఇమేజింగ్, థర్మల్ డిటెక్షన్ కెమెరాలు, రాడార్లు, డ్రోన్లు లేకుండానే శిథిలాల కింద అన్వేషణను కొనసాగిస్తున్నట్లు తెలిపాయి. దీంతో సహాయక చర్యలు మందకొడిగా సాగుతున్నాయని, మిలటరీ సర్కారు ఆంక్షలు కూడా ఇబ్బందికరంగా మారాయని పేర్కొన్నాయి. కనీసం శిథిలాల్లో ఎవరి జాడనైనా కనిపెడితే.. వారికి ఆక్సిజన్ అందజేసే వెసులుబాటు కూడా లేదని వివరించాయి.

### కొత్త సంవత్సర వేడుకల రద్దు

భూకంపం నేపథ్యంలో బౌద్ధుల కొత్త సంవత్సర(తింగ్‌యాన్) వేడుకలను రద్దు చేస్తున్నట్లు మయన్మార్‌లోని మిలటరీ కౌన్సిల్ ఉత్తర్వులు జారీ చేసింది. నిజానికి ఏటా వారం రోజులపాటు నూతన సంవత్సర వేడుకలు జరుగుతాయి. ఈనెల 17న తింగ్‌యాన్ ఉండగా.. 13 నుంచి 16వ తేదీ వరకు వసంతోత్సవాలు, ఇతర వేడుకలను షెడ్యూల్ చేశారు. సర్కారు తాజా నిర్ణయంతో ఈ వేడుకలు రద్దయ్యాయి.

### విధ్వంసంపై ఇస్రో ఫొటోలు




మయన్మార్ భూకంపం సృష్టించిన విధ్వంసానికి సంబంధించి కార్టోశాట్-3 ఉపగ్రహం తీసిన ఫొటోలను ఇస్రో తాజాగా విడుదల చేసింది. భూకంపానికి ముందు, తర్వాత తేడాలను ఆ చిత్రాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. మార్చి 28న భూకంపం సంభవించగా.. కార్టోశాట్-3 మార్చి 29న మయన్మార్‌లోని మాండలే, సగాయింగ్ నగరాలపై నుంచి ఈ ఫొటోలు తీసింది. వాటితోపాటు మార్చి 18న ఇదే ప్రాంతంపై నుంచి కార్టోశాట్-3 తీసిన చిత్రాలను పక్కపక్కన ఉంచిన ఇస్రో విపత్తుకు ముందు, తర్వాత ఈ ప్రాంతం ఎలా ఉందో స్పష్టంగా తెలియజేసింది.

# నిత్యానంద సజీవ సమాధి?

### ప్రకటించిన మేనల్లుడు సుందరేశ్వరన్



చెన్నై, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు స్వామి నిత్యానంద రెండు రోజుల క్రితం సజీవ సమాధి అయినట్లు ఆయన మేనల్లుడు సుందరేశ్వరన్ ప్రకటించారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం నిత్యానంద ప్రాణత్యాగం చేసి, సమాధి చెందారని సామాజిక మాధ్యమాల ద్వారా వివరించారు. నిత్యానంద అధికారిక వెబ్‌సైట్ గానీ, యూట్యూబ్ చానల్ గానీ సుందరేశ్వరన్ ప్రకటనను ఖండించకపోవడంతో ఆయన భక్తగణం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. అదే సమయంలో నిత్యానంద వేంకటేశ్వర మూర్తి భావసమాధి దర్శనం పేరుతో శ్రీవారి వేషంలో ఆయన దర్శనమిస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వెలువడటం కలకలం రేపుతోంది. కేసుల నుంచి తప్పించుకునేందుకే ఈ సజీవ సమాధి ప్రకటన అంటూ నెటిజన్లు దుయ్యబడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా నిత్యానందకు అభిమానులు, భక్తులు, అనుచరులు పెద్దసంఖ్యలో ఉన్నారు. తిరువణ్ణామలై, బిడది, అహ్మదాబాద్ తదితర 41 ప్రాంతాల్లో ఆయనకు ఆశ్రమాలున్నాయి. 15ఏళ్ల క్రితం నిత్యానంద ఒక ప్రముఖ నటితో సన్నిహితంగా ఉన్న వీడియో సంచలనం సృష్టించింది. వందలాది మంది మహిళా శిష్యురాళ్లను తప్పుదారి పట్టించడం, మనీలాండరింగ్‌కు పాల్పడటంతో పాటు భూకబ్జాలకు సంబంధించి ఆయనపై పలు ఆరోపణలున్నాయి. బెంగుళూరు, అహ్మదాబాద్‌లో మహిళలపై నిత్యానంద అత్యాచారం చేసినట్లు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో 2020లో దేశం వదిలిపోయిన నిత్యానంద.. పసిఫిక్ దీవుల్లో కైలాస' పేరుతో దేశాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు ప్రకటించారు.

### ఆ ఆస్తులన్నీ రంజితకేనా..?

స్వామీజీ అవతారంలో ఉన్నప్పటికీ నిత్యానంద విలాసవంతమైన జీవితాన్నే అనుభవించారు. రూ.వందల కోట్లతో కైలాస దీవి కొనుగోలు చేసినట్లు సన్నిహిత భక్తులు చెబుతున్నారు. ఆయన ఆస్తుల విలువ దాదాపు రూ.4వేల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇప్పుడు ఆయన మరణించినట్లు వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో.. ఆ ఆస్తులన్నీ ఎవరికి చెందుతాయనే చర్చ మొదలైంది. సుదీర్ఘకాలంగా నిత్యానంద శిష్యురాలిగా, భాగస్వామిగా ఉన్న నటి రంజితకే అవన్నీ చెందుతాయని శిష్యగణం చెబుతోంది. వాటి నిర్వహణ బాధ్యతలు కూడా చూస్తున్నారని భక్తులు చెబుతున్నారు.



భూమిపూజ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

## నేడు సీబీజీ ప్లాంట్‌కు భూమిపూజ

» నారా లోకేశ్, అనంత్ అంబానీ హాజరు

» 459 ఎకరాల్లో రూ.135 కోట్లతో ఏర్పాటు

» ప్రకాశం జిల్లా పీసీపల్లిలో సర్వం సిద్ధం

అమరావతి, ఒంగోలు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రిలయన్స్ గ్రీన్ ఎనర్జీ సంస్థ రాష్ట్రంలో కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టనుంది. ఈ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా నెలకొల్పనున్న 500 సీబీజీ ప్లాంట్లలో భాగంగా తొలి ప్లాంటుకు బుధవారం భూమి పూజ జరగనుంది. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి మండలం దివాకరపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేయనున్న ఈ ప్లాంటుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ శంకుస్థాపన చేయనున్నారు. ప్రకాశం జిల్లాలో కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాల్లో నాలుగు ప్లాంట్ల కోసం 4,900 ఎకరాల భూమిని జిల్లా యంత్రాంగం గుర్తించింది. తొలి ప్లాంట్‌ను కనిగిరి నియోజకవర్గంలో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దివాకరపల్లి వద్ద 459 ఎకరాల్లో రూ.135 కోట్లతో ఈ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మంగళవారం ఈ ఏర్పాట్లను పరిశీలించారు.

### సీబీజీ విప్లవాత్మక మైలురాయి: లోకేశ్

భారత్‌లో 2035 నాటికి కార్బన్ ఉద్గారాలను సున్నా స్థాయికి తేవడమే లక్ష్యంగా సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తిని చేపడతామని ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఇందులో భాగంగా కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ)కు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పారు. రిలయన్స్ సంస్థ రాష్ట్రంలో రూ.65వేల కోట్లతో 500 సీబీజీ ప్లాంట్లను స్థాపించడం విప్లవాత్మక మైలురాయి అన్నారు. వీటి ద్వారా రెండున్నర లక్షల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కర్బన ఉద్గారాలను నివారించేందుకు విజనరీ లీడర్ చంద్రబాబు వినూత్న ఆలోచనలకు తెరతీశారని అన్నారు.

# ప్రగతి రథ చక్రానికి ప్రయాసలు!



» ఏపీఎస్ ఆర్టీసీలో ఎవరి గోల వారిదే

» పనిష్మెంట్లపై డ్రైవర్లు, సిబ్బంది పదోన్నతుల సమస్యపై అధికారులు

» ఆర్నెల్లయినా మీటింగ్ లేదని బోర్డు సభ్యులు

» ఒకరికొకరు చెప్పుకొంటున్న వైనం

ప్రగతి రథ చక్రానికి ప్రయాసల పంక్చర్లు పడుతున్నాయి. ఏపీఎస్ ఆర్టీసీలో సిబ్బంది, ఉద్యోగులు, అధికారులు చివరకు బోర్డు సభ్యులు కూడా 'ఎవరి గోల వారిదే' అన్నట్టుగా ఉన్నారు. చిన్న పొరపాట్లకూ భారీ పనిష్మెంట్లకు గురవుతున్నామని సిబ్బంది, పదోన్నతులు లేకుండానే రిటైరైపోతామేమోనన్న ఆవేదనలో ఉద్యోగులు తల్లడిల్లుతున్నారు. ఇక, బోర్డు ఏర్పడి ఆరు మాసాలైనా ఒక్కసారీ భేటీ కాలేదని.. ఈ మాత్రానికి తామెందుకని బోర్డు సభ్యులు తలపట్టుకుంటున్నారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రజారవాణా సంస్థ ఏపీఎస్ ఆర్టీసీ.. అంతర్గత సమస్యలతో అల్లాడుతోంది. సంస్థలో పనిచేసే చిన్న స్థాయి ఉద్యోగుల నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు, ఆఖరుకు బోర్డు సభ్యుల దాకా సమస్యల్లో చిక్కుకున్నారు. దీంతో ఒకరికొకరు తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. సిబ్బంది వెళ్లి.. తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు చెబుతుంటే.. వారి నుంచి ఊరట లభించకపోగా ఎదురు.. వారి సమస్యలను సిబ్బందికి చెప్పుకొంటున్నారు. అదేవిధంగా ఉన్నతాధికారుల ముందు బోర్డు సభ్యులు సైతం తమ ఆవేదనను వ్యక్తం పరుస్తున్నారు. దీంతో ఎవరిని కదిలించినా.. ఒకరికొకరు తమ తమ సమస్యలు చెప్పుకొంటున్న పరిస్థితి కనిపిస్తోంది.

### బోర్డు బాధ బోర్డుది!

అటు సిబ్బంది, ఇటు అధికారులు క్యూకట్టి మరీ తమకు సమస్యలు విన్నవిస్తుంటే.. వాటిని పరిష్కరించాల్సిన బోర్డు సభ్యులు.. "మీ సమస్యలు మాకు చెబుతున్నారు. మా బాధ ఎవరికి చెప్పాలి" అని నిట్టూరుస్తున్నారు. విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో ప్రతి నోటా ఈ విషయాలే విని పిస్తున్నాయి. సిబ్బందిని పర్యవేక్షించే అధికారులు, వారిని నడిపించి, తీర్మానాలు చేసే పాలకమండలి సభ్యుల వరకు అందరూ అసంతృప్తితోనే ఉన్నారు.

### సర్క్యులర్ ఏం చెబుతోంది?

ఆర్టీసీ సిబ్బంది తప్పు చేస్తే తీసుకోవాల్సిన చర్యలపై 2019లో అప్పటి ఎండీ సురేంద్ర బాబు అధికారులు, కార్మిక సంఘాలతో సుదీర్ఘంగా చర్చించి 1/2019 సర్క్యులర్ తీసుకొచ్చారు. ఎవరైనా కండక్టర్ ప్రయాణ చార్జీ వసూలు చేసి టికెట్ ఇవ్వకపోతే ఉద్యోగం నుంచి తొలగించాలని పేర్కొన్నారు. డ్రైవర్ మద్యం తాగి బస్ నడిపి ప్రమాదానికి కారణమైతే ఉద్యోగం నుంచి తీసేయాలని, అలా కాకుండా ఎదుటి వాహనం వచ్చి ఆర్టీసీ బస్సును ఢీ కొడితే పోలీసు కేసు పెట్టి ఎదుటి వాహనం నుంచి బీమా పరిహారం పొందాలని సూచించారు. పనిష్మెంట్ల విషయమై అందరికీ ఆమోద యోగ్యమైన నిర్ణయాలు అమల్లోకి తెచ్చారు. అయితే, 2020లో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయ్యాక ఆ సర్క్యులర్‌ను అధికారులు పక్కన పెట్టారు. ఇష్టారాజ్యంగా సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నారు. వీటిపై ఎన్ఎంయూ, ఈయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, కార్మిక పరిషత్ తదితర సంఘాలు ఎండీ, మంత్రి, ప్రభుత్వ పెద్దలకు వినతులు ఇచ్చి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

### సిబ్బంది వేదన ఇదీ..

"చిన్న చిన్న పొరపాట్లు, చిన్నపాటి తప్పులకు కూడా గట్టిగానే పనిష్మెంట్ ఇస్తున్నారు సర్. ట్రాఫిక్ సిగ్నల్ జంప్ అయినా, యాక్సిడెంట్ చేసినా ఒక విధంగానే చర్యలు తీసుకుంటున్నారు. ఎండీ సురేంద్ర బాబు హయాంలో ఇచ్చిన 1/2019 సర్క్యులర్ అమలయ్యేలా చూడండి" అని డ్రైవర్లు ఇతర సిబ్బంది ఆర్టీసీ అధికారులకు విన్నవించుకుంటున్నారు.

### అధికారుల ఆవేదన ఇదీ..

"మా ప్రమోషన్లు అన్యాయంగా ఆపేశారు సర్. ఏసీఆర్(ప్రభుత్వ విధానం) స్థానంలో ఎంఎంఆర్(కార్పొరేషన్ ప్రకారం) పెట్టామంటూ 90 మంది ప్రమోషన్లకు బ్రేకులేశారు. బోర్డులో తీర్మానం చేసి న్యాయం చేయండి" అని బోర్డు సభ్యులకు అధికారులు గోడు వెళ్లబోసుకుంటున్నారు.

### బోర్డు మాట ఏంటంటే

ఆయా సమస్యను పలువురు సిబ్బంది ఇటీవల బోర్డు సభ్యుల దృష్టికి తీసుకెళ్లగా.. "మీ పనిష్మెంట్ల సంగతి చూడాలంటే మా బోర్డు మీటింగ్ జరగాలి కదా?. ఆర్నెల్లయినా ఒక్క సమావేశం జరగలేదు. కనీసం మాకు ఆర్టీసీ హౌస్‌లో కూర్చోవడానికి కూడా చోటు లేదు" అని వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే సమయంలో ఆర్టీసీలో డిపో మేనేజర్ నుంచి ఈడీ వరకు 90 మంది ప్రమోషన్లు ఆగిపోయాయి. ఏడాది నుంచి ప్రయత్నించి చివరికి మార్చి చివరి వారంలో డీపీసీ జరగ్గా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వార్షిక రహస్య నివేదిక(ఏసీఆర్) ఉండాలని డీపీసీ తిరస్కరించింది. అయితే కార్పొరేషన్‌లో ఉండే మెరిట్ రేటింగ్ రిపోర్ట్(ఎంఆర్ఆర్) జత చేశామని చెప్పినా వినలేదు. పైగా "ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు కదా.. అదే విధానం పాటించాలి" అంటూ సీనియర్ ఐఏఎస్ అధికారి అభ్యంతరం చెప్పారు. ఈ పదోన్నతుల విషయమై ఆర్టీసీ పాలకమండలి సభ్యుల్ని కలిసి ఈ ఒక్కసారికి ఎంఆర్ఆర్ అనుమతించేలా బోర్డులో తీర్మానం చేసి పంపాలని సంబంధిత అధికారులు విన్నవించారు. "మీకు ప్రమోషన్లు ఆగడం బాధగానే ఉండొచ్చు.. మాకు ఆర్నెల్లుగా జీతాలు కూడా రావట్లేదు. మేం ఎవరికి చెప్పాలి. మీ కన్నా ఎక్కువ బాధలు మాకున్నాయ్. మా చైర్మన్‌కు చెబుదామంటే ఆయనకు కూడా కేబినెట్ హోదా ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో ఆర్టీసీ చైర్మన్‌కు కేబినెట్ హోదా ఉండేది" అని బోర్డు మెంబర్ ఒకరు చేసిన వ్యాఖ్యలతో అధికారుల నోట మాటరాలేదు.

## ముగిసిన టెన్త్ పరీక్షలు



అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. మంగళవారం చివరి పరీక్ష సోషల్ స్టడీస్ జరిగింది. ఈ పరీక్షకు 6,24,742 మందికిగాను 6,17,333 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు సజావుగా సాగేందుకు మార్గదర్శనం చేసిన మంత్రి లోకేశ్‌కు, ఉన్నతాధికారులకు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



విజయవాడలోని ఒక పరీక్షా కేంద్రం వద్ద ఆనందోత్సాహాలతో వీడ్కోలు చెప్పుకొంటున్న విద్యార్థినులు

## విజయవాడ-దుబాయ్ ఫ్లైట్ నడపండి

» ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ చైర్మన్‌కు ఏపీ చాంబర్స్ లేఖ

విజయవాడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దుబాయ్‌కు నేరుగా సర్వీసును ప్రారంభించాల్సిందిగా ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌కు ఏపీ చాంబర్స్ విజ్ఞప్తి చేసింది. ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ గ్రూప్ చైర్మన్, సీఈవో షేక్ అహ్మద్‌బిన్ సయీద్ అల్ మక్తూమ్‌కు ఈ మేరకు అధికారికంగా మంగళవారం లేఖ రాసింది. విజయవాడ నుంచి దుబాయ్‌కు ఉన్న డిమాండ్ రీత్యా గత ఐదేళ్లుగా నేరుగా విమానం నడపాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు పేర్కొన్నారు. ఎమిరేట్ ఎయిర్‌లైన్స్ బృందం ఇటీవల విజయవాడ వచ్చి అధ్యయనం చేసిందని, విమానాశ్రయ సామర్థ్యంపై సంతృప్తి వ్యక్తం చేయటం మంచి పరిణామన్నారు. విజయవాడ, అమరావతి, గుంటూరులను కలుపుతూ సుమారు 20 మిలియన్ల క్యాచ్‌మెంట్ జనాభా పరిధిలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ఉందని తెలిపారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఉభయ గోదావరి జిల్లాల నుంచి 5 లక్షల మంది ప్రవాస భారతీయులు ఉన్నారని, వీరంతా తరచూ యూరప్, మధ్య ప్రాచ్యదేశాలు, యూఎస్‌లకు ప్రయాణిస్తుంటారని తెలిపారు. దుబాయ్‌కు నేరుగా విమాన సర్వీసు లేకపోవటం వల్ల దేశంలోని ఇతర ఎయిర్‌పోర్టుల మీదుగా ప్రయాణించాల్సి వస్తోందని చెప్పారు. విజయవాడ నుంచి దుబాయ్‌కు నేరుగా విమానం నడపగలిగితే 80 శాతం కంటే ఎక్కువ ఆక్యుపెన్సీ ఉంటుందని, ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని డైరెక్ట్ ఫ్లైట్ నడపాల్సిందిగా భాస్కరరావు విజ్ఞప్తి చేశారు.

## ఆధార్ నమోదుకు ప్రత్యేక క్యాంపులు

» ఆరేళ్ల లోపు పిల్లలు, పీవీటీజీల కోసం ఏర్పాటు

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల లోపు పిల్లలకు, ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూపు(పీవీటీజీ)లకు ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టేందుకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేయాలని గ్రామ, వార్డ్ సచివాలయ శాఖ డైరెక్టర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాశారు. ఇప్పటికే మార్చి నెలలో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేశామని, కొనసాగింపుగా ఏప్రిల్ 3 నుంచి 5 వరకు, 8 నుంచి 11వ తేదీ వరకు ఆయా అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్ల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. 1.95 లక్షల మంది పిల్లలు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్నారని, వారందరికీ ఆధార్ నమోదు పెండింగ్‌లో ఉందని తెలిపారు. అదే విధంగా 10 జిల్లాలకు సంబంధించి 34,995 మంది పీవీటీజీలకు ఆధార్ కార్డులు లేవని గిరిజన సంక్షేమశాఖ డేటా ఇచ్చిందన్నారు. గతంలో ఆధార్ కార్డులు లేని పీవీటీజీలకు, పిల్లలకు ఆధార్ కార్డులు ఇవ్వాలని సీఎం ఆదేశించినట్లు పేర్కొన్నారు.

## నీటి వనరుల రికవరీ సెల్‌కు రాష్ట్ర స్థాయి కమిటీ

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జల్ హి అమృత్(జేఎచ్ఏ), అమృత్ 2.0 సంస్కరణలో భాగంగా నీటి వనరుల రికవరీ సెల్ రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీయూఎఫ్ఐడీసీ)ఎండీ చైర్మన్‌గా, ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డు చీఫ్ ఇంజనీర్, జల వనరులశాఖ చీఫ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్ , ట్రాన్స్‌కో ప్రతినిధి, ఏపీఐఐసీ చీఫ్ ఇంజనీర్, గ్రేట్ విశాఖ చీఫ్ ఇంజనీర్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్, ఆంధ్రాయూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ సభ్యులుగా, ఏపీ యూఎఫ్ఐడీసీ చీఫ్ ఇంజనీర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం.127 టు 133/టిఓ/2024-25, తేది: 29.03.2025
గ్రా.నీ.స & పారిశుధ్య విభాగము, మచిలీపట్నం వారిచే కృష్ణా జిల్లా పరిధిలో DMFT & ZP నిధుల నుండి మంజూరు కాబడిన 7 గ్రామీణ నీటి సరఫరా పనులు చేపట్టుటకు అంచనా విలువ: రూ.112.50 లక్షలతో ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్లు 03.04.2025, ఉ.11 గం. నుండి https://tender.apeprocurement.gov.in లో అందుబాటులో ఉండును. ఫోన్: 9494949955.
సం/- కార్యనిర్వాహక ఇంజనీర్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, మచిలీపట్నం
DIPR R.O.No. 16002/CL/ADVT/1/1/2021-22, తేది:01.04.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
వ్యవసాయ మార్కెటింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం.01/2025-26/EE(AM)VJA/AE/K & NTR Dist. Dt: 01.04.2025
రిజిష్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (వ్య.మా) విజయవాడ వారిచే కృష్ణ మరియు NTR జిల్లాలోని వివిధ రైతు బజార్ల యొక్క ఫేస్ లిఫ్టింగ్ 21 పనులు కొరకు అంచనా విలువ: రూ.102.05 లక్షలతో ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. పూర్తి వివరాలను www.eprocurement.gov.inలో ది.02.04.2025, మ.01.00 గం.ల నుండి చూడవచ్చును. ఫోన్: 0866-2974950, 9182361369.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, వ్యవసాయ మార్కెటింగ్, విజయవాడ
DIPR RO.No.16003/CL/ADVT/1/1/2021-22, Dt: 01.04.2025

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
LENIN CENTRE, GOVERNORPET, VIJAYAWADA-520002(A.P.)
E Procurement Tender Notice
NIT No. 121/CRDA-14023(41)/4/2018-AEO2-LSE-APCRDA Dated:26.03.2025
Name of Work :APCRDA-" Establishment, Operation & Maintenance of Low Cost Real-Time/Continuous On-line Ambient Air Quality Monitoring Station.
The bid can be downloaded on AP e-procurement portal from 02.04.2025 to 16.04.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 16.04.2025 up to 15.00 Hrs, Technical bid opening 16.04.2025 @16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in Sd/- Commissioner, APCRDA, Vijayawada.

శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానము, పెదకాకాని, గుంటూరు జిల్లా.
ఈ ప్రొక్యూర్మెంట్/సీల్డ్ టెండరు కమ్ బహిరంగ వేలము ప్రకటన
ఆర్.సి.నెం.బి1/2/2025 తేది : 01.04.2025
పై దేవస్థానము నందు భక్తులచే సమర్పించిన తలనీలాలు సేకరణ, ఫోటోలు, వీడియోలు తీసుకొను, బొమ్మలు, రుద్రాక్షలు వగైరా విక్రయించుకొను లైసెన్సు హక్కులకు మరియు ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ (కంప్యూటర్, ప్రింటర్ వగైరాలు) సరఫరా చేయు లైసెన్సు హక్కులకు ది. 15.04.2025 నుండి ది.31.03.2027 వరకు 5వసారి ఈ-ప్రొక్యూర్మెంట్, టెండరు కమ్ బహిరంగ వేలము ది. 09.04.2025 న దేవస్థానము నందు జరుగును. ది. 02.04.2025 ఉదయం గం.10.30 నుండి https://tender.apeprocurement.gov.in నందు టెండరు డాక్యుమెంట్స్ అందుబాటులో ఉంచటమైనది. తదుపరి వివరముల కొరకు 9491000728, 9705551825 ద్వారా కార్యాలయ పనివేళల నందు తెలుసుకొనగలరు.
సం/- జి.వి.డి.యస్. లీలాకుమార్
ఉపకమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి

AP Trade Promotion Corporation Ltd., VIJAYAWADA
(Government of Andhra Pradesh Undertaking)
Short Tender Notification
No.APTPC/VIJ/NB-Tender/2025-26/003, Dt. 28.03.2025
The APTPC Ltd., Vijayawada Invites bids from eligible bidders through e-procurement portal https://www.apeprocurement.gov.in for Conversion of Cream Wove Paper and Duplex Board into Notebooks and for Transportation of Raw Materials, Note Books and Plain Copier Paper. Last date for submission of bids is on 11.04.2025 upto 1.00 pm. For further details please visit https://apexports.ap.gov.in. Contact Mobile No: 8919892197, 9000991832 and e-mail ID: aptpc1970@gmail.com
Sd/- VICE CHAIRMAN & MANAGING DIRECTOR
DIPR R.O. No.4002PP/CL/ADVT/1/1/2021-22, Dt:01.04.2025

GOVERNMENT OF ANDHRA PRADESH
MUNICIPAL ADMINISTRATION DEPARTMENT
APUF-11036/7/2025-ADMN SEC-APUFIDC, Dt.01-04-2025
E-PROCUREMENT TENDER NOTICE
The Commissioner and Director of Municipal Administration, A.P., Vaddeswaram for Providing internet services to the 3rd to 6th & 8th floors of the O/o C&DMA, Vaddeswaram with 125 MBPS, 1:1 internet leased line including the maintenance of the internet Access points 13 Nos, Mictorek Switch 1 No, CISCO Managed Switch 48 port 5 Nos, Unmanaged Switch 5 Nos including wiring for users also for the period of one year including taxes.

| | | |
|---|---|---|
| 1. | Tender document download Starting Date and time: | 02-04-2025 at 11.00 AM. |
| 2. | Last date and time of Download of Tenders: | 08-04-2025 up to 03.00 PM. |
| 3. | Last date and time of submission of Tenders: | 08-04-2025 up to 04.00 PM. |
| 4. | Technical Specifications Bid Opening date (Technical Bid Stage) | 09-04-2025 at 11.00 AM. |
| 5. | Price Bid Opening date (Financial Bid Stage) | Will be intimated later. |
| 6. | Address for communication: | 5th Floor, O/o. CDMA, Prime hill crest, CDMA, Vaddeswaram |
| 7. | EMD & Processing fees: | The Supplier has to deposit Rs.10,000/- as EMD through BG/DD from any Nationalize Bank. |

DIPR RO No.4003PP/CL/ADVT/1/1/2021-22, Dt: 01.04.2025

## నట్టేట మునిగిన బర్లీ పొగాకు రైతు

» గతేడాది క్వింటా ధర 18వేలు.. ధర బాగుందని అధికంగా సాగు

» 3వేలకు పడిపోయిన ధర.. ఆదుకోవాలంటూ రైతుల గగ్గోలు

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు రైతులు నట్టేట మునిగారు. నిరుడు క్వింటా రూ.18 వేల దాకా పలికిందనే ఆశతో బర్లీ సాగు చేసిన రైతులు.. ఈ ఏడాది ధర లేక లబోదిబోమంటున్నారు. తామే కొంటామని కొన్ని కంపెనీలు భరోసా ఇవ్వడంతో వేలాది ఎకరాల్లో రైతులు బర్లీ పొగాకు సాగు చేశారు. వాస్తవానికి భారత పొగాకు బోర్డు అనుమతితో వర్జీనియా పొగాకును అనేక కంపెనీలు బ్యాంకుల గ్యారెంటీతో రైతుల నుంచి కొనుగోలు చేస్తుంటాయి. వర్జీనియా రకం కొనుగోలుపై పొగాకు బోర్డు నియంత్రణ ఉంటుంది. నాటు రకంగా పరిగణించే బర్లీ పొగాకును బోర్డు అనుమతి లేని రైతులు సాగు చేసి, ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముతుంటారు. బర్లీ పొగాకుకు డిమాండ్ ఉండటంతో వ్యాపారులు రైతుల్ని ప్రోత్సహించి, విత్తనాలు ఇచ్చి సాగు చేయించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా, కర్నూలు జిల్లాల్లోని దాదాపు లక్ష ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేశారు. దీని సాగుకు ఎకరానికి రూ.లక్ష దాకా రైతులు పెట్టుబడి పెట్టారు. కౌలు రైతులకు మరింత ఖర్చయ్యింది. ఇప్పుడేమో క్వింటా రూ.3వేలు కూడా పలడం లేదని రైతులు వాపోతున్నారు. గిట్టుబాటు ధర లేక.. బర్లీ పొగాకు కొనే నాథుడు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## సంచార పశువైద్య సేవలకు టెండరు ఖరారు

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచార పశువైద్య సేవలు అందించేందుకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా పిలిచిన టెండర్లను ప్రభుత్వం ఖరారు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 340 వెటర్నరీ అంబులెన్స్‌ల నిర్వహణకు టెండర్ దాఖలు చేసిన మెస్సెర్స్ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి ఇచ్చింది. ఈ ఏజెన్సీ కోట్ చేసిన హెచ్1 రేటు ప్రకారం సంచార పశువైద్యానికి అవసరమైన అన్ని పరికరాలు అమర్చిన అంబులెన్స్ నిర్వహణ కోసం నెలకు ఒక్కో అంబులెన్స్‌కు రూ.1,64,500 చొప్పున చెల్లించేందుకు పశుసంవర్ధక శాఖ కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం లెటర్ ఆఫ్ అవార్డును ప్రభుత్వం ఆమోదించింది. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## ఏపీ జెన్కో ఎండీగా చేకూరి కీర్తికి పూర్తి అదనపు బాధ్యత

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ చేకూరి కీర్తికి ఏపీ జెన్కో ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వు జారీ చేశారు. ఏపీ జెన్కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర బాబు సెలవులో ఉండటంతో ఈమేరకు ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

## జమిలి ఎన్నికలు పిచ్చి తుగ్లక్ చర్య: తులసిరెడ్డి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): 'రాజ్యాంగ సవరణ చేసి దేశవ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహించాలనే మోదీ సర్కారు నిర్ణయం దురదృష్టకరం. ఇది పిచ్చి తుగ్లక్ చర్య' అని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. మంగళవారం కడపలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'జమిలి ఎన్నికల ద్వారా కలిగే ప్రయోజనాలను ముందుగా దేశ ప్రజలకు చెప్పాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా చెప్పడం విడ్డూరంగా ఉంది. జమిలి ఎన్నికల వల్ల ప్రభుత్వానికి ఎన్నికల ఖర్చు తగ్గుతుందని బీజేపీ నాయకులు చెప్పడంలో వాస్తవం లేదు. రాష్ట్రంలో పేదరికం మీద చేపట్టిన పీ-4 సర్వే అనేక అనుమానాలు రేకెత్తిస్తోంది. ఇది క్విడ్ ప్రోకోకు దారితీస్తుందేమో?' అన్న అనుమానాన్ని తులసిరెడ్డి వ్యక్తం చేశారు.

## దివ్యాంగురాలిపై అత్యాచారం

సత్తెనపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో ఓ యువకుడు దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లిలో సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. వడ్డవల్లి ప్రాంతంలో నార్నెపాడుకు చెందిన సీహెచ్ బాబు అనే యువకుడు దివ్యాంగురాలి ఇంటికి సమీపంలో నివాసం ఉంటున్నాడు. రాత్రి సమయంలో మంచి నీటి కోసమని యువతి ఇంట్లోకి వెళ్లి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. యువతి పెద్దగా కేకలు వేయటంతో కుటుంబ సభ్యులు, ఇంటి పక్కన వారు యువకుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏపీలో 133 చదరపు కి.మీ. అటవీ భూముల ఆక్రమణ

» 12వ స్థానంలో నిలిచిన రాష్ట్రం

» దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాల్లో 13 వేల చదరపు కి.మీ. కబ్జా

» ఢిల్లీ, సిక్కిం, గోవా రాష్ట్రాల విస్తీర్ణం కన్నా ఇది ఎక్కువ

» వివరాలివ్వని రాష్ట్రాల్లో తెలంగాణ

» వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: దేశవ్యాప్తంగా అటవీ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని కేంద్ర పర్యావరణ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. మొత్తం 25 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 13 వేల చదరపు కిలో మీటర్ల అటవీ భూములు ఆక్రమణలకు గురయ్యాయని తెలిపింది. ఇది.. ఢిల్లీ, సిక్కిం, గోవాల భౌగోళిక విస్తీర్ణంకన్నా ఎక్కువగా ఉందని పేర్కొంది. ఏపీలో 133 చదరపు కిలోమీటర్ల మేర అటవీ భూముల ఆక్రమణ జరిగిందని, ఇది దేశవ్యాప్తంగా జరిగిన ఆక్రమణలలో 12వ రాష్ట్రంగా నిలిచిందని తెలిపింది. అటవీ భూముల ఆక్రమణలకు సంబంధించి 25 రాష్ట్రాలు, కొన్ని కేంద్ర పాలిత ప్రాంతాలు మాత్రమే వివరాలు వెల్లడించాయని, మరో పది రాష్ట్రాలు వివరాలు సమర్పించలేదని పేర్కొంది. అటవీ భూముల ఆక్రమణలపై వచ్చిన వార్తలను గత ఏడాది జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ) తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో సుమోటోగా విచారణకు ఆదేశించింది. కాగా, గత ఏడాది కేంద్రం ఇచ్చిన నివేదిక ప్రకారం.. 7,50,648 హెక్టార్ల అటవీ భూమి ఆక్రమణలకు గురైంది. ఇది ఢిల్లీ రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణానికి ఐదు రెట్లు ఎక్కువగా ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ తమ అటవీ విస్తీర్ణాల ఆక్రమణలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దీంతో గత వారం కేంద్ర పర్యావరణ శాఖ గత ఏడాది మార్చి వరకు 25 రాష్ట్రాలు, కొన్ని కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైన అటవీ ప్రాంతాల కు సంబంధించిన నివేదికను ఎన్జీటీకి అందించింది. దీని ప్రకారం 13,056 చదరపు కిలో మీటర్ల అటవీ ప్రాంతం ఆక్రమణకు గురైనట్టు వివరించింది. ఆయా రాష్ట్రాల్లో ఏపీ, మహారాష్ట్ర, ఒడిశా, పుదుచ్చేరి, పంజాబ్, తమిళనాడు, త్రిపుర, ఉత్తరాఖండ్, యూపీ, సిక్కిం, మధ్యప్రదేశ్ వంటివి ఉన్నాయి. ఇక, ఇప్పటికీ సమాచారం ఇవ్వని రాష్ట్రాల్లో తెలంగాణ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ వంటివి ఉన్నాయని నివేదికలో పేర్కొంది.

### నివేదికలోని కీలక అంశాలు

» మధ్యప్రదేశ్‌లో భారీ ఎత్తున అటవీ భూముల ఆక్రమణలు జరిగాయి. ఏకంగా 5,460.9 చదరపు కిలోమీటర్ల మేర భూములు ఆక్రమణకు గురయ్యాయి.

» ఈశాన్య రాష్ట్రం అసోం తర్వాత స్థానంలో నిలిచింది. ఇక్కడ 3,620.9 చదరపు కిలో మీటర్ల మేరకు అటవీ భూములను ఆక్రమించుకున్నారు.

» ఆంధ్రప్రదేశ్‌లో 133.18 చదరపు కిలో మీటర్ల అటవీ భూములు ఆక్రమణలకు గురయ్యాయి.

» మొత్తం ఆక్రమిత అటవీ భూముల్లో 409.77 చదరపు కిలో మీటర్లను తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

## పేదల ఇళ్లకు రూ.3,220 కోట్ల అదనపు సాయం

» 4 విడతలుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ: హౌసింగ్ ఎండీ

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ దశల్లో నిలిచిపోయిన 5.99 లక్షల ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆదివాసీ గిరిజన (పీవీజీటీ) లబ్ధిదారుల ఇళ్లను పూర్తి చేయడానికి ప్రభుత్వం రూ. 3,220 అదనపు సాయం మంజూరు చేసింది. ఈ అదనపు సాయం నాలుగు విడతలుగా (బేస్మెంట్, రూఫ్ లెవెల్, స్లాబ్ లెవెల్, ఇల్లు పూర్తయిన తర్వాత) లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.రాజబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'పీఎంఏవై (1.0), ప్రధాన మంత్రి జన్‌మన్ పథకాల కింద 2016-2024 మధ్య కాలంలో బడుగులకు మంజూరు చేసిన 7.32 లక్షల ఇళ్లను పూర్తి చేయాల్సిఉంది. గత వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల యూనిట్ విలువ రూ. 1.80 లక్షలుగా నిర్ణయించడం, గత ఐదేళ్లలో ఇంటి నిర్మాణ సామగ్రి, కూలీల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో లబ్ధిదారులు అప్పులపాలై ఇళ్లను మధ్యలోనే ఆపేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకుని వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేయించి పేదవాడి పక్కా ఇంటి కలను నిజం చేయాలని సంకల్పించారు. ఇంటి యూనిట్ విలువకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ఆదివాసీ గిరిజన (పీవీటీజీ) లబ్ధిదారులకు రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 5.99 లక్షల పెండింగ్ ఇళ్లను పూర్తి చేయడానికి ప్రభుత్వం రూ. 3,220 కోట్లు మంజూరు చేసింది' అని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రాజబాబు వివరించారు.

## స్థానిక ప్రజా ప్రతినిధులతో నేడు జగన్ భేటీ

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల స్థానిక సంస్థలకు జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపొందిన జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమావేశం కానున్నారు. బుధవారం తాడేపల్లిలోని జగన్ నివాస ప్రాంగణంలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

## ఐబీపీఎస్ పీవో, క్లర్క్ మెయిన్ ఫలితాల విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఐబీపీఎస్(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పలు ఉద్యోగ నియామకాల పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఐబీపీఎస్ క్లర్క్(కస్టమర్ సర్వీస్ అసోసియేట్స్) మెయిన్ ఫలితాలతో పాటు పీవో ఉద్యోగాలకు మెయిన్ పరీక్ష, ఇంటర్వ్యూలు పూర్తిచేసిన వారికి సంబంధించిన ఫలితాలను ibps.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ ఫలితాలు అందుబాటులో ఉంటాయని, ప్రభుత్వ రిజర్వేషన్ల నియమ నిబంధనల ప్రకారం ప్రొవిజనల్ ఆర్డర్ విడుదల చేసినట్లు ఐబీపీఎస్ తెలిపింది.

## మల్లన్న హుండీ ఆదాయం రూ.6.10 కోట్లు

శ్రీశైలం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. గడిచిన 27 రోజులకు రూ.6.10 కోట్లు ఆదాయం సమకూరింది. దీంతో పాటు 20.1 తులాల బంగారం, 6.2 కిలోల వెండి లభించింది. అదేవిధంగా 990 యుఎస్ఏ డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, 16 మలేషియా రింగిట్స్, 30 ఆస్ట్రేలియా డాలర్లు, 20 యూకే పౌండ్స్, 810 యుఏఈ దిర్హమ్స్, 250 మెక్సికో పిసో, 130 కెనడా డాలర్ల విదేశీ కరెన్సీ వచ్చింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## స్వేచ్ఛకు సమాధి

ఏ విలువలను చూసి అమెరికాకు ఆ ప్రతిమను బహూకరించామో, ఇప్పుడు అవి అక్కడ లేవు, ఇక అది కూడా అక్కడ ఉండకూడదు, మా విగ్రహాన్ని మాకు ఇచ్చేయండి అంటూ పక్షంరోజుల క్రితం ఫ్రాన్స్ నాయకుడు ఒకరు అమెరికాలోని స్టాట్యూ ఆఫ్ లిబర్టీ మీద ఓ పదునైన వ్యాఖ్య చేశారు. విదేశీ విద్యార్థుల గెంటివేత విషయంలో ట్రంప్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్న ఈ సందర్భంలో, న్యూయార్క్ నగరంలో ఆకాశాన్ని తాకుతూ కనిపించే ఆ స్వేచ్ఛా ప్రతిమ ట్రంప్ ఏలుబడిలో అక్కడ ఉండటం నిజంగానే సరికాదనిపిస్తోంది. అమెరికా అంటే స్వేచ్ఛ, హక్కులకు పెద్ద దిక్కు అనే నమ్మకం ఇప్పుడు క్రమంగా నశిస్తున్నది. వందలాదిమంది విదేశీ విద్యార్థులమీద ట్రంప్ ఇంత కక్ష-కట్టడానికి వారు చేసిన తప్పల్లా ఏడాదిన్నరకు పైగా సాగుతున్న ఒక భయానకమైన యుద్ధాన్ని ఆపమనడం, మారణకాండను నిరసించడం. నిర్దిష్టమైన అభిప్రాయాలు ఉన్నందుకు వీరంతా ట్రంప్ దృష్టిలో దేశద్రోహులైనారు. భావస్వేచ్ఛకు పుట్టినిల్లని అంటున్నచోట ఏకంగా ఉగ్రవాదుల మద్దతుదారులుగా ముద్రపడ్డారు.

తమ రాజ్యాంగం హక్కుల గురించి ఏమంటున్నదో ట్రంప్‌కు అనవసరం. భావస్వేచ్ఛను భంగపరచే చర్యలనూ, చట్టాలనూ అది సహించదన్నదీ ఆయనకు పట్టదు. తొలి విడత పాలనలోనే ఆయన తన నిజస్వరూపాన్ని చూపించాడు. అధికారం దక్కనందుకు ఏకంగా చట్టసభలమీదకే కార్యకర్తలను ఉసిగొల్పాడు. మలివిడతలో మరింత బలంగా అధికారంలోకి రావడంతో ఏకంగా విశ్వరూపాన్నే ప్రదర్శిస్తున్నాడు. వందలాదిమంది విదేశీ విద్యార్థులను వేకువనే తట్టిలేపి, తట్టాబుట్టా సర్దుకొని దేశం విడిచిపెట్టిపోవాలంటున్నాడు. ఈ విద్యార్థులు ట్రంప్ అభిమానుల మాదిరిగా విధ్వంసాలు ఎరిగినవారు కాదు. రోడ్లమీదకు వచ్చి దొరికినవాటిని తగలబెట్టిందీ లేదు. మిగతా ప్రపంచం గురించీ, సమాజం గురించీ, మనుషులూ మనుగడ పోరాటాల గురించీ ఎక్కడైతే నేర్చుకుంటున్నారో, అక్కడే వాటి పరిరక్షణకోసం వారు నినదించారు. గాజా ఘోరకలిని ప్రశ్నించడం, ఆకలిదప్పికలతో అల్లాడుతున్న లక్షలాది మందిని రక్షించమంటూ ఎలుగెత్తి ఆ విశ్వవిద్యాలయాల గోడలలోపల ఘోషించడం తిరుగుబాటు ఎలా అవుతుందో తెలియదు. మానవహక్కుల గురించి మాట్లాడటమే ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడంగా, విద్యార్థుల నిరసనలను హమాస్ అనుకూల, యూదు వ్యతిరేకత చర్యలుగా నిర్వచించి, శిక్షించడంలో ట్రంప్ వ్యూహం సుస్పష్టం.

యూనివర్సిటీల్లో సుదీర్ఘకాలం సాగిన ఈ ఉద్యమాలు, అంతవరకూ నిర్లజ్జగా ఇజ్రాయెల్ కొమ్ముకాస్తున్న అమెరికా ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడవేసి, కాస్తంత తగ్గేట్టు చేశాయి. మరింత శక్తిమంతమైన ఆయుధాలను సమకూరుస్తూ మారణకాండకు సహకరిస్తున్న అమెరికా పాలకులు ఈ ఉద్యమం కారణంగా ఇజ్రాయెల్‌ను నాలుగు మాటలు అనవలసి వచ్చింది, మానవతాసాయం గురించి మాట్లాడవలసి వచ్చింది. యూనివర్సిటీలు సైతం తమ నడవడికను, గతకాలపు విలువలను తడిమిచూసుకోవలసి వచ్చింది. యుద్ధాలు ఆపిన చరిత్ర విద్యార్థులకు ఉన్నదనీ, వియత్నాంలో తమ ప్రభువులను కాలువెనక్కుతీసుకొనేట్టు చేసిన ఘనులు వారని ట్రంప్‌కు తెలుసు. కాల్పుల విరమణను నీరుగార్చి, గాజాను ఖాళీచేయించే క్రమంలో నెతన్యాహూతో కలసి తిరిగి మారణకాండను అమలుచేస్తున్న ట్రంప్‌కు స్వదేశంలో ఒక్క అసమ్మతిస్వరం ఉన్నా మళ్ళీ నిప్పురాజుకొనే ప్రమాదం ఉన్నదని తెలుసు.

ఒక హంతకుడినో, ఉగ్రవాదినో వెతుకుతున్న, వేటాడుతున్న భాష ఈ విదేశీవిద్యార్థుల విషయంలో వాడుతున్నారు. కృత్రిమమేధతో సామాజిక మాధ్యమాలను జల్లెడపట్టి, కలుగులో దాక్కున్నవారిని వెతికిపట్టి మరీ దేశంనుంచి గెంటేస్తారట. విద్యార్థులకు వివరణలు ఇచ్చుకొనే అవకాశం లేదు, సమాధానం చెప్పుకొనే చోటూ లేదు. కేవలం ఓ ఆరోపణ, ఒకే ఒక్క ఈమెయిల్ సందేశంతో దేశ బహిష్కరణ జరిగిపోతోంది. ఉదారవాదాలు, ఉన్నతాశయాలు వెనక్కుపోయిన అగ్రరాజ్య దురహంకారమిది. వీసాలు రద్దయినంతమాత్రాన విద్యార్థులు వెనక్కుపోనవసరం లేదని, యూనివర్సిటీల దయాదాక్షిణ్యాలున్నంతవరకూ ఉండవచ్చునని కొందరు భరోసా ఇస్తున్నారు. కానీ, అమెరికా తన ఆదర్శాలను అటకెక్కించేస్తూ, విలువలకు, విజ్ఞానానికీ నెలవుగా ఉండాల్సిన విద్యాలయాలు మిలటరీ క్యాంపులుగా మారుతున్నప్పుడు ఉండికూడా ప్రయోజనమేమిటన్నది ప్రశ్న.

# దక్షిణాదిన బీజేపీ విస్తరణ ఎలా సాధ్యం?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్


హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల తర్వాత దేశ రాజకీయాల్లో ఒక స్తబ్దత ఏర్పడింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు చాలా యాంత్రికంగా జరుగుతున్నాయి. మీడియా గ్యాలరీలు దాదాపు ఖాళీగా ఉండగా, ఉభయ సభల్లో కూడా సీట్లు చాలా సందర్భాల్లో ఖాళీగా కనపడుతున్నాయి. సభ్యులు మొక్కుబడిగా చర్చల్లో పాల్గొంటున్నారు. రకరకాల అంశాలపై ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించడం, అడపాదడపా సభలు వాయిదాపడడం కూడా పెద్దగా వార్తల్లోకి ఎక్కడం లేదు. ప్రతిపక్షాలు బలహీనమైతే పార్లమెంట్ ఎలా నడుస్తుందో చెప్పేందుకు ప్రస్తుత సమావేశాలే నిదర్శనం. 'పార్లమెంట్‌లో రాజకీయాలే జరగడం లేదు. మమ్మల్ని కూడా రాజకీయాలపై దృష్టి కేంద్రీకరించకుండా రాష్ట్ర సమస్యల గురించి పట్టించుకోవాలని మా నాయకుడు చంద్రబాబునాయుడు కోరారు' అని తెలుగుదేశం నేత ఒకరు చెప్పారు. మోదీకి కూడా పార్లమెంట్ సమావేశాలపై పెద్దగా ఆసక్తి ఉన్నట్లు కనపడడం లేదు. తన భావి అజెండాను ఎలా వేగంగా పూర్తి చేయాలా అన్న ఆలోచనతోనే ఆయన ఉన్నారు.

పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండగానే మధ్యలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాగపూర్‌లో ఆరఎసఎస్ కేంద్రకార్యాలయానికి వెళ్లడం రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షించింది. మోదీ సంఘ్ కార్యాలయానికి వెళ్లడం, సంఘ్ వ్యవస్థాపకులు హెగ్డేవార్, గోల్వాల్కర్‌లకు నివాళులు అర్పించడం ఒక కీలక సంకేతంగా భావించవచ్చు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాగపూర్‌లోని సంఘ్ కార్యాలయానికి, దేశ రాజధానిలోని ప్రధానమంత్రి కార్యాలయానికి మధ్య గతంలో ఎన్నడూ లేనంతగా సయోధ్య ఏర్పడిందనడంలో సందేహం లేదు. గతంలో వాజపేయి హయాంలో కూడా నాగపూర్‌కు, ఢిల్లీకి మధ్య సయోధ్య ఏర్పర్చేందుకు ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి అంతగా సఫలీకృతం కాలేదు. ఈ విషయం నాడు ఉప ప్రధానిగా ఉన్న లాల్ కృష్ణ అద్వాణీ స్వయంగా అంగీకరించారు. 'సంఘ్ సోదర కూటమిలో తమ స్వంత సైద్ధాంతిక మిత్రపక్షాల ఆందోళనను, అభిప్రాయాలను సరైన విధంగా పట్టించుకోలేకపోయామని, వారు ప్రధానంగా మాకు మద్దతునిస్తున్నందువల్ల ఎలాగూ మాతోనే కలిసి ఉంటారులే అన్న ఆత్మవిశ్వాసంతో ఉండిపోయామని, అదే తమ ఓటమికి ఒక కారణమైందని' అద్వాణీ తన ఆత్మకథలో రాసుకున్నారు. సంఘ్‌తో నిత్యసంబంధాలు ఏర్పర్చుకోవడం, సిద్ధాంతానికీ, ఆచరణకూ మధ్య ఐక్యత సాధించేందుకు ప్రయత్నించడం వల్లే మోదీ విజయవంతం కాగలుగుతున్నారని చెప్పక తప్పదు. సిద్ధాంతానికీ ఆచరణకు మధ్య ఐక్యత సాధించడంలో విఫలమైనందువల్లే ఈ దేశంలో వామపక్షాలతో సహా అనేక రాజకీయ పార్టీలు విఫలమవుతున్నాయి.

నిజానికి మోదీ సంధి దశలో ఉన్నారు. వచ్చే సెప్టెంబర్ నాటికి ఆయనకు 75 ఏళ్లు పూర్తవుతాయి. అయితే సంఘ్ లోను, కొందరు బీజేపీ పెద్దల విషయంలోనూ అనుసరించిన నిబంధన మోదీకి వర్తించదని ఇప్పటికే స్పష్టమైంది. అందుకు కారణం మోదీ ప్రధానిగా మరి కొన్నేళ్లు కొనసాగాల్సిన అవశ్యకతను సంఘ్, సంఘ్ ప్రాధాన్యతను మోదీ ఇప్పటికే గుర్తించినట్లు కనిపిస్తోంది. ప్రతి రోజూ దేశ వ్యాప్తంగా 83,129 శాఖలను నిర్వహిస్తున్నామని, వారానికి లక్షా 15వేలకు పైగా మిలన్‌లు జరుగుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తరించడంపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించామని ఇటీవల జరిగిన సంఘ్ సర్వప్రతినిధి సభ తర్వాత సహ్ కార్యవాహ్ ముకుంద్ మీడియాకు తెలిపారు. ఆసక్తికరమైన విషయం ఏమంటే ప్రతి ఏడాదీ లక్షలమంది యువకులు సంఘ్‌లో చేరుతున్నారని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఇటీవల జరిగిన 4,415 ప్రారంభ శిక్షణ శిబిరాల్లో 2,22,962 మంది హాజర్యయారని, వీరిలో 1,63,000ల మంది 14–25 సంవత్సరాల వయసు మధ్య ఉన్నవారేనని ఆయన చెప్పారు. ఇంతటి కీలక ప్రభావం ఉన్న సంఘ్ బీజేపీకి అండగా ఉండడమే ఆ పార్టీకి బలం అని మోదీకి తెలుసు. గత సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి కేవలం 240 సీట్లు మాత్రమే లభించిన తర్వాత మహారాష్ట్ర, హరియాణాలో సంఘ్ బలంగా పనిచేసి మళ్లీ మోదీ నిలదొక్కుకునేందుకు కావల్సిన బలాన్ని అందించిందని బీజేపీ నేతలే చెబుతున్నారు.

అందువల్ల మోదీ అసంపూర్తిగా ఉన్న తన అజెండాను అమలు చేసేందుకు ఆయనకు సంఘ్ బలం తప్పనిసరి. ఈ క్రమంలో ఆయన సంఘ్ అజెండాను కూడా పూర్తి చేయవలిసి ఉంటుంది. అనుకున్న విధంగా వక్ఫ్ బిల్లు ఆమోదానికి ఆయన రంగం సిద్ధం చేశారు. జమిలి ఎన్నికలకు కూడా ఆయన రాజకీయ పార్టీలను మానసికంగా సిద్ధం చేస్తున్నారు. రానున్న ఏడాది కాలంలో బిహార్, అస్సాం, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ ఎన్నికలు జరుగనున్నాయి. వీటిలో మెజారిటీ రాష్ట్రాల్లో గెలవడం బీజేపీకి ఒక అగ్నిపరీక్ష లాంటిది. ముఖ్యంగా దక్షిణాదిన బీజేపీ విస్తరించడం అంత సులభం కాదు.

అయితే కేవలం సంఘ్ అండదండలు ఉన్నంత మాత్రాన బీజేపీ విజయాలు సాధించగలుగుతుందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. నిజానికి సంఘ్ బలంగా ఉండడం వేరు, బీజేపీ బలంగా ఉండడం వేరు అన్న విషయం రెండు సంస్థలకూ తెలియనిది కాదు సంఘ్ అత్యంత బలంగా ఉన్న కర్ణాటకను ఒకప్పుడు బీజేపీ దక్షిణాది ద్వారంగా ఆ పార్టీ నేతలు అభివర్ణించారు. కాని క్రమంగా ఆ ద్వారం మూసుకుపోతున్నట్లు కనపడుతోంది. దేశమంతటా హిందూత్వ ప్రయోగం విజయవంతం అవుతున్నట్లు కనపడుతున్నప్పటికీ కర్ణాటకలో మాత్రం ఈ ప్రయోగం లింగాయత్‌ల అదుపులో ఉన్నట్లు స్పష్టమవుతోంది. అక్కడ పార్టీలో ఉన్న అంతర్గత పోరాటాన్ని అధిష్ఠానం అరికట్టలేకపోతోంది. నేతలు ఒకరిపై మరొకరు మీడియాకెక్కుతున్నారు. యడ్యూరప్పను, ఆయన కుమారుడు విజయేంద్రను మచ్చిక చేసుకునేందుకు ఇటీవల బలమైన ఎమ్మెల్యేను బసనగౌడ పాటిల్ యత్నాల్‌ను పార్టీ నుంచే బహిష్కరించారు. బీజేపీకి కర్ణాటకలో భవిష్యత్ లేదని త్వరలో ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని యత్నాల్ ప్రకటించారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను అప్రతిష్ఠపాలు చేసేందుకు ముడా కుంభకోణాన్ని లేవనెత్తి, ఈడీని ప్రయోగించినా బీజేపీ విజయవంతం కాలేకపోయింది. విచిత్రమేమంటే సంఘ్ హేమాహేమీలు దత్తాత్రేయ హోసబలె, సిఆర్ ముకుంద్, ప్రస్తుతం జాతీయ స్థాయిలో సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా ఉన్న సంతోష్, హెచ్‌వి శేషాద్రి, పద్మనాభాచార్య తదితరులు ఆ రాష్ట్రానికి చెందినవారే. ఒకప్పటి సర్ సంఘ్ చాలక్ సుదర్శన్ కూడా మైసూరుకు చెందినవారే. నిజానికి మహారాష్ట్ర తర్వాత అత్యధిక సంఖ్యలో అగ్రశ్రేణి సంఘ్ నేతలు కర్ణాటక నుంచే వచ్చారు. కాని అదే కర్ణాటకలో ఇప్పుడు బీజేపీ రాజకీయ భవిష్యత్తు డోలాయమాన పరిస్థితిలో ఉన్నది. సంతోష్ జీ వల్లే దక్షిణాదిలో బీజేపీ దెబ్బతిన్నదని విమర్శలు చేసేవారు కూడా ఉన్నారు. తమిళనాడులో ఐపీఎస్ అధికారి అన్నామలైను ప్రవేశపెట్టి ఓట్ బ్యాంకును పెంచుకునేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో మళ్లీ అన్నాడీఎంకెపై ఆధారపడవలసిన స్థితి ఏర్పడింది. కేరళలో కూడా ఆరఎసఎస్ బలంగా ఉన్నా బీజేపీ కొంత ఓటు శాతాన్ని పెంచుకోవడం తప్ప అసాధారణమైన విజయాలేమీ సాధించలేదు.





రాజకీయాల్లో ప్రత్యర్థులను బలహీనపరచడం వల్లనో, భావోద్వేగాలను సృష్టించడం వల్లనో లభించే విజయాలు తాత్కాలికమే అవుతాయి. మనను నడిపిస్తున్న లక్ష్యాలు ఏమిటి? రాజకీయాల్లో మనం ఎందుకు ప్రవేశించాం? ఆదర్శాలు, విశ్వాసాల కన్నా వ్యక్తులకు ప్రాధాన్యమిస్తున్నామా అన్న ప్రశ్నలు వేసుకుని ముందుకు సాగాలి. లేనిపక్షంలో విజయాలు వైఫల్యాలుగా మారేందుకు ఎంతో కాలం పట్టదు. కాంగ్రెస్ అదే పరిస్థితిని ఎదుర్కొన్న విషయం తెలియనిది కాదు.

ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే నెల్లూరులో ఆరఎసఎస్ తొలి శాఖ 1947లోనే ఏర్పడింది. 1948లో విజయవాడలో ఆరఎసఎస్ అతి పెద్ద సభను నిర్వహించింది. 1950లలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన తొలి ఓటీసీ నెల్లూరులో జరిగింది. మహారాష్ట్ర నుంచి వచ్చిన దేశ్‌పాండే, బాపురావు మోఘే, బందిష్టే, గోపాల్‌రావు టాగోర్‌తో పాటు కరెడ్ల సత్యనారాయణ, భండారు సదాశివరావు, సోమేపల్లి సోమయ్య లాంటి వారు సంఘ్‌ను ఏపీలో నిర్మించారు. గుంటూరులో శాఖకు హాజరైన వారిలో మాజీ ముఖ్యమంత్రులు ఎన్టీరామారావు, భవనం వెంకటరామ్, సీనియర్ జర్నలిస్టు పొత్తూరి వేంకటేశ్వరరావు లాంటి వారున్నారని ఒక ఆరఎసఎస్ నేత తన ఆత్మకథలో రాశారు. నిజానికి హైదరాబాద్ స్టేట్‌లో ఆర్యసమాజ్ మూలంగా ఆరఎసఎస్‌కు అనుకూల వాతావరణం ఉండేది. 1947లోనే గోల్వాల్కర్ హైదరాబాద్‌కు రహస్యంగా వచ్చారు. 1949లో శ్రీరాంసాఠే ఆరఎసఎస్ కార్యకలాపాలను ప్రారంభించారు. నృపతుంగ, కేశవ మెమోరియల్ లాంటి విద్యాసంస్థలను సంఘ్ అభిమానులను ప్రారంభించారు. నక్సల్బరీ ఉద్యమానికి పోటీగా 1967లోనే ఏబీవీపీ ఏర్పడింది. తొలి ఏబీవీపీ విద్యార్థి సదస్సు 1967 జూలైలో జరిగింది. 1968లో అఖిల భారత ఏబీవీపీ సదస్సు జరిగినప్పుడు సుప్రీం మాజీ ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తర్వాత క్రమేణా ఏబీవీపీ తెలంగాణలోని అనేక కాలేజీల్లో బలపడింది. అయినప్పటికీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యామ్నాయ భావజాలం బలంగా ఉండడం వల్ల జనసంఘ్ ఉనికి ఏర్పర్చుకోలేకపోయింది. తర్వాతికాలంలో తెలుగుదేశం బలమైన ప్రాంతీయ పార్టీగా ఏర్పడడంతో బీజేపీ నిలదొక్కుకోలేకపోయింది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో సంఘ్ పరివార్, బీజేపీ పుంజుకునేందుకు వాతావరణం ఏర్పడినప్పటికీ, టీఆరఎస్, కాంగ్రెస్ పార్టీలు ఆ పార్టీకి బలమైన ప్రతిబంధకాలుగా మారాయి. ఇప్పటికీ తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తేగల నాయకత్వాన్ని ఆ పార్టీ ఏర్పర్చుకోలేకపోతోంది. రాజకీయాల్లో ప్రత్యర్థులను బలహీనపరచడంవల్లనో, భావోద్వేగాలను సృష్టించడంవల్లనో లభించే విజయాలు ఎప్పటికైనా తాత్కాలికమవుతాయి. మనను నడిపిస్తున్న లక్ష్యాలేమిటి? రాజకీయాల్లో మనం ఎందుకు ప్రవేశించాం, ఆదర్శాలు, విశ్వాసాల కన్నా వ్యక్తులకు మనం ప్రాధాన్యత కల్పిస్తున్నామా అన్న ప్రశ్నలు వేసుకుని ముందుకు సాగకపోతే విజయాలు వైఫల్యాలుగా మారేందుకు ఎంతో కాలం పట్టదు. కాంగ్రెస్ అదే పరిస్థితిని ఎదుర్కొన్న విషయం తెలియనిది కాదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

## మన విద్యార్థులను 'ఏఐ'కు సిద్ధం చేయాలి!

కృత్రిమ మేధస్సును (ఏఐ) ప్రాథమిక, మాధ్యమిక విద్యలో ప్రవేశపెట్టడం నేటి ఆధునిక బోధనా విధానాలలో కీలక అవసరం. దేశాలు తమ విద్యార్థులను ఏఐ ఆధారిత భవిష్యత్తుకై సిద్ధం చేయడానికి పోటీపడుతున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ దేశాలు ప్రత్యేకమైన విధానాలను, అమలు వ్యూహాలను అభివృద్ధి చేశాయి.

చైనా ఏఐ విద్యలో ముందంజలో ఉంది. మూడవ తరగతి నుంచే తప్పనిసరి ఏఐ పాఠ్య ప్రణాళికను ప్రవేశపెట్టడం చైనా ప్రత్యేకత. విద్యార్థులకు మెషీన్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్, స్పీచ్ రికగ్నిషన్ వంటి అంశాలను పరిచయం చేస్తూ ప్రత్యేక పాఠ్య పుస్తకాలను రూపొందించారు. టెక్నాలజీ కంపెనీల సహకారంతో ఏఐ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌లను అభివృద్ధి చేశారు. వీటి ద్వారా చిన్న పిల్లలకు క్లిష్టమైన ఏఐ అంశాలను అర్థమయ్యేలా బోధిస్తున్నారు. ఏఐ ఆధారిత స్మార్ట్ తరగతి గదులను కూడా అభివృద్ధి చేశారు. దక్షిణ కొరియా ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటేషనల్ థింకింగ్‌పై ఎక్కువ శ్రద్ధతో సాధారణ విషయాలలోకి ఏఐ అక్షరాస్యతను ప్రవేశపెట్టడం ద్వారా సమగ్ర విద్యా విధానాన్ని రూపొందించింది. సింగపూర్ మాధ్యమిక స్థాయిలో ఏఐ విద్యను నిర్మాణాత్మకంగా అమలు చేసింది. ఏఐ అక్షరాస్యత, ప్రోగ్రామ్, కోడ్ ఫర్ ఫన్ వంటి కార్యక్రమాలు విద్యార్థులకు ప్రయోగిక అనుభవాన్ని అందిస్తున్నాయి. ఉపాధ్యాయ శిక్షణ, పరిశ్రమ భాగస్వామ్యం ద్వారా ఏఐ విద్యను సమర్థంగా బోధించేలా చర్యలు తీసుకున్నారు. అమెరికా రాష్ట్రాల వారీగా ఏఐ విద్యను అమలు చేస్తోంది. స్థానిక అవసరాలకు అనుగుణంగా ఏఐ విద్యా కార్యక్రమాలను రూపొందించింది. స్టెమ్ విధానం, నైతిక ఏఐ వినియోగంపై అమెరికా శ్రద్ధచూపుతోంది. గూగుల్, ఐబీఎం వాట్సన్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రైవేటు రంగ సంస్థలు ఏఐ విద్యా కార్యక్రమాలను అభివృద్ధి చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి.

భారతదేశంలో ఏఐ విద్యా ప్రణాళికను దశల వారీగా అమలు చేయడం సమర్థవంతమైన మార్గంగా భావించాలి. ప్రాథమిక స్థాయిలో (1–3 తరగతులు) విద్యార్థులకు ఏఐ పరిచయం చేసే విధానం పునాది స్థాయిలో ఉండాలి. పిల్లలకు ఆకర్షణీయమైన అభ్యాస (ప్రాక్టికల్) విధానాల ద్వారా కంప్యూటేషనల్ థింకింగ్‌ను పరిచయం చేయాలి. విజువల్ ప్రోగ్రామింగ్ టూల్స్ రోబోట్– ఆధారిత విద్య ద్వారా ప్రాథమిక ప్రోగ్రామింగ్, లాజికల్ థింకింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేయాలి. ఉన్నత ప్రాథమిక విద్య (4–6 తరగతులు)లో విద్యార్థులకు సరైన పాఠ్య ప్రణాళిక, ప్రాక్టికల్ ఉదాహరణలు, సరళమైన మెషీన్ లెర్నింగ్ ప్రాజెక్టుల ద్వారా మౌలిక ఏఐ భావనలను బోధించాలి. చిన్న చిన్న మెషీన్ లెర్నింగ్ ప్రాజెక్టులు, ఇంటరాక్టివ్, సూపర్‌వైజ్డ్ లెర్నింగ్ ప్రయోగాల ద్వారా మరింత లోతుకు తీసుకువెళ్లాలి. ఏఐ నైతికత గురించి అవగాహన పెంచాలి. మాధ్యమిక స్థాయిలో (7–9 తరగతులు) గణనీయమైన మార్పులు తీసుకురావాలి. విద్యార్థులు పైథాన్ వంటి భాషలను నేర్చుకోవాలి. డేటా విశ్లేషణ, మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లను ప్రాక్టికల్ ప్రాజెక్టుల ద్వారా అధ్యయనం చేయాలి. ఈ దశలో ఏఐ సామాజిక ప్రభావంపై అవగాహన పెంచాలి. 10–12 తరగతులు ఏఐ విద్యకు మరింత ప్రాముఖ్యతను తెచ్చే దశ. అధునాతన ప్రోగ్రామింగ్, పరిశ్రమ సహకార ప్రాజెక్టులు ఇందులో భాగం కావాలి. విద్యార్థులు ఏఐ అభివృద్ధి వినియోగంపై నైతిక అవగాహన పెంచుకునేలా చర్యలు తీసుకోవాలి.



మన జాతి భవిష్యత్తు భావితరాలకు అందించే విద్యపై ఆధారపడి ఉంది. ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలవడానికి విద్యలో ఏఐ చేర్చడం లాంటి సంస్కరణలను చేపట్టడం తక్షణావసరం.

ఏఐ విద్యా ప్రణాళిక విజయవంతంగా అమలవ్వాలంటే తగిన మౌలిక సదుపాయాలు ఉండాలి. దీనిలో అధిక వేగం గల ఇంటర్నెట్, కంప్యూటింగ్ పరికరాలు, ఏఐ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లు, స్మార్ట్ తరగతి గదులు ముఖ్యమైనవి. ఉపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండాలి. వారి శిక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయాలి. పరిశ్రమ మెంటర్ల సహకారం విద్యార్థులకు ఉపయుక్తం.

సాంప్రదాయ పాఠ్య ప్రణాళికలో ఏఐను సమర్థంగా అనుసంధానించాలి. గణితంలో స్టాటిస్టికల్ కాన్సెప్ట్స్ సైన్స్‌లో డేటా అనాలిసిస్, భాషా పాఠాలలో సహజ పద్ధతిలో నేర్చుకునే (ఎనఎల్‌పీ) అంశాలు ఉండాలి. ఏఐ నైతికత, సంఘంపై ప్రభావాన్ని సామాజిక శాస్త్రాల బోధనలో భాగం చేయాలి. విద్యార్థుల పురోగతిని మూల్యాంకనం చేయడానికి ప్రాజెక్ట్–ఆధారిత, నిరంతర మూల్యాంకన విధానాలను అనుసరించాలి.

భారతదేశం ఏఐ విద్యను విజయవంతంగా అమలు చేయాలంటే అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులను గణనలోకి తీసుకొని, స్థానిక విద్యా అవసరాలకు అనుగుణంగా ప్రణాళికను రూపొందించాలి. మన జాతి భవిష్యత్తు మనం భావితరాలకు అందించే విద్యపై ఆధారపడి ఉంది. ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలవడానికి విద్యలో ఏఐ చేర్చడం లాంటి సంస్కరణలను వెంటనే చేపట్టడం ఇప్పుడు తక్షణావసరం.

● ప్రొఫెసర్ ఎన్. శివప్రసాద్

## ఆహార వృథా అరికట్టాలి

ఇళ్లు, హోటళ్లు, విందులు, విహారాలు, రవాణాలో ఆహారం అమితంగా వృథా అవుతున్నది. ఈ సమస్య ప్రపంచాన్ని వేధిస్తున్నది. 2022లో బిలియన్ టన్నులకు పైగా ఆహారం ప్రపంచవ్యాప్తంగా వృథా అయిందని యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్స్ ఫుడ్ వేస్ట్ రిపోర్ట్ వెల్లడించింది. ఇది ప్రపంచ జనాభాలో 20 శాతం మంది ఆకలి తీరుస్తుందని ఆ నివేదిక పేర్కొంది. భయంకరమైన ఈ సమస్యలో ఇండియా అగ్ర భాగాన ఉంది.

ఆహార వృథా రెండు రకాలుగా జరుగుతుంది. ఇంట్లో వండినది కుప్ప తొట్టెలో పడేస్తున్నాం. పొలం నుండి వినియోగదారునికి చేరే దారిలో పడేసేది ఇంకొంత. వెరసి 73 మిలియన్ టన్నులకు వృథా చేరుతున్నది. ఆహార వృథా వల్ల పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతున్నది. వ్యవసాయానికి నేల, నీరు, విద్యుత్ అధికంగా కావాలి. ఆహార వృథా అంటే వెలకట్టలేని సహజ వనరులను నాశనం చేయడం. ఒక ఎకరా వరి పండించడానికి 20 నుంచి 40 వేల లీటర్ల నీరు అవసరం. ఇండియాలో నగరాలు, పట్టణాల్లోని చెత్తలో పన్నెండు శాతం ఆహార పదార్థాలే ఆక్రమిస్తున్నాయి. నగర పాలక సిబ్బంది సేకరించిన చెత్తను నేలమాళిగల్లో పూడుస్తారు. తడి ఆహారపు చెత్త నేలలో చివికేటప్పుడు మిథేన్ వాయువు ఉత్పత్తి అవుతుంది. ఇది వాతావరణంలోని వేడిని పట్టి నిలుపుతుంది. దీంతో భూమి వేడెక్కుతుంది. బొగ్గు పులుసు వాయువు కంటే మిథేన్ అధిక వేడి కలుగజేస్తుంది. ఆహార వృథా వల్ల జరిగే సామాజిక నష్టాన్ని తోసిపుచ్చలేం. దేశంలో భారీ స్థాయిలో ఆహారోత్పత్తి జరుగుతున్నది. అయినా ఇక్కడ ఇరవై శాతం మంది పేదలు తిండి గింజలు కొనలేక పస్తులుంటున్నారు. భూతాపం పెరుగుదల, అస్థిర వర్ష ఋతువు, వరదలు, కరువులు, కొండ చెరియలు విరిగిపడటం మొదలైన ప్రకృతి వైపరీత్యాలు పంటలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి.

ఈ సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కోవాలి. ఇందుకు ద్విముఖ వ్యూహం అవసరం. వ్యక్తిగత స్థాయి పరిష్కారాలు, విధాన సంస్కరణలు గావించి సుస్థిరాభివృద్ధికి బాటలు వేసుకోవాలి. ఇంటి అవసరాలకు తగినన్ని వెచ్చాలే కొనాలి. కచ్చితమైన భోజన ప్రణాళిక వేసుకోవాలి. సరైన మూతలున్న డబ్బాలలో వెచ్చాలు పోసుకొని, సరైన ఉష్ణోగ్రతల్లో వాటిని దాచుకోవాలి. ఎక్కువగా కూరగాయలు దొరికే కాలంలో ఒరుగులు తయారు చేసుకోవాలి. వంట గదిలో వచ్చిన చెత్తను సద్వినియోగపరచుకోవాలి. అంటే కంపోస్ట్ చేసి పూలమొక్కలకు, కూరగాయల మొక్కలకు వేయాలి. ఇలా చేస్తే తాజా పూలు, కూరగాయలు దొరుకుతాయి. ఊరు శుభ్రమౌతుంది. పెరటి తోటలు, మిద్దె తోటలు వేయాలి. వీటి పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలి. ప్రభుత్వం శీతల గిడ్డంగుల నిర్మాణం చేపట్టి, ఆహార పదార్థాల నిల్వ సామర్థ్యం పెంచాలి. ప్రజల భాగస్వామ్యంతో మెరుగైన నిల్వ పద్ధతులు రూపొందించాలి. ఆహార పదార్థాల ధరలు అదుపు చేస్తే పేదలకు పట్టెడు మెతుకులు దొరుకుతాయి. వస్తు రవాణా వసతులు మెరుగుపరచాలి.

– వి. వరదరాజు

# పల్లెల ముఖచిత్రం మార్చగల 'పీ4'

దిగ్గజ వ్యాపారవేత్తలు, అత్యంత ధనవంతులైన వారెన్ బఫెట్, బిల్‌గేట్స్ మిలిందా ఫ్రెంచ్ గేట్స్ 2010లో 'ద గివింగ్ ప్లెడ్జ్' అనే దాతృత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా, ప్రపంచవ్యాప్తంగా 200 మందికి పైగా ధనవంతులు తమ సంపదలో కనీసం 50శాతం లేదా అంతకంటే ఎక్కువ భాగాన్ని సామాజిక సంక్షేమ కార్యకలాపాలకు దానం చేయడానికి అంగీకరించారు. ఇదే కోవలో ఏపీలో పేదరికాన్ని తగ్గించి పేద కుటుంబాలను సాధికారత వైపు నడిపించేందుకు శ్రీకారం చుట్టిన ప్రక్రియే పీ4 విధానం. సంపన్న వర్గాలు నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకుని వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే దీని ప్రధాన ఉద్దేశం.

పేదరికం లేని సమాజం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతినిత్యం కృషి చేస్తున్నారు. ఇందుకోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి పీ-4 కార్యక్రమాన్ని ఉగాది రోజున అమరావతి వేదికగా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా లోగోను ఆవిష్కరించి, ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించారు.

అట్టడుగున ఉన్న పేదల సాధికారత కోసమే ఈ పీ4 కార్యక్రమం. మొదట నాలుగు గ్రామాల్లో పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో 5,869 కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. సంపద అధికంగా ఉన్న కుటుంబాలు అట్టడుగున ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం. ఇందులో భాగంగా లబ్ధిదారులను గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్న సమాచారంతో పాటు సర్వే, గ్రామసభల ద్వారా గుర్తిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 40 లక్షల కుటుంబాలు దీనికి అర్హులుగా ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో సర్వే చేపట్టారు. ఈ సర్వే ద్వారా అట్టడుగున ఉన్న వారిని గుర్తించి లబ్ధిదారుల ధ్రువీకరణ అనంతరం వారి వివరాలను సమృద్ధి బంధనమ్ ప్లాట్‌ఫాంలో ఉంచుతారు.

లబ్ధి పొందాల్సిన కుటుంబాలను సాయం చేసే కుటుంబాలతో అనుసంధానించడమే ఈ పీ-4 విధానంలో ప్రభుత్వ పాత్ర. నేరుగా ప్రభుత్వం ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించదు. ఈ ఏడాది ఆగస్టు నాటికి ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 5లక్షల కుటుంబాలు భాగస్వామ్యం పొందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పీ4 విధానం ద్వారా అట్టడుగున ఉన్న 20శాతం మందికి మేలు జరుగుతుంది. సంపద ఉన్న వారిలో 10శాతం మంది అట్టడుగున ఉన్న వారిలో 20శాతం పేదలను ఆదుకోవడం ద్వారా సమాజంలో ఆర్థిక అసమానతలు రూపుమాపవచ్చన్నది ప్రభుత్వం ఆలోచన.

పీ4 ద్వారా సంపన్న (మార్గదర్శి), ఆర్థికంగా వెనుకబడిన (బంగారు కుటుంబం) కుటుంబాల మధ్య నేరుగా అనుసంధానం ఉంటుంది. ఇందులో ప్రభుత్వం నేరుగా ఆర్థిక సహాయం అందించకపోయినా మార్గదర్శి కుటుంబాలు సమర్థంగా సహాయపడేలా సౌకర్యాలు కల్పిస్తుంది. వివిధ శాఖల డేటా సిస్టమ్స్ విశ్లేషణలు, గ్రౌండ్ సర్వేల ద్వారా అత్యంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలను గుర్తిస్తారు. ఈ ప్రక్రియ డైనమిక్‌గా ఉంటుంది. అర్హులైన కుటుంబాలు ఎప్పటికప్పుడు చేర్చబడతాయి. అదనంగా, కుటుంబాలు తమను తాము బంగారు కుటుంబంగా నమోదు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ధ్రువీకరణ ప్రక్రియ అనంతరం అర్హులైన కుటుంబాలు పథకంలో భాగమవుతాయి.



పీ4 విధానం ద్వారా అట్టడుగున ఉన్న 20శాతం మందికి మేలు జరుగుతుంది. ప్రభుత్వ లక్ష్యాలకు దాతల సహకారం తోడైతే ఎంతో అభివృద్ధి సాధించవచ్చు అన్న విషయం జన్మభూమి, గ్రామాల దత్తత కార్యక్రమాల ద్వారా ఇదివరకే రుజువైంది. ఊరి నుంచి ఎదిగిన శ్రీమంతులు, స్థితిమంతులు, ప్రవాసాంధ్రులు ఆ దిశగా ఆలోచించాలి. అందరు ముందుకు వస్తే పల్లెలు కొత్తరూపు సంతరించుకోవడానికి ఎంతోకాలం పట్టదు.

దేశవ్యాప్తంగా ఏ అవినీతి అరాచకం జరిగినా ఏ1, ఏ2, ఏ3, ఏ4గా ఉండే వైసీపీ నేతలకు పీ4 అంటే ఏం తెలుస్తుంది. దాచుకోవడం దోచుకోవడం తప్ప మరేమీ తెలియని వైసీపీ నేతలకు పేదలు ఏమైపోతే ఏమిటి? వారు మాత్రం ప్యాలెస్‌లు కట్టుకొని రాజభోగాలు అనుభవించవచ్చు, పేదలు సాధికారత సాధిస్తే మాత్రం కళ్లు మండుతాయి! పేదలకు సాయం చేయకపోగా, పేదలను ఆదుకునేందుకు చేపట్టిన మంచి కార్యక్రమంపై బురదజల్లే వైసీపీ నేతలను పేదలు తరిమి తరిమికొట్టే పరిస్థితి రాకపోదు.

'ద గివింగ్ ప్లెడ్జ్' కార్యక్రమంలో భారతదేశం నుంచి పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు పని చేశారు. ప్రపంచ వ్యాప్తంగా 30దేశాల నుంచి 240 మంది ఇందులో చేరి కోట్లాది కుటుంబాలలో మార్పు తెచ్చారు. ప్రతి దేశంలో ఆర్థిక అసమానతలు సహజమే. కానీ ఏ దేశంలో అయితే ఇవి తక్కువగా ఉంటాయో ఆ దేశంలో ప్రజలు సంతోషంగా ఉంటారు. ఆర్థిక అసమానతలను పరిష్కరించడానికి సాహసోపేతమైన చర్యలు అవసరం. సంపద సృష్టి ఒక్కటే సరిపోదని భావించి, అందుకు అనుగుణంగా సంపదను సమర్థమైన మార్గాల ద్వారా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోనున్నారు. మరోవైపు పీ-4 విధానానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి పారిశ్రామికవేత్తలు, ప్రముఖులు సహకరించాలి. ప్రభుత్వ లక్ష్యాలకు దాతల సహకారం తోడైతే ఎంతో అభివృద్ధి సాధించవచ్చు అన్న విషయం జన్మభూమి, గ్రామాల దత్తత కార్యక్రమాల ద్వారా ఇదివరకే రుజువైంది. ఊరి నుంచి ఎదిగిన శ్రీమంతులు, స్థితిమంతులు, ప్రవాసాంధ్రులు ఆ దిశగా ఆలోచించాలి. అందరు ముందుకు వస్తే పల్లెలు కొత్తరూపు సంతరించుకోవడానికి ఎంతోకాలం పట్టదు.


■ ఏలూరి సాంబశివరావు
పర్చూరు శాసనసభ్యులు

## కష్టకాలంలోనూ సైనిక దాడులా?

పెను భూకంపం ధాటికి మయన్మార్ (బర్మా) కకావికలమైంది. రెండువేల మందికి పైగా మరణించినట్లు, మూడు వేల మంది క్షతగాత్రులైనట్టు లెక్క తేలినా, ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది. అమెరికా అంచనాల ప్రకారం విగత జీవుల సంఖ్య కొన్ని వేలల్లో ఉండొచ్చు. అక్కడి రెండు పెద్ద నగరాలు కూలిన భవనాలు, నిర్మాణాలతో మట్టి దిబ్బలుగా మారినట్లు ఛాయాచిత్రాలు చెప్తున్నాయి. వెంటనే అక్కడ సహాయక చర్యలు అందించడానికి భారత్ ముందుకురావడం, 139 టన్నుల సహాయక సామగ్రి, పలు సహాయక బృందాలు, విపత్తు నిర్వహణా టీములు వెంటనే పనిలోకి దిగడం అభినందనీయం. అయితే ఇలాంటి విషాద సమయంలో కూడా అక్కడి సైనిక పాలకులు విపక్షీయులపై ఆయుధ దాడులు ఆపకపోవడం బాధాకరం. స్వంత దేశం కష్టాల్లో ఉన్నప్పుడు తమ శక్తిమేర సహాయక చర్యలు చేపట్టకుండా, సైనిక దాడులు చెయ్యడం వారికే చెల్లు. ఆ దేశం భూకంపాలకు నెలవు. అలాంటప్పుడు భూకంపాలకు తట్టుకునేలా, తక్కువ నష్టం కలిగించేలా నిర్మాణాలు ఉండాలి. జపాన్ తరహాలో నిబంధనల మేరకు నిర్మాణాలు జరిగితే వైపరీత్యాల వేళ తక్కువ ప్రాణ, ఆస్తి నష్టం ఉంటుంది. ఆ దేశంతో సహా, మిగతా దేశాలకు ఈ భూకంపం కనువిప్పు కలిగించాలి. ప్రకృతి వైపరీత్యం జరగకుండా ఎవరూ ఆపలేరు. కానీ, దాని నుంచి తక్కువ నష్టం కలిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవచ్చు. మయన్మార్‌కి వచ్చిన కష్టం బాధాకరం. వారి కన్నీరు తుడుస్తూనే, మనం కళ్లు తెరుద్దాం.

– డి.వి.జి. శంకరరావు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
బుధవారం 2 ఏప్రిల్ 2025



# ఇక.. ఆర్‌అండ్‌బీ వంతు!

నిన్న విజయవాడ మున్సిపల్ కమిషనర్ బంగ్లా, డీఆర్ఆర్ ఇండోర్ స్టేడియాలను అటాచ్ చేస్తూ నోటీసులు ఇచ్చిన విజయవాడ కమర్షియల్ కోర్టు నేడు ఆర్‌అండ్‌బీ శాఖకు హెచ్చరికలు జారీ చేసింది. విజయవాడలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను అమ్మి అయినా కాంట్రాక్టు సంస్థకు నగదు చెల్లించాలని ఆదేశించింది. పక్షం రోజుల డెడ్‌లైన్ విధిస్తూ ఈ లోపు డబ్బులు చెల్లించాలని.. లేని పక్షంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను అటాచ్ చేసి, దానిని విక్రయించి కాంట్రాక్టు సంస్థకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులకు స్పష్టం చేసింది. దీంతో ఆర్‌అండ్‌బీకి ఉన్న పరువు కాస్తా పోయినట్టు అయింది. నిబంధనల ప్రకారం చేసిన పనులకు డబ్బులు చెల్లించకపోతే కాంట్రాక్టు సంస్థలు కమర్షియల్ కోర్టుల ద్వారా న్యాయం పొందవచ్చనడానికి తాజా ఉదంతం అద్దం పడుతోంది.



## నిన్న మున్సిపల్ కమిషనర్ బంగ్లా.. నేడు ఆర్‌అండ్‌బీ బంగ్లా!

### అటాచ్ చేస్తామని విజయవాడ కమర్షియల్ కోర్టు హెచ్చరిక

**15వ తేదీ లోపు కాంట్రాక్టు సంస్థకు నగదు చెల్లించాలి**

**లేని పక్షంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను అటాచ్ చేస్తాం**

**అధికారులకు స్పష్టం చేసిన న్యాయస్థానం**

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇంతకు ముందు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్‌టీఎస్ రోడ్డు పనులు చేసిన కాంట్రాక్టు సంస్థ కమర్షియల్ కోర్టును ఆశ్రయించటంతో కమిషనర్ బంగ్లా, డీఆర్ఆర్ ఇండోర్ స్టేడియాలను అటాచ్ చేసినట్టు ఏకంగా నోటీసులు అంటించి దండోరా కూడా వేయించిన సంగతి తెలిసిందే. అదే కాంట్రాక్టు సంస్థకు ఆర్‌అండ్‌బీలో కూడా భారీ మొత్తంలో బిల్లు బకాయిలు చెల్లించాల్సి ఉండటంతో ఆ కాంట్రాక్టు సంస్థ కమర్షియల్ కోర్టును ఆశ్రయించింది. దీంతో ఆర్ అండ్‌బీ ఉన్నతాధికారులకు విజయవాడ కమర్షియల్ కోర్టు ఘాటుగా హెచ్చరికలు జారీ చేసింది. ఏప్రిల్ 15వ తేదీ లోపు డబ్బులు చెల్లించని పక్షంలో అటాచ్ తప్పదని స్పష్టం చేసింది. దీంతో ఆర్‌అండ్‌బీ శాఖ ఉన్నతాధికారులు, ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్‌డీసీ) ఉన్నతాధికారుల పరువు గాలిలో కలిసింది.




### అసలేం జరిగిందంటే..

హైదరాబాద్- గుంటూరు మార్గంలో పూర్వం స్టేట్ హైవే - 2 (ఇప్పుడు ఎన్‌హెచ్ - 167 ఏజీ)గా ఉండేది. ఈ రోడ్డులో నాలుగు హైలెవల్ వంతెనల కాంట్రాక్టును హైదరాబాద్‌కు చెందిన కాంటెక్ సిండికేట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పనులు దక్కించుకుంది. రోడ్డు పనులను తమ సొంత నిధులతో కాంట్రాక్టు సంస్థ చేపట్టింది. ఈ సంస్థ 2003లో అప్పటి ఆర్‌అండ్‌బీ అధికారులతో అగ్రిమెంట్ అయింది. ఏడాదిలో పనులు పూర్తి చేసింది. దరిమిలా 2004 నుంచి 2013 వరకు దాదాపుగా పదేళ్ల పాటు ఆ సంస్థ టోల్ చార్జీలను వసూలు చేసుకుంది. నిబంధనల ప్రకారం చూస్తే హోల్‌సేల్ ప్రైజ్ ఇండెక్స్ పెరిగిన ప్రతిసారీ ఆ మేరకు కాంట్రాక్టు సంస్థ టోల్ చార్జీలను పెంపుదల చేసి వసూలు చేయాల్సి ఉంటుంది. హోల్‌సేల్ ప్రైజ్ ఇండెక్స్ పెరిగిన క్రమంలో టోల్ చార్జీల పెంపు కోసం ఆర్‌అండ్‌బీ, రోడ్డు కార్పొరేషన్ తదితర సంబంధిత శాఖలకు కాంట్రాక్టు సంస్థ చార్జీల పెంపునకు అనుమతి కోరింది. ఆ సందర్భంలో చార్జీల పెంపుదలకు పైరెండు శాఖలు అంగీకరించలేదు. ఇలా పదేళ్ల పాటు గడిచిపోయింది. ఈ చర్య వల్ల కాంట్రాక్టు సంస్థకు భారీగా నష్టం జరిగింది. దీనిపై కాంట్రాక్టు సంస్థ నిబంధనల ప్రకారం ఆర్బిట్రేషన్‌కు వెళ్లింది. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉండే క్రమంలో హైదరాబాద్‌లో కమర్షియల్ కోర్టును ఆర్‌అండ్‌బీ అధికారులు ఆశ్రయించగా.. అక్కడ వారి కేసును కొట్టివేయటం జరిగింది. ఆ తర్వాత ఆర్‌అండ్‌బీ అధికారులు ఉమ్మడి రాష్ట్రంలోనే హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ కూడా కేసును కొట్టివేయటం జరిగింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారు. అక్కడ కూడా కేసును కొట్టివేశారు. ఈ క్రమంలో రాష్ట్ర విభజన జరిగింది. ఆర్‌అండ్‌బీ అధికారులు న్యాయస్థానాలలో వేసిన కేసులు రద్దు కావటంతో కాంట్రాక్టు సంస్థ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తనకు జరిగిన అన్యాయాన్ని తీసుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఆర్‌అండ్‌బీ శాఖను వివరణ కోరింది. ఆర్‌అండ్‌బీ శాఖ ఉన్నతాధికారులు స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. స్టీరింగ్ కమిటీ జరిగిన తప్పిదాన్ని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఆ తర్వాత మళ్లీ దీనికి సంబంధించి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో కాంట్రాక్టు సంస్థ విజయవాడలోని కమర్షియల్ కోర్టును 2021వ సంవత్సరంలో ఆశ్రయించింది. తనకు మిగతా 6లో..

విద్యార్థులతో పాఠాలు అప్పజెప్పించుకుంటున్న మంత్రి కొల్లు రవీంద్ర



# పాఠాలు చెప్పి.. ప్రశ్నలు అడిగి!

## ఉపాధ్యాయుడైన మంత్రి కొల్లు రవీంద్ర

### ఈడేపల్లి మునిసిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మమేకం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సేవలో క్షణం తీరక లేకుండా గడిపే రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం ఉపాధ్యాయుడిగా మారిపోయారు. ఈడేపల్లి మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో ఒక గంట సేపు పాఠ్య పుస్తకాలు చేత పట్టుకుని విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులతో రైమ్స్ చెప్పించారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖా మంత్రి, కలెక్టరు ఎవరూ అంటూ ప్రశ్నించి విద్యార్థులను నుంచి సమాధానాలు రాబట్టారు. మూడవ తరగతిలో విద్యార్థుల మధ్య బెంచీలపై కూర్చుని ఎక్కాలు అప్పజెప్పించుకున్నారు. వివిధ పాఠ్యాంశాల్లోని ప్రశ్నలు అడుగుతూ సరదాగా గడిపారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుంది.. టీచర్లు సరిగా పాఠాలు చెబుతున్నారా లేక కొడుతున్నారా అని ప్రశ్నించారు. చిన్నారులు చెప్పిన సమాధానాలు విని మంత్రి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి శనివారం మీరు బ్యాగ్‌లు మోసుకుని రానక్కరలేదని, ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపే రోజులు వచ్చాయన్నారు.

లలితా త్రిపుర సుందరీదేవికి
**చామంతులతో పుష్పార్చన** 6లో



**సరుకు రవాణాలో తగ్గేదే లేదు..!**

● ఉత్తమ పనితీరు కనబర్చిన విజయవాడ రైల్వే డివిజన్ 8లో

# కదిలించిన ఫిర్యాదులు

## బుడమేరులో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు



బుడమేరులో మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న డ్రైనేజీ శాఖ అధికారులు

» ఫిర్యాదులు చేసిన గ్రామస్థులు, కూటమి నాయకులు

» ఎట్టకేలకు క్షేత్రస్థాయి పరిశీలనకు డ్రైనేజీ అధికారులు

గుడివాడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల బుడమేరులో అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా సాగాయి. అనుమతి లేకుండా మట్టి తరలింపుపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. గ్రామస్తులు, కూటమి నాయకుల ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం డ్రైనేజీ అధికారులు పరిశీలనకు వెళ్లారు. అధికారులు వస్తున్నారనే విషమం తెలుసుకుని హుటాహుటీన బుడమేరు కట్టపై మట్టిపోసి డ్రైనేజీ అధికారులు కళ్లు గప్పారు. వివరాల్లోకి వెళితే... పెదపారుపూడి మండలం మోపర్రు పంచాయతీ పరిధిలో బుడమేరులో కాలువ వెడల్పు, ఎత్తును పెంచే విధంగా డ్రైనేజీశాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. కాంట్రాక్టు ఎక్స్‌టెన్షన్ లేకుండానే కాంట్రాక్టర్ విచ్చలవిడిగా మట్టిని తవ్వి ఉంగుటూరు, గన్నవరం, ఉయ్యూరు ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్న విషయం తెలిసిందే. బుడమేరు వరదల్లో చేరిన మట్టి దిబ్బలను తవ్వేసుకుని రాత్రిళ్లు టిప్పర్లతో తరలించుకుపోయారు. దీనిపై డ్రైనేజీ అధికారులు అలస్యంగా స్పందించారు. అందునా గ్రామస్తులు, టీడీపీ నాయకుల ఫిర్యాదుతో కదిలారు. మంగళవారం రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు ఫిర్యాదుతో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. బుడమేరు కట్ట పటిష్టతకు పనులు చేపట్టారు.

### స్థానికులకు ఉపాధి కల్పించండి

బుడమేరులో తమ గ్రామ పరిధిలో పనులు జరుగుతుండటంతో తమకు ఉపాధి చూపాలంటూ గ్రామస్తులు డ్రైనేజీ అధికారులను కోరారు. కట్టను పటిష్ట పరచాలని, గతంలో వరదల వలన తాము తీవ్రంగా నష్టపోయామని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలోని ట్రాక్టర్‌లను పనుల్లో వినియోగించుకోవాలని కోరారు. ప్రస్తుతం మోపర్రు వైపు పనులు జరుగుతున్నాయని, చేదుర్తిపాడు పరిధిలో పనులు ప్రారంభమవ్వగానే ఉపాధి అవకాశాలు కల్పించేలా చూస్తానని కాంట్రాక్టర్ హామి ఇచ్చారు.

### రాత్రి పూట పనులకు అనుమతులివ్వవద్దని ఎస్ఈకి లేఖ

వరుస ఫిర్యాదుల నేపథ్యంలో బుడమేరులో రాత్రిళ్లు పనులు చేయకుండా ఉత్తర్వులివ్వాలని డ్రైనేజీ అధికారులు ఎస్ఈకి లేఖ రాశారు. తాము విధుల్లో ఉండే వరకు పనులు జరిగేలా చూడాలని, రాత్రి ఏడు గంటల తరువాత ఎటువంటి పనులు చేయవద్దని కోరారు. డ్రైనేజీశాఖ గుడివాడ ఈఈ కిరణ్‌బాబు, డీఈ గణపతి, ఏఈ అనిల్, పాములపాడు డీసీ చైర్మన్ యార్లగడ్డ రవి, కాంట్రాక్టర్ గొట్టిపాటి శ్రీధర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రాండ్ టూరిజం!

## సందర్శకులను ఆకట్టుకునేలా ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలు

**'ఆపరేషన్ టూరిజం' పేరుతో పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు**

**హోటల్స్, రవాణా రంగాలతోనూ ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం చర్చలు**

**జిల్లాను అగ్రపథంలో నిలిపేందుకు కలెక్టర్ లక్ష్మీశ కృషి**




(ఆంధ్రజ్యోతి, విజయవాడ): 'బ్రాండ్ ఎన్టీఆర్.. గ్రాండ్ టూరిజం' పేరుతో జిల్లాకు వచ్చిన పర్యాటకులను నాలుగు రోజుల పాటు ఇక్కడే ఉండేలా చేసేందుకు ఒక అద్భుతమైన జిల్లాస్థాయి టూరిజం సర్క్యూట్ ప్యాకేజీకి ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. జిల్లా స్థూల ఆదాయంలో 60 శాతం పైగా ఆదాయం పర్యాటకం, సేవా రంగాల ద్వారా వస్తోంది. దీంతో కలెక్టర్ లక్ష్మీశ ఎన్టీఆర్ జిల్లాను అగ్రపథంలో నిలిపేందుకు పర్యాటకరంగంపై దృష్టి సారించారు. ఆపరేషన్ టూరిజం పేరుతో టూరిజాన్ని విభిన్న కోణాలలో అభివృద్ధి చేసే అంశాలను అన్వేషిస్తున్నారు. ఎన్టీఆర్‌జిల్లా భౌగోళిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఒక టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చెయ్యాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ జిల్లాకు వచ్చిన వారు నాలుగు రోజుల పాటు ఇక్కడ ఉండటానికి వీలుగా ఒక పర్యాటక మార్గాన్ని ప్యాకేజీగా తీసుకురావాలన్న ఆలోచన చేశారు. దీనికి అనుగుణంగా టెంపుల్ టూరిజం, అడ్వెంచర్ టూరిజం, ఆతిథ్యరంగం, రవాణా రంగం మిగతా 6లో..

### ప్యాకేజీని తక్కువ ధరకు తెచ్చేందుకు రవాణా, ఆతిథ్య రంగాలతో ఒప్పందం

జిల్లా టూరిజం ప్యాకేజీని అతి తక్కువ ధరకు తీసుకు వచ్చేందుకు వీలుగా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు పర్యాటక అధికారులు రవాణ, ఆతిథ్య రంగాలతో ఒప్పందం చేసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రవాణా, ఆతిథ్య రంగాలతో అధికారులు సమావేశమవుతున్నారు. ఆతిథ్య రంగంలో స్టార్ హోటల్స్, ఫోర్ స్టార్ హోటల్స్, త్రీ స్టార్ హోటల్స్, బడ్జెట్ హోటల్స్, రెసిడెన్సీలు, లాడ్జీలు వంటి వాటితో సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రతిష్ఠాత్మక జిల్లా పర్యాటక ప్యాకేజీని బుక్ చేసుకున్న వారికి డిస్కౌంట్ రేట్లతో చార్జీ వసూలు చేసేలా వారితో చర్చలు నడుస్తున్నాయి. చర్చలు సానుకూలంగా జరుగుతున్నాయి. ఇదే సమయంలో రవాణా రంగంతో కూడా అధికారులు చర్చలు జరుపుతున్నారు. రవాణా రంగానికి సంబంధించి ట్యాక్సీలు, ప్రైవేటు మినీ బస్ ఆపరేటర్లతో కూడా సంప్రదింపులు జరుపుతున్నారు. జిల్లా టూర్ ప్యాకేజీ బుక్ చేసుకున్న అతి తక్కువ ధరతో చార్జీలు తీసుకునేలా వాటి అసోసియేషన్స్‌తో సంప్రదింపులు చేస్తున్నారు.

### బ్రాండ్ ప్రమోషన్స్

జిల్లా టూరిజం ప్యాకేజీలకు అధికార యంత్రాంగం బ్రాండ్ ప్రమోషన్‌ను కల్పించనుంది. ఆర్టీసీ బస్సులపై ప్రకటనలు, సినిమా థియేటర్లలో స్లైడ్స్, బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు ఇలా జనసమ్మర్థం ఉన్న ప్రాంతాలలో పర్యాటక ప్యాకేజీలకు సంబంధించి ప్రచారం కల్పించనుంది. అదేవిధంగా సోషల్ మీడియా ద్వారా కూడా ప్రచారం చేయించనుంది. జిల్లాకు చెందిన ప్రముఖులనే బ్రాండ్ అంబాసిడర్లుగా గుర్తించి వారి ద్వారా కూడా వివిధ రంగాలకు చెందిన వర్గాలలో ప్రచారం కల్పించనుంది.

# గృహ యోగం

**2025-26 ఆర్థిక సంవత్సరానికి అర్బన్, రూరల్ కేటగిరీలలో ఎన్టీఆర్ జిల్లాకు 1,15,379 గృహాలు మంజూరు**

**నిర్మాణాల కోసం 1,08,836 రిజిస్ట్రేషన్లు** 6లో

# కృష్ణాతీరంలో అడుగుల సవ్వడి

**వేసవిలో హీట్‌ను బీట్ చేస్తామంటున్న కృష్ణా రివర్ వాకర్స్**

కృష్ణాతీరంలో ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మికత

కనకదుర్గవారధి కింద శాండ్ వాక్, యోగా, స్విమ్మింగ్

భవానీ జల శంకరాలయంలో పూజలు 8లో



పెండింగ్ ఆర్‌వోబీలకు

# మోక్షం

**వైసీపీ ప్రభుత్వ హయాంలో 4 ఆర్‌వోబీలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే**

» నూరు శాతం ఖర్చుపెడతాం.. ప్రతిపాదనలు ఇవ్వమన్నా ఇవ్వని ప్రభుత్వం

» కూటమి ప్రభుత్వం రావటంతో అడుగు ముందుకు పడింది

» యుద్ధ ప్రాతిపదికన రెండు ఆర్‌వోబీలకు అనుమతులు ఇచ్చిన రైల్వే

» భూసేకరణకు సంబంధించి గజిట్ నోటిఫికేషన్ విడుదల

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాయనపాడు - విజయవాడల మధ్య పెండింగ్ ఆర్‌వోబీలకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌వోబీలన్నింటినీ మేమే పూర్తి ఖర్చు పెట్టి చేస్తామని రైల్వేశాఖ నుంచి ప్రతిపాదన వచ్చినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ఆర్‌వోబీల పరిస్థితి ఎక్కడ వేసిన మిగతా 6లో..



### పరీక్షలు అయిపోయాయ్!

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఆఖరి సబ్జెట్ రాసిన విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుంచి చిరునవ్వులు చిందిస్తూ బయటకు వచ్చారు. దేదీప్యమానంగా వెలిగిపోతున్న ముఖాలతో ఒకరికొకరు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఇక పరీక్షలు అయిపోయాయ్ అంటూ రోడ్లపై సందడి చేస్తూ ఇళ్లకు చేరారు.

**లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు సెక్యులర్ పార్టీలు కలిసిరావాలి**

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ 6లో

**క్రీడాకారులకు శాప్ చైర్మన్ అభినందన** 8లో

**దేవరపల్లిలో బుసక దందా!**

» బీసీ సొసైటీ భూముల్లో నెల రోజులుగా రాత్రివేళ తవ్వకాలు 6లో

**ప్రతి కుటుంబంలోనూ ఒక పారిశ్రామికవేత్త ఉండాలి**

» కలెక్టర్ లక్ష్మీశ 8లో

# 'గోవిందరాజు' భూములపై విచారణ

### సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పటమట గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టు భూములపై విచారణకు రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశించారు. 'రూ.250 కోట్ల పబ్లిక్ ట్రస్ట్ భూమి గోవిందా!' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై దేవదాయశాఖ స్పందించింది. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ విచారణకు ఆదేశించారు. దీనిపై సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వాలని కోరారు. 2023లో మచిలీపట్నం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ఈవో సుబ్బారెడ్డి గోవిందరాజులు ట్రస్ట్‌కు సంబంధించిన సమగ్ర విచారణ జరిపి ఒక నివేదిక ఇచ్చారు. దేవదాయశాఖ కమిషనర్ దీనిపై సుబ్బారెడ్డి నుంచి కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారని తెలుస్తోంది. అప్పట్లో సుబ్బారెడ్డి గుర్తించిన అంశాలన్నింటిని కమిషనర్‌కు విన్నవించారని సమాచారం. ముమ్మాటికీ పబ్లిక్ ట్రస్ట్ భూములని, ప్రైవేటు ట్రస్టు మాదిరిగా వాటిని విక్రయించటం చట్టవిరుద్ధమని ఆయన చెప్పినట్టు తెలిసింది. దేవదాయ శాఖ కమిషనర్ సమగ్ర విచారణకు ఆదేశించటంతో.. మరోమారు విచారణ కమిటీని నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## లలితా త్రిపుర సుందరీదేవికి చామంతులతో పుష్పార్చన

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గమ్మకు నిత్యం లలితా సహస్రనామ పారాయణం, జప, తర్పణ నిర్వహిస్తారు. ఆదిశంకరాచార్యులు అమ్మవారిని దర్శించుకున్న తరువాత, ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి నిత్యం పుజలు జరుగుతుంటాయి. ఈ క్రమంలో అమ్మవారిని ఉగ్రరూపం నుంచి లలిత మనోహర సుందర దివ్యరూపాన్ని భక్తులకు ప్రదర్శించాలని ఆదిశంకరాచార్యులవారు కోరటంతో మహిషాసుర మర్ధినిగా స్వయంభువుగా అవతరించిన దుర్గమ్మ అనుగ్రహించి సౌందర్యలహరిలో పేర్కొన్నట్టుగా లలిత లావణ్య సుమధుర సోయగాల చిరుమందహాస మూర్తిగా భక్తులను దీవిస్తూ దర్శనమిచ్చింది. అప్పటి నుంచి ఆమెను లలితా సహస్రనామంతో అర్చిస్తారు. లలితా సహస్ర నామంలో ఒక చోట ఆమెకు చాంపేయ కుసుమ ప్రియ అని వస్తుంది. అందుకే ఆమెను చామంతులతో కొలవటం వల్ల సంతుష్టిరాలువుతుందని నమ్మిక. దుర్గామల్లేశ్వర దేవస్థానంలో చైత్ర మాస వసంత నవరాత్రుల్లో తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో పూజించటం జరుగుతుంది. మంగళవారం పసుపు, తెలుపు చామంతులు, మల్లెలతో ప్రత్యేక పుష్పార్చన వైభవంగా జరిగింది. పూజా మండపం (నటరాజస్వామి ఆలయ ప్రాంగణం)లో ఉదయం 9 గంటలకు పుష్పార్చన ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. జపాన్ దేశం టోక్యో నగరానికి చెందిన మహిళలు దుర్గమ్మ పుష్పార్చనలో పాల్గొన్నారు. విజయవాడ సందర్శనలో భాగంగా దుర్గమ్మ మహిమలు గురించి స్థానికుల నుంచి తెలుసుకుని పుష్పార్చనలో పాల్గొన్నట్టు వారు పేర్కొన్నారు.



పూజల్లో జపాన్ యువతులు



ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లకు వినతి పత్రం ఇస్తున్న ఎన్ఎంయూ నేతలు

## పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

» ఆర్టీసీ చైర్మన్‌కు ఎన్ఎంయూ నేతల వినతి

బస్‌స్టేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణను నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైశ్రీనివాసరావు, ఇతర నాయకులు కోరారు. మంగళవారం బస్‌స్టేషన్ ప్రాంగణంలోని ఎన్టీఆర్ భవన్‌లో కొనకళ్లను యూనియన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఇప్పటికే సమస్యలపై ఎండీకి వినతి పత్రం ఇచ్చామని గుర్తుచేశారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలను సత్వరం పరిష్కరించాలని చైర్మన్‌ను కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని చైర్మన్‌కు అందజేశారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి ఎస్.రాజేష్ కుమార్, విజయవాడ జోనల్ కార్యదర్శి ఎ.రామారావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు, రేపు ఆర్టీసీ డిపోల వద్ద ఎర్ర బ్యాడ్జీలతో నిరసన

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేంత వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల వద్ద బుధ, గురువారాల్లో ఎర్ర బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు ఎన్ఎంయూ నేతలు ఒక ప్రకటనలో తెలిపారు. 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, సస్పెన్షన్లు, అక్రమ తొలగింపులను ఆపాలని, నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.



ముప్పాళ్లలో ముఖ్యమంత్రి పర్యటన స్థలం పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

## 5న ముప్పాళ్లకు సీఎం చంద్రబాబు

» ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే సౌమ్య

చందర్లపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబు మండలంలోని ముప్పాళ్ల రానున్నారు. ఈనెల 5న జగ్జీవన్‌రామ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తున్నది. ఈక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముప్పాళ్లలో పర్యటించనున్నారు. తొలుత జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. ఆయన దేశానికి చేసిన సేవలను వివరించనున్నారు. అక్కడే ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించే అవకాశం ఉంది. అనంతరం పీ-4 కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఎస్సీ కాలనీల్లో ప్రజల ఆర్థిక స్థితిగతులను ముఖ్యమంత్రి స్వయంగా తెలుసుకోనున్నారు. పూర్తిగా పేదరికంతో ఉన్న వారిని గుర్తించి వారిని గ్రామంలోని సంపన్నులకు దత్తత ఇవ్వనున్నారు. అనంతరం నియోజకవర్గంలోని పార్టీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ప్రభుత్వవిప్ తంగిరాల సౌమ్యలు ముప్పాళ్ల గ్రామంలో పర్యటించారు. సమావేశానికి అనువైన స్థలం కోసం అన్వేషించారు. హెలిప్యాడ్ ప్రదేశాలను పరిశీలించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు రానుండటం పట్ల కూటమి నేతల్లో ఉత్సాహం నెలకొన్నది. కార్యక్రమంలో ఆర్డీవో కె.బాలకృష్ణ, ఎన్ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, కోగంటి బాబు, మేకల సుధాకర్, ఉన్నం నరసింహారావు, నల్లాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గృహ యోగం

» 2025-26 ఆర్థిక సంవత్సరానికి అర్బన్, రూరల్ కేటగిరీలలో ఎన్టీఆర్ జిల్లాకు 1,15,379 గృహాలు మంజూరు

» నిర్మాణాల కోసం 1,08,836 రిజిస్ట్రేషన్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్టీఆర్ జిల్లా ప్రజలకు గృహయోగం కలగబోతోంది. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన్ (పీఎంఏవై) పథకం కింద 1,15,379 గృహాల నిర్మాణానికి లక్ష్యం నిర్దేశించటం జరిగింది. ఇప్పటి వరకు 1,08,836 మంది దరఖాస్తు చేసుకోగా.. 26,610 గృహాలకు ఇంకా అవకాశం ఉంది. దీనికోసం జిల్లా ప్రజలు మండల హౌసింగ్ ఏఈ కార్యాలయంలో గానీ, గ్రామ సచివాలయంలోగానీ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్టీఆర్ జిల్లాలో అర్బన్, గ్రామీణ ప్రాంతాలకు వేర్వేరుగా మొత్తం మూడు కేటగిరీల్లో ఇళ్లను మంజూరు చేయటం జరిగింది.

● అర్బన్ లోకల్ బాడీ (యూఎల్‌బీ) పరిధిలో పీఎంఏవై అర్బన్ (బీఎల్‌సీ) కేంద్రం వాటా రూ.1,50,000, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.30,000 కలిపి రూ.1,80,000 ఉంటుంది.

● అర్బన్ డెవలప్‌మెంట్ ఏరియా (యూడీఏ) పరిధిలో పీఎంఏవై (బీఎల్‌సీ)లో కేంద్ర వాటా రూ.1,50,000, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.18,000, ఎస్‌బీఎం ద్వారా రూ. 12,000 కలిపి రూ. 1,80,000 ఉంటుంది.

● పీఎంఏవై గ్రామీణ పరిధిలో కేంద్రం



రూ.1,20,000, రాష్ట్ర ప్రభుత్వం రూ.30,000, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.18,000, ఎస్‌బీఎం ద్వారా రూ.18,000 కలిపి మొత్తం రూ.1,80,000 ఉంటుంది.

● ఎన్టీఆర్ జిల్లా తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 2,466, నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో 21,157, విజయవాడ అర్బన్ పరిధిలో 85.214 ఇళ్లు మంజూరయ్యాయి. నియోజకవర్గాల వారీగా తిరువూరు(2465), నందిగామ (12,690), జగ్గయ్యపేట (8,467), మైలవరం (23,750), విజయవాడ సెంట్రల్ (23,490), విజయవాడ తూర్పు (19,620), విజయవాడ పశ్చిమ (18,354) ఇళ్లు మంజూరయ్యాయి.

### ముందుకు కదలని 2021-22 గ్రామీణ ఇళ్లు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 4,143 పీఎంఏవై గ్రామీణ ఇళ్లు మంజూరు కాగా వీటిలో 2,254 ఇళ్ల పనులు ప్రారంభమే కాలేదు. కేవలం పూర్తయిన ఇళ్లు 1007 మాత్రమే ఉన్నాయి.

### లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు

# సెక్యులర్ పార్టీలు కలిసిరావాలి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

జగ్గయ్యపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు సెక్యులర్ పార్టీలు, ప్రజాసంఘాలు ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఎంతైన ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చాక అతిపెద్ద ప్రమాదాన్ని లౌకిక రాజ్యాంగంపై జరుగుతున్న దాడితో దేశ ప్రజలు అందరూ ఎదుర్కోబోతున్నారని ఆయన హెచ్చరించారు. మంగళవారం రాత్రి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో సీపీఐ ఏరియా కార్యదర్శి ఎ.శివాజీ అధ్యక్షతన జరిగిన లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలో ఇండోనేషియా, పాకిస్తాన్‌ల తర్వాత ముస్లిం జనాభా అధికంగా ఉన్న భారతదేశంలో కేంద్ర కేబినెట్‌లో ఒక్క ముస్లింకు కూడా చోటు కల్పించలేదని, బీజేపీ మతోన్మాదంతో వ్యవహరిస్తున్నదని చెప్పారు. దేశంలో బీజేపీ తిరుగులేని శక్తిగా ఎదిగేందుకు జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ స్థానాల పునర్విభజనను తలకెత్తుకుందని చెప్పారు. దక్షిణాదిలో బలహీనంగా ఉన్న బీజేపీ ఉత్తరాదిలో పార్లమెంట్ స్థానాలను పెంచుకుని ఆ ప్రాబల్యంతో తిరుగులేని శక్తిగా ఎదగాలన్న కుట్ర వుందని చెప్పారు.

### మోదీ, అమిత్‌షాలను చూస్తే జగన్‌కు హడల్

రాష్ట్రంలో అన్ని రాజకీయపార్టీలు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలకు ఊడిగం చేస్తున్నాయని రామకృష్ణ ఆరోపించారు. ప్రతిపక్ష





సదస్సులో మాట్లాడుతున్న సీపీఐ రామకృష్ణ

నేత జగన్‌కు మోదీ, అమిత్‌షాను చూస్తేనే హడల్ లని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మోదీని పొగడటమే అజెండాగా పెట్టుకున్నారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాషాయ జెండా వేసుకుని గుడులు, గోపురాలు తిరుగుతున్నారని విమర్శించారు.

### జనాభా పెంచమనటానికి సిగ్గులేదా!

పార్లమెంట్ స్థానాల కోసం బీజేపీ జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేస్తుంటే చంద్రబాబు నిస్సిగ్గుగా ప్రజలను జనాభా పెంచమంటున్నారని విమర్శించారు. చంద్రబాబు, లోకేష్‌లతో పాటు ధనికులు, కార్పొరేట్‌లు ఎవరైనా ఒకరు, ఇద్దరికు మించి కన్నారా అని ప్రశ్నించారు. కార్పొరేట్లకు కొమ్ముకాసి వారిని అతి పెద్ద ధనికులుగా చేస్తున్న టీడీపీ, కూటమి ప్రభుత్వం వాళ్లను పేదలను ఆదుకోమని అడ్డుకోవటం అవివేకమని రామకృష్ణ అభిప్రాయం వ్యక్తం చేశారు. మేఘా కృష్ణారెడ్డి అనే సామాన్య కాంట్రాక్టర్‌ను నేడు ఈ స్థాయికి తెచ్చింది చంద్రబాబు, వైఎస్, జగన్‌లు కాదా అని ప్రశ్నించారు.

### విద్యుత్ కాంట్రాక్టులు రద్దు చేయరేం

ఎన్నికలకు ముందు జగన్ ప్రభుత్వం విద్యుత్ కాంట్రాక్ట్‌ల వల్ల ప్రజలపై తీవ్ర విద్యుత్ భారం పెరుగుతుందని చెప్పిన చంద్రబాబు, పవన్‌లు నేడు అధికారంలోకి వచ్చాక ఎందుకు రద్దు చేయటం లేదని నిలదీశారు. విద్యుత్ ఒప్పందాల వల్ల ప్రజలపై రూ.1.20 లక్షల కోట్ల భారం మోపుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా సీపీఐ కార్యదర్శి దోనేపుడి శంకర్, పట్టణ సీపీఐ కార్యదర్శి జె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రాండ్ టూరిజం!

(5వ పేజీ తరువాయి)

వంటి అనేక సేవా రంగాలను కూడా సమ్మిళతం చేసి ఎన్టీఆర్ జిల్లా బడ్జెట్ టూరిజం ప్యాకేజీకి కలెక్టర్ లక్ష్మీశ శ్రీకారం చుట్టారు. ఆ మేరకు జిల్లా పర్యాటక అధికారులతో ప్యాకేజీ రూపకల్పన చేయిస్తున్నారు.

**అనేక వనరులకు నిలయం :** జిల్లా పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా అనేక వనరులు కలిగిన ప్రాంతం కావటంతో ఒక అద్భుతమైన టూర్ ప్యాకేజీకి శ్రీకారం చుట్టి, దీనిని పబ్లిక్ డొమైన్‌లోకి తీసుకు రానున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో కృష్ణానదిని ఉత్తరవాహినిగా పిలుచుకునే జగ్గయ్యపేట ముక్త్యాల నుంచి పరిటాల వరకు కృష్ణాతీరం వెంబడి అనేక పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. వీటన్నింటినీ గొలుసుకట్టుగా అనుసంధానిస్తారు. మధ్యలో కొండపల్లి బొమ్మల తయారీ పరిశ్రమలు, కొండపల్లి బొమ్మల విక్రయశాలలు వంటివి ప్యాకేజీకి జోడిస్తారు. జిల్లాను ప్రపంచ పటంలో నిలబెడుతున్న హస్తకళాఖండం కొండపల్లి బొమ్మలు కావటంతో బొమ్మల తయారీని ప్రత్యక్షంగా చూసేలా ప్యాకేజీలో పొందుపరచబోతున్నారు. ఆ తర్వాత ఎంతో చారిత్రక ప్రసిద్ధి చెందిన కొండపల్లి కోటను ప్రత్యక్షంగా చూసేలా, దాని చరిత్ర తెలుసుకునేలా టూరిజం ప్యాకేజీకి లేజర్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి వీక్షించేలా చేయటంతో పాటు ఆ తర్వాత కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ అందాలను వీక్షించేలా, ట్రెక్కింగ్ చేసేలా టూర్ ప్యాకేజీకి జోడిస్తారు. మూలపాడు బటర్ ఫ్లై పార్క్‌ను కూడా ఈ ప్యాకేజీలో అనుసంధానం చేస్తారు. ఇవన్నీ పూర్తయిన తర్వాత పవిత్ర సంగమం, విజయవాడలో కనకదుర్గమ్మ గుడి, బాపు మ్యూజియం, గాంధీహిల్, మొగల్రాజపురం గుహలు, ప్రకాశం బ్యారేజీ వంటి సందర్శనీయ ప్రాంతాలను ప్యాకేజీలో యాడ్ చేస్తారు. ఆ తర్వాత నగరంలో అత్యంత ప్రత్యేకమైన హరిత బెర్మ్‌పార్క్, భవానీ ద్వీపం సందర్శన, అక్కడే బస వంటి వాటిని కూడా ప్యాకేజీలో అంతర్భాగం చేస్తారు. చివరగా చెంతనే ఉన్న అమరావతి రాజధాని సందర్శన, ఉండవల్లి గుహలు, వెంకటేశ్వరస్వామి టెంపుల్, మంగళగిరి పానకాలస్వామి దేవాలయాల సందర్శన వంటి వాటిని కలుపుతూ ప్యాకేజీని ముగిస్తారు. ఈ ప్యాకేజీ కూడా పర్యాటకులు కోరుకున్నట్టుగా అమలు చేయటానికి రెండు, మూడు సర్క్యూట్లను రూపొందిస్తారు.

**పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు :** జిల్లాలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసే అంశాలపైనా ఇదే సందర్భంలో దృష్టి పెట్టనున్నారు. కొండపల్లి రిజర్వు ఫారెస్టు మంచి ట్రెక్కింగ్, సైట్ సీయింగ్ ప్రాంతంగా ఉంది. దాదాపుగా వందకు పైగా జలపాతాలను ట్రెక్కర్లు గుర్తించారు. రిజర్వు ఫారెస్ట్‌లో ట్రెక్కింగ్ చేసే వారికి, క్యాంపింగ్ చేసేవారికి తగిన సదుపాయాలను కల్పించే అంశంపై దృష్టి సారించారు. ఫారెస్ట్‌లోకి ఎంతవరకు వీలైతే అంతవరకు సిమెంట్ రోడ్డును వేయగలిగితే కొండపల్లి రిజర్వు ఫారెస్టుకు సందర్శకుల తాకిడి పెరుగుతుందని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. అలాగే రోడ్డు వెంబడి సిమెంట్ బల్లలు, షెల్టర్స్, తాగునీరు వంటివి ఏర్పాటు చేస్తే చక్కగా అడవిలో ప్రకృతిని ఆస్వాదించవచ్చని అంచనా వేస్తున్నారు. కొండపల్లి ఖిల్లాకు పునర్వైభవం తీసుకురావటానికి వీలుగా అక్కడ లేజర్ షో పునరుద్ధరణ, ఫెస్టివల్స్ నిర్వహణ వంటివి చేపట్టనుంది. కొండపల్లిని పర్యాటకంగా తీర్చిదిద్దటానికి వీలుగా పీపీపీ విధానంలో పలు ప్రాజెక్టులను చేపట్టాలని భావిస్తోంది.

## పెండింగ్ ఆర్‌వోబీలకు మోక్షం

(5వ పేజీ తరువాయి)

గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. ఆర్‌వోబీల నిర్మాణానికి సంబంధించి ప్రధానంగా రెవెన్యూ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల నుంచి ఏమేమి తొలగించాల్సి వస్తుంది? వాటికి అయ్యే వ్యయం ఎంత? అన్న అంచనాలను మాత్రమే రైల్వే శాఖ కోరింది. ఈ అంచనాలు ఇవ్వటంలో కూడా అప్పట్లో అంతులేని తాత్సారం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన క్రమంలో .. కొద్ది రోజుల కిందట విజయవాడ రైల్వే డివిజన్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైల్వే అధికారులు ఆర్‌వోబీలకు సంబంధించిన పెండింగ్ అంశాలను వివరించారు. జిల్లా యంత్రాంగం చొరవ చూపటంతో రైల్వే శాఖకు ప్రతిపాదనలు అందించటం జరిగింది. దీంతో రైల్వే శాఖ యుద్ధ ప్రాతిపదికన రెండు ఆర్‌వోబీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాయనపాడు యార్డు నుంచి 147వ లెవల్ క్రాసింగ్ గేటు వరకు ఒక ఆర్‌వోబీ, లెవల్ క్రాసింగ్ గేట్ 148 దగ్గర రాయనపాడు - విజయవాడ స్టేషన్ల మధ్యన మరో ఆర్‌వోబీకి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాయనపాడు పరిధిలో ఏర్పాటు చేస్తే రెండు ఆర్‌వోబీల పనులకు భూ సేకరణ ప్రక్రియను చేపట్టేందుకు వీలుగా గజిట్ నోటిఫికేషన్‌ను కూడా వెలువరించటం జరిగింది.



ముప్పాళ్లలో పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ లక్ష్మీశ

## ముగిసిన పది పరీక్షలు

» ఎన్టీఆర్ జిల్లాలో 27,577 మంది హాజరు

» పరీక్షా కేంద్రాన్ని తనిఖీచేసిన కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : చందర్లపాడు మండలంలోని ముప్పాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. చివరిరోజు సోషల్ పరీక్ష 168 కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహించగా.. జిల్లాలో 27,840 మందికిగాను 27,577 మంది (99.06 శాతం) హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 64 కేంద్రాలను తనిఖీ చేశాయి. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో యూవీ సుబ్బారావు తెలిపారు.

## హార్టీకల్చర్ సమగ్ర అభివృద్ధి లక్ష్యం

» కేంద్ర సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ వెల్లడి

వన్‌టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం 2014-15 నుంచి మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడిహెచ్) పథకాన్ని అమలు చేస్తోంది.. దేశవ్యాప్తంగా హార్టీకల్చర్ రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పథకం అమలవుతోంది. హార్టికల్చర్ రైతులకు మద్దతుగా ఉండేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ (ఎంఐఎస్) ధర తేడా భర్తీ చెల్లింపు (ఎంఐఎస్-పిడిపిఎస్) వంటి పథకాలు ప్రోత్సాహకాలు అమలు చేస్తోందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ వెల్లడించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హార్టికల్చర్ రైతులకు కేంద్ర ప్రభుత్వం గత ఐదేళ్లుగా అందిస్తున్న మద్దతు వివరాలు తెలపాలని లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడిహెచ్) పథకాన్ని సమీక్షించేందుకు నీతి అయోగ్ సహా అనేక స్వతంత్ర సంస్థలు అధ్యయనాలు చేశాయని, ఇందువల్ల హార్టికల్చర్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా గుర్తించటం జరిగిందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు పథకంలో పలు మార్పులు చేయటం జరిగిందన్నారు.

## యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా నేడు గొల్ల నరసింహ యాదవ్ బాధ్యతల స్వీకరణ

విద్యాధరపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : యాదవులు, బీసీల సంక్షేమం అభివృద్ధి కోసం అంకిత భావంతో పనిచేస్తానని గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. మంగళవారం ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. 1982 నుంచి పార్టీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, ఎన్టీఆర్ అభిమానిగా ఉంటున్నానని తెలిపారు. తన 43 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఏ పదవి ఇచ్చినా వన్నె తెచ్చేలా పనిచేసినట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాలు, తూ.చ తప్పకుండా పాటిస్తూ పార్టీ ఎదుగుదలకు కృషి చేసినట్టు తెలిపారు.

## దుర్గగుడి అన్నదాన విభాగం పెండింగ్ బిల్లు నిలిపివేత

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానం అన్నదాన విభాగంలో పనిచేసే ఇద్దరు అధికారులు భారీగా చేతివాటం ప్రదర్శిస్తూ అమ్మవారి సొమ్ము కైంకర్యం చేస్తున్నారని ఆరోపణలు వినిపించాయి. ఆ విభాగంలో సేవా బృందం సభ్యులు ఉచితంగా సేవలు అందిస్తుంటారు. వీరిని అవకాశంగా తీసుకుని ఆ విభాగంలో ఇద్దరు అధికారులు అక్కడ పనిచేసే సిబ్బందితో పాటు సేవా బృందం సభ్యులను కూడా పనిచేస్తున్నట్లు రికార్డు తయారు చేసి మూడు నెలలకుగాను పెండింగ్ బిల్లు రూ.20లక్షలు తీసుకోవటానికి ప్రయత్నించినట్టు సమాచారం. ఈ వ్యవహారం పై మార్చి28వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్నదాన విభాగంలో అవినీతి భోజనం కథనం ప్రచురితమైంది. దీని పై స్పందించిన దేవస్థానం ఈ.ఓ, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ విచారణ చేపట్టారు. అందులో భాగంగా అన్నదాన విభాగం అధికారులు పెట్టిన మూడు నెలలకు సంబంధించి 20 లక్షల రూపాయల బిల్లును నిలిపివేశారు. ప్రతిరోజూ అన్నదాన విభాగంలో పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా బయో మెట్రిక్ హాజరు వేయాలని ఈ.ఓ ఆదేశించారు. దీంతో మంగళవారం నుంచి అన్నదాన విభాగంలో ఉన్న బయో మెట్రిక్ ద్వారా హాజరువేసుకున్నారు.

## ఇక.. ఆర్అండ్‌బీ వంతు!

(5వ పేజీ తరువాయి)

జరిగిన నష్టం విలువ రూ.8.94 కోట్లుగా పేర్కొని కోర్టుకు నివేదించింది. కోర్టు విచారించిన మీదట తాజాగా ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులకు ఏప్రిల్ 15వ తేదీ లోపు కాంట్రాక్టు సంస్థకు డబ్బులు చెల్లించాలని ఆదేశించింది. లేని పక్షంలో విజయవాడ బందరు రోడ్డు వెంబడి ఉన్న ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను అటాచ్ చేస్తామని పేర్కొంది. మరి.. ఆర్అండ్‌బీ అధికారులు చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన దిద్దుబాటు చర్యలు చేపడతారా? లేక నిర్లక్ష్యంగా వ్యవహరించి కార్పొరేషన్ ఆస్తులను అటాచ్ చేసినట్టుగా ఏదైనా చేసుకోమని వదిలేస్తారా అన్నది వేచి చూడాల్సి ఉంది.

# దేవరపల్లిలో బుసక దందా!

» బీసీ సొసైటీ భూముల్లో నెల రోజులుగా రాత్రివేళ తవ్వకాలు

» పక్కపొలాలు కోతకు గురయ్యేలా ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్న వైనం


» రెవెన్యూ అధికారుల అండతో స్థానిక టీడీపీ నాయకుల నిర్వాకం!

» పంట చేలకు ప్రమాదమని సమీప భూముల రైతుల ఆవేదన

(తోట్లవల్లూరు, ఆంధ్రజ్యోతి)

తోట్లవల్లూరు మండలం దేవరపల్లి బీసీ సొసైటీ ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నెలరోజులుగా రాత్రి సమయాల్లో బుసక తవ్వకాలు అడ్డూ అదుపు లేకుండా జరుగుతున్నాయి.

స్థానిక టీడీపీ నాయకులు రెండు గ్రూపులుగా ఏర్పడి ఒకరోజు ఒక గ్రూపు, రెండోరోజు మరో గ్రూపు చొప్పున బుసక దందా చేస్తున్నారని పార్టీ కార్యకర్తలే చెబుతున్నారు. వీరికి రెవెన్యూ అధికారుల అండ ఉందని బాహాటంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నదీపాయలో రహదారి వేసినప్పుడే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని, దాంతో బుసక అక్రమ తవ్వకాలకు తెరలేపారని రైతులు ఆరోపిస్తున్నారు. రాత్రి 7 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు యంత్రాలతో ట్రాక్టర్లకు బుసక లోడింగ్ చేస్తున్నారని, ప్రతిరోజు సుమారు వంద ట్రాక్టర్లలో రవాణా సాగిస్తున్నారని రైతులు తెలిపారు. ట్రాక్టర్‌లో బుసక లోడింగ్‌కి రూ 500 నుంచి రూ.700 వరకు వసూలు చేస్తున్నారని, ఇందుకు సహకరించే బీసీ సొసైటీ సభ్యుల్లో కొందరికి ట్రాక్టర్‌కి రూ.100 చొప్పున ముట్టజెప్పి.. ట్రాక్టర్ బుసకను గ్రామాల్లో రూ. 1500 వరకు విక్రయిస్తు అక్రమార్కులు సొమ్ముచేసుకుంటున్నారని చెప్పారు.



దేవరపల్లి బీసీ సొసైటీ భూముల్లో బుసక తవ్వకాలు



రాత్రి వేళ గుట్టుగా రవాణా

### నిబంధనలకు విరుద్ధం

ప్రభుత్వం ఇచ్చిన సొసైటీ భూములను సాగుచేసుకుని జీవించాలని, ఈ విధంగా మట్టిని అమ్ముకోకూడదని నిబంధనలు చెపుతున్నాయి. సాగుకి అనుకూలంగా లేకుంటే అధికారులకు దరఖాస్తు చేసుకుని అనుమతి వచ్చాక తవ్వకాలు చేయాల్సి ఉంది. అయితే ఒక్క రైతు కూడా దరఖాస్తు చేయకుండా సదరు టీడీపీ నేతలు దగ్గరుండి బుసక తవ్వకాలు సాగించటం దారుణమని విమర్శలు వస్తున్నాయి.

### పంటలకు ప్రమాదం

మొక్కజొన్న పండిస్తున్న భూములకు వరదవస్తే ప్రమాదం వాటిల్లేలా లోతుగా బుసక మట్టిని తవ్వేశారని, దీంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియకుండా ఉందని పలువురు రైతులు వాపోయారు. మూడు చోట్ల మూడెకరాల వరకు బుసక తవ్వకాలు జరిగాయని చెప్పారు. అధికారులు అడ్డుకట్ట వేయకపోతే సొసైటీ భూములకు రక్షణ ఉండదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### తవ్వకాల విషయం తెలియదు! పరిశీలించి చర్యలు తీసుకుంటా..

- తహసీల్దార్ ఎం.కుసుమకుమారి

దేవరపల్లి బీసీ సొసైటీ భూముల్లో బుసక అక్రమ తవ్వకాలపై తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని వివరణ కోరగా.. ఆ విషయం తనకు తెలియదన్నారు.

ఇప్పటివరకు బుసక తవ్వకాలకు ఎవరూ దరఖాస్తు చేయలేదని, అక్రమ తవ్వకాలకు రెవెన్యూ సహకరిస్తుందన్న ఆరోపణలు నిజం కాదన్నారు. వీఆర్వోకి చెప్పి తవ్వకాలను నిలిపివేయిస్తానని ఆమె పేర్కొన్నారు.



**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 162,171, 182 |
| చికెన్ విత్ స్కిన్ | 310 |
| చికెన్ స్కిన్‌లెస్ | 320 |
| నెక్ కోడిగుడ్డు ధర (100) | |
| విజయవాడ జోన్ రైతు ధర రూ. 450 | |

### 4న క్రికెట్ సెలక్షన్స్

విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 4న సీనియర్ మెన్ అండ్ అండర్-23 మెన్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు కేడీసీఏ సెక్రటరీ ఎం.రవీంద్ర చౌదరి తెలిపారు. సీనియర్ మెన్ సెలక్షన్స్‌లో పాల్గొనే వారు తమ పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ జిరాక్స్ కాపీ తీసుకురావాలని, అండర్-23 సెలక్షన్స్‌లో పాల్గొనే వారు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని తెలిపారు. ఈ ఎంపికలు 4న ఉదయం 7.30నుంచి ప్రారంభమవుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికలకు వచ్చేటపుడు వారి పూర్తి క్రికెట్ కిట్‌తో పాటు వైట్ డ్రస్, స్పోర్ట్స్ షూస్‌తో హాజరుకావాలని ఆయన తెలిపారు.

# 10వేల ఇళ్లకు సోలార్ విద్యుత్ లక్ష్యం

### ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



14వ డివిజన్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఏపీకి చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ప్రతిసారి రాష్ట్రంలో ఒక ప్రత్యేక పథకాన్ని ప్రారంభించి ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 14వ డివిజన్ ఎస్ఎస్ఎం స్కూల్ సమీపంలో మంగళవారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డివిజన్‌లో ఇద్దరు నిరుపేద కుటుంబాలకు చెందిన కార్యకర్తలకు తన సొంత నిధులతో బడ్డీ కొట్టు, ప్లాట్‌ఫాం రిక్షాను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయిన తొలి సారి డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. ఇప్పుడు సోలార్ విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. నియోజక వర్గంలో 10 వేల ఇళ్లకు సోలార్ విద్యుత్ అమలు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు. ఈ పథకానికి ఉన్న రాయితీలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఎల్లబాబు, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, నర్రా కిషోర్, నాగరాజు, గరికపాటి బద్రీ, డాంగియా కుమారి, సాంబయ్య పాల్గొన్నారు.

# శేషజీవితం ఆనందంగా గడపాలి

### పదవీ విరమణ కార్యక్రమంలో సీపీ రాజశేఖరబాబు



పదవీ విరమణ చేసిన సిబ్బందికి వీడ్కోలు చెబుతున్న నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, అడ్మిన్ డీసీపీ కేజీవీ సరిత

గుణదల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన సిబ్బంది శేషజీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని కోరుకుంటున్నట్లు నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. నగర పోలీస్ కమిషనరేట్లో పనిచేసి పదవీ విరమణ చేసిన సిబ్బందికి వీడ్కోలు పలికే కార్యక్రమం కమిషనర్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. పదవీ విరమణ చేసిన వారిని ముందుగా దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంకిత భావంతో సేవలు అందించిన వారికి సమాజంలో ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని చెప్పారు. పదవీ విరమణ చేసిన వారిలో టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ ఎ.శ్రీనివాసరావు, గుణదల స్టేషన్ ఎస్ఐ అబ్దుల్ రఖీబ్, మూడో ట్రాఫిక్ ఎస్ఐ జె.రంగయ్య, సీఎస్‌బీలో ఏఎస్ఐ వై.ఎస్.మహంకాళిరావు, ఏఆర్‌లో హెడ్ కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసరావులు ఉన్నారు. పదవీ విరమణ చేసిన సిబ్బందికి వీడ్కోలు చెప్పే కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ డి.ప్రసాదరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు, పోలీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

### పన్ను వసూళ్లు రూ. 252 కోట్లు

కార్పొరేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : 2024-25 సంవత్సరానికి ఆస్తి పన్ను, నీటి చార్జీలు, డ్రెయినేజీ చార్జీలు మొత్తం కలిపి రూ.252 కోట్లు వసూలు అయ్యాయని విజయవాడ నగరపాలకసంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరంలో పోలిస్తే ఈ సంవత్సరం 20 శాతం పన్నులు అధికంగా వసూలు చేశామని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను రూ.160 కోట్లు, నీటి చార్జీలు రూ.34 కోట్లు, డ్రెయినేజీ చార్జీలు రూ.15 కోట్లు వసూలు కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను రూ.189 కోట్లు, నీటి చార్జీలు రూ.44 కోట్లు, డ్రెయినేజీ చార్జీలు రూ. కోట్లు మొత్తం కలిపి రూ.252 కోట్లు వసూలు అయ్యాయని ఆయన తెలిపారు.

# త్వరితగతిన వితంతు పింఛన్ పంపిణీ



13వ డివిజన్‌లో పింఛన్ అందిస్తున్న కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్



పెన్షన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పటమట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో వితంతు పింఛన్ల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం త్వరితగదిన పంపిణీ చేస్తున్నామని 13వ డివిజన్ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ తెలిపారు. డివిజన్‌లో గుండు వెంకట్రావ్ అనే లబ్ధిదారుడు ఫిబ్రవరిలో మృతి చెందాడు. ఆ పింఛన్‌ను వితంతు పింఛన్‌గా మార్చి అతని భార్య లక్ష్మికి మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ తర్వాత చనిపోయిన వ్యక్తుల భార్యలకు వెంటనే పింఛన్ మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. తన డివిజన్‌లో ఐదుగురు వితంతువులకు పింఛన్ మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి నూతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**రాణిగారితోట:** కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ప్రతినెల మొదటి తేదీనే అన్ని సామాజిక పెన్షన్‌లు అందించడం జరుగుతుందని 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు అన్నారు. మంగళవారం డివిజన్‌లో పెన్షన్‌ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### రేపటి వరకు రైల్వే గేటు మూసివేత



మధురానగర్, ఏప్రిల్ 1 (ఆంధ్ర జ్యోతి): మధురానగర్ పప్పుల మిల్లు రైల్వే గేటు మూసేశారు. రైల్వే ట్రాక్‌ల మరమ్మతుల నిమిత్తం గురువారం వరకు (మూడు రోజులు)గేటు మూసేసి ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. వాహనదారులు మధురానగర్ రెల్వే స్టేషన్ ఆర్‌యూబీ వైపు నుంచి దారిని వినియోగించుకోవాలని సూచించారు.

**BHIMAVARAM MUNICIPALITY**
**EXPRESSION OF INTEREST (E.O.I)**
Roc No.2193/EOI/2025/G1/DB Dated :01.04.2025

The Commissioner, Bhimavaram Municipality invites the Expression of Interest (E.O.I) for providing "PROPOSAL FOR INSTALLATION, UPGRADATION, OPREATION & MAINTENANCE OF MODREN TRAFFIC SIGNALS ON BOOT (BUILD OWN OPERATE AND TRANSFER) BASIS IN BHIMAVARAM MUNICIPALITY LIMTS" from the eligible Firms/Agencies/Dealing with Traffic Signals

1. Starting Date for selling E.O.I Document : 03.04.2025 at 11:00 AM
2. Ending date for Selling of E.O.I Doc : 16.04.2025 at 04:00 PM
3. Last Date for Submission of E.O.I In Sealed cover : 17.04.2025 upto 04:30 PM

The Technical bid & Finacial bid sealed in separate covers shall be dropped in the E.O.I Box at Commissioner Chamber on 17-04-2025 up to 04.30 pm and same will be opened at 5.00 p.m. For obtain E.O.I Document please contact Section Office during the working hours on payment of non - refundable fee of Rs.11,800/- (10,000/- + 1,800 GST) Demand Draft favouring to the commissioner, Bhimavaram Municipality. The bidder Shall submit Bid Security Deposit of Rs.1,00,000/- (Rupees One Lakh Only) by way of Demant Draft drawn from any Nationalized / Scheduled Bank of India in favor of "Commissioner, BHIMAVARAM MUNICIPALITY" payable at Bhimavaram along with E.O.I

Commissioner,
Bhimavaram Municipality.



త్రిశక్తిపీఠంలో కాళీమాత అమ్మవారు, ఉత్సవమూర్తులకు కలువ పూలతో అర్చన చేస్తున్న కమిటీ సభ్యులు

# కాళీమాతకు కలువ పూలతో పుష్పార్చన

కృష్ణలంక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వసంత నవరాత్రుల మూడో రోజైన మంగళవారం త్రిశక్తి పీఠంలోని కాళీమాత అమ్మవారి ఉత్సవమూర్తులకు కలువ పూలతో ఆలయ కమిటీ సభ్యులు పుష్పార్చన నిర్వహించారు. కాళీమాత అమ్మవారిని వరలక్ష్మీదేవిగా అలంకరించారు. ఉదయాన్నే శ్రీ మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### కొరగంజి శేఖర్‌బాబుకు ఘన నివాళి



కొరగంజి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

పటమట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కార్మిక నేత కొరగంజి 19వ వర్ధంతిని సీపీఐ నేతలు 9వ డివిజన్ పటమటలంకలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు మాట్లాడుతూ కొరగంజి శేఖర్‌బాబు 74 కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తన బ్యాంకు ఉద్యోగాన్ని సైతం తృణ ప్రాయంగా వదులుకున్నారన్నారు. ఈకార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యుడు దోనేపూడి సూరిబాబు, డివిజన్ కార్యదర్శి లంక ప్రసాద్, సైకం రాము, అన్నే జగన్నాథరావు, బొమ్మిడి రవి, నడకుదిటి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

# తేనెమనసులు 60 సంవత్సరాల వేడుకలు



తేనెమనసులు విడుదలై 60 సంవత్సరాలైన సందర్భంగా వేడుకలు నిర్వహిస్తున్న కృష్ణ ఫ్యాన్స్

గవర్నర్‌పేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో సూపర్‌స్టార్ కృష్ణ ప్రధాన పాత్రలో తొలిసారిగా నటించిన తెలుగు భాషా ప్రేమకథ చిత్రం తేనెమనసులు (1965) విడుదలై 60 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆలిండియా సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో మంగళవారం లెనిన్ సెంటర్‌లోని బాబా మందిరంలో కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. భక్తుల సమక్షంలో అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాస్వామి మాట్లాడుతూ తేనెమనసులు చిత్రం పూర్తిగా రంగుల్లో చిత్రీకరించబడిన మొదటి తెలుగు సామాజిక చిత్రం కావడం విశేషమన్నారు. ప్రధాన పాత్రల్లో అందరినీ కొత్తవారిని ఎంపిక చేసుకోవడం అప్పట్లో పెద్ద సంచలనం అన్నారు. సినిమా వాణిజ్య పరంగా విజయవంతమవ్వడమే కాకుండా డోలి పేరుతో 1969లో హిందీలో కూడా పునర్నిర్మించారని పేర్కొన్నారు.

# తండ్రి సిగరెట్ మానడం లేదని ఆత్మహత్య

వన్‌టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పక్షవాతానికి గురైన తండ్రి సిగరెట్ తాగడం మానడం లేదని మనస్తాపంతో కుమార్తె (32) సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం తిరుమలరావు వీధి, నిర్మల శిశుభవన్ సమీపంలో బండారు రమేష్ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతని భార్య ఏడాది క్రితం చనిపోయింది. అతనికి ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు స్థానికంగా ఉంటున్నాడు. రెండో కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అతను కుమార్తె శివరూపిణి కలిసి ఉంటున్నారు. రమేష్ బాబు పక్షవాతానికి గురికావటంతో ఇంటి వద్ద ఉంటూ మందులు వాడుతున్నాడు. అతని కుమార్తె ఇంటి వద్ద ఉంటూ తండ్రి ఆలనా పాలనా చూసుకుంటుంది. రమేష్ బాబుకు సిగరెట్లు అలవాటు ఉంది. డాక్టర్లు మానేయమని చెప్పినా అతను వినకుండా సిగరెట్లు తాగుతున్నాడు. ఈ విషయంపై సోమవారం రాత్రి తండ్రి కుమార్తె మధ్య గొడవ జరిగింది. దీంతో కోపంతో మనస్తాపం చెందిన ఆమె రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. పక్కగదిలో ఉన్న తండ్రి ఎంత పిలిచినప్పటికీ తలుపు తీయకపోవటంతో పెద్ద కొడుకుకు సమాచారం ఇచ్చాడు. అతను వచ్చి తలుపులు నెట్టి చూడగా శివరూపిణి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి ఫ్యాన్‌కు వేలాడుతున్న శివరూపిణి మృతదేహాన్ని కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివకుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాస్టర్ మృతిపై విచారణ జరిపించాలని

### కొవ్వొత్తుల ర్యాలీ నేడు

లబ్బీపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చర్చెస్ ఆధ్వర్యంలో బుధవారం క్యాండిల్ లైట్ పీస్ ర్యాలీ నిర్వహించనున్నామని ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ ఫాదర్ మువ్వల ప్రసాద్, రెవరెండ్ పాస్టర్ ఆలూరి విశ్వప్రసాద్ తెలిపారు. పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల మృతిపై క్రైస్తవ సమాజంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, పాస్టర్ మరణంలో కుట్రకోణం దాగి ఉందని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం సాయంత్రం 6గంటలకు బావాజీపేటలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చ్ ఈస్ట్ పారిష్ నుంచి క్యాండిల్ లైట్ పీస్ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. సాంబమూర్తి రోడ్ మీదుగా ధర్నా చౌక్ ప్రెస్‌క్లబ్ వరకు ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన క్రైస్తవ సోదరులు కొవ్వొత్తుల ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### వైద్యఖర్చులకు ఆర్థికసాయం

రామలింగేశ్వరనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):

15వ డివిజన్ రామలింగేశ్వర నగర్‌కు చెందిన కటకం భీష్మకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థికసాయాన్ని మంగళవారం టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతి కుమార్ బాధితుడి ఇంటికి వెళ్లి అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### రోస్టర్‌లో లోపాలను సరిదిద్దాలి

పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ

గాంధీనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై రోస్టర్‌లో లోపాలను సరిదిద్ది మాదిగలకు 7, మాలలకు 7, ఉపకులాలు 1 శాతం రిజర్వేషన్లు కేటాయించి సమన్యాయం చేసేలా గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. మాలలకు తలొగ్గి రోస్టర్‌లో లోపాలను సరిదిద్దకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. గాంధీనగర్‌లోని కార్యాలయంలో మంగళవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు రోస్టర్‌పై ప్రభుత్వ నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. వర్గీకరణపై ఆర్డినెన్స్ కాదు... అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

### పాలిసెట్ ఉచిత శిక్షణకు 15లోగా దరఖాస్తు చేయండి

భారతీనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశించేందుకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ తరగతుల నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం విజయసారథి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ అప్లికేషన్‌పై ఫోన్ నెంబరుతో పాటు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ ఇవ్వబడుతుందన్నారు. పాలిసెట్ పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులు ఈ నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పదవ తరగతి పరీక్షలురాసి పాలిటెక్నిక్ కోర్సులలో చేరే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాల ప్రధాన కార్యాలయం, 9492685021లో సంప్రదించాలని అన్నారు.

### దుర్గగుడిలో అన్నవితరణకు విరాళం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):

తెలంగాణా రాష్ట్రం వరంగల్‌కు చెందిన సి.హెచ్.రమేష్ తమ కుటుంబ సభ్యులతో మంగళవారం అమ్మవారి ఆలయానికి విచ్చేసి అన్నవితరణ నిమిత్తం అధికారులను కలిసి రూ.1,00,116లను చెక్కు అందదేశారు.

ఈ సందర్భంగా అధికారులు దాతకు, కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అధికారులు ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

### అంతర్గత రోడ్లో పేరుకున్న చెత్త



గురునానక్ కాలనీ శివాలయం సమీపంలోని అంతర్గత రోడ్లో చెత్త, ఎండిపోయిన చెట్ల కొమ్మలు పెరుకుపోయి ప్రమాదకరంగా మారింది. చెత్త, ఇతర వ్యర్థాలు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భారతీనగర్,ఆంధ్రజ్యోతి

### పెంచిన పాలు, పాల ఉత్పత్తుల ధరలు ఉపసంహరించాలి

చిట్టినగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న ధరలకు పోటీపడి కృష్ణామిల్క్ యూనియన్ యాజమాన్యం ఏడాదికి రెండుసార్లు చొప్పున ఏటా పాల ధరలు పెంపుదల చేయడం అన్యాయమని సీపీఎం నాయకులు బోయి సత్యబాబు అన్నారు. పెంచిన పాలు, పాల ఉత్పత్తుల ధరలకు నిరసనగా మంగళవారం విజయ డెయిరీ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. కనీసం వినియోగదారులని పిలిచి సంప్రదింపులు జరపటం లేదని, ఏకపక్షంగా కృష్ణా మిల్క్ యూనియన్ పాలు, పాల ఉత్పత్తుల ధరలు పెంచుతుందన్నారు. వెంటనే పెంచిన ధరలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు, సుబ్బారెడ్డి, బాలదుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
© 99854 11868, 99854 85777

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
© సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

**FLATS FOR SALE**
విజయవాడ, తాడిగడప డొంకరోడ్డు, కోడూరు వారి కాలనీ, విఘ్నేష్ హైట్స్ నందు 2 BHK ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్రదించండి: © 91337 37163
AJB- 209325

**WANTED**
విజయవాడ మెట్రోపాలిటన్ హోటల్ వారికి స్టాఫ్ కావలెను. ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ఫీల్డ్ ఆఫీసర్ - సెక్యూరిటీ, సౌత్ ఇండియన్ చెఫ్, హౌస్ కీపింగ్ బాయ్స్, సెక్యూరిటీ గార్డు, ఆకర్షణీయమైన జీతం. సంప్ర: © 72888 85598
AJB- 8

**PLOT FOR SALE**
విజయవాడ, గొల్లపూడి, కంచికచర్ల, పరిటాల పరిసర ప్రాంతాల్లో ప్లాట్లు అమ్మదలచిన, కొనదలచిన వారు సంప్రదించగలరు. సెల్: 93947 17262
AJB-209331

**EDUCATION**
ఆంధ్రా, నాగార్జున యూనివర్శిటీల ద్వారా DEGREE, P.G, MBA, MCA, AUTHORIZED STUDY & EXAM CENTER. డైరెక్ట్ 10th, ఒకే సం.లో ఇంటర్. భవ్య అకాడమి (Since 2001): 97053 35678
AJB- 175

**పాఠకులకు ముఖ్య గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటన రూ. 290/- ప్రతి అదనపు లైనుకు రూ. 40/- కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733, గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

మీ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా తెలియజేయండి.
లీగల్ ప్రకటనలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
ఎటువంటి ప్రకటనకైనా ఆంధ్రజ్యోతిని సంప్రదించండి.
జన్మదిన, వార్షికోత్సవ శుభాకాంక్షలు
అంతిమయాత్ర, వర్ధంతి, జయంతి
క్లాసిఫైడ్స్
పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 11609
పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, వన్‌టౌన్, భవానిపురం : 99854 09286, పెనమలూరు : 99854 09240, మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733 గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240



# కృష్ణాతీరంలో అడుగుల సవ్వడి

## వేసవిలో హీట్‌ను బీట్ చేస్తామంటున్న కృష్ణా రివర్ వాకర్స్

వారంతా వివిధ వృత్తుల్లో రిటైర్డ్ అయిన వారు, పలు ప్రాంతాలకు చెందిన వారు. 35 ఏళ్ల కిత్రం కృష్ణమ్మ వారందరినీ శాండ్ వాక్ పేరుతో ఒకచోట చేర్చింది. అప్పటి నుంచి వారి స్నేహబంధం 3 దశాబ్దాలుగా కొన సాగుతోంది. ప్రతిరోజు కలిసేవారు, ఒకరిని ఒకరు చూసుకోనిదే ఉండలేరు. ఎక్కడికైనా కుటుంబ సభ్యుల్లా కలిసి వెళ్తారు. కృష్ణా తీరాన్ని చూడక పోతే, ఆ గాలి పీల్చకపోతే, ఆ నీటిని తాకక పోతే, ఏదో కోల్పోయిన భావన కలుగుతుందని అంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం








- కృష్ణాతీరంలో ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మికత
- కనకదుర్గవారధి కింద శాండ్ వాక్, యోగా, స్విమ్మింగ్
- భవానీ జల శంకరాలయంలో పూజలు
- తారు రోడ్డు, మట్టి రోడ్డు వాకింగ్ కన్నా శాండ్ వాకింగ్ బెస్ట్ అంటున్న వాకర్లు

విజయవాడ నగరంలోని కనకదుర్గావారధి దిగువన కృష్ణాతీరంలో ఇసుకలో వాకింగ్, స్విమ్మింగ్, యోగా చేసేందుకు ఎంతోమంది క్యూ కడుతున్నారు. వారిలో 30 ఏళ్లుగా నిరంతరాయంగా వస్తున్నవారూ ఉన్నారు. వాకింగ్, స్విమ్మింగ్ తరువాత భవానీ జల శంకరాలయంలో పూజలు చేస్తూ, ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకుంటున్నారు. భక్తి, ఆరోగ్యంపై ఆసక్తితో ప్రతిరోజూ అక్కడికి వెళుతున్న కృష్ణా రివర్ శాండ్ వాకర్స్ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు. యోగాసనాలు, బ్రీతింగ్ ఎక్సర్ సైజులు ఆరోగ్యానికి ఎంతోమేలు చేస్తాయని, వాటితో పాటు స్విమ్మింగ్ వల్ల శ్వాస వ్యవస్థ బలపడుతుందంటున్నారు. 70వ దశకంలోనూ బీపీ, షుగర్ సమస్యలు లేకపోవడానికి శాండ్ వాక్, ఆధ్యాత్మిక భావన, యోగాసనాలే కారణమంటున్నారు. ఇక్కడ ఒక్కసారి వాకింగ్‌కు అలవాటు పడితే, ఏళ్ల తరబడి ఆపలేరంటున్నారు. వరదల సమయంలో తప్ప, ఎప్పుడూ విరామం తీసుకోలేదని, 60, 70 ప్లస్ వయసులోనూ ఆరోగ్యంగా ఉండాలంటే, కృష్ణాతీరాన్ని తప్పక తాకాలంటున్నారు వాకర్స్ మాకు ఆరోగ్యాన్నిచ్చే కృష్ణా నదిలోని జీవరాసులకు హాని జరగకుండా, సబ్బులు, షాంపూల వాడకాన్ని పూర్తిగా నిషేధించామని చెబుతున్నారు. నేటి వేగవంతమైన జీవితంలో ఊబకాయం, అనారోగ్యాలతో బాధపడే యువతకు శాండ్ వాకర్స్ మార్గదర్శకంగా నిలుస్తారనడంలో సందేహం లేదు. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటూ వారు తమ అనుభవాలను పంచుకుంటూ, ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో చూపిస్తున్నారు.

### 3 దశాబ్దాల బంధం
### పుట్టగుంట వెంకటేశ్వరరావు



నేను 33 ఏళ్లుగా స్విమ్మింగ్‌కు వెళుతున్నా. ఒకరోజు స్విమ్మింగ్‌కు వెళ్లకపోతే ఏదో కోల్పోయానన్న భావన. వాకింగ్‌కు వెళ్లబట్టే నేటికీ బీపీ, షుగర్ లాంటి సమస్యలు లేవు. భక్తి, ఆరోగ్యం ఒకేచోట దొరుకుతుండటంతో ఆసక్తి చూపుతున్నాం. మిత్రులతో కాలక్షేపానికి కృష్ణాతీరం సరైన వేదిక.

### వాకర్స్, స్విమ్మర్స్ స్నేహం ఇది
### గుత్తికొండ శివన్నారాయణ



నేను 35 ఏళ్ల నుంచి కృష్ణా తీరానికి వెళుతున్నా. మొదట్లో పటమటలంక నుంచి కలిసి వెళ్లేవాళ్లం. 30 ఏళ్లకు పైగా వాకర్స్ అండ్ స్విమ్మర్స్‌గా స్నేహం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే ఏ ఊరు వెళ్లాలన్నా కలిసే వెళతాం. కార్తీకమాసం, శివరాత్రి పర్వదినాల్లో తలో చేయి వేసి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం.

### తీరానికి వస్తే స్నేహం.. ఆరోగ్యం: నయిముల్లా



కృష్ణా తీరానికి వస్తే స్నేహం, ఆరోగ్యం రెండు లభిస్తాయి. అందుకే ఉదయాన్నే శాండ్ వాకింగ్ చేస్తాం. సతీసమేతంగా వాకింగ్‌కి వస్తా. కృష్ణా తీరంలో నడక, యోగా, శ్వాసపై ధ్యాస అన్ని అనారోగ్యాలను దూరం చేస్తుంది. నలుగురితో మాట్లాడటంతో మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఇక్కడకు చిగురించిన స్నేహం ఎన్నేళ్లయినా కొనసాగుతుంది.



### ఆరోగ్యానికి ఆయువుపట్టు: నిమ్మగడ్డ సుబ్బారావు



దాదాపు 35 ఏళ్ల నుంచి కృష్ణానదితో అనుబంధం ఉంది. శాండ్ వాక్ చేశాక యోగాసనాలు వేస్తే ఆరోగ్యానికి ఆయువుపట్టు. ఈరోజు వరకు మందులుగానీ, ఆసుపత్రికి వెళ్లడం గానీ ఎరుగం. ఒక రోజు కృష్ణానదికి వెళ్లకపోతే నిరుత్సాహంగా ఉంటుంది. మాకు మార్గదర్శనం చేసిన వారు చెన్నుపాటి శేషగిరిరావు, ఐలాపురం వెంకయ్య. ఎక్కడికి వెళ్లినా వాకర్స్ అందరం కలిసికట్టుగా వెళతాం.

### దైవదర్శనం.. ఆ తర్వాత యోగా
### తాడికొండ రత్నకుమార్



18 ఏళ్లు వచ్చినప్పటి నుంచి అంటే 22 ఏళ్లుగా వెళుతున్నాం. విజయవాడ క్లబ్ దగ్గర ఉండే వాళ్లం పోలీస్ కానిస్టేబుల్ ట్రయినింగ్‌కు వెళ్లాం. రన్నింగ్, లాంగ్ జంప్ ప్రాక్టీస్ కోసం మొదలు పెట్టాం. అలవాటుగా మారిపోయింది. ఇసుకపై నడవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఒక రోజు వెళ్లకపోయినా ఏదో కోల్పోయామన్న భావన.

### జీవితానికి హ్యాపీ స్టార్ట్ : తాడికొండ శ్రీనివాసరావు



ఆహ్లాదం, ఆరోగ్యం ఒకే సమయంలో లభిస్తాయి. మంచి ఫ్రెండ్స్‌తో కబుర్లు ఓ ఆటవిడుపుగా ఉంటుంది. నిత్యం పని ఒత్తిడిలో ఉండే మాకు ఇది రిలీఫ్. రోజువారి జీవనం నుంచి ఈ 2గంటలు ఎంతో ఉపశమనం కలుగుతుంది. జీవితానికిది ఓ హ్యాపీ స్టార్ట్ లాంటిది. వాకింగ్, స్విమ్మింగ్, ప్రేయింగ్ అన్ని కలిసివస్తాయి.

---



చైత్ర దీపికను అభినందిస్తున్న శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

## రోలర్ స్కేటింగ్‌లో చైత్రదీపికకు పతకాలు

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తైవాన్‌లో గత నెల 24 నుంచి 30 వరకు జరిగిన తైవాన్ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఓపెన్ కాంపిటిషన్స్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన పి.చైత్రదీపిక భారత జట్టు తరపున పలు విభాగాల్లో పతకాలు సాధించింది. పెయిర్ (దీపిక, కైవల్య) స్కేటింగ్ విభాగంలో బంగారు పతకం, ఇన్‌లైన్ విభాగంలో కాంస్య పతకం, కపుల్ (చైత్ర దీపిక, కైవల్య) డాన్స్ విభాగంలో రజత పతకాలు మొత్తం మూడు పతకాలు సాధించి దేశానికెంతో పేరు తెచ్చింది. ఈ సందర్భంగా చైత్ర దీపిక స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడును మర్యాదపూర్వకంగా కలిసి తైవాన్‌లో సాధించిన పతకాల గురించి వివరించింది. దీంతో ఆయన దీపికను అభినందించి భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి దేశానికి పేరుతేవాలని సూచించారు.

## రోస్టర్‌లో లోపాలు సరిదిద్దాలి

- పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ

గాంధీనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై రోస్టర్‌లో లోపాలను సరిదిద్ది మాదిగలకు 7, మాలలకు 7, ఉపకులాలు 1 శాతం రిజర్వేషన్లు కేటాయించి సమన్యాయం చేసేలా ఈనెల 3న జరగబోయే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. మాలలకు తలొగ్గి రోస్టర్‌లో లోపాలను సరిదిద్దకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. గాంధీనగర్‌లోని కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రోస్టర్‌లో మాలలకు 8, మాదిగలకు 6 రిజర్వేషన్లు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. వర్గీకరణకపై ఆర్డినెన్స్ కాదు, అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

## పాత పీ అండ్ టీ కాలనీలో
# మహిళ అనుమానాస్పద మృతి

విజయవాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఆటోనగర్‌ను ఆనుకుని ఉన్న పాత పీ అండ్ టీ కాలనీలో ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. బందరు రోడ్డు పక్కన ఆటోనగర్ గేటుకు సమీపంలో చెత్త కాగితాలను ఏరుకునే కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇక్కడ ఉంటున్న లక్ష్మికి దాసరి మహంకాళి నాలుగో భర్త. ఇద్దరూ చెత్త కాగితాలను ఏరుకుంటూ జీవిస్తున్నారు.

భార్యాభర్తలు ఇద్దరూ అట్టపెట్టెలు, చెత్త కాగితాలను ఏరుకుని వాటిని విక్రయించగా వచ్చిన డబ్బులతో మద్యం తాగుతుంటారు. ఆటోనగర్‌లో చాంద్ బిర్యానీ పాయింట్‌కు ఎదురుగా ఉన్న వీధిలో రామ్ ప్రియ అపార్ట్‌మెంట్ ఉంది. దీనికి దిగువ షాపులు ఉన్నాయి. వాటికి పైన మూడంతస్తుల్లో ఫ్లాట్లు ఉన్నాయి. ఈ అపార్ట్‌మెంట్‌కు మొత్తం మూడు మార్గాలు ఉన్నాయి. తూర్పు, దక్షిణం, ఉత్తరం వైపు నుంచి అపార్ట్‌మెంట్‌లోకి మార్గాలు ఉన్నాయి. సరిగ్గా ఉత్తర, పశ్చిమకు వాయువ్యంలో ఆటోమొబైల్ షాపునకు పక్కన లక్ష్మి పడి ఉంది. ఆమెకు రక్తస్రావం అవుతూ ఉండడంతో స్థానికులు పటమట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలాన్ని సెంట్రల్ ఏసీపీ దామోదరరావు, దక్షిణ మండలం ఏసీపీ దేవినేని పావన్‌కుమార్, పటమట ఇన్‌స్పెక్టర్ వి.పవన్ కిషోర్, కృష్ణలంక ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ బి.గుణరాము, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సత్యానందం పరిశీలించారు.

### పరారీలో భర్త

లక్ష్మి భర్త మహంకాళిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మి చనిపోయిందన్న విషయం తెలిసిన తర్వాత బందరు రోడ్డుకు పక్కన గుడిసెల్లో ఉంటున్న వాళ్లంతా ఘటనా స్థలానికి చేరుకున్నారు. మహంకాళి మాత్రం కనిపించలేదు. దీంతో పోలీసులు అతడిపై అనుమానం వ్యక్తం చేశారు. లక్ష్మికి జరిగిన రక్తస్రావం రుతుచక్రం కారణంగా జరిగిందా లేదా ఇతర కారణాలు ఉన్నాయన్నది వైద్యుల పరీక్షల్లో తేలాల్సి ఉంది.

## రవాణా శాఖ చరిత్రలో.. తొలి ఏటీసీగా రమాశ్రీ

- 1990లో తొలి మహిళా ఆర్‌టీఓగా రవాణాశాఖలోకి అడుగు పెట్టిన రమాశ్రీ
- మళ్ళీ ఇన్నాళ్ళకు అదనపు రవాణా కమిషనర్‌గా చరిత్ర

ఆంధ్రజ్యోతి, విజయవాడ: రాష్ట్ర చరిత్రలో రవాణా శాఖ అదనపు రవాణా కమిషనర్‌గా మహిళా అధికారిణి ఎల్ఎస్ఎం రమాశ్రీ పదోన్నతి పొందారు. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (జేటీసీ)గా ఉన్న రమాశ్రీకి ఈ అరుదైన గౌరవం దక్కింది. రమాశ్రీ ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో తొలి మహిళా ఆర్టీఓగా వచ్చారు. మహిళలు కూడా ఆర్‌టీఓ పోస్టులకు అర్హులేనని నాడు ఎన్టీఆర్ తీసుకున్న చారిత్రక నిర్ణయంతో 1990 వ సంవత్సరలో రమాశ్రీ మొదటి మహిళా ఆర్‌టీఓగా నియమితులయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర రవాణా శాఖలోనే రమాశ్రీ అదనపు రవాణా కమిషనర్‌గా నిలవటం విశేషం. నాడు ఎన్టీఆర్ నేతృత్వంలో తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో ఆర్‌టీఓగా అవకాశం దక్కించుకున్న రమాశ్రీ మళ్ళీ చంద్రబాబు నేతృత్వంలోని అదే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో అదనపు రవాణా కమిషనర్‌గా పదోన్నతి సాధించటం విశేషం.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నేతలు

## సమాజంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల మధ్య విద్వేషాలు పెంచేందుకు పాలకులు చేస్తున్న కుట్రల నేపథ్యంలో సమాజంలో శాంతిని నెలకొల్పి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కుల్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ మంత్రి, రైతు ఉద్యమ సమన్వయ కమిటీ కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. సొసైటీ ఫర్ కమ్యూనల్ హార్మనీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 13న సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సమైక్యతా శంఖారావం సదస్సు సన్నాహక ప్రజా సంఘాల సమావేశం మంగళవారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకేలో జరిగింది. ఈ సందర్భంగా సదస్సుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వడ్డే మాట్లాడుతూ ప్రజాస్వామ్య లౌకిక ప్రజాతంత్ర వాదులు పెద్దసంఖ్యలో సమావేశానికి హాజరుకావాలని కోరారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లి విల్సన్, న్యూ డెమోక్రసీ పార్టీ కార్యదర్శి కె. పోలారి, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం నేతలు షేక్ బాజీ, రైతు సంఘం నేత ఆర్. రవీంద్రనాథ్, కార్మిక సంఘ నేతలు పి. అజయ్‌కుమార్, వెంకటసుబ్బయ్య, సాహిత్య, సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు అరసం అరుణకుమార్, అరసవిల్లి కృష్ణ, చంద్రానాయక్, ఆర్. పిచ్చయ్య, అప్పర్, విజయప్రకాష్, ఎన్ లక్ష్మణరావు, శివనాగమణి, రాజారావు, జమలయ్య, యలమందరావు, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.




మెడికల్ కౌన్సిల్ నూతన సభ్యులతో మంత్రి సత్యకుమార్ యాదవ్

## రోగుల్ని వైద్యులు మానవత దృష్టితో చూడాలి

మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రభుత్వాసుపత్రి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వైద్యులు రోగులను మానవతా దృష్టితో చూడాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మాట్లాడుతూ వైద్యులను దేవుళ్లుగా పిలుస్తారని కానీ ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో వైద్యం వ్యాపారంగా మారిపోవడంతో వైద్య వృత్తి విలువలు పల్చబడ్డాయని అభిప్రాయపడ్డారు. అవసరం లేకుండానే ఎక్సరేలు, సిటీ స్కానింగ్, ఎమ్మార్ఐ స్కానింగ్‌లు తీస్తున్నారన్నారు. నార్మల్ డెలివరీ అయ్యే అవకాశం ఉన్నా అవసరం లేకున్నా సిజేరియన్ ఆపరేషన్ చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు గర్భిణులకు నార్మల్ డెలివరీ చేస్తే మంచిదన్నారు. ప్రజలకు కూడా పలు రకాల టెస్టులు చేస్తేనే డాక్టర్లు మంచివారనే అపోహలోకి ఉన్నారన్నారు. అలాంటి వారికి అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ల సర్టిఫికెట్లను ప్రతి ఐదేళ్లకొకసారి ఏపీఎంసీలో రెవెన్యూవల్ చేసుకోవాలన్నారు. ఈ విషయంలో నూతన కౌన్సిల్ డాక్టర్లు శ్రద్ధ పెట్టాలన్నారు. ఫారిన్ మెడికల్ గ్రాడ్యూయేట్స్ రిజిస్ట్రేషన్‌పై సమస్యలున్నాయన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల్ని ఏపీఎంసీ ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌కు ఆరుగురు సభ్యలను నామినేటెడ్ పోస్టుల్లో నియమించినట్టు చెప్పారు. ఇంకా నలుగురు ఎక్స్ అఫీషియో మెంబర్లు, 13 మంది ఎలక్టెడ్ సభ్యులు ఎన్నుకోవాల్సి ఉందన్నారు. మొత్తం 23 మంది సభ్యులు ఏపీఎంసీలో ఉంటారన్నారు. మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను ఎన్నుకోవాల్సి ఉందన్నారు.

## సరుకు రవాణాలో తగ్గేదే లేదు..!

- ఉత్తమ పనితీరు కనబర్చిన విజయవాడ రైల్వే డివిజన్



రైల్వే స్టేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సరుకు రవాణాలో ఉత్తమ పనితీరును కనబరిచింది. 38.322 మిలియన్ టన్నుల సరుకును లోడింగ్ చేసింది. 2014-15లో కేవలం 38.169 మిలియన్ టన్నులు మాత్రమే రవాణా చేయగా, పదేళ్లలో అధిక సరుకును రవాణా చేయటానికి విజయవాడ డివిజన్ సరుకు రవాణ ఆదాయంలోనూ మెరుగు కనబరిచింది. గతం కంటే 4.3 శాతం పెరుగుదలను నమోదు చేసింది. ఆయా గణాంకాలను డివిజన్ అధికారులు వివరించారు. ఇక కోచింగ్ ఆదాయానికి వస్తే 2023-24లో రూ.94.62 కోట్లు రాగా, 2024-2025లో రూ.111.70 ఆదాయం వచ్చింది. అంటే గత ఏడాది కన్నా 18శాతం పెరుగుదల. ఇదే సమయంలో గత ఆర్థిక సంవత్సరంలో 62.7 మిలియన్ల మంది ప్రయాణించగా, అంతకు ముందు సంవత్సరంలో 63.6 మిలియన్ల మంది మాత్రమే ప్రయాణించారు. 4.8 శాతం పెరుగుదల కనపడింది. దీంతో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ సరుకు రవాణా కస్టమర్లకు, ప్రయాణికులకు అభినందనలు తెలిపారు. సరుకు రవాణాలో కీలక పాత్ర వహించిన సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు అంకితభావాన్ని అభినందించారు. రికార్డు బ్రేకింగ్ పనితీరును ప్రదర్శించిన డివిజన్ అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

### విజయవాడ - గూడూరు ప్యాసింజర్ రైళ్లు రద్దు

3వ లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో గూడూరు - ఒంగోలు సెక్షన్ మధ్య టంగుటూరులో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న దృష్ట్యా గూడూరు - విజయవాడ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. ఈనెల 4 నుంచి 8 వరకు 67225 విజయవాడ - గూడూరు, ఈనెల 5 నుంచి 9 వరకు 67226 గూడూరు - విజయవాడ రైలు, ఈనెల 8న, 17259 నెల్లూరు - విజయవాడ రైళ్లను రద్దు చేసినట్టు డివిజనల్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూపకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.




పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

## ప్రభుత్వ బడిలో విద్యార్థుల్ని చేర్పిద్దాం

- ఉపాధ్యాయులకు యూటీఎఫ్ పిలుపు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియలో ఉపాధ్యాయులు క్రియాశీలకంగా వ్యవహరించాలని, తల్లిదండ్రులు, సమాజం వద్దకు వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో ఉండేటట్టు బాధ్యత తీసుకోవాలని ఉపాధ్యాయులకు యూటీఎఫ్ పిలుపునిచ్చింది. ఎంజీ రోడ్డులోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ బడిలో విద్యార్థుల్ని చేర్పిద్దాం అనే పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పాలకుల విధానాల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గుముఖం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బడి ఈడు పిల్లల్లో 49శాతం మంది మాత్రమే ప్రభుత్వ బడుల్లో చదువుతుండగా, 51శాతం మంది ప్రైవేట్ బడుల్లో చదివే వారుడడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పీ మనోహర్‌కుమార్, నేతలు హనుమంతరావు, ఏ గోపాలకృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. శ్రీనివాసరావు, ఏ. సుందరయ్య, పాల్గొన్నారు.



అనూష, హసీష్‌ను అభినందిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు.

## క్రీడాకారులకు శాప్ ఛైర్మన్ అభినందన

లబ్బీపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్ టెన్నిస్ క్రీడాకారిణి ఎస్.అనూష, స్కేటింగ్ క్రీడాకారుడు ఎం. హసీష్‌లు శాప్ ఛైర్మన్ రవినాయుడును ఆయన చాంబర్‌లో మంగళవారం కలిశారు. అనూష గ్రేటర్ నోయిడాలో మార్చి 26వ తేదీ వరకూ జరిగిన ఫస్ట్ సౌత్ ఏషియన్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టీమ్ ఈవెంట్‌లో గోల్డ్‌మెడల్, ఇండివిడ్యువల్ డబుల్స్‌లో బ్రాంజ్ మెడల్, మిక్స్‌డ్ డబుల్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించినట్టు శాప్ ఛైర్మన్‌కు వివరించింది. అదే విధంగా స్కేటింగ్ క్రీడాకారుడు ఎం. హసీష్ కూడా ఛైర్మన్‌ను కలిసి చైనా, తైవాన్‌లో మార్చి 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగిన ఇన్‌లైన్ ఫ్రీ స్టైల్, ఫ్రీ స్టైల్, సోలో డ్యాన్స్ స్కేటింగ్ పోటీలలో మూడు సిల్వర్ మెడల్స్ సాధించినట్టు ఛైర్మన్‌కు వివరించారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ రవినాయుడు క్రీడాకారులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, శాప్ నుంచి పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు.

## ప్రతి కుటుంబంలోనూ
# ఒక పారిశ్రామికవేత్త ఉండాలి



పారిశ్రామిక యూనిట్లకు రూ.3.20 కోట్ల ప్రోత్సాహకాలకు ఆమోదం: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త ఉండాలనేది సీఎం చంద్రబాబు దార్శనికతని, రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా తీసుకొంటున్న చర్యల్లో అధికారులు కీలక భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. పారిశ్రామిక విధానాల కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, పారిశ్రామిక అనుమతులపై చర్చించారు. 2024, డిసెంబరు 19 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పారిశ్రామిక అనుమతులకు సంబంధించి 105 దరఖాస్తులు స్వీకరించగా, 90 ఆమోదం పొందాయని పరిశ్రమల శాఖ అధికారులు వివరించగా, మిగిలిన దరఖాస్తులను కూడా నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని సూచించారు. జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, ఎల్‌డీఎం కె.ప్రియాంక, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె. బాబ్జి, డీపీవో పి.లావణ్య కుమారి, పీసీబీ ఈఈ పి.శ్రీనివాసరావు, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు తదితరులు హాజరయ్యారు.

## ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ మెరుగైన సేవలు

- కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకంపై వచ్చిన ఫిర్యాదులపై మంగళవారం తన చాంబర్‌లో జిల్లా క్రమశిక్షణా కమిటీ సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా ప్రైవేటు ఆసుపత్రుల్లో పేద వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. ఉద్యోగులకు సంబంధించి ఆరోగ్యపథకం (ఈహెచ్ఎస్) ద్వారా వైద్యసేవలందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల ప్రభుత్వం ఈహెచ్ఎస్ బిల్లులను చెల్లించడం జరిగిందన్నారు. డీఎంహెచ్‌వో శర్మిష్ట, డీసీహెచ్ఎస్ ఎం జయకుమార్, జిల్లా ఎన్టీఆర్ వైద్యసేవల విభాగం సమన్వయ అధికారి ఎస్‌బీ సతీష్, కమిటీ సభ్యుడు కేశవకృష్ణ, పలువురు ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ సక్రమంగా చేయండి

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో పోలింగ్‌కేంద్రాల పునర్వ్యవస్థీకరణ సక్రమంగా చేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణపై సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 205 పోలింగ్ కేంద్రాలు, నగరంలో 135 పోలింగ్ కేంద్రాలున్నట్టు తెలిపారు. డీఆర్‌వో కే చంద్రశేఖరరావు, ఇన్‌చార్జి ఆర్డీవో సీహెచ్ పద్మావతి, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, మచిలీపట్నం తహసీల్దార్‌లు మధుసూదనరావు, నాగభూషణం, ఎన్నికల విభాగం అధికారులు నారాయణ, శ్యామ్ పాల్గొన్నారు.



# టస్సర్ ట్రెండ్

ఫ్యాషన్

హుందాగా, విలాసవంతంగా కనిపించాలనుకుంటే టస్సర్ చీరలు కట్టాలి. అన్ని రకాల వేడుకలకూ నప్పే టస్సర్ చీరల సొబగుల గురించి తెలుసుకుందామా?

ప్రత్యేకమైన ఆకృతి, సహజ సిద్ధమైన స్వర్ణం మెరుపులను కలిగిన అద్భుతమైన వస్త్రమే టస్సర్. వైల్డ్ సిల్క్‌తో తయారయ్యే టస్సర్ చీరలకు ఎన్నో ప్రత్యేకతలుంటాయి.

- **వైల్డ్ సిల్క్:** యాంథెరీ మాత్‌ల గూళ్ల నుంచి సేకరించిన పట్టుతో వైల్డ్ పట్టును తయారుచేస్తారు. ఈ వైల్డ్ పట్టు పురుగులు మల్బరీ ఆకులు మినహా ఇతరత్రా ఆకులను తింటాయి
- **టెక్స్‌చర్:** కాస్త గురుకుగా ఉండే ఈ వస్త్రం, సుతిమెత్తని మల్బరీ పట్టుకు భిన్నంగా ఉంటుంది
- **మెరుపు:** ఈ పట్టు సహజసిద్ధ బంగారు మెరుపు కలిగి ఉంటుంది
- **రంగు:** బీజ్, క్రీమ్, గోధుమ రంగుల్లో తయారవుతుంది
- **డిజైన్:** సంప్రదాయ బెంగాలీ టస్సర్ చీరలు, నేత బార్డర్లు, కొంగులను కలిగి ఉంటాయి. అలాగే చీర మొత్తం పూల మోటిఫ్స్‌ను కలిగి ఉంటాయి
- **పేర్లు:** టస్సర్ సిల్క్‌నే కోసా సిల్క్ అని కూడా అంటారు



**ప్రత్యేకతలివే!**

- సహజ సిద్ధం: ఈ పట్టు తయారీలో సహజరంగులనే ఉపయోగిస్తారు
- మన్నిక: టస్సర్ పట్టు ఎంతో మన్నికైనది. దీనికి ముడతలు, చిరుగులు ఏర్పడవు
- వైవిధ్యం: సాధారణ వేడుకలు మొదలు, పెళ్లిళ్లు, పండగలకు కూడా ఈ చీరలెంతో చక్కగా సూటవుతాయి.

మనం చేసే చిన్న చిన్న పొరబాట్లవల్ల మెదడు బలహీనమై జ్ఞాపకశక్తి తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. జ్ఞాపకశక్తి పెరగాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.

## జ్ఞాపకశక్తి మందగిస్తోందా..!

- ప్రతిరోజూ ఉదయం పోషకాలతో కూడిన అల్పాహారం తీసుకోవాలి. దీనివల్ల మెదడుకి కావాల్సిన గ్లూకోజ్ అందుతుంది. ఇది ఏకాగ్రతని, జ్ఞాపకశక్తిని పెంచుతుంది.
- పడుకునే ముందు ఫోన్, ల్యాప్‌టాప్‌లను చూస్తూ ఎక్కువ సమయం గడపకూడదు. వీటి నుంచి వచ్చే కాంతి వల్ల మెదడులో మెలటోనిన్ ఉత్పత్తి క్షీణిస్తుంది. నిద్రించే సమయం కూడా తగ్గడంతో మెదడు అలసిపోయి గుర్తుపెట్టుకునే సామర్థ్యాన్ని కోల్పోతుంది. ప్రతిరోజూ కనీసం ఆరు గంటలు ప్రశాంతంగా నిద్రించాలి.
- చక్కెర శాతం ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తినకూడదు. దీనివల్ల మెదడులో వాపు సమస్యలు వచ్చి జ్ఞాపకశక్తి మందగిస్తుంది.
- ఒకేసారి ఎక్కువ పనులు చేస్తూ ఉంటే మెదడు త్వరగా అలసిపోతుంది. ఇలాంటప్పుడు కూడా ఏమీ గుర్తు ఉండవు. కాబట్టి మల్టీ టాస్కింగ్ చేయవద్దు.
- నిర్జలీకరణ వల్ల కూడా జ్ఞాపకశక్తి మందగిస్తుంది. అందుకే శరీరంలో నీటి శాతం తగ్గకుండా తరచూ మంచినీళ్లు తాగుతూ ఉండాలి.
- శరీరంలో డి విటమిన్ లోపించినా ఏమీ గుర్తుండవు. కాబట్టి ప్రతిరోజూ ఒంటికి ఎండ తగిలేలా చూసుకోవాలి.
- దగ్గరి బంధువులు, స్నేహితులకు సంబంధించిన పుట్టిన రోజు తేదీలు, ఫోన్ నెంబర్లు గుర్తు పెట్టుకునే ప్రయత్నం చేయడం; మెదడుకి పనిచెప్పే చదరంగం, వైకుంఠపాళి, క్యారమ్స్ లాంటి ఆటలు ఆడడం; జీపీఎస్ విధానాన్ని ఉపయోగించకుండా దారులు గుర్తుంచుకోవడం లాంటివి అనుసరిస్తూ ఉంటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది.



# ఆడపిల్ల... ఆదుకునే పిల్ల

**ఆడపిల్ల భారం కాదని తన తల్లిదండ్రులకే కాదు, మొత్తం ప్రపంచానికే నిరూపించి చూపించాలనుకుంది ప్రముఖ మిక్స్‌డ్ మార్షల్ ఆర్టిస్ట్ పూజా తోమర్. ఉత్తర్‌ప్రదేశ్ బుధానా గ్రామానికి చెందిన పూజ, యుఎఫ్‌సి ఫైట్ గెలిచిన మొట్టమొదటి భారతీయురాలిగా చరిత్ర కూడా సృష్టించింది. పుట్టుకతోనే బతుకు పోరాటాన్ని మొదలుపెట్టిన ఫైటర్ పూజ మనోగతమిది.**

స్ఫూర్తి



"అప్పటికే అమ్మానాన్నలకు ఇద్దరు ఆడపిల్లలు. వాళ్లను పెంచడమే భారమైపోయిన సమయంలో, నేను పుట్టడంతో నాన్న స్పృహ తప్పి పడిపోయారు. పెంచే స్థోమత, ధైర్యం లేక వాళ్లు నన్ను వదిలించుకోవాలని అనుకున్నారు. మూడో కూతురుని పెంచకూడదని అప్పటికే నిర్ణయించేసుకున్నారు కాబట్టి నన్ను కుండలో వదిలేశారు. కానీ తల్లి మనసు తట్టుకోలేకపోయింది. నా ఏడుపు వినగానే అమ్మ నన్ను బయటకు తీసి గుండెలకు హత్తుకుని, నన్ను పెంచుకోవాలని నిశ్చయించుకుంది. ఈ భారాన్నీ, బాధను నేను చిన్నప్పటి నుంచీ మోస్తూనే ఉన్నాను. ఊహ తెలిసింది మొదలు నన్ను నేను నిరూపించి చూపించే అవకాశాల కోసం వెతకడం మొదలుపెట్టాను. బాల్యంలో క్రీడాకారులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు నన్ను ఆకర్షించే వారు కారు. మెరుపు వేగంతో కదులుతూ ప్రత్యర్థులను మట్టి కరిపించే యాక్షన్ హీరోలు, ప్రత్యేకించి జాకీచాన్ నన్నెంతో ఆకర్షించేశాడు. నేనతని సినిమాలను వినోదం కోసం కాకుడా, ఫైటింగ్ నేర్చుకోవడం కోసం చూసేదాన్ని.



### జాకీచాన్ స్ఫూర్తితో...

ఏడో తరగతిలో బడిలో జరిగిన కరాటే పోటీలో తోటి మగపిల్లవాడి ముఖం మీద పిడిగుద్దులు కురిపించాను. దాంతో ఆ పిల్లాడు మూర్ఛపోయాడు. దాంతో నన్ను డిస్‌క్వాలిఫై చేసేశారు. దాంతో బడి యాజమాన్యం నేనా ఆటకు తగిన వ్యక్తిని కానని తీర్మానించేసింది. కానీ ఆ సమయంలో నాకు జాకీ చాన్ గుర్తొచ్చాడు. నేను పుట్టిందే అతనిలా ఫైట్ చేయడం కోసం. అలాంటప్పుడు నచ్చిన పని మానేయడంలో అర్థం ఏముంది? ఆ తర్వాత కూడా బడిలో గొడవల్లో మగపిల్లల మీద పైచేయి సాధిస్తూ, ఫైటింగ్‌నే క్రీడగా మలుచుకోవాలనే విషయాన్ని గ్రహించాను. అలా 12వ తరగతిలో మా బడి కొచ్చిన కరాటే టీచర్ దగ్గర పాఠాలు నేర్చుకోవడం మొదలుపెట్టాను. కొంత కాలానికి కరాటేను మించిన మరొక మార్షల్ ఆర్ట్, ఉషు నేర్చుకోవడం మొదలుపెట్టాను. మామయ్య సహాయంతో భోపాల్ వెళ్లి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఐదేళ్ల పాటు శిక్షణ పొందాను. ఆ ఐదేళ్ల కఠోర శిక్షణ తర్వాత నాకు కానిస్టేబుల్ ఉద్యోగం వరించింది. కానీ నేను దాన్నొక అవమానంగా భావించాను. పైగా అప్పట్లో ఎమ్‌బిబిఎస్ చదువుతున్న మా అక్కకు ట్యూషన్ ఫీజు అవసరమైంది. సరిగ్గా అదే సమయంలోనే మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎమ్ఎమ్ఎ) గురించి విన్నాను. ఢిల్లీ నుంచి ఒకరు నన్ను స్పాన్సర్ చేయడానికి అంగీకరించడంతో మరో ఆలోచన లేకుండా ఫైట్‌కు సిద్ధపడ్డాను. అలా గత ఏడాది జూన్‌లో, బ్రెజిల్‌కు చెందిన రయాన్ అమాండాను ఓడించి, అల్టిమేట్ ఫైట్ ఛాంపియన్‌షిప్ (యుఎఫ్‌సి)లో విజయం సాధించి, ఈ ఫైట్ గెలిచిన మొట్టమొదటి భారతీయురాలిగా గుర్తింపు తెచ్చుకున్నాను. పోటీలో గెలుపొందిన డబ్బుతో కుటుంబాన్ని ఆదుకున్నాను.

> **ఊహ తెలిసింది మొదలు నన్ను నేను నిరూపించుకొనే అవకాశాల కోసం వెతకడం మొదలుపెట్టాను. బాల్యంలో క్రీడాకారులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు నన్ను ఆకర్షించే వారు కాదు. మెరుపు వేగంతో కదులుతూ ప్రత్యర్థులను మట్టి కరిపించే యాక్షన్ హీరోలు, ప్రత్యేకించి జాకీచాన్ నన్నెంతో ఆకర్షించాడు.**

కానీ ఈ గెలుపును చూడడానికి నాన్న లేకపోవడం నన్నిప్పటికీ బాధిస్తూ ఉంటుంది.

### అపజయాలు సహజం

గెలవడం కోసం కాదు, స్పష్టత కోసం ప్రతి పోరాటానికి ముందు భగవంతుడిని ప్రార్థిస్తాను. నా శిక్షణ కూడా ఎంతో కఠినంగా సాగుతుంది. రోజుకు రెండు సెషన్లు సాధన చేస్తాను. కానీ ఈ మార్చి 22న యుఎఫ్‌సి ఫైట్‌లో అపజయం పాలయ్యాను. అన్నిసార్లూ గెలుపు మనల్ని వరించదు. కొన్నిసార్లు గెలుస్తాం, కొన్నిసార్లు ఓడిపోతాం! అయితే పోరాడే అవకాశమిచ్చిన ఆ భగవంతుడికి నేనెప్పటికీ రుణపడి ఉంటాను. అన్నిటికంటే ముఖ్యంగా నన్ను కనడం భారంగా భావించిన అమ్మ నన్ను చూసి గర్వపడుతూ ఉండడం ఎంతో సంతృప్తిని కలిగిస్తూ ఉంటుంది."

**వేణు, భాగ్య దంపతులు. వారి కుటుంబంలో కూడా చిన్న చిన్న దెబ్బలాటలు ఉంటాయి. కానీ అవి మొబైల్స్‌లో టెక్స్ట్ మెసేజ్‌లుగా మారి... మరింత ముదిరిపోయాయి. వ్యవహారం విడాకుల వరకు వెళ్లింది.**

# 'ఫిక్సిటింగ్' ప్రమాదమే!

ఈ ఆధునిక యుగంలో మొబైల్స్ సర్వసాధారణమయిపోయిన తర్వాత ఒకరితో మరొకరు సమాచారం ఇచ్చిపుచ్చుకోవటం సులభమయిపోయింది. దీనివల్ల అనేక ప్రయోజనాలున్నా- కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయి. ఇలాంటి ఇబ్బందే- టెక్స్ట్ మెసేజ్‌ల ద్వారా దెబ్బలాడుకోవటం. దీనికే మానసిక నిపుణులు 'ఫిక్సిటింగ్' అని పేరు పెట్టారు. దీనివల్ల కొన్ని లాభాలున్నా.. ఎక్కువగా నష్టాలే ఉన్నాయంటున్నారు మానసిక నిపుణుడు డాక్టర్ ప్రసాదరావు. ఆ నష్టాలేమిటో చూద్దాం...

- ఎదురెదురుగా ఉండి దెబ్బలాడుకున్నప్పుడు- వాడే భాష, హావభావాలు, శరీర కదలికలు మొదలైనవి ప్రధానమైన పాత్ర పోషిస్తాయి. కానీ టెక్స్ట్ మెసేజ్‌లలో కేవలం పదాలు మాత్రమే ఉంటాయి. దానిని ఎవరు ఏ విధంగానైనా అర్థం చేసుకోవచ్చు. చాలా సందర్భాలలో సరైన భాషను వాడకపోవటం వల్ల అనేక అపార్థాలు ఏర్పడే అవకాశం కూడా ఉంది. దీనితో గొడవలు మరింతగా పెరిగిపోతాయి.



- ఎదురెదురుగా ఉండి దెబ్బలాడుకున్నప్పుడు- ఆవేశం తగ్గిన తర్వాత రాజీ పడటానికి అవకాశం ఉంటుంది. మన మెదడు అవతల వ్యక్తులతో మనం గడిపిన మంచి గుర్తులను వెలికి తెస్తుంది. దానితో వారి పట్ల మనకు సానుకూలత ఏర్పడే అవకాశం ఉంటుంది. టెక్స్ట్ మెసేజ్‌లలో అలాంటి అవకాశమే ఉంటుంది. ఒక సారి మెసేజ్ చదివిన తర్వాత దానిని మళ్లీ వెనక్కి తీసుకోగలిగే అవకాశమే ఉండదు.
- 'ఫిక్సిటింగ్'లో గొడవలు త్వర త్వరగా పెరిగిపోతాయి. కొన్నిసార్లు అవతల వ్యక్తులతో మనకున్న బంధాన్ని తెంచేసుకొనే పరిస్థితులు కూడా ఏర్పడతాయి. మిలినియల్స్, జెన్ జెడ్ (18 నుంచి 35 సంవత్సరాల లోపు వారు)లు ఎక్కువ సార్లు 'ఫిక్సిటింగ్'లోకి దిగుతారు.

### నివారణ మార్గాలివే...

- టెక్స్ట్ పంపేముందు మనం చెప్పదలుచుకున్న భావం కరెక్టేనా అనే విషయాన్ని ఒకటికి రెండు సార్లు చూసుకోవాలి. భాషను కూడా చెక్ చేసుకున్న తర్వాత మాత్రమే మెసేజ్‌ను పంపాలి.
- మెసేజ్‌లు పంపే సమయంలో "నేను" అనే పదాన్ని ఎక్కువసార్లు వాడకండి. "నాకు ఇలా అర్థమయింది" అని వాడితే సమస్యకు వెంటనే పరిష్కారం లభిస్తుంది.
- మాటల దెబ్బలాటకు రంగం సిద్ధం అవుతోందనుకుంటే... ఛాటింగ్ నుంచి బయటకు వచ్చేయండి. తాత్కాలికంగా మెసేజ్‌లు పంపటం మానేయండి.
- మెసేజ్‌ల ద్వారా మాటల యుద్ధం ముదురుతోందనుకున్నప్పుడు... నేరుగా మాట్లాడటానికి ప్రయత్నించండి. లేకపోతే నేరుగా కలవండి.

**బెంగళూరుకి చెందిన వీణా పీటర్‌కు బొమ్మలంటే ఇష్టం. కూతురు తార కోసం సరదాగా తయారు చేసిన బొమ్మ ఓ వ్యాపార సంస్థ ప్రారంభానికి నాంది పలికింది. అదే 'తారాస్ డాల్ హౌస్'. పర్యావరణానికి అనుకూలంగా ఉండే రకరకాల బొమ్మలను రూపొందించడం ఈ సంస్థ ప్రత్యేకత. అంతేకాదు ఎంతోమంది మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు ప్రస్తుతం కోటి రూపాయల టర్నోవర్ దిశగా సాగుతోంది. ఈ సంస్థకు సంబంధించి ఆసక్తికరమైన విశేషాలను వీణ ఇలా చెప్పుకొచ్చారు...**



# బొమ్మను చేసి... ఉపాధిగా మలచి

"సాధారణంగా ఆడపిల్లలు పొడవాటి జడ ఉన్న అమ్మాయి బొమ్మతో ఆడుకోవడానికి ఇష్టపడతారు. నా కూతురికి కూడా అలాంటి బొమ్మ కొనాలని చాలా షాపులు తిరిగాను. ఎక్కడా దొరకలేదు. ఓ షాపులో చిన్న జడ ఉన్న అమ్మాయి బొమ్మ కనిపిస్తే వెంటనే కొని ఇంటికి తీసుకెళ్లాను. మా అమ్మాయి చేతిలో ఆ బొమ్మ ఎక్కువ కాలం నిలవలేదు. నాకు బాధగా అనిపించింది. మార్కెట్లో దొరికే బొమ్మలన్నీ ఇలా త్వరగా విరిగిపోతుండడంతో నేనే ఒక బొమ్మను తయారు చేయాలని అనుకున్నా. ఇంట్లో ఉన్న పలుచని వస్త్రాలను ఉపయోగించి ఒక అమ్మాయి బొమ్మను తయారు చేశాను. పొడవైన ఊలు దారాలతో జడను రూపొందించాను. బొమ్మకు చక్కగా డ్రెస్ కుట్టి తొడిగాను. ఈ బొమ్మను చూసి మా అమ్మాయి చాలా సంతోషించింది. చాలా రోజుల వరకూ దానితోనే ఆడుకుంది కూడా. దీంతో ఇలాంటి బొమ్మల తయారీ ప్రారంభించాలనే ఆలోచన వచ్చింది. వెంటనే 2022లో తారాస్ డాల్ హౌస్‌ని ఏర్పాటు చేశాను.

### తయారీ ఇలా...

అమ్మాయి బొమ్మలతో పాటు అబ్బాయి బొమ్మలను కూడా తయారు చేస్తాం. బొమ్మలను తయారు చేయడానికి నాణ్యమైన మెత్తని బట్టలను ఉపయోగిస్తాం. బొమ్మల తయారీకి కావాల్సిన ముడిపదార్థాలు, వాటికి తొడిగే దుస్తులకోసం అవసరమయ్యే వస్త్రాలను ఢిల్లీ, సూరత్‌ల నుంచి తెప్పించుకుంటాం. చర్మం రంగు... మూడు రకాల టోన్లలో ఉండేలా బొమ్మలను రూపొందిస్తాం. అలాగే తల వెంట్రుకలను నాలుగు వేర్వేరు రంగుల్లో తీర్చిదిద్దుతాం. ప్రస్తుతం ఆరు, పన్నెండు, పద్దెనిమిది అంగుళాల పొడవున్న బొమ్మలను రూపొందిస్తున్నాము. పిల్లల అభిరుచిని దృష్టిలో ఉంచుకుని ట్రావెల్ డాల్ హౌస్‌లు, స్లింగ్ బ్యాగ్ డాల్ క్యారియర్లు, డాల్ టెంట్లు, బొమ్మల వార్డ్‌రోబ్ సెట్‌లు కూడా తయారుచేస్తున్నాము. మా బొమ్మలకు ఢిల్లీ, పుణె, అహ్మదాబాద్, హైదరాబాద్, చెన్నై నగరాల్లో మంచి ఆదరణ ఉంది.

### పర్యావరణ హితం...

బొమ్మల తయారీలో ప్లాస్టిక్, హానికరమైన రసాయన రంగులను ఉపయోగించము. స్టెన్సిల్ ట్రేసింగ్, కత్తిరించడం, కుట్టడం, తలకు వెంట్రుకలు అతికించడం, దుస్తులు కుట్టడం లాంటి ప్రక్రియలన్నింటినీ అత్యంత జాగ్రత్తగా నిర్వహిస్తాము. పిల్లలు ఎంతకాలం ఆడుకున్నప్పటికీ బొమ్మలు మన్నికగా ఉండేలా రూపొందిస్తాము.



### మహిళా సాధికారతకు...

ప్రస్తుతం నెలవారీ 200 నుంచి 300 వరకు బొమ్మలు అమ్ముడవుతున్నాయి. వీటి నుంచి రెండు లక్షల వరకు ఆదాయం వస్తోంది. త్వరలో ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను ప్రారంభించాలనుకుంటున్నాము. అమెరికా సహా ఇతర పశ్చిమ దేశాల్లో వ్యాపారాన్ని విస్తరించాలనుకుంటున్నాము. దీనికి కొంత సమయం పట్టవచ్చు. తారాస్ డాల్ హౌస్ సంస్థ మహిళల సాధికారతకు ప్రాధాన్యమిస్తుంది. టైలరింగ్, బొమ్మల తయారీ, మార్కెటింగ్ విభాగాల్లో పూర్తిగా మహిళలే పనిచేస్తున్నారు. సంస్థ సహవ్యవస్థాపకుల్లో ఒకరు తప్ప మొత్తం బృంద సభ్యులంతా మహిళలే. నా అభిరుచి మరికొంతమంది మహిళలకు ఉపాధి మార్గం అయినందుకు ఎంతో సంతోషంగా, సంతృప్తిగా ఉంది. భవిష్యత్తులో మరింతమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తా."

# స్పోర్ట్స్

విజయవాడ ● బుధవారం 2 ఏప్రిల్ 2025

# లఖ్‌నవూపై 'పంజా'

## చెలరేగిన ప్రభ్‌సిమ్రన్, శ్రేయాస్
## అర్ష్‌దీప్‌నకు మూడు వికెట్లు
## కింగ్స్ చేతిలో పంత్‌సేన ఓటమి



ప్రభ్‌సిమ్రన్ సింగ్ (34 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 69)

**లఖ్‌నవూ:** ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ అదరగొడుతోంది. బౌలింగ్, బ్యాటింగ్‌లో తిరుగులేని ప్రదర్శన కనబర్చుతూ ప్రత్యర్థులకు సవాల్ విసురుతోంది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (34 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 69), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (30 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 52 నాటౌట్) మెరుపు అర్ధసెంచరీలతో మంగళవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 8 వికెట్ల తేడాతో గెలిచింది. పంజాబ్‌కిది వరుసగా రెండో విజయం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 7 వికెట్లకు 171 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ (30 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 44), ఆయుష్ బదోని (33 బంతుల్లో ఓ ఫోర్, 3 సిక్సర్లతో 41), మార్‌క్రమ్ (18 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సర్‌తో 28), అబ్దుల్ సమద్ (12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 27) రాణించారు. ఛేదనలో పంజాబ్ 16.2 ఓవర్లలో 2 వికెట్లకు 177 పరుగులు చేసి గెలిచింది. నేహల్ వధేరా (25 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 43 నాటౌట్) చెలరేగాడు. స్పిన్నర్ దిగ్వేష్‌కు రెండు వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ప్రభ్‌సిమ్రన్ నిలిచాడు.

**బ్యాటర్ల దూకుడు:** ఛేదనలో పంజాబ్ ఆది నుంచే దూసుకెళ్లింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ లఖ్‌నవూ బౌలర్లను ఆడేసుకున్నాడు. ఎలాంటి బంతినైనా ఎడాపెడా బాదేస్తూ బౌండరీల వరద పారించాడు. శ్రేయాస్, నేహల్ వధేరా సైతం బ్యాట్లు ఝుళిపించడంతో మరో 22 బంతులుండగానే పంజాబ్ గెలుపు సంబరాలు చేసుకుంది. తొలి ఓవర్‌లోనే సిమ్రన్ 4,6తో పరుగులకు తెర లేపాడు. మరో ఓపెనర్ ప్రియాన్ష్ (8)ను మూడో ఓవర్‌లో స్పిన్నర్ దిగ్వేష్ అవుట్ చేసినా సిమ్రన్ జోరు ఆగలేదు. బిష్ణోయ్ ఓవర్‌లో అతను వరుసగా 4,4,6 బాదగా జట్టు పవర్‌ప్లేలో 62/1 పరుగులు సాధించింది. మరో ఎండ్‌లో శ్రేయాస్ చక్కటి సహకారం అందిస్తూ ఎక్కువగా ప్రభ్‌సిమ్రన్‌కే స్ట్రయికింగ్ వచ్చేలా చూశాడు. ఈక్రమంలో ప్రభు 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఈ మైదానంలో ఎవరికైనా ఇదే ఫాస్టెస్ట్ ఫిఫ్టీ కావడం విశేషం. అయితే చక్కటి షాట్లతో దూసుకెళుతున్న అతడిని 11వ ఓవర్‌లో దిగ్వేష్ దెబ్బతీశాడు. ఆ ఓవర్ తొలి బంతికి సిమ్రన్ ఆడిన స్లాగ్ స్వీప్ సిక్సర్ ఖాయమనిపించినా.. బదోని బంతిని లోనికి విసిరి రోప్ దాటాడు. అంతలోనే బిష్ణోయ్ ఆ బాల్‌ను అందుకున్నాడు. ఆ తర్వాత కూడా పంజాబ్ జోరు తగ్గలేదు. శ్రేయాస్‌తో పాటు నేహల్ ఎదురుదాడికి దిగాడు. 14వ ఓవర్‌లో వధేరా 6,4,6తో బిష్ణోయ్ 16 రన్స్ సమర్పించుకున్నాడు. అటు శ్రేయాస్ తర్వాతి ఓవర్‌లోనే 4,6 బాదడంతో పంజాబ్ ఛేదన సులువైంది. ఇక 30 బంతుల్లో 17 రన్స్ కావాల్సిన వేళ వధేరా 16వ ఓవర్‌లోనే 6,6,4తో 16 రన్స్ రాబట్టగా.. శ్రేయాస్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. అలాగే 30 బంతుల్లోనే అజేయ హాఫ్ సెంచరీని కూడా పూర్తి చేశాడు.

**ఆదుకున్న పూరన్-బదోని:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్ పేలవంగా ఆరంభమైంది. పంజాబ్ బౌలర్ల పకడ్బందీ బంతులకు 35 పరుగులకే 3 వికెట్లను కోల్పోయింది. అయితే నికోలస్ పూరన్, ఆయుష్ బదోని అండగా నిలిచే ప్రయత్నం చేయడంతో జట్టు స్కోరు ఫర్వాలేదనిపించింది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ మార్ష్‌ను పేసర్ అర్ష్‌దీప్ తొలి ఓవర్‌లో గోల్డెన్ డక్‌గా అవుట్ చేశాడు. అటు మరో ఓపెనర్ మార్‌క్రమ్ మూడో ఓవర్‌లో మూడు ఫోర్లతో 13 రన్స్ రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లోనే వరుసగా 4,6తో వహ్వా అనిపించినా అతడిని ఫెర్గూసన్ బౌల్డ్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు పూరన్‌తో మార్‌క్రమ్ 31 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక కెప్టెన్ పంత్ (2) మరోసారి తీవ్రంగా నిరాశపరిచాడు. మ్యాక్స్‌వెల్ ఓవర్‌లో అతడు చాహల్‌కు క్యాచ్ ఇవ్వడంతో జట్టు పవర్‌ప్లేలో 39/3 స్కోరుతో నిలిచింది. తొలి ఓవర్‌లోనే క్రీజులోకి వచ్చిన పూరన్ పరిస్థితులకు తగ్గట్టు ఆరంభంలో సంయమనం చూపాడు. కాస్త కుదురుకున్నాక బ్యాట్ ఝుళిపిస్తూ పదో ఓవర్‌లో 4,4,6తో చెలరేగి 15 రన్స్ రాబట్టాడు. ఆ వెంటనే స్టొయినిస్ ఓవర్‌లో 6,4 బాదాడు. కానీ అతను మరింత ప్రమాదకరంగా మారకముందే 12వ ఓవర్‌లో పూరన్‌ను చాహల్ వెనక్కిపంపాడు. దీంతో నాలుగో వికెట్‌కు బదోనితో అతను జోడించిన 54 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం మిల్లర్ (19) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా బదోని-సమద్ జోడీ వేగంగా ఆడి ఆరో వికెట్‌కు 47 పరుగులు జత చేర్చింది. ముఖ్యంగా సమద్ 18వ ఓవర్‌లో 6,4,4తో పాటు బదోని 4తో 20 రన్స్ సమకూరాయి. వీరి జోరుకు జట్టు స్కోరు కూడా 150 దాటింది. కానీ చివరి రెండు ఓవర్లలో పంజాబ్ బౌలర్లు నియంత్రించారు. 19వ ఓవర్‌లో పేసర్ జాన్సెన్ 8 పరుగులే ఇవ్వగా.. ఆఖరి ఓవర్‌లో బదోని, సమద్‌ల వికెట్లు తీసిన అర్ష్‌దీప్ 7 పరుగులే ఇచ్చాడు.

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | నె.రరే |
|---|---|---|---|---|---|---|
| బెంగళూరు | 2 | 2 | 0 | 0 | 4 | 2.266 |
| పంజాబ్ | 2 | 2 | 0 | 0 | 4 | 1.485 |
| ఢిల్లీ | 2 | 2 | 0 | 0 | 4 | 1.320 |
| గుజరాత్ | 2 | 1 | 1 | 0 | 2 | 0.625 |
| ముంబై | 3 | 1 | 2 | 0 | 2 | 0.309 |
| లఖ్‌నవూ | 3 | 1 | 2 | 0 | 2 | -0.150 |
| చెన్నై | 3 | 1 | 2 | 0 | 2 | -0.771 |
| హైదరాబాద్ | 3 | 1 | 2 | 0 | 2 | -0.871 |
| రాజస్థాన్ | 3 | 1 | 2 | 0 | 2 | -1.112 |
| కోల్‌కతా | 3 | 1 | 2 | 0 | 2 | -1.428 |

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్




### ఐపీఎల్‌లో నేడు

| | |
|---|---|
| వేదిక | బెంగళూరు |
| బెంగళూరు x గుజరాత్ | రా.7.30 |

### స్కోరుబోర్డు

**లఖ్‌నవూ:** మార్‌క్రమ్ (బి) ఫెర్గూసన్ 28, మార్ష్ (సి) జాన్సెన్ (బి) అర్ష్‌దీప్ 0, నికోలస్ పూరన్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) చాహల్ 44, పంత్ (సి) చాహల్ (బి) మ్యాక్స్‌వెల్ 2, బదోని (సి) మ్యాక్స్‌వెల్ (బి) అర్ష్‌దీప్ 41, మిల్లర్ (సి) ప్రభ్‌సిమ్రన్ (బి) జాన్సెన్ 19, సమద్ (సి) ఆర్య (బి) అర్ష్‌దీప్ 27, శార్దూల్ (నాటౌట్) 3, అవేశ్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 171/7; వికెట్ల పతనం:** 1-1, 2-32, 3-35, 4-89, 5-119, 6-166, 7-167; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-43-3, ఫెర్గూసన్ 3-0-26-1, మ్యాక్స్‌వెల్ 3-0-22-1, జాన్సెన్ 4-0-28-1, స్టొయినిస్ 2-0-15-0, చాహల్ 4-0-36-1.

**పంజాబ్:** ప్రియాన్ష్ ఆర్య (సి) శార్దూల్ (బి) దిగ్వేష్ రాఠి 8, ప్రభ్‌సిమ్రన్ (సి) బిష్ణోయ్ (బి) దిగ్వేష్ రాఠి 69, శ్రేయాస్ అయ్యర్ (నాటౌట్) 52, నేహల్ వధేరా (నాటౌట్) 43, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 16.2 ఓవర్లలో 177/2; వికెట్ల పతనం:** 1-26, 2-110; **బౌలింగ్:** శార్దూల్ ఠాకూర్ 3-0-39-0, అవేశ్ ఖాన్ 3-0-30-0, దిగ్వేష్ రాఠి 4-0-30-2, రవి బిష్ణోయ్ 3-0-43-0, సిద్దార్థ్ 3-0-28-0, సమద్ 0.2-0-6-0.

## అయ్యర్‌కు మళ్లీ సెంట్రల్ కాంట్రాక్ట్?

**న్యూఢిల్లీ:** భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీ నెగ్గడంలో కీలకపాత్ర పోషించిన స్టార్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్‌కు మళ్లీ బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కే అవకాశాలున్నాయి. దేశవాళీ క్రికెట్ ఆడా లనే బోర్డు సూచనలను పెడచెవిన పెట్టడంతో 2023-24కు గాను అయ్యర్‌తోపాటు ఇషాన్ కిషన్‌కు బోర్డు కాంట్రాక్ట్‌లు దక్కలేదు. కానీ, శ్రేయాస్ మళ్లీ జాతీయ జట్టులో చోటు దక్కించుకోవడంతో అతడిపై సానుకూల దృక్పథం ఏర్పడింది. దీంతో త్వరలో ప్రకటించనున్న 2024-25 కాంట్రాక్ట్‌ల జాబితాలో అయ్యర్ పేరు ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇషాన్ మాత్రం మరికొన్ని రోజులు వేచిచూడాల్సిన పరిస్థితి. ఇప్పటికే టీ20లకు గుడ్‌బై చెప్పిన సీనియర్లు రోహిత్ శర్మ, కోహ్లీలకు మరోసారి ఏ+ కాంట్రాక్ట్ ఖాయమని తెలుస్తోంది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి కూడా బోర్డు కాంట్రాక్ట్ దక్కనున్నట్టు సమాచారం.

## టాప్-100లో స్నేహిత్



ప్రపంచ టీటీలో తెలుగు కుర్రాడికి 89వ ర్యాంక్

47వ స్థానానికి మానవ్

**న్యూఢిల్లీ:** తెలుగు క్రీడాకారుడు ఫిడేల్ ఆర్ స్నేహిత్ ప్రపంచ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టాడు. అంతర్జాతీయ టీటీ సమాఖ్య మంగళవారం విడుదలజేసిన ర్యాంకింగ్స్‌లో స్నేహిత్ సింగిల్స్‌లో ఏకంగా 34 స్థానాలు ఎగబాకాడు. ఓవరాల్‌గా 89వ ర్యాంకులో నిలిచి తొలిసారి టాప్-100లో చోటు దక్కించుకున్నాడు. ఓ తెలుగు ఆటగాడు టాప్-100లోపు ర్యాంక్ సాధించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. గతవారం చెన్నై వేదికగా జరిగిన డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్ టోర్నీలో స్నేహిత్ ప్రీక్వార్టర్స్‌లో వెటరన్ స్టార్ శరత్ కమల్‌ను ఓడించి సంచలన ప్రదర్శన చేసిన సంగతి తెలిసిందే. ఇక ఇదే టోర్నీతో ఆటకు వీడ్కోలు పలికిన శరత్ కమల్ 80వ ర్యాంక్‌తో కెరీర్‌ను ముగించాడు. చెన్నై టోర్నీలో సెమీస్ చేరి రికార్డుకెక్కిన భారత స్టార్ మానవ్ టక్కర్ 47వ ర్యాంకుతో తన కెరీర్‌లో అత్యుత్తమస్థానాన్ని దక్కించుకున్నాడు.

## లక్ష్య పరాజయం

ప్రపంచ బాక్సింగ్ కప్

**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ కప్‌లో తొలిరోజు భారత ఆటగాడు లక్ష్య చాహర్‌కు నిరాశ ఎదురైంది. బ్రెజిల్‌లోని ఫోజ్ డొ గువాకులో మంగళవారం జరిగిన 80 కిలోల విభాగం ఆరంభ బౌట్‌లో లక్ష్య 0-5తో స్థానిక బాక్సర్ వాండెర్లీ పెరీరా చేతిలో ఓటమి పాలయ్యాడు. రెండోరోజు పోటీల్లో భారత బాక్సర్లు జదుమాని సింగ్ (50 కిలోలు), నిఖిల్ దూబే (75 కిలోలు), జుగ్నూ (85 కిలోలు) తలపడనున్నారు.

## ఆర్చర్లు ధీరజ్, చికితకు వీసా కష్టాలు



**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1 పోటీల్లో పాల్గొనాల్సిన తెలుగు ఆర్చర్లు బొమ్మదేవర ధీరజ్, తానిపర్తి చికితరావుకు వీసా కష్టాలు మొదలయ్యాయి. అమెరికా ఆతిథ్యమిస్తున్న ఈ వరల్డ్‌కప్ టోర్నీ ఈనెల 8న ప్రారంభం కానుంది. జ్యోతి సురేఖ, ధీరజ్, చికిత సహా 23 మంది భారత ఆర్చర్లు బరిలోకి దిగుతున్నారు. వీరిలో ధీరజ్, చికితతో పాటు మరో 9మంది వీసాలకు దరఖాస్తు చేస్తున్నప్పుడు సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో నిర్దిష్ట గడువులోపు దరఖాస్తులు పంపకపోవడంతో వీసాలు మంజూరు కాలేదు. ఈనెల 5వ తేదీలోపు అక్కడికి చేరుకోవాలి. విమాన టిక్కెట్లు బుక్ అయ్యాయి కానీ వీసాలు మంజూరవలేదు. తెలుగు రాష్ట్రాల కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రామ్మోహన్ నాయుడు, చంద్రశేఖర్ ఈ విషయంలో చొరవ తీసుకోవాలని ఆర్చర్లు సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు. కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్‌తో మాట్లాడి తమకు వీసాలు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

## హాకీకి వందన వీడ్కోలు



**న్యూఢిల్లీ:** భారత మహిళల హాకీ జట్టు తరపున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన వెటరన్ స్ట్రయికర్ వందన కటారియా (32).. అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. కెరీర్‌లో 320 మ్యాచ్‌లు ఆడిన వందన 158 గోల్స్ సాధించింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంతో చరిత్ర సృష్టించిన భారత జట్టులో ఆమె కూడా సభ్యురాలు. కెరీర్‌లో అత్యున్నత స్థాయిలో ఉండగా గుడ్‌బై చెప్పాలనుకొన్నానని మంగళవారం సోషల్ మీడియా ద్వారా కటారియా తెలిపింది. హాకీ ఇండియా లీగ్‌లో మాత్రం ఆడతానని చెప్పింది. ఉత్తరాఖండ్‌కు చెందిన వందన.. 2009లో అరంగేట్రం చేసింది. తనదైన ప్రతిభతో అనతికాలంలోనే భారత జట్టులో కీలక సభ్యురాలిగా ఎదిగింది. ఒలింపిక్స్‌లో హ్యాట్రిక్ గోల్స్ సాధించిన తొలి భారత మహిళా ప్లేయర్‌గా కటారియా రికార్డు సృష్టించింది. 2018 ఆసియా క్రీడల్లో రజతం.. 2013, 2018 ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచిన భారత జట్టులో కటారియా సభ్యురాలు. ప్రభుత్వం పద్మశ్రీ, అర్జున అవార్డులతో ఆమెను సత్కరించింది.

## వచ్చే వరల్డ్‌కప్ ఆడతా..



**న్యూఢిల్లీ:** విరాట్ కోహ్లీ తన భవిష్యత్ ప్రణాళికలను వెల్లడించాడు. దీంట్లో భాగంగా 2027లో జరిగే వన్డే వరల్డ్‌కప్‌లోనూ ఆడాలనుకుంటున్నట్టు తేల్చాడు. చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు విజేతగా నిలిచాక రోహిత్, విరాట్ వన్డే కెరీర్‌పై సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ ఈ ఫార్మాట్ నుంచి ఇప్పట్లో తప్పుకొనే ఆలోచన లేదని ముంబైలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో విరాట్ తెలిపాడు. రాబోయే వన్డే వరల్డ్‌కప్ గెలుచుకునేందుకు ప్రయత్నించడమే తన ముందున్న పెద్ద లక్ష్యంగా స్పష్టం చేశాడు. గతేడాది టీ20 వరల్డ్‌కప్ గెలిచాక రోహిత్, విరాట్, జడేజాలు ఆ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే.

# బంగారంగరం!



- రూ.94,000 దాటిన 10 గ్రాముల పసిడి
- ఒక్కరోజే రూ.2,000 పెరుగుదలతో సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయికి..
- గత 2 నెలల్లో ఇదే అతిపెద్ద పెరుగుదల

న్యూఢిల్లీ: పసిడి ధరలు మంగళవారం సరికొత్త జీవితకాల రికార్డు గరిష్ఠానికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం ధర 10 గ్రాములపై ఏకంగా రూ.2,000 పెరిగి రూ.94,150కి చేరింది. దేశీయంగా మేలిమి బంగారం రూ.94,000కు చేరడం ఇదే ప్రప్రథమం. అంతేకాదు, ఈ విలువైన లోహం రేటు పెరగడం వరుసగా ఇది నాలుగో రోజు. అంతర్జాతీయంగా దీని ధరలు వేగంగా పెరుగుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు కూడా రూ.2000 పెరుగుదలతో ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.93,700కు ఎగబాకింది. దాదాపు 2 నెలల్లో గోల్డ్‌కు ఇదే అతిపెద్ద ఒక్కరోజు పెరుగుదల. ఈ ఫిబ్రవరి 10న తులం పసిడి రూ.2,400 పెరుగుదలను నమోదు చేసింది. ఈ జనవరి 1న రూ.79,390 పలికిన బంగారం.. గడిచిన మూడు నెలల్లో రూ.14,760 (18.6 శాతం) మేర పుంజుకుంది. వెండి విషయానికొస్తే, కిలో రూ.500 తగ్గుదలతో రూ.1,02,500కు పరిమితమైంది.

### అంతర్జాతీయ మార్కెట్లోనూ కొత్త రికార్డు

ట్రంప్ సుంకాలు వాణిజ్య యుద్ధాలకు దారి తీయనున్నాయన్న భయాందోళనలతో ఇన్వెస్టర్లు ఈక్విటీల్లోని పెట్టుబడులను ఈ విలువైన లోహాల్లోకి మళ్లిస్తున్నారు. దాంతో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు సరికొత్త రికార్డు స్థాయికి పెరిగాయి. స్పాట్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 3,149.03 డాలర్లు, జూన్ డెలివరీ గడువుతో కూడిన కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు 3,177 డాలర్ల వద్ద ఆల్‌టైం గరిష్ఠాలను నమోదు చేశాయి. సిల్వర్ మాత్రం అర శాతానికి పైగా తగ్గి 33.83 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

### ఏడాది చివరినాటికి 4,000 డాలర్లకు!?

ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల సమయాల్లో మన పెట్టుబడులకు భద్రత కలిగించే సాధనంగా బంగారానికి పేరుంది. ట్రంప్ సుంకాల ప్రకటనలు అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితిని పెంచడంతో ఈ ఏడాది గోల్డ్ రేటు భారీగా పెరిగింది. ఈ మార్చి 14న ఔన్స్ బంగారం తొలిసారిగా 3,000 డాలర్లకు చేరింది. ప్రస్తుతం 3,150 డాలర్ల స్థాయిలో ట్రేడవుతోంది. ఈనెల 2 నుంచి అమలులోకి రానున్న ట్రంప్ సుంకాలు వాణిజ్య అనిశ్చితులను తీవ్రతరం చేయనుంది. ఇందుకు తోడు, అమెరికా మళ్లీ ఆర్థిక మాంద్యంలోకి జారుకునే అవకాశాలూ రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈనేపథ్యంలో గోల్డ్ ర్యాలీ మున్ముందూ కొనసాగవచ్చని, ఈ ఏడాది చివరినాటికి ఔన్స్ 4,000 డాలర్లకు చేరుకునే అవకాశాలున్నాయని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు.

# బిజినెస్

## మార్కెట్లో ట్రంప్ సుంకంపం!



భారీ నష్టాలతో 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభం

సెన్సెక్స్ 1,390 పాయింట్లు పతనం

23,200 దిగువ స్థాయికి జారిన నిఫ్టీ

రూ.3.44 లక్షల కోట్ల సంపద ఉఫ్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు కొత్త ఆర్థిక సంవత్సరానికి (2025-26) భారీ నష్టాలతో స్వాగతం పలికాయి. ఈ నెల 2 నుంచి ట్రంప్ పరస్పర సుంకాలు అమలు చేయనున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్తమై భారీగా అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో ప్రామాణిక సూచీలు కుప్పకూలాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 1,390.41 పాయింట్లు (1.80 శాతం) క్షీణించి 76,024.51 వద్దకు జారుకుంది. ఒక దశలో సూచీ 1,502 పాయింట్ల మేర క్షీణించి 76,000 స్థాయిని సైతం కోల్పోయినప్పటికీ, తిరిగి నిలబెట్టుకోగలిగింది. కొవిడ్ సంక్షోభ కాలమైన 2020లో చవిచూసిన మార్కెట్ పతనం తర్వాత సెన్సెక్స్‌కు ఆర్థిక సంవత్సర ప్రారంభం రోజున ఇదే అతిపెద్ద నష్టం. అంతేకాదు, సూచీకి గడిచిన నెల రోజుల్లో ఇదే అతిపెద్ద ఒక్కరోజు క్షీణత కూడా. నిఫ్టీ విషయానికొస్తే, 353.65 పాయింట్ల (1.50 శాతం) పతనమై 23,165.70 వద్ద స్థిరపడింది. అమ్మకాలు పోటెత్తడంతో ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎ్‌సఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.44 లక్షల కోట్లు తగ్గి రూ.409.43 లక్షల కోట్లకు (4.78 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 28 నష్టపోయాయి. హెచ్‌సీఎల్ టెక్ 3.87 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా 3 శాతానికి పైగా పతనమయ్యాయి. బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టైటాన్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా స్టాక్స్ 2.81 శాతం వరకు నష్టపోగా.. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 1.77 శాతం తగ్గింది. ఇండస్ ఇండ్ బ్యాంక్ మాత్రం 5.11 శాతం ఎగిసి సెన్సెక్స్ టాప్ గెయినర్‌గా నిలిచింది. కాగా, బీఎస్ఈలోని మిడ్ క్యాప్ సూచీ 1.04 శాతం నష్టపోగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ అతి స్వల్ప లాభాన్ని నమోదు చేసింది. రంగాలవారీ సూచీల్లో టెలికాం, ఆయిల్ అండ్ గ్యాస్ మినహా అన్నీ నేలచూపు చూశాయి. రియల్టీ ఇండెక్స్ 3.05 శాతం క్షీణించగా.. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, ఫోకస్డ్ ఐటీ రెండు శాతానికి పైగా పతనమయ్యాయి.

### వొడాఫోన్ ఐడియా షేరు 19 శాతం అప్

ప్రైవేట్ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా షేరు దాదాపు 19 శాతం పెరిగి రూ.8.10 వద్ద ముగిసింది. కంపెనీ చెల్లించాల్సిన రూ.36,950 కోట్ల బకాయిలను కేంద్ర ప్రభుత్వం సంస్థలో ఈక్విటీ వాటాగా మార్చుకున్న నేపథ్యంలో షేరుకు డిమాండ్ భారీగా పెరిగింది.

## కాగ్నిజెంట్ జీసీసీ సర్వీస్ గ్లోబల్ హెడ్‌గా శైలజ జోస్యుల

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ టెక్నాలజీ, ప్రొఫెషనల్ సేవల సంస్థ కాగ్నిజెంట్ తన జీసీసీ సర్వీస్ లైన్‌కి కొత్త గ్లోబల్ హెడ్‌ను నియమించింది. ఇప్పటికే కాగ్నిజెంట్‌లో వివిధ ఉన్నత పదవులు నిర్వహించిన శైలజ జోస్యులను ఈ విభాగం గ్లోబల్ హెడ్‌గా నియమించినట్టు తెలిపింది. ఆమె ఈ హోదాలో హైదరాబాద్ నుంచి పని చేస్తారు. శైలజ తన 30 ఏళ్ల ఉద్యోగ జీవితంలో కాగ్నిజెంట్, ఈవై, థామ్సన్ రాయిటర్స్, హెచ్ఎస్‌బీసీ వంటి పలు ప్రముఖ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు.

### కార్గో హ్యాండ్లింగ్‌లో విశాఖ పోర్టు రికార్డు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు 2024-25 ఆర్థిక సంవత్సరంలో 82.62 మిలియన్ టన్నుల కార్గోను హ్యాండ్లింగ్ చేసి కొత్త రికార్డు నెలకొల్పింది. గత ఆర్థిక సంవత్సరంలో 81.09 మిలియన్ టన్నులు హ్యాండ్లింగ్ చేయగా, దానిని ఈసారి అధిగమించింది. ముఖ్యంగా క్రూడ్ ఆయిల్, పెట్రోలియం ఆయిల్ అండ్ లూబ్రికెంట్లు, మాంగనీస్, బాక్సైట్, బియ్యం, జనరల్ కార్గోలో అధిక వృద్ధిని నమోదు చేసిందని పోర్టు చైర్మన్ అంగముత్తు తెలిపారు.

## మార్చి జీఎస్‌టీ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లు

- గత నెలలో 9.9% పెరిగిన వసూళ్లు
- తెలంగాణలో రూ.5,401 కోట్లు
- ఏపీలో రూ.4,033 కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చి నెలలోనూ జీఎస్‌టీ వసూళ్లు పెరిగాయి. గత నెల మొత్తానికి ఈ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 9.9 శాతం ఎక్కువ. మార్చి నెల మొత్తానికి సీజీఎస్‌టీ రూపంలో రూ.38.100 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ రూపంలో రూ.49,900 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూపంలో రూ.95,900 కోట్లు, జీఎస్‌టీ సెస్సు రూపంలో రూ.12,300 కోట్లు వసూలయ్యాయి. రిఫండ్స్ తీసివేస్తే గత నెల మొత్తానికి నికరంగా జీఎస్‌టీ వసూళ్లు రూ.1.76 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 7.3 శాతం ఎక్కువ.

**2024-25లో రూ.22.08 లక్షల కోట్లు**

మార్చి ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి చూసినా జీఎస్‌టీ వసూళ్లు రూ.22.08 లక్షల కోట్లకు చేరాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 9.4 శాతం ఎక్కువ. రిఫండ్స్‌ని తీసివేసినా 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.19.56 లక్షల కోట్ల జీఎస్‌టీ వసూలైంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 8.6 శాతం ఎక్కువ.

### తెలుగు రాష్ట్రాల్లో అంతంతే

గత నెల జీఎస్‌టీ వసూళ్లు దేశవ్యాప్తంగా 9.9 శాతం పెరిగినా, రెండు తెలుగు రాష్ట్రాల్లో మాత్రం పెద్దగా ఎదుగుబొదుగూ లేదు. రెండు రాష్ట్రాల నుంచి గత నెల రూ.9,434 కోట్ల జీఎస్‌టీ వసూలైంది. ఇందులో ఏపీ నుంచి రూ.4,033 కోట్లు, తెలంగాణ నుంచి రూ.5,401 కోట్లు వసూలయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఏపీలో వసూళ్లు ఒక శాతం పడిపోగా తెలంగాణాలో జీరో శాతం వృద్ధి రేటు నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) మొత్తానికి చూసినా ఏపీలో 1.2 శాతం పెరిగి రూ.44,825 కోట్లకు, తెలంగాణాలో 5.1 శాతం వృద్ధి రేటుతో రూ.62,987 కోట్లకు చేరాయి.

## ఆటో అమ్మకాల వృద్ధి అంతంతే...


మారుతి, హ్యుండయ్ అమ్మకాల్లో క్షీణత

న్యూఢిల్లీ: దేశంలో ప్రముఖ కార్ల తయారీదారులైన మారుతి సుజుకీ, హ్యుండయ్ మార్చి నెలలో నిరాశావహమైన అమ్మకాలు నమోదు చేశాయి. ఇన్వెంటరీలో దిద్దుబాటు, డిమాండ్ క్షీణత ఇందుకు కారణమని పరిశ్రమ వర్గాలంటున్నాయి. ఇదే సమయంలో ఎస్‌యూవీలకు ఏర్పడిన డిమాండుతో మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ గత ఏడాది మార్చితో పోల్చితే అమ్మకాల్లో వృద్ధిని సాధించాయి. మార్చి నెలలో మారుతి సుజుకీ అమ్మకాలు 1 శాతం తగ్గి 1,50,743కి పరిమితం అయ్యాయి. గత ఏడాది మార్చిలో కంపెనీ 1,52,718 యూనిట్లు విక్రయించింది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరం మొత్తం మీద కంపెనీ దేశీయ విక్రయాలు స్వల్పంగా పెరిగి 17,60,767కి చేరాయి. 2023-24 సంవత్సరంలో విక్రయాలు 17,59,881గా ఉన్నాయి.

**అమ్మకాలు**

| కంపెనీ | 2025 మార్చి | 2024 మార్చి | 2024-25 | 2023-24 |
|---|---|---|---|---|
| హ్యుండయ్ మోటార్స్ | 51,820 (-) | 53,001 | 5,98,666 (-) | 6,14,721 |
| మహీంద్రా | 48,048 (+) | 40,631 | 5,51,487 (+) | 4,59,877 |
| టాటా మోటార్స్ | 51,872 (+) | 50,297 | 5,56,263 (-) | 5,73,495 |
| కియా ఇండియా | 25,,525 (+) | 21,400 | 2,55,207 (+) | 2,45,634 |
| టయోటా కిర్లోస్కర్ | 30,043 (+) | 27,180 | 3,37,148 (+) | 2,63,512 |
| జేఎస్‌డబ్ల్యూ మోటార్ | 5,500 (+) | 5,050 | ----- | ----- |
| హోండా కార్స్ | 7,228 (+) | 7,071 | 1,26,151 (+) | 1,24,173 |
| అశోక్ లేలాండ్ | 24,060 (+) | 22,736 | ----- | ----- |

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 2వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 425 | విజయవాడ | 450 |
| వరంగల్ | 427 | గోదావరి | 425 |
| చిత్తూరు | 520 | విశాఖపట్నం | 440 |
| | | డజను గుడ్లు రూ. 60 | |

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 146 | విజయవాడ | 152 |
| వరంగల్ | 146 | గుంటూరు | 152 |
| కరీంనగర్ | 146 | ఒంగోలు | 152 |
| మహబూబ్‌నగర్ | 146 | చిత్తూరు | 117 |
| కర్నూలు | 146 | నెల్లూరు | 122 |
| విశాఖపట్నం | 124 | అనంతపురం | 122 |
| గోదావరి | 152 | | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 92,840 ▲ | 85,100 ▲ | 1,14,000 ▲ |
| విజయవాడ | 94,200 ▲ | 88,000 ▲ | 1,03,000 ▲ |
| విశాఖపట్నం | 89,310 ▲ | 81,870 ▲ | 1,00,600 ▼ |
| రాజమండ్రి | 92,840 ▲ | 85,100 ▲ | 1,03,100 ▼ |
| ప్రొద్దుటూరు | 93,100 ▲ | 85,840 ▲ | 1,00,800 ▼ |
| ముంబై | 91,150 ▲ | 83,461 ▲ | 99,641 ▼ |

## ఉపాధి హామీలో పశువుల తొట్టెల నిర్మాణం

- 12,500 తొట్టెలకు రూ.56.25 కోట్ల వ్యయం
- 15 నాటికి పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ ఆదేశం
- పశువులు మేతమేసి ఇంటికి తిరిగొచ్చే మార్గంలో ఏర్పాటు
- రోజూ 25 లక్షల పశువులకు తాగునీరు

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):గోకులాల నిర్మాణం, పంట నీటి కుంటల తవ్వకాన్ని ఉపాధి పథకంలో భాగంగా చేసిన విధంగానే ఇప్పుడు పాడి రైతుల కోసం మరో కార్యక్రమాన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ చేపట్టింది. వేసవిలో పశువులు నీటి కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు గ్రామాల్లో నీటి తొట్టెలను నిర్మిస్తున్నారు. గ్రామాల్లో పశు సంపదకు తాగునీటి సమస్య ఎదురు కారాదని, అందు కోసం నీటి తొట్టెలు నిర్మించాలని సీఎం నిర్దేశించడంతో అందుకు అనుగుణంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. 12,500 నీటి తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ఉపాధి హామీ పథకం నుంచి రూ.56.25 కోట్ల నిధులు వినియోగిస్తున్నారు. నీటి తొట్టెల నిర్మాణాలను ఈ నెల 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వేసవిలోనే ఈ తొట్టెలు సంపూర్ణంగా వినియోగంలోకి రావాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వీటి నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. అన్ని జిల్లాల్లో ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం మణికొండలో చేసిన భూమి పూజలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజ పాల్గొన్నారు. ఒక్కో తొట్టెకు రూ.45 వేలు వ్యయం చేస్తారు. ఈ తొట్టెల ద్వారా రోజుకు 25 లక్షల పశువులు, మూగజీవాలు నీరు తాగే అవకాశముంది. రాష్ట్రవ్యాప్తంగా 12,500 తొట్టెలు నిర్మించాల్సిన అవసరం ఉందని పశుసంవర్థక శాఖ గుర్తించింది. పశువులు మేతమేసి ఇంటికి తిరిగి వచ్చే మార్గంలో వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ తొట్టెలను రెండు డిజైన్లలో నిర్మించనున్నారు. ఒకటి పశువులకు మాత్రమే కాగా, మరొకటి పశువులతోపాటు మేకలు, గొర్రెలు తదితర జీవాలూ నీరుతాగేలా నిర్మించాలని నిర్దేశించారు. 3,500 లీటర్ల నీరుపట్టేలా వీటిని నిర్మించనున్నారు.

## కోస్తా, రాయలసీమలకు వర్ష సూచన

- సాధారణం కంటే తక్కువగా ఉష్ణోగ్రతల నమోదు

అమరావతి, విశాఖపట్నం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉత్తర తమిళనాడు, దానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. మధ్య మహారాష్ట్ర నుంచి కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమరిన్ తీరం వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. దీంతో ఇటు బంగాళాఖాతం, అటు అరేబియా సముద్రం నుంచి తేమగాలులు భూ ఉపరితలంపైకి వీస్తున్నాయి. వీటి ప్రభావంతో బుధవారం కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 3న రాయలసీమలో ఎక్కువ చోట్ల, కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, అక్కడక్కడా వడగళ్లు పడే అవకాశం ఉందని పేర్కొంది. 4న రాయలసీమలో ఎక్కువ ప్రాంతాల్లో, కోస్తాలో కొన్నిచోట్ల వర్షాలు కురవనున్నాయి. బుధవారం కోస్తా, రాయలసీమల్లో ఎక్కువచోట్ల మేఘాలు ఆవరించి ఉండే అవకాశం ఉన్నందున పగటి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంతకంటే తక్కువగా నమోదవుతాయని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు, బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని 30 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపుతాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. గురువారం కూడా 47 మండలాల్లో వడగాడ్పులు వీయనుండగా, అల్లూరి, రాయలసీమ జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన అకాల వర్షాలు కురుస్తాయని తెలిపింది. కాగా, మంగళవారం కర్నూలు జిల్లా ఉలిందనకొండ, విజయనగరం జిల్లా నెలివాడలో 39.8, కడప జిల్లా వేంపల్లె, నంద్యాల జిల్లా రుద్రవరంలో 39.5, అనకాపల్లి జిల్లా రావికమతంలో 39.2, అనంతపురం జిల్లా నాగసముద్రంలో 39 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## భూకంపాలను

# ముందే పసిగట్టేస్తా

- మయన్మార్ భూకంపం గురించి ముందే చెప్పా
- ముందస్తు గుర్తింపునకు ప్రత్యేక అల్గారిథమ్
- 5 వేల కి.మీ దూరంలోనూ అంచనా వేయొచ్చు
- వారం-నెల ముందే గుర్తించవచ్చు
- 100 అంచనాల్లో 18 నిజమయ్యాయి
- త్వరలో ధర్మశాల, తవాంగ్‌లో.. భారీ భూకంపాలు వచ్చే ప్రమాదం
- యువ ఇంజనీర్ శివ సీతారామ్ వెల్లడి
- 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మయన్మార్ భూకంపం మూడు వేలమందిని బలిగొంది. ఆకాశ హర్మ్యాలు పేక మేడల్లా కూలిపోయాయి. అయితే.. తుఫానులు, సునామీల మాదిరిగానే.. భూకంపాలనూ ముందుగానే గుర్తించే వ్యవస్థ అందుబాటులోకి వస్తే ప్రాణనష్టాన్ని నివారించవచ్చు. సరిగ్గా ఇదే ఆలోచనతో పనిచేసిన యువ ఇంజనీరు శివ సీతారామ్ ఇప్పుడు భూప్రకోపాన్ని ముందస్తుగా గుర్తించగలుగుతున్నారు. ఇందుకోసం ఎన్నో పరిశోధనలు చేసిన ఆయన.. సొంతంగా ఓ అల్గారిథమ్‌ను రూపొందించుకుని, హెచ్చరికలు చేస్తున్నారు. తన వెబ్‌సైట్ https://www.seismo.in లో.. ముందస్తు అంచనాలను పోస్టు చేస్తున్నారు. మయన్మార్ భూకంపంపైనా ఆయన నెల రోజుల ముందే హెచ్చరికలు చేశారు. ఈ అల్గారిథమ్ కోసం 19 ఏళ్లు పరిశోధించిన శివ సీతారామ్‌తో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకంగా మాట్లాడింది.

### ముందుగానే భూకంపాలను అంచనా వేయడం ఎలా సాధ్యం?

సాధ్యం కానిదేదీ లేదు. ఒకప్పుడు చంద్రుడి పైకి వెళ్లడం అసాధ్యమనుకున్నారు. ఇప్పుడు అది సాధ్యమైంది కదా? 2004లో సునామీ తర్వాత.. నాకు భూకంపాలను ముందుగానే అంచనా వేయాలనే ఆలోచన వచ్చింది. 2005లో జమ్మూకశ్మీర్‌లో సంభవించిన భారీ భూకంపం తర్వాత.. నా పరిశోధనలు మొదలయ్యాయి. 2017 వరకు దీనిపై పనిచేస్తూ.. ప్రత్యేక అల్గారిథమ్‌ను రూపొందించా. దీని ద్వారా కచ్చితత్వంతో భూంకపాలను అంచనా వేస్తున్నా.

### ఎన్ని రోజుల ముందు గుర్తించొచ్చు?

ప్రపంచవ్యాప్తంగా భూభౌతిక శాస్త్రవేత్తలు కొన్ని సెకన్ల ముందే భూకంపాలను గుర్తిస్తున్నారు. నా అల్గారిథమ్ మాత్రం ఎక్కడ.. ఎంత తీవ్రతతో భూకంపం వస్తుందో నెలరోజుల ముందే చెబుతుంది. నా అంచనాల్లో 100కు 18 నిజమయ్యాయి. పరిశోధనల్లో ఇది మంచి సక్సెస్ రేటుగా చెప్పవచ్చు. 2023 నేపాల్ భూకంపం, ఈ ఏడాది జనవరిలో టిబెట్, జపాన్ భూకంపాలను ముందుగానే అంచనా వేశాను. చిన్న భూకంపాలను కాకుండా.. తీవ్రత 5 కంటే ఎక్కువ ఉండే వాటినే గుర్తించగలుగుతున్నాం. 2020 నుంచి నేను గుర్తించిన అంచనాల డాటా నా వెబ్‌సైట్‌లో ఉంది.


శివ సీతారామ్

### ధర్మశాలలో భూకంపం అని మీ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు?

అవును. నా అల్గారిథమ్ తదుపరి అంచనా ధర్మశాల. అక్కడ 7 అంత కంటే ఎక్కువ తీవ్రతతో భూకంపం వచ్చే ప్రమాదముంది. తవాంగ్ రీజియన్‌లో కూడా భూమి ప్రకోపించనుంది. ఈ రెండూ కొన్ని నెలల్లో జరగవచ్చు. సమయం, తేదీల విషయంలో కచ్చితత్వం రావాల్సి ఉంది.

### ప్రకృతి కూడా ముందే హెచ్చరిస్తుందా?

అవును.. ప్రకృతి ముందుగానే హెచ్చరిస్తుంది. భూకంపం రావడానికి మూడు నుంచి ఆర్నెల్ల ముందుగానే ఆ సూచనలు అందుతాయి. శాస్త్రవేత్తలకు కూడా ఆ విషయం తెలుసు. అయితే, ఆ సూచనలను పసిగట్టి, నిజంగానే విపత్తు వస్తుందా అని చెప్పడం కష్టమే..! మేము 20 అంశాలను పరిగణనలోకి తీసుకుంటాం. వాటిల్లో కీలకమైనది భూమిలోంచి రాడాన్, మిథేన్ గ్యాస్ విడుదలవ్వడం. విద్యుదయస్కాంత తరంగాల్లో హెచ్చుతగ్గులుండడం. భూమి లోపల లావా నిరంతరం ఒత్తిడిని సృష్టిస్తుంది. ఈ ఒత్తిడిని భరించలేనప్పుడు భూ ఫలకాలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. దీంతోపాటు.. వాతావరణంలో మార్పులను పరిగణనలోకి తీసుకుంటాం. ఇలా భారత్‌తోపాటు.. 50 దేశాల్లో భూకంపాలను ముందుగానే అంచనా వేయగలుగుతున్నాం.

### గ్రహాల కూటమికి.. భూకంపాలకు సంబంధముందా?

గ్రహాల కూటమి వల్ల ప్రకృతిలో మార్పులు వస్తాయి. కానీ, భూకంపాలు వస్తాయని కచ్చితంగా చెప్పలేం.

### ప్రభుత్వ సహకారం ఉందా?

నేను సొంతంగానే పరిశోధనలు చేస్తున్నా. నా అంచనాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ప్రభుత్వానికి 70-80% కచ్చితత్వంతో ఉన్న అంచనాలు కావాలి. నా అల్గారిథమ్ ఆ స్థాయికి చేరేలా పరిశోధనలు చేస్తున్నాం. అయితే.. నా కుటుంబ సభ్యుల సహకారం చాలా ఉంది. హైదరాబాద్ సైనిక్‌పురిలో సెసిమో రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, పరిశోధనలు చేస్తున్నా. దేశంలో 3చోట్ల అబ్జర్వేటరీలున్నాయి. నా పరిశోధనలు నచ్చి, కొందరు నిధులను సమకూరుస్తున్నారు.

### డిప్లొమా చేసి ఈ స్థాయిలో పరిశోధనలెలా?

మా స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు. సీఆర్ రెడ్డి కాలేజీలో పాలిటెక్నిక్ డిప్లొమా(మెకానికల్ ఇంజనీరింగ్) చేశాను. సైయెంట్ సంస్థలో కొన్నాళ్లు పనిచేశాను. పరిశోధనల కోసం 2014-15లో ఉద్యోగం మానేశాను. 2018 తర్వాత పూర్తిస్థాయిలో పరిశోధనలకు అంకితమయ్యాను.

### దక్షిణాదికీ ముప్పు



మన దేశంలో దక్షిణాదికి కూడా భూకంపాల ముప్పు ఉందని ఎన్‌జీఆర్ఐ విశ్రాంత శాస్త్రవేత్త, 2002లో భారత భూకంప జోన్లను నిర్ధారించిన బి.రామలింగేశ్వరరావు వెల్లడించారు. 1762 నుంచి 2014 సంవత్సరం వరకు భూకంపాల చరిత్ర ప్రకారం ఆయన ఓ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఉత్తర భారత సరిహద్దు ఫలకం, దక్షిణ భారత శిలాసంధి మధ్య క్రియాశీల-నిష్క్రియాశీల భూకంప కాలచక్రం కొనసాగుతున్నట్లు గుర్తించామన్నారు. "అంటే.. ఒకట్రెండు సంవత్సరాలు అటూ ఇటుగా.. పాతికేళ్ల పాటు ఉత్తరాదిలో భూకంపాలు వస్తే.. ఆ తర్వాత పాతికేళ్లు దక్షిణాదిలో ప్రకంపనలు వస్తాయి. 1850-1900 మధ్య కాలంలో భూకంపాలను గమనిస్తే ఈ విషయం అర్థమవుతుంది. 2000 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు(2025) ఉత్తరాదిలో భూకంపాలు వచ్చాయి. ఇప్పుడు ఉత్తరాది భూకంప కాలచక్రం పూర్తికావొస్తోంది. దీంతో.. దక్షిణ భారతంలో ప్రకంపనాలకు అవకాశాలుంటాయి. అయితే.. ఉత్తరాదిలో భూకంప తీవ్రత 7.7గా ఉంటే.. దక్షిణాదిలో 6 వరకు ఉండే అవకాశాలున్నట్లు మా పరిశోధనలో తేలింది" అని ఆయన వివరించారు.

**- బి.రామలింగేశ్వరరావు, ఎన్‌జీఆర్ఐ విశ్రాంత శాస్త్రవేత్త**



## పాఠ్య పుస్తకాల 'భారం'

# తగ్గుతోంది

- సబ్జెక్టుకు ఓ పుస్తకం విధానానికి విద్యాశాఖ స్వస్తి
- ఒకటే పుస్తకంలో రెండు మూడు సబ్జెక్టులు

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బడి పిల్లలకిచ్చే పుస్తకాల సంఖ్యను పాఠశాల విద్యాశాఖ తగ్గిస్తోంది. ప్రతి సబ్జెక్టుకు ఒక పుస్తకం అనే విధానానికి స్వస్తి పలికింది. ఎక్కువ సంఖ్యలో పుస్తకాలతో పిల్లల్లో గందరగోళం లేకుండా భాషా సబ్జెక్టులు, ఇతర సబ్జెక్టులను వీలైనంత మేర ఒక్కటే పుస్తకంగా మార్చేసింది. దీంతో వచ్చే ఏడాది ఏకంగా 1.53 కోట్ల మేర పుస్తకాలు తగ్గిపోనున్నాయి. 2024-25లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం 4.49 కోట్ల పుస్తకాలు ముద్రించగా, ఆ సంఖ్య వచ్చే విద్యా సంవత్సరానికి 2.96 కోట్లకు తగ్గింది. ప్రాథమిక తరగతుల స్థాయిలో ఒకటి, రెండు తరగతుల్లో ఇప్పటివరకూ 3 పుస్తకాలు ఉండగా, ఇప్పుడు దానిని ఒక్కటిగా మార్చారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం మూడు సబ్జెక్టులను ఒక్కటే పుస్తకంగా ముద్రిస్తున్నారు. అదనంగా వర్క్‌బుక్ ఇస్తారు. దీంతో 1, 2 తరగతుల పిల్లలు రోజూ రెండు పుస్తకాలను బడికి తీసుకెళ్తే సరిపోతుంది. 3 నుంచి 5 తరగతులకు తెలుగు, ఇంగ్లిష్, ఈవీఎస్, గణితం నాలుగు సబ్జెక్టులుంటాయి. వాటిలో తెలుగు, ఇంగ్లిష్ కలిపి ఒకటి, ఈవీఎస్, గణితంకు ఒక పుస్తకం ముద్రిస్తున్నారు. రెండు వర్క్‌బుక్స్ ఇస్తారు. 6 నుంచి 9 తరగతుల వరకు తెలుగు, ఇంగ్లిష్, హిందీ మూడు పాఠ్యపుస్తకాలను ఒక్కటిగా కలిపేశారు. మిగిలిన సబ్జెక్టులకు పుస్తకాలు వేర్వేరుగానే ఉంటాయి. 8, 9 తరగతుల్లో సైన్స్‌లో ఫిజిక్స్ బయాలజీకి వేర్వేరు పుస్తకాలు ఉండగా వాటిని ఒక్కటిగా మార్చారు. అలాగే సోషల్‌లో జాగ్రఫీ, చరిత్ర, ఎకానమీ, పాలిటీకి వేర్వేరుగా పుస్తకాలు ఉండగా వాటిని ఒకటిగా ముద్రిస్తున్నారు. పదో తరగతి పుస్తకాలు మాత్రం ఎలాంటి మార్పులు లేకుండా యథాతథంగా ఉంచారు. అలాగే ఏడాదిలో రెండు సెమిస్టర్లుగా పుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించడంతో బ్యాగుల బరువు కూడా తగ్గిపోనుంది. ఎప్పటిలాగే పాఠ్యపుస్తకాలను బైలింగ్వల్ విధానంలో ముద్రిస్తున్నారు.


### శనివారం బ్యాగులుండవు

శనివారాన్ని పాఠశాల విద్యాశాఖ నో బ్యాగ్ డేగా ప్రకటించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇది అమల్లోకి వస్తుంది. 1 నుంచి 9 తరగతుల విద్యార్థులు ప్రతి శనివారం స్కూలుకు బ్యాగులు తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. ఆ రోజు పాఠశాలల్లో సెమినార్లు, డిబేట్లు, క్విజ్‌లు, ఆటల పోటీలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాయడం, చదవడంతో పాటు విద్యార్థులను మౌఖిక పరీక్షలను ఎదుర్కోగలిగేలా, వివిధ అంశాలపై చర్చించేలా తీర్చిదిద్దడమే నో బ్యాగ్ డే లక్ష్యం!.

# చిత్రజ్యోతి

SINCE 1965

## మరో 30 రోజుల్లో..



నాని, శ్రీనిధి శెట్టి జంటగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హిట్: ద థర్డ్ కేస్'. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. విజయవంతమైన 'హిట్ ఫ్రాంచైజీలో మూడో భాగంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మే 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం '30 డేస్ కౌంట్‌డౌన్' పోస్టర్ రిలీజ్ చేసింది. నాని ఇంటెన్స్ లుక్‌లో సిగరేట్ కాలుస్తూ గన్ గురిపెట్టిన పోస్టర్ అదిరిపోయింది.

## ఇది ప్రేక్షకుల విజయం

నాగవంశీ



నిర్మాత సూర్యదేవర నాగవంశీ సమర్పణలో సాయిసౌజన్య, హారికా సూర్యదేవర నిర్మించిన తాజా చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్‌నితిన్ ప్రధాన పాత్రల్లో నటించారు. సినిమా ఇటీవలే విడుదలై ఘనవిజయం సాధించిన సందర్భంగా నాగవంశీ మాట్లాడుతూ "ఇందులోని వినోదం నచ్చడంతో యువత, కుటుంబ ప్రేక్షకులు సినిమా థియేటర్లకు క్యూ కడుతున్నారు. ముందుగానే చెప్పినట్లు ఇది ప్రేక్షకులను నవ్వించడానికి చేసిన ప్రయత్నం. ఈ సినిమా విజయం ప్రేక్షకులదే. రివ్యూ అనేది ఒకరి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. సినిమాలకు నిజాయితీగా ఇచ్చే రివ్యూలను స్వాగతిస్తాము. కానీ సినిమాను చంపేయాలనే ఉద్దేశంతో కొందరు లేనిపోనివి రాస్తూ.. దెబ్బతీస్తున్నారు. సినిమా బతికితేనే మనమందరం బాగుంటాం అనే విషయాన్ని గ్రహించాలి" అని అన్నారు.

### ఆ సినిమాలపై క్లారిటీ


"అల్లు అర్జున్, త్రివిక్రమ్ సినిమా పూర్తిగా పురాణాల నేపథ్యంలో సాగనుంది. అక్టోబరు నుంచి రెగ్యులర్ షూటింగ్ ఆరంభం కానుంది. విజయ్ దేవరకొండ నటిస్తున్న 'కింగ్‌డమ్' సినిమాలో యాక్షన్‌కు అధిక ప్రాధాన్యత ఉంటుంది. ఇందులోని పోరాట ఘట్టాలు 'కేజీఎఫ్' సినిమా స్థాయిలో ఉంటాయి. రవితేజ నటిస్తున్న 'మాస్ జాతర' సినిమాను జూలైలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అని నాగవంశీ చెప్పారు.



## మెగా గ్యాంగ్ పరిచయం

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం (మెగా 157-వర్కింగ్ టైటిల్) ఉగాది నాడు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన విషయం తెలిసిందే. చిరంజీవి కెరీర్‌లోని ఐకానిక్ పాత్రలనూ, చిత్రబృందాన్ని పరిచయం చేస్తూ వినూత్నమైన వీడియోను మంగళవారం అనిల్ రావిపూడి విడుదల చేశారు. వీడియో ప్రారంభంలో దర్శకత్వ విభాగం సభ్యులు చిరంజీవి పంచబోయే వినోదాన్ని చూసేందుకు ఆసక్తిగా ఉన్నామని చెప్పారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మాస్టర్ పాటపాడుతూ ఎంట్రీ ఇవ్వగా, చిరంజీవి 'గోదారి గట్టు' పాట నుంచి కొన్ని లైన్లు ఆలపించి ఎంటర్‌టైన్ చేశారు.

## ఎంపురాన్‌కు మరోసారి సెన్సార్



మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో వచ్చిన 'ఎల్2: ఎంపురాన్'లోని కొన్ని సన్నివేశాలు వివాదాస్పదమైన నేపథ్యంలో దర్శక నిర్మాతలు మరోసారి సెన్సార్ బోర్డును ఆశ్రయించారు. చిత్రంలోని 24 సన్నివేశాలను తొలగించాలని సెన్సార్ బోర్డు చెప్పింది. కొన్ని చోట్ల ఆడియో మ్యూట్ చేయాలని, కొన్ని పేర్లు మార్చాలని ఆదేశించింది. సెన్సార్ బోర్డు సూచనల మేరకు సినిమాలో కీలక పాత్ర బాల్‌రాజ్ భజరంగీ పేరును బలదేవ్‌గా మార్చనున్నారు. థాంక్స్ కార్డులోని కేంద్ర మంత్రి సురేష్ గోపి పేరునూ తొలగించనున్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు సంబంధించిన సన్నివేశాలు మ్యూట్‌లో ప్రదర్శితమవుతాయి. అయితే రివైజ్డ్ వెర్షన్‌ను ఎప్పటి నుంచి ప్రదర్శిస్తారనే విషయాన్ని చిత్రబృందం ప్రకటించలేదు.

## పరిపూర్ణమైన తెలుగు సినిమా



ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకుడు. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. ఈనెల 18న విడుదలవుతోంది. ప్రీ రిలీజ్ వేడుకలో మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ "నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్‌తో ఇది నాకు మూడో సినిమా. కుటుంబసమేతంగా చూడదగ్గ హాస్యభరిత చిత్రమిది. ఈ సినిమా విజయంపై నమ్మకం ఉంది" అని అన్నారు. "చాలా రోజులుగా మంచి తెలుగు సినిమా తీయాలనుకుంటున్నాను. ఆ కోరిక ఈ సినిమాతో తీరింది. కేవలం జాతకాలనే నమ్మకూడదు.. మనం చేయాల్సిన పనులను వందశాతం నిబద్ధతతో చేయాలని చెప్పే సినిమా ఇది" అని శివలెంక కృష్ణప్రసాద్ తెలిపారు.

## 'మిథునం' తర్వాత మరోసారి



'మిథునం' లాంటి క్లాసికల్ చిత్రం తర్వాత నటుడు తనికెళ్ల భరణి మరోసారి మెగాఫోన్ పట్టబోతున్నారు. దర్శకుడిగా తన కొత్త సినిమాకు సంబంధించిన విశేషాలను ఆయన మీడియాతో పంచుకున్నారు. ప్రతిభావంతులైన నూతన నటీనటులను ఎంపిక చేసి, వారితో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు ఆయన చెప్పారు.

## భావోద్వేగాలతో నిండిన ప్రేమకథ

సాయి అభిషేక్



నూతన నిర్మాత సాయి అభిషేక్ రూపొందించిన చిత్రం '28 డిగ్రీస్ సెల్సియస్'. నవీన్‌చంద్ర, షాలినీ వడ్నికట్టి జంటగా 'పొలిమేర' ఫేమ్ అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించారు. ఈనెల 4న సినిమా విడుదలవుతున్న సందర్భంగా సాయి అభిషేక్ మీడియాతో ముచ్చటించారు. "దర్శకుడు అనిల్‌తో కలసి ఓ మంచి సినిమాను ప్రేక్షకులకు అందిద్దామని చేసిన ప్రయత్నమే ఈ థ్రిల్లర్. భావోద్వేగాలతో నిండిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. కథపై పూర్తి నమ్మకం ఉండడంతో నిర్మాణపరంగా రాజీపడలేదు. నవీన్ చంద్ర ఈ సినిమాకు ప్రాణం పెట్టి పనిచేశారు. ఓ తీవ్ర అనారోగ్య సమస్య నుంచి హీరోయిన్‌ను హీరో ఎలా రక్షించుకున్నాడు అనేది కథాంశం. విభిన్న జానర్స్‌లో సాగుతూ ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేసే అద్భుత ప్రేమకథ ఇది" అని చెప్పారు.

క్లాప్..

## సరికొత్త థ్రిల్లర్



వికాస్ వశిష్ఠ, దీయరాజ్, ఇనయ సుల్తానా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఫ్రైడే'. ఈశ్వర్‌బాబు ధూళిపూడి దర్శకత్వంలో కేసనకుర్తి శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాకు సంబంధించి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సరికొత్త థ్రిల్లర్ కథాంశంతో సినిమా అందరినీ అలరిస్తుందని పేర్కొన్నారు.

## టీనేజ్ లవ్‌స్టోరీ



ఉదయ్‌రాజ్, వైష్ణవి సింగ్ జంటగా రాజేశ్ చికిలే దర్శకత్వం వహించిన చిత్రం 'మధురం'. ఎం. బంగార్రాజు నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 18న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. 1990 నేపథ్యంలో సాగే టీనేజ్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం తెరకెక్కిందని మేకర్స్ తెలిపారు.

## విభిన్నమైన కథతో...



'బింబిసార' ఫేమ్, దర్శకుడు మల్లిడి వశిష్ఠ సోదరుడు మల్లిడి కృష్ణ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నూతన నటుడు కుశాల్ రాజు కథానాయకుడిగా డా.లతా రాజు ఈ సైన్స్ ఫిక్షన్ డ్రామాను నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రాన్ని ప్రారంభించారు. దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి స్క్రిప్టును అందజేయగా దర్శకుడు వి.వి.వినాయక్ క్లాప్ కొట్టారు. దర్శకుడు మల్లిడి వశిష్ఠ గౌరవ దర్శకత్వం వహించారు.




# పెన్షన్ల సొమ్ముతో పరారీ

- 7.50 లక్షలతో ఉడాయించిన సచివాలయ ఉద్యోగి
- గతంలోనూ ఇదే తీరు.. సస్పెన్షన్ తొలగింపుతో మళ్లీ!


తోట తరుణ్‌కుమార్

కంచికచర్ల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పెన్షన్ సొమ్ము రూ.7.50 లక్షలతో సచివాలయ ఉద్యోగి ఒకరు పరారైన సంఘటన ఎన్‌టీఆర్ జిల్లా కంచికచర్లలో జరిగింది. మంగళవారం సాయంత్రం వరకు సదరు ఉద్యోగి ఆచూకీ తెలియకపోవడంతో ఎంపీడీవో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గంపలగూడెం మండలం పెనుగొలనుకు చెందిన తోట తరుణ్‌కుమార్ కంచికచర్ల-3 సచివాలయంలో విద్య, సంక్షేమ సహాయకునిగా పనిచేస్తున్నారు. ఈ సచివాలయం పరిధిలోని పెన్షన్ లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు మార్చి 29న తరుణ్‌కుమార్ బ్యాంకు నుంచి రూ.48.35 లక్షలు డ్రా చేశాడు. దానిలో మిగిలిన సచివాలయ సిబ్బందికి రూ.40.85 లక్షలు ఇచ్చాడు. వెటర్నరీ అసిస్టెంట్ గోపాలాచారి రూ.2.92 లక్షలు తీసుకోలేదు. దీనితోపాటు తాను పంపిణీ చేయాల్సిన రూ.4.58 లక్షలతో కలిసి మొత్తం రూ.7.50 లక్షలు తరుణ్‌కుమార్ వద్ద ఉన్నాయి. మంగళవారం ఉదయం పెన్షన్ సొమ్ము పంపిణీ చేయాల్సి ఉండగా.. తరుణ్‌కుమార్ విధులకు రాలేదు. అధికారులు ఫోన్ చేస్తే.. స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఎంపీడీవో లక్ష్మీకుమారి ఫిర్యాదు మేరకు కంచికచర్ల పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి, గాలిస్తున్నారు. లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయంగా నగదు సమకూర్చి పెన్షన్ అందించామని ఎంపీడీవో చెప్పారు. కాగా గతంలో నెమలి సచివాలయంలో పనిచేస్తున్నప్పుడూ తరుణ్ రూ.2 లక్షలతో పరారైనట్టు తెలిసింది. అప్పట్లో అతడిని సస్పెండ్ చేసిన అధికారులు.. సొమ్ము జమ చేయడంతో తిరిగి పోస్టింగ్ ఇచ్చారు.

## ప్రభుత్వ బడిలో విద్యార్థుల్ని చేర్పిద్దాం

- టీచర్లకు యూటీఎఫ్ పిలుపు

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించేందుకు క్రియాశీలకంగా వ్యవహరించాలని, ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య(యూటీఎఫ్) పిలుపునిచ్చింది. 'ప్రభుత్వ బడిలో విద్యార్థుల్ని చేర్పిద్దాం' అనే వాల్‌పోస్టర్‌ను యూటీఎఫ్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు, ఇతర కార్యవర్గ సభ్యులు మంగళవారం విజయవాడలో ఆవిష్కరించారు. రాష్ట్రంలో 49శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో, 51శాతం మంది ప్రైవేటు పాఠశాలల్లో చదవడం ప్రభుత్వ విద్యారంగానికి ప్రమాద ఘంటికలు అని పేర్కొన్నారు. అందువల్ల పిల్లలకు నాణ్యమైన విద్యను ప్రభుత్వ బడుల్లో అందుతుందనే భరోసాను తల్లిదండ్రులకు ఇవ్వాలన్నారు. ప్రతి యూటీఎఫ్ కార్యకర్త ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల నమోదులో భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రభుత్వ బడులను రక్షించుకోవాల్సిన బాధ్యత టీచర్లపైనే ఉందన్నారు.

# విజయ ప్రతిధ్వని.. టైగర్ ట్రయంఫ్

- తూర్పు నౌకాదళం చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా
- విశాఖపట్నంలో ప్రారంభమైన వేడుక
- 13 వరకూ భారత్, అమెరికా సైనిక విన్యాసాలు


భారత్, అమెరికా దేశాల నౌకా సిబ్బంది

విశాఖపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భారత్, అమెరికా నౌకా దళాలు సంయుక్తంగా నిర్వహించే 'టైగర్ ట్రయంఫ్-2025' సైనిక విన్యాసాలు ఈసారి విజయాన్ని ప్రతిధ్వనించేలా ఉంటాయని తూర్పు నౌకాదళం చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా అన్నారు. మంగళవారం ప్రారంభమైన ఈ విన్యాసాలు ఈనెల 13వ తేదీ వరకు కొనసాగుతాయని ఆయన వెల్లడించారు. 'టైగర్ ట్రయంఫ్-2025' ఆరంభ కార్యక్రమాన్ని విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్‌లోని ఐఎన్ఎస్ జలాశ్వపై మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమీర్ సక్సేనా మాట్లాడుతూ.. ఏటా అమెరికా, భారత్ నౌకాదళాలు నిర్వహిస్తున్న విన్యాసాల్లో ఇది నాలుగోదని వివరించారు. ఇది రెండు దేశాల మధ్య నేవీ, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ సంబంధాలను పెంపొందించడమే కాకుండా స్నేహ సంబంధాలను బలోపేతం చేస్తుందన్నారు. ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు హార్బర్ ఫేజ్ విన్యాసాలు, 8 నుంచి 12 వరకు సముద్ర విన్యాసాలు ఉంటాయన్నారు. భారత్ తరపున యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ జలాశ్వ, ఐఎన్ఎస్ ముంబై, ఐఎన్ఎస్ ఘరియల్, ఐఎన్ఎస్ శక్తి, ఎంహెచ్ 60ఆర్ హెలికాప్టర్లు పాల్గొంటున్నాయని తెలిపారు. అమెరికా తరపున యుఎస్ఎస్ కామ్‌స్టాక్, యుఎస్ఎస్ రాల్ఫ్ జాన్సన్, పీ8ఏ పోసిడాన్ విమానం, సి-130జె విమానం ఈ విన్యాసాల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు. అమెరికా రక్షణ వ్యవహారాల ఇన్‌చార్జి జోర్గాన్ కె ఆండ్రూస్ మాట్లాడుతూ.. రెండు దేశాల భాగస్వామ్యం వల్ల ఇండో-పసిఫిక్ ప్రాంతానికి రక్షణపరంగా మరింత భరోసా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రియర్ అడ్మిరల్ సుశీల్ మీనన్, ఐఎన్ఎస్ జలాశ్వ కెప్టెన్ సౌషద్ అలీఖాన్, కామ్‌స్టాక్ కమాండింగ్ ఆఫీసర్ బైరన్ స్టాక్స్, రియర్ అడ్మిరల్ గ్రెగొరి న్యూకిర్క్, తదితరులు పాల్గొన్నారు.

# చిన్న కాంట్రాక్టర్లకు చిల్లు!

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టిన పనులకూ చకచకా బిల్లులు చెల్లిస్తున్నారు. 2014-19 మధ్య పనులు చేసిన కాంట్రాక్టర్లతోపాటు, ఇప్పుడు ప్రభుత్వం వచ్చాక జరిగిన పనులకు సంబంధించిన బిల్లులు రూ.4వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. అయినా సరే... 'ఐప్యాక్' పనులకే బిల్లుల చెల్లింపులో పెద్ద పీట వేస్తుండటం విశేషం! ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం చేపట్టిన పనులకు సంబంధించి రూ.600 కోట్ల బిల్లులను క్లియర్ చేసేశారు. మూడు రోజుల క్రితం ఈ చెల్లింపులు జరిగిపోయాయి.

### 'ఐప్యాక్' పనులే ముద్దు...

వైసీపీకి రాజకీయ వ్యూహాలు అందించిన 'ఐప్యాక్' ఐదేళ్లూ రాష్ట్రంలో చక్రం తిప్పిన సంగతి తెలిసిందే. 2024 ఎన్నికలకు ఏడాది ముందు ఎక్కడ ఏ పని చేయాలో కూడా ఐప్యాక్ దిశా నిర్దేశం చేసింది. ప్రజావసరాలు, ప్రాధాన్యాలతో నిమిత్తం లేకుండా... కేవలం ఓట్లు, రాజకీయ కోసం అక్కడ రోడ్డేయండి, ఇక్కడ బ్రిడ్జి కట్టండంటూ ఐప్యాక్ సూచనలు చేసింది. ఆ పనులను వైసీపీ ప్రభుత్వం చేపట్టింది. కానీ... కాంట్రాక్టర్లకు మాత్రం డబ్బులు ఇవ్వలేదు. జగన్ ఎక్కడికి పోయినా 'వైసీపీ కాంట్రాక్టర్లు' చుట్టుముట్టి... బిల్లుల కోసం గగ్గోలు పెడుతున్న సంగతి తెలిసిందే. అయితే... ఇప్పుడు కూటమి సర్కారు ఆ బిల్లులను ఎంచక్కా చెల్లిస్తోంది.

### ఎవరికి ఎంత...

మార్చి 30వ తేదీన రూ.2,000 కోట్ల బిల్లులు చెల్లించామని... ఇందులో 90 శాతం రూ.కోటిలోపు బిల్లులున్న చిన్న కాంట్రాక్టర్లేనని ప్రభుత్వం అధికారికంగా ప్రకటన ఇచ్చింది. అయితే... చిన్న కాంట్రాక్టర్లకు రూ.1200 కోట్లకు మించి చెల్లింపులు జరగలేదని తెలుస్తోంది. ఇందులో రూ.600 కోట్లు ఎన్నికల ముందు వైసీపీ హయాంలో జరిగిన 'ఐప్యాక్' పనులకే చెల్లించినట్లు సమాచారం. విచిత్రమేమిటంటే.. ఇప్పుడు అధికారంలో ఉన్న నేతల ఒత్తిడితోనే ఈ బిల్లులు క్లియర్ చేసినట్లు చెబుతున్నారు.

### చిన్న కాంట్రాక్టర్ల గోడు

'రూ.2 వేల కోట్లు ఇచ్చేశాం' అని ప్రభుత్వం ప్రకటించగానే.. బిల్లుల కోసం కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న కాంట్రాక్టర్లంతా సంబర పడిపోయారు. ఖాతాల్లోకి డబ్బు జమ అవుతుందని మూడు రోజులు వేచి చూసినా ఫలితం లభించలేదు. మరోవైపు... 'మీకు ప్రభుత్వం డబ్బులు ఇచ్చేసింది. మా బాకీ కట్టేయండి' అంటూ అప్పట్లో సిమెంటు, స్టీల్, ఇతర మెటీరియల్ సరఫరా చేసిన వ్యాపారులు చిన్న కాంట్రాక్టర్లపై ఒత్తిడి పెంచారు. 'మాకు డబ్బు రాలేదు మొర్రో' అని చెప్పినా... నమ్మడంలేదు. గట్లు బలోపేతం చేయడం, మోటార్ల మరమ్మతులు, కాలువలు పూడిక తీయడం, గుర్రపు డెక్కలు తీయడం, ప్రాజెక్టుల గేట్లకు గ్రీజు పూయడంలాంటి మెయింటెనెన్స్ పనుల బిల్లులు 2017-18 నుంచి దాదాపు రూ.80 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. పనులు చేసిన వారంతా చిన్న చిన్న కాంట్రాక్టర్లే. ఇవి ఇప్పటికీ క్లియర్ కాలేదు. 2018లో జలవనరుల శాఖ కింద పనిచేసిన ఒక కాంట్రాక్టర్‌కు రూ.73 లక్షల బిల్లు రావాలి. తాజా చెల్లింపుల్లో దీనికీ మోక్షం లభించలేదు. తాజాగా... మళ్లీ అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పనుల కింద చిన్న కాంట్రాక్టర్లు రోడ్లపై గుంతలు పూడ్చే పనులు చేశారు. వీరిలో కొందరు టీడీపీకి చెందిన వారూ ఉన్నారు. వీటికి సంబంధించి రూ.100 కోట్ల వరకు బిల్లులు ఉన్నాయి. వీటిని కూడా పక్కన పడేశారు. 'ఐప్యాక్' పనులకు మాత్రం జై కొట్టారు.

### ఫిఫో పాటించండి...

బిల్లుల చెల్లింపులకు ఒక పద్ధతి ఉంది. అదే... ఫస్ట్ ఇన్, ఫస్ట్ ఔట్ (ఫిఫో). మొదట పని చేసి, బిల్లులు సమర్పించిన వారికి మొదట చెల్లింపులు జరగాలి. ఈ పద్ధతికి వైసీపీ పాతరేసింది. టీడీపీ హయాంలో పనులు చేసిన వారిపై కక్షకట్టినట్లు వ్యవహరించింది. కనీసం ఇప్పుడైనా 'ఫిఫో' పాటించాలని చిన్న కాంట్రాక్టర్లు కోరుతున్నారు. కోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకున్న బిల్లులకైనా చెల్లింపులు చేయాలని వేడుకుంటున్నారు. రూ.2,000 కోట్లలో 90 శాతం చిన్న కాంట్రాక్టర్లకే ఇస్తున్నట్లు ప్రభుత్వం చెప్పిన మాటల్లో నిజం లేదని... ఈ ముసుగులో కోటి రూపాయలు దాటి భారీగా ఉన్న బిల్లులూ చెల్లించేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్న కాంట్రాక్టర్లకు రూ.4000 కోట్లు కేటాయించగలిగితే 90 శాతం మంది కష్టాల నుంచి బయటపడతారని పేర్కొంటున్నారు.

### ఎన్నెన్ని కష్టాలు..

15వ ఆర్థిక సంఘం ఇచ్చిన గ్రాంట్లతో మునిసిపాలిటీల్లో నిర్వహించిన రోడ్లు, డ్రెయిన్లు, నీటి సరఫరాకు సంబంధించిన పనులు జరిగాయి. 10 మునిసిపాలిటీల్లో కలిపి రూ.70 కోట్లకు సంబంధించిన బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో సిద్ధంగా ఉన్నాయి. కానీ... చెల్లింపులు జరగలేదు.

- పంచాయతీ రాజ్‌లో చేసిన పనులకు బిల్లులు అసలు చేయలేదు. ఇవి దాదాపు రూ.200 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.
- చిన్న కాంట్రాక్టర్లకు చెల్లింపుల ముసుగులో... నాబార్డు కింద పనులు చేసిన పనుల జాబితాలో బడా కంపెనీలకు కూడా చెల్లింపులు చేశారు.
- రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లు సీఎండీఎఫ్, ఎస్‌డీఎఫ్ ద్వారా చేసిన పనుల బిల్లులు అధికారుల నిర్లక్ష్యం కారణంగా సీఎఫ్ఎంఎస్‌లోకి కూడా ఎక్కలేదు. వైజాగ్, అనంతపురం మునిసిపాలిటీల్లో ఎస్‌డీఎఫ్ గ్రాంట్ల కింద 2014-19 సమయంలో చేసిన పనులకు కోర్టుకెళ్లి ఆదేశాలు తెచ్చుకుంటేనే బిల్లులు చెల్లించారు. వెళ్లని వాళ్లకు ఇంతవరకు చెల్లించలేదు. ఆ బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లోకి ఎక్కించలేదు. విశాఖ, అనంతపురం, మంగళగిరి-తాడేపల్లి మునిసిపాలిటీల్లో కలిపి ఈ బిల్లులు రూ.10 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

## వివేకా హత్య కేసు విచారణలో.. ఏం జరుగుతోంది?

(మొదటి పేజీ తరువాయి)

విచారణ చేపట్టారు. వివేకా హత్య కేసు విచారణ సీబీఐ కోర్టులో ఏ దశలో ఉందని ప్రశ్నించారు. సీబీఐ సమర్పించిన 13 లక్షల పత్రాలలో ఇప్పటివరకు దాదాపు 2.30 లక్షలు తెరిచినట్లు న్యాయవాదులు పేర్కొన్నారు. అంటే మిగతా 11 లక్షలు తెరవడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఈ సమస్యను పరిష్కరించడానికి నిందితులకు కొత్త హార్డ్‌డిస్కులు ఇచ్చినట్లు సీబీఐ తరపు న్యాయవాది కాపాటి శ్రీనివాస్ తెలిపారు. ఇక మీ ఇష్టమని న్యాయమూర్తి అన్నారు. కాగా.. దస్తగిరికి క్షమాభిక్ష పెట్టడం సరికాదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు తెలిపారు. తమ పిటిషన్లపై సీబీఐ కౌంటర్ దాఖలు చేసిందని.. పూర్తి స్థాయి వాదనలకు సమయం కేటాయించాలని కోరారు. వివేకా కుమార్తె సునీతారెడ్డి తరపు న్యాయవాది ఎస్.గౌతమ్ వాదనలు వినిపిస్తూ.. దస్తగిరికి కడప కోర్టు ఇచ్చిన క్షమాభిక్ష కేసులో తాము ఇప్పటికే ఇంప్లీడ్ అయ్యామని తెలిపారు. అలాగే సీబీఐ కోర్టు సాక్షిగా గుర్తించిన కేసులోనూ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేస్తామని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ నెల 16న పూర్తి స్థాయి వాదనలు వింటామన్నారు. అలాగే హత్య కేసు విచారణను వేగవంతం చేయాలంటూ సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సీజే ధర్మాసనానికి బదిలీ చేసినట్లు తెలిపారు. తదుపరి విచారణను 16వ తేదీకి వాయిదా వేశారు.

### వాణిజ్య సిలిండర్ ధర తగ్గింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర తగ్గింది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.41 మేర తగ్గించాయి. అలాగే ఏటీఎఫ్(ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్) ధరలను 6.1%(లీటర్‌కు రూ.5,870.54 ల) మేర తగ్గించాయి. ఏప్రిల్ 1 నుంచే ఈ ధరల తగ్గింపు అమల్లోకి వచ్చింది. ధరల తగ్గింపు తర్వాత వాణిజ్య సిలిండర్ ధర ఢిల్లీలో రూ.1,762, ముంబైలో రూ.1,868.50, చెన్నైలో రూ.1,921.50 లకు తగ్గింది.

## కీసర టోల్ వద్ద

# ప్రవీణ్‌కు ప్రమాదం!

### విజయవాడకు రాకముందే బైక్‌పై నుంచి పడిన పాస్టర్

- ప్లాజా ముందు ఉన్న మలుపులో పక్కకు దూసుకుపోయిన బుల్లెట్
- స్థానికుల ఫోన్‌తో అంబులెన్స్ రాక
- సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు
- గాయాలను శుభ్రం చేశామన్న టోల్ సిబ్బంది



కీసర టోల్‌గేటు వద్ద అంబులెన్స్ రోడ్డుపైకి వస్తున్న దృశ్యాలు


కీసర టోల్‌ప్లాజా వద్ద దెబ్బతిన్న బుల్లెట్ హెడ్‌లైట్

విజయవాడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ అనుమానాస్పద మృతి కేసులో చిక్కుముళ్లు వీడుతున్నాయి. ప్రవీణ్ విజయవాడకు చేరుకోవడానికి ముందే బుల్లెట్‌పై నుంచి అదుపుతప్పి పడిపోవడం నిజమని తేలింది. హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఆయన ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశించిన తర్వాత కీసర టోల్‌ప్లాజాలోకి రావడానికి ముందు ప్రమాదం బారిన పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజీ తాజాగా వెలుగులోకి వచ్చింది. 24వ తేదీన ప్రవీణ్ విజయవాడలోని గొల్లపూడి వద్ద ఉన్న పెట్రోలు బంకుకు చేరుకునే సమయానికి గాయాలు ఉన్నట్టు అక్కడ సిబ్బంది పోలీసులకు వివరించారు. దీనికి ముందే ఆయన బుల్లెట్‌పై నుంచి అదుపుతప్పి పడిపోయారు. జగ్గయ్యపేట వద్ద ముందుగా చిల్లకల్లు టోల్‌ప్లాజా వస్తుంది. ఇది దాటిన తర్వాత కీసర టోల్‌ప్లాజా. ఈ టోల్‌ప్లాజాలోకి వెళ్లడానికి ముందు 50 మీటర్ల దూరంలో జాతీయ రహదారిపై మలుపు ఉంటుంది. ఇక్కడ మలుపు తీసుకున్న తర్వాత ప్లాజాలోని లేన్లలోకి వాహనాలు ప్రవేశిస్తాయి. ప్రవీణ్‌కుమార్ 24వ తేదీ మధ్యాహ్నం 3.52 గంటలకు వేగంగా వస్తున్నట్టు సీసీ కెమెరాల్లో రికార్డయింది. సరిగ్గా మలుపు వద్దకు వచ్చేసరికి ఆయన అక్కడ వాహనాన్ని తిప్పలేదు. తిన్నగా వెళ్లిపోవడంతో జాతీయ రహదారికి పక్కన ఉన్న ప్రదేశంలో పడిపోయారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల ఫుటేజీలో కనిపిస్తున్నాయి. ప్రవీణ్ పడిపోయిన ప్రదేశానికి ముందు రెండో ఆటోలు ఉండడంతో మట్టి గాల్లోకి లేచిన దృశ్యాలు కనిపించాయి. దీన్ని టోల్‌ప్లాజా సిబ్బంది ధ్రువీకరించారు. బుల్లెట్‌పై నుంచి పాస్టర్ పడిపోవడంతో పెద్ద శబ్దం వచ్చింది. ఇది విన్న స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఇంతలోనే ప్లాజా సిబ్బంది వెళ్లి పడిపోయిన ప్రవీణ్‌ను పైకి లేపి, బుల్లెట్‌పై కూర్చోబెట్టారు.

### కీసరకు ముందుగానే ఒకసారి ప్రమాదం?

అయితే పడిపోయిన వ్యక్తి ఎవరో తమకు తెలియదని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. ప్రమాదం మాత్రం జరిగిందని, అక్కడికి వెళ్లి చూశామని ప్రత్యక్ష సాక్షులు స్పష్టం చేస్తున్నారు. కీసర టోల్ వద్ద జరిగినట్టుగానే.. దీనికి ముందు మరో ప్రమాదం జరిగిందా? అన్న సందేహం వ్యక్తమవుతోంది. టోల్‌ప్లాజా, అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలానికి వెళ్లి ప్రవీణ్‌కు ఏమైనా గాయాలయ్యాయా అని పరిశీలించారు. కుడి చేతిపై గీసుకున్నట్టుగా గాయం ఉన్నట్టు గుర్తించారు. అయితే అది కీసర టోల్‌ప్లాజా వద్ద పడిపోయినప్పుడు తగిలిన గాయం కాదని అంబులెన్స్ సిబ్బంది దినకరన్ చెబుతున్నాడు. గంట క్రితం తగిలిన గాయంలా ఉందని ఆయన స్పష్టం చేశాడు. దీన్ని బట్టి చూస్తే చిల్లకల్లు-కీసర టోల్‌ప్లాజాల మధ్య ప్రవీణ్‌కు మరో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. విజయవాడ వైపునకు వస్తున్న క్రమంలో చిల్లకల్లు టోల్‌గేట్ దాటిన తర్వాత ప్రవీణ్ అదుపు తప్పి పడిపోయి ఉండొచ్చని దర్యాప్తు బృందాలు అనుమానిస్తున్నాయి.

### గాయాలను శుభ్రం చేశాం: దినకరన్, అంబులెన్స్ ఉద్యోగి




24వ తేదీన మాకు సేఫ్టీ మీటింగ్ పెట్టారు. ఆ మీటింగ్‌లో ఉండగా కంట్రోల్‌రూం నుంచి 3.52 గంటలకు కాల్ వచ్చింది. అప్పటికే మా గేట్‌మ్యాన్ పాస్టర్‌ను పైకి లేపాడు. మేం వెళ్లేసరికి ఆయన బుల్లెట్‌పై కూర్చుని ఉన్నాడు. కుడిచేతిపై గీసుకునట్టుగా ఉంది. ఆ దెబ్బ ఇక్కడ తగల్లేదు. గంట క్రితం వేరే చోట తగిలిన దెబ్బలా అనిపించింది. క్లీన్ చేస్తే అక్కడ గీసుకుపోయి ఉంది. బైక్ నడిపే పరిస్థితిలో లేరు కాబట్టి.. కాసేపు విశ్రాంతి తీసుకోమని చెప్పాం. ఆ సమయానికి ఆయన బైక్‌ను ఆపుకోలేని, నిలబడలేని స్థితిలో ఉన్నారు. 5-10 నిమిషాలు పడిపోయిన ప్రదేశంలోనే ఉంచాం. మేము మాట్లాడుతుంటే అదే పనిగా కిక్‌రాడ్‌తో బైక్‌ను స్టార్ట్ చేస్తున్నారు. బైక్ స్టార్ట్ కాకపోవడంతో కీ ఒకసారి ఆఫ్‌చేసి, ఆన్ చేసి సెల్ఫ్ స్టార్ట్ చేశాడు. మావైపు చూసి ఒక్కసారిగా నవ్వి, మేం చూస్తుండగానే మమ్మల్ని దాటి వెళ్లిపోయాడు. మా ప్లాజాకు 50 మీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. మలుపులో ఒక మొబైల్ షాపు ఎదురుగా ఆయన పడ్డారు. ప్లాజాకు ముందు లైన్లు ఉంటాయి. అక్కడ మలుపు ఉంటుంది. ఈ మలుపు తిరగకుండా నేరుగా వెళ్లిపడిపోయారు.


మాజీ ఎంపీ హర్షకుమార్‌కు నోటీసు 179 బీఎన్ఎస్ఎస్‌ను అందిస్తున్న పోలీసులు

## హర్షకుమార్‌కు పోలీసు నోటీసు

- పాస్టర్ కేసులో ఆధారాలు ఉంటే సమర్పించండి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ కేసు దర్యాప్తు అధికారి మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్‌కు నోటీసు జారీ చేశారు. రాజమహేంద్రవరంలోని తన నివాసంలో మంగళవారం బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179 కింద పోలీసులు జారీ చేసిన నోటీసును హర్షకుమార్ తీసుకున్నారు. రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో నమోదయిన ప్రవీణ్ కేసు దర్యాప్తులో ఉండగా.. హర్షకుమార్ గత నెల 27న ప్రెస్‌మీట్ పెట్టారు. 'ఆ సంఘటన ముమ్మాటికీ హత్యే. ఇది పోలీసులకు, వైద్యులకు తెలుసు' అని ప్రకటించారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు అధికారి నోటీసు జారీ చేశారు. కేసుకు సంబంధించి ఆధారాలు ఏమైనా ఉంటే వాటిని దర్యాప్తు అధికారికి ఈ నెల 1 లేదా 2 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఇప్పటికే ఒక నోటీసు ఇచ్చామని, ఇది రెండో నోటీసని పోలీసులు తెలిపారు. దీనిపై హర్షకుమార్ స్పందిస్తూ... 'పాస్టర్ ప్రవీణ్ కేసుపై నేనే బుధవారం రైట్ టు ఇన్‌ఫర్మేషన్ ప్రకారం సమాచారం అడుగుతా' అని తెలిపారు.

## పాస్టర్ ప్రవీణ్ కేసులో లోతైన దర్యాప్తు

- మత విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు: అనిత


హోం మంత్రి అనితకు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర పాస్టర్ల యూనియన్ ప్రతినిధులు

నక్కపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి కేసులో ఎవరైనా మత విద్వేషాలు రగిలించేలా రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా చర్యలు తీసుకుంటామని హోం మంత్రి అనిత హెచ్చరించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆమెను మంగళవారం రాష్ట్ర పాస్టర్ల సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రవీణ్ పగడాల కేసు గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత కేసు దర్యాప్తు గురించి వివరించారు. ఇప్పటికే లోతైన విచారణ జరుగుతోందని, ఒకటి, రెండు రోజుల్లో సమగ్ర నివేదిక వస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఎప్పటికప్పుడు ఈ ఘటనపై ఆరా తీస్తున్నారన్నారు. అయితే కావాలనే కొంతమంది ఈ కేసు విషయంలో రాజకీయం చేస్తున్నారని మంత్రి ఆరోపించారు.

# ఇక స్మార్ట్ రేషన్ కార్డులు!

## ఏటీఎం కార్డు సైజులో మే నుంచి మంజూరు

- క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ఫీచర్లు
- కుటుంబసభ్యుల జోడింపు, తొలగింపు, స్ప్లిట్ కార్డుల ఆప్షన్లకు అవకాశం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలు, హాస్టళ్లకు సన్నబియ్యం
- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల వెల్లడి




అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఏటీఎం సైజులో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఏప్రిల్ 30తో ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిన వెంటనే.. సీఎం చంద్రబాబు ఆమోదంతో ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానంలో వీటి జారీ చేపడుతామని పేర్కొన్నారు. ఇందులో క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ఫీచర్లు ఉంటాయన్నారు. సచివాలయంలో మంగళవారం మంత్రి మనోహర్ మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఫ్యామిలీ రేషన్ కార్డునే సైజు తగ్గించి అన్ని వివరాలతో కొత్త కార్డులు జారీ చేస్తామన్నారు. కొత్త కార్డుల జారీ సమయంలోనే కుటుంబసభ్యుల జోడింపు, తొలగింపు, స్ప్లిట్ కార్డుల కోసం ఆప్షన్లు ఇస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలోలా ఎక్కడా వ్యక్తుల చిత్రాలు కార్డులపై ఉండబోవని స్పష్టం చేశారు. ఈ-కేవైసీ పూర్తయిన తర్వాత ఎంత మందికి కొత్త కార్డులు ఇవ్వాలనే దానిపై స్పష్టత వస్తుందన్నారు. మరోవైపు రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, బాధ్యులపై పీడీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా వాహనాలను సీజ్ చేస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం రూ.1,600 కోట్లతో ఎండీయూ వాహనాలను కొనుగోలు చేసి దుర్వినియోగం చేసిందని, ఇది పెద్ద కుంభకోణమని, దీనిపై విచారణ జరుగుతోందని, త్వరలోనే ఒక నిర్ణయం ప్రకటిస్తామని మనోహర్ తెలిపారు. కొన్ని వాహనాలు కనబడకపోగా, మరికొన్ని పనిచేయడం లేదన్నారు. అప్పుడున్న ప్రమాణాల ప్రకారం వీటి కొనుగోలు జరగలేదన్నారు. బియ్యం ఎగుమతుల నిబంధనలను కేంద్రం సరళతరం చేయడం వల్ల.. తెలంగాణ ప్రభుత్వం కాకినాడ పోర్టు నుంచి 1.50 లక్షల టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తామని మోసం చేసిందని విమర్శించారు. మధ్యాహ్న భోజన పథకం కింద వచ్చే విద్యా సంవత్సరం నుంచి 44,394 ప్రభుత్వ పాఠశాలలు, 3,938 వసతి గృహాలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని ప్రత్యేక ప్యాకింగ్‌తో ప్రతి నెలా పంపిణీ చేసే ఏర్పాట్లు చేస్తున్నామని, 5 గోదాములు ఏర్పాటు చేశామని తెలిపారు.

### 24 గంటల్లోనే రైతులకు డబ్బులు జమ

ఈ రబీ సీజన్‌లో 10 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని మంత్రి పేర్కొన్నారు. ఇందు కోసం 2,900 రైతు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఖరీఫ్‌లో 35,93,443 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 24 గంటల్లోనే రూ.8,279 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా రైతులు వాట్సాప్ ద్వారా ధాన్యం అమ్ముకునే అవకాశం కల్పించామన్నారు. 16 వేల మంది వాట్సాప్ ద్వారా తమకు నచ్చిన మిల్లుల్లో ధాన్యం విక్రయించుకున్నారని వివరించారు. గత ఖరీఫ్ సీజన్‌లో గత ప్రభుత్వ హయాంలో 29 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారన్నారు. గతంతో పోలిస్తే తమ ప్రభుత్వం 20 శాతం ఎక్కువగా ధాన్యాన్ని కొనుగోలు చేసిందని తెలిపారు. ఖరీఫ్ ధాన్యం రైతుల వద్ద కుప్పల మీద ఉంటే కొనుగోలు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం 4.95 లక్షల మంది రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తే.. తమ ప్రభుత్వం నేటికి 5.60 లక్షల మంది రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసిందన్నారు. 2023, 2024లలో వైసీపీ ప్రభుత్వం నెల్లూరు జిల్లాల్లో ఒక్క బస్తా ధాన్యం కొనుగోలు చేయలేదని, తమ ప్రభుత్వం నేటికి నెల్లూరు జిల్లాలో 75,410 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందన్నారు. పల్నాడు జిల్లాల్లో గతంలో 60 టన్నులు కొనుగోలు చేస్తే.. ప్రస్తుతం 14 వేల టన్నులు కొనుగోలు చేశామని, అదేవిధంగా కృష్ణాలో 23 శాతం, గుంటూరులో 639 శాతం, బాపట్లలో 213 శాతం అధికంగా ధాన్యాన్ని కొనుగోలు చేశామని మంత్రి తెలిపారు.

### రెండో విడత దీపం-2 అమలు ప్రారంభం

కోటి మంది లబ్ధిదారులు దాటే విధంగా రెండో విడత దీపం-2 పథకాన్ని మంగళవారం నుంచి ప్రారంభించామని మంత్రి మనోహర్ తెలిపారు. మొదటి విడతలో 99.03 లక్షల మంది సద్వినియోగం చేసుకున్నారని, లబ్ధిదారుల ఖాతాల్లో రూ.760 కోట్లు నేరుగా జమ చేశామని పేర్కొన్నారు. ఈ మూడు నెలల్లో అదనంగా 2 లక్షల గ్యాస్ కనెక్షన్లు నమోదయ్యాయని తెలిపారు. ఈ-కేవైసీ అర్హత విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా.. వాట్సాప్, ఆన్‌లైన్ ద్వారా నివృత్తి చేసుకొనే వెసులుబాటు కల్పించామన్నారు.

# డైట్‌లలో అధ్యాపకుల భర్తీకి నోటిఫికేషన్

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శిక్షణ సంస్థల(డైట్) బలోపేతానికి పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. డైట్‌లలో అధ్యాపకులను భర్తీ చేసేందుకు మంగళవారం నోటిఫికేషన్ జారీచేసింది. డిప్యుటేషన్ ప్రాతిపదికన ఈ పోస్టుల భర్తీకి స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపింది. సంబంధిత సబ్జెక్టులలో 55శాతం మార్కులు, ఎంఈడీలో 55శాతం మార్కులు, స్కూల్ అసిస్టెంట్‌గా కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్నవారు ఏప్రిల్ 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఓ ప్రకటనలో తెలిపారు.

# కుడికాలువ విస్తరణ లేదు!

- తాడిపూడి నుంచి జక్కంపూడి దాకా సమాంతర కాలువ
- పోలవరం-బనకచర్ల ప్రాజెక్టులో కీలక మార్పు
- పథకం పొడవునా విద్యుత్కేంద్రాలు.. 2 హైడల్, మరో 2 పంప్డ్
- అవసరమైన చోట్ల సోలార్ ప్లాంట్లు
- మొత్తంగా 3,430 మెగావాట్ల ఉత్పత్తి
- ప్రాజెక్టు నిర్వహణకు 3,377 మెగావాట్లు కావాలి
- వాడకం పోను 53 మెగావాట్లు మిగులు
- డీపీఆర్‌లో జల వనరుల శాఖ స్పష్టీకరణ
- అంచనా వ్యయం రూ.81,800 కోట్లు
- జూన్ 1న టెండర్లు పిలిచే అవకాశం

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి జలహారతి పేరిట ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన 'పోలవరం-బనకచర్ల రెగ్యులేటర్' ప్రాజెక్టులో ప్రభుత్వం కీలక మార్పు చేసింది. పోలవరం కుడి ప్రధాన కాలువను విస్తరించడం కాకుండా తాడిపూడి నుంచి ఎన్టీఆర్ జిల్లా జక్కంపూడి వరకు సమాంతర కాలువ నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సిద్ధం చేసింది. రూ.81,800 కోట్ల భారీ అంచనా వ్యయంతో తలపెట్టిన ఈ ప్రాజెక్టు నిర్వహణ భారం కాకుండా స్వీయ స్వావలంబన సాధించేలా.. ప్రాజెక్టు పొడవునా విద్యుత్కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ప్రాజెక్టు యాజమాన్య నిర్వహణకు 3,377 మెగావాట్ల విద్యుత్ అవసరం కాగా.. రెండు చోట్ల జలవిద్యుత్కేంద్రాలు (430 మెగావాట్లు), ఇంకో రెండు చోట్ల పంప్డ్ స్టోరేజీ (1,000 మెగావాట్లు).. ఎంపిక చేసిన ప్రాంతాల్లో సోలార్ ప్లాంట్ల (2,000 మెగావాట్లు) నిర్మాణంతో 3,430 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని ప్రతిపాదించింది. అలా చేస్తే 53 మెగావాట్లు మిగులుతాయని కూడా తెలిపింది. రెండు టీఎంసీల చొప్పున 100 రోజుల పాటు 200 టీఎంసీల గోదావరి వరద జలాలను తరలించే ఈ పథకానికి జూన్ 1న టెండర్లను పిలిచే అవకాశం ఉంది.

### బుడమేరుకు దూరంగా..

పోలవరం కుడి కాలువను విస్తరించి బుడమేరు గుండా వరద జలాలను ప్రకాశం బ్యారేజీలోకి తరలించాలన్న ఆలోచనను జల వనరుల శాఖ విరమించుకుంది. విస్తరణలో సమస్యలు ఎదురవుతాయని అంచనా వేసింది. తాజాగా తాడిపూడి ఎత్తిపోతల పథకం వద్ద 15 కిలోమీటర్ల నుంచి 166.50 కిలోమీటర్ల వద్ద జక్కంపూడి గ్రామం దాకా సమాంతరంగా కాలువ తవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం 1,401 ఎకరాల భూమిని సేకరిస్తుంది. సమాంతర కాలువ ద్వారా బుడమేరుకు దూరంగా.. పవిత్ర సంగమం వద్ద గోదావరి జలాలను కృష్ణా నది(ప్రకాశం బ్యారేజీ)లోకి తరలిస్తారు. ఈ తొలి దశ పథకం కోసం రూ.13,800 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసింది. అనంతరం ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లాపల్లి రిజర్వాయరులోకి 33,000 క్యూసెక్కుల చొప్పున 83.40 కిలోమీటర్ల ఓపెన్ కాలువ గుండా ఆరు ఎత్తిపోతల ఏర్పాటుతో తరలిస్తారు. బొల్లాపల్లి రిజర్వాయరు వద్ద 230 మెగావాట్ల జల విద్యుత్కేంద్రాన్ని స్థాపిస్తారు. బొల్లాపల్లి నుంచి నల్లమల రిజర్వాయరుకు.. అక్కడి నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు 23,000 క్యూసెక్కుల చొప్పున తరలిస్తారు. మధ్యలో మూడు లిఫ్టులను ఏర్పాటు చేస్తారు. 200 మెగావాట్ల విద్యుత్కేంద్రాన్ని స్థాపిస్తారు. 27.10 కిలోమీటర్ల పొడవున టన్నెల్ నిర్మిస్తారు. సమీపంలోని సిద్ధాపురం వద్ద జంట టన్నెల్స్ తవ్వుతారు. వాటి ద్వారా బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు జలాలు తరలిస్తారు.

### విద్యుత్కేంద్రాలు ఇలా..

- బొల్లాపల్లి రిజర్వాయరు వద్ద 230 మెగావాట్లు, సిద్ధాపురం వద్ద 200 మెగావాట్ల జలవిద్యుత్కేంద్రాలను నిర్మిస్తారు.
- ప్రాజెక్టులో ఆరో స్టేజ్‌లో గుత్తికొండ వద్ద రెండు చోట్ల 400 మెగావాట్లు, 600 మెగావాట్ల సామర్థ్యంతో రెండు పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు.
- ఇక ప్రాజెక్టు పొడవునా ఎంపిక చేసిన ప్రదేశాల్లో 2,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.

3,430 మెగావాట్ల విద్యుదుత్పత్తితో ఏటా రూ.2,954 కోట్ల ఆదాయం ఉంటుందని.. ప్రాజెక్టు నిర్వహణకు 3,377 మెగావాట్లు వినియోగిస్తే ఇంకో 53 మెగావాట్లు మిగులుతుందని జల వనరుల శాఖ స్పష్టం చేస్తోంది. ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ చార్జీలే భారమని.. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు కోసం కరెంటు కొనాల్సిన పనే లేదని, ఏర్పాటుచేసే విద్యుత్ ప్లాంట్లు ఆ కొరత తీరుస్తాయని అంటోంది. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగానే ఈ విద్యుత్ ప్లాంట్లను నిర్మిస్తున్నందున.. ఆర్థిక సంస్థల నుంచి రుణాలు కచ్చితంగా అందుతాయని అధికార వర్గాలు అంటున్నాయి.



### చక్కగా నవ్వారు.. బాగా పలకరించారు



"సీఎం మా ఇంటికి వస్తున్నారంటే ముందు భయమేసింది. అంత పెద్దవాళ్లతో నేను ఎలా నడుచుకోవాలో అర్థం కాలేదు. అంతలోనే చిరునవ్వుతో దేవుడిలా ఆ పెద్దాయన ఇంట్లోకి వచ్చారు. చాలా బాగా నవ్వారు. చక్కగా పలకరించారు. 'పింఛన్ వస్తున్నదా అమ్మా? ఎవరైనా ఇబ్బందిపెడుతున్నారా?' అని అడిగారు. కుటుంబంలో సమస్యలు అడిగారు. మీ ఎమ్మెల్యే ఏలూరి మంచివారు. మీకు అండగా ఉంటారని చెప్పారు. ఈ జన్మకు ఇది చాలు.. చాలా సంతోషంగా ఉంది."

- బత్తుల జాలమ్మ, పింఛన్ లబ్ధిదారు

బాపట్ల జిల్లా చినగంజాం మండలం కొత్తగొల్లపాలెంలో పింఛనుదారు బత్తుల జాలమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో ఎంపీ కృష్ణప్రసాద్, మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

### మాకిక భయం లేదు



"ముఖ్యమంత్రి నేరుగా మా ఇంటికి వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ బాధ్యత తీసుకుంటానని ఆయన భరోసా ఇవ్వడంతో మాకు కొండంత ధైర్యం వచ్చింది. నా భర్త కొంతకాలం క్రితం చనిపోయారు. నా పెద్ద కుమార్తె మానసిక వికలాంగురాలు. ఆమెకు ప్రభుత్వం రూ. 15 వేలు పింఛను ఇస్తోంది. ఇక మాకు భయం లేదు. చాలా ఆనందంగా ఉంది."

- వడ్లమూడి సుభాషిణి, లబ్ధిదారు

# మా పింఛన్ల ముందు ఆ బటన్లెంత?

(మొదటి పేజీ తరువాయి)

పంపిణీలోను, పీ 4 లబ్ధిదారులతో జరిగిన కార్యక్రమంలోను పాల్గొన్నారు. ఆ గ్రామంలో ఏర్పాటుచేసిన ప్రజావేదికలో స్థానికులతో సీఎం మాట్లాడారు. అనంతరం స్థానిక టీడీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి గురించి ఆయన మాట్లాడారు. 'నేను అమరావతిలో ఏసీ రూంలో కూర్చుంటే నేతలు కూడా బద్ధకిస్తారు. అందుకే నేనే ముందుండి క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నాను. సైన్యాధిపతి ముందుంటేనే విజయం వరిస్తుంది." అని వ్యాఖ్యానించారు. పింఛన్ల పంపిణీకి కొత్తగొల్లపాలెం గ్రామాన్ని ఎంచుకోవడానికి కారణం ఉందని తెలిపారు. "ఈ గ్రామంలో ప్రతి ఎన్నికల్లోనూ టీడీపీయే గెలిచింది. మొత్తం జనాభాలో 95 శాతం యాదవ సామాజిక వర్గం ఉంది. వీరు మా పార్టీకి ఆది నుంచీ అండగా ఉంటున్నారు. అందుకే ఈ గ్రామాన్ని ఎంచుకున్నా. నాకు ప్రజలే ముందు...ఆ తర్వాతే మిగిలినవన్నీ" అని స్పష్టం చేశారు. పింఛన్ల పంపిణీలో భాగంలో దివ్యాంగురాలైన వడ్లమూడి సుభాషిణి, వితంతువు బత్తుల జాలమ్మ ఇళ్లకు వెళ్లి పింఛన్ అందించారు. అనంతరం గ్రామంలోని దేవాలయాన్ని సందర్శించిన పెద్దగొల్ల పూజారి ఆశీస్సులు తీసుకున్నారు. ఊరి స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

### పేదల ఎదుగుదలకు అడ్డొస్తే సహించను

"పింఛన్లు అందించడానికి గ్రామంలో ఇద్దరి ఇళ్లకు వెళ్లా. వారిలో ఒకరు మంచంలో ఉన్నారు. మరొకరు కుటుంబానికి ఆధారమైన పెద్ద దిక్కును కోల్పోయారు. వారి కష్టాలు కదిలించాయి. వెంటనే ప్రభుత్వం వైపు నుంచి వారికి అందే అన్ని పథకాలను వెంటనే ఇవ్వాలని ఆదేశించా. ఆ కుటుంబాలకు పింఛనే ఆధారం. మానవత్వంతో ఆలోచించి పింఛన్ సొమ్ము పెంపు నిర్ణయాన్ని తీసుకున్నా. రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల మందికి పెరిగిన పింఛన్లు అందుతున్నాయి. పేదరిక నిర్మూలనలో భాగంగానే పింఛన్ సొమ్మును పెంచి అందిస్తున్నాం. పేదలను అన్నివిధాల పైకి తేవడమే లక్ష్యంగా పీ4కు రూపకల్పన చేశాం. సంకల్పంతో, నిండు మనసుతో ఆ కార్యక్రమాన్ని తీసుకున్నాం. దానిపై ఇష్టారీతిన విమర్శలు చేస్తే సహించేది లేదు. కళ్లుంటే చూడండి. మనసుతో ప్రభుత్వం చేస్తున్న మంచి గురించి ఆలోచించండి. అంతేగానీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడతామంటే కుదరదు. చేతనైతే ఈ కార్యక్రమంలో భాగస్వాములు కండి. అంతేగానీ రాళ్లు వేసే పనిచేసి పేదల ఎదుగుదలకు అడ్డు రావద్దు."

### చిల్లర వేషాలేస్తే సహించను

- ప్రజావేదికలో అల్లరిమూకలకు సీఎం వార్నింగ్

సీఎం చంద్రబాబు ప్రజావేదికలో మాట్లాడుతుండగా, దూరం నుంచి ఒకరిద్దరు గొడవకు ప్రయత్నించారు. ఆ అల్లరి మూకపై సీఎం తీవ్ర స్వరంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీ సమస్య ఏమిటో చెప్పండి. నేను వింటాను. కానీ, రాజకీయ పార్టీల ప్రోద్బలంతో ఇలాంటి చిల్లర వేషాలు వేస్తే సహించను. 43 ఏళ్ల రాజకీయ అనుభవం నాది. ఆవలిస్తే పేగులు లెక్కబెడతా" అంటూ వారిని హెచ్చరించారు. కాగా, కొత్తగొల్లపాలెం గ్రామంలో పింఛన్లు అందించే కార్యక్రమంలో చంద్రబాబు గతానికి కంటే భిన్నంగా కనిపించారు. రోడ్డు వెంబటి నిలుచుని వినతులు ఇవ్వబోయిన వారిని "అందరూ ప్రజావేదిక వద్దకు మీటింగ్‌కు రండి. అక్కడ మాట్లాడుకుందాం' అని తెలిపారు. ప్రజావేదికలో బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథిని గ్రామస్థులకు చంద్రబాబు పరిచయం చేశారు. "ఈయనది కూడా మీ కులమే (యాదవులు). కష్టపడి పైకొచ్చి ఈ స్థాయిలో ఉన్నారు. మీరంతా ఇలాగే ఎదగాలి" అన్నారు.

### సంపద సృష్టిస్తా.. పేదలకు పంచుతా...

"అమరావతికి పునర్ వైభవం తెస్తాం. 2027 కల్లా పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం చేపడతాం. గత ప్రభుత్వం దివాలా తీయించిన విశాఖ ఉక్కును గాడినపెట్టాం. విశాఖకు రైల్వే జోన్ సాధించాం. రోడ్ల మీద గుంతలు పూడ్చాం. డీఎస్సీ ద్వారా జూన్ నెలాఖరులోగా పెద్దఎత్తున టీచర్ పోస్టులను భర్తీచేస్తాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుచేశాం. మంచి సంకల్పంతో పీ4 కార్యక్రమం చేస్తున్నాం. సమాజంలో టాప్‌లో ఉన్న పది శాతం మంది, దిగువన ఉన్న 20 శాతం మందిని సామాజిక బాధ్యతగా పైకి తీసుకురావడమే ఈ కార్యక్రమం. 2029 నాటికి జీరో పావర్టీ రాష్ట్రాన్ని చూడాలన్నదే నా లక్ష్యం" అని చంద్రబాబు తెలిపారు.



వడ్లమూడి సుభాషిణికి పెన్షన్ అందజేస్తున్న సీఎం

### సంపన్నులు సహకరిస్తే రాష్ట్రమే బంగారు కుటుంబం..

- పీ 4 కార్యక్రమంలో సీఎం వ్యాఖ్య..
- ఎమ్మెల్యే, కలెక్టరుపై చిరుకోపం

ఆర్థిక పటిష్ఠత ఉన్నవారు పీ4 కార్యక్రమానికి సహకరిస్తే రాష్ట్రమే బంగారు కుటుంబం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. బాపట్ల జిల్లా చిన గంజాం మండలం కొత్తగొల్లపాలెంలో 10 బంగారు కుటుంబాలను (పేద కుటుంబాలు), ఇద్దరు మార్గదర్శకులను (సంపన్నులు) ప్రజావేదికకు ఆయన పరిచయం చేశారు. చినగంజాం మండలం గొనసపూడి గ్రామానికి చెందిన లీడింగ్ ఫార్మ సూటికల్ కంపెనీ యజమాని విక్రమ్ నారాయణరావు, పర్చూరు మండల పరిధిలోని ఇంకొల్లు గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత్త వసంత శ్రీనివాసరావులు మార్గదర్శకులుగా ముందుకువచ్చారు. కొత్తగొల్లపాలెంలో 10 కుటుంబాలను ఆదుకునేందుకు వారు సుముఖత చూపారు. కొత్తగొల్లపాలెంకు చెందిన బంగారు కుటుంబ మహిళ అంకమ్మ భర్త చనిపోయాడు. కుమారుడు గణేశ్‌ను పెట్టుకుని జీవిస్తున్నానని ఆమె తెలపగా, గణేశ్‌ను వేదికపైకి సీఎం పిలిపించారు. భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నావని అడగ్గా, గణేస్ సాఫ్ట్‌వేర్ అని చెప్పారు. గణేశ్‌ను 'మార్గదర్శకులు' ఆ రంగంలో తీర్చిదిద్దుతారని సీఎం అన్నారు. కాగా, పీ4 అర్హత కలిగిన పది కుటుంబాల్లో నలుగురు సభలో కనిపించకపోవడంతో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కలెక్టర్ వెంకటమురళిపై సీఎం చిరుకోపం ప్రదర్శించారు. హార్డ్‌గా కాదు, స్మార్ట్‌గా పని చేయాలని సూచించారు.

# కాకినాడ పోర్టులో 40% వాటా లాక్కున్నారు



వైసీపీ సర్కారుపై లోక్‌సభలో ఎంపీ లావు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): 'కాకినాడ పోర్టు విలువ సుమారు రూ.2,500 కోట్లు. దానిలో 40% వాటాను గత వైసీపీ సర్కారు బలవంతంగా రూ.494 కోట్లకు తీసుకుంది' అని టీడీపీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు ఆరోపించారు. మంగళవారం లోక్‌సభలో కోస్టల్ షిప్పింగ్ బిల్లు 2024పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'కాకినాడ పోర్టు ఆస్తులను రక్షించాల్సిన అవసరం ఉంది. లేకపోతే సముద్ర వాణిజ్యం దెబ్బతింటుంది. కాకినాడ పోర్టు లావాదేవీలను ఎలా నిర్వహించారో కేంద్రం పరిశీలించాలి. ఇలాంటి లావాదేవీలు జరిగినప్పుడు పోర్టులో పని చేసే చాలామంది ప్రజలు, ఉద్యోగులు ప్రభావితమవుతున్నారు. అందుకని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమాచారమివ్వాలి. కోస్టల్ షిప్పింగ్ రంగం అభివృద్ధికి బలమైన భద్రతా యంత్రాంగంతో పాటు నౌకాశ్రయ ఆస్తులను సంరక్షించాల్సిన అవసరం ఉంది. 100-150 ఏళ్లుగా ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ గుంటూరు జిల్లా మీదుగా చెన్నై వరకు వెళ్తుంది. దీన్ని అభివృద్ధి చేస్తే షిప్పింగ్, సముద్ర రవాణా ఖర్చులు తగ్గుతాయి. దీనిని పరిగణనలోకి తీసుకోవాలి' అని ఎంపీ లావు కోరారు.




బాధ్యతలు చేపట్టిన తర్వాత మంత్రి సత్య కుమార్‌తో ఏపీ మెడికల్ కౌన్సిల్ పాలకవర్గం

# వ్యాపారంగా మారిన వైద్యం

- వైద్యులు సేవాభావంతో పని చేయాలి
- గర్భిణులకు అవసరం లేకుండా సిజేరియన్లు
- రోగుల ఆలోచన విధానంలో కూడా మార్పు రావాలి
- ఏపీఎంసీ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి సత్యకుమార్

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): 'ఇప్పుడు వైద్యం కొన్ని ప్రాంతాల్లో వ్యాపారంగా మారింది. 'సేవా భావంతో చేయాల్సిన పని బిజినెస్ అయింది' అని ఆరోగ్య మంత్రి సత్యకుమార్ అన్నారు. మంగళవారం ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్(ఏఎంసీ) నూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్లు జి.సుజాత, కె.వెంకట సుబ్బనాయుడు, డి.శ్రీహరి, స్వర్ణగీత, ఎస్.కేశవరావుబాబు, సి.మల్లేశ్వరి ఏఎంసీ సభ్యులుగా మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. 'వైద్యుల్ని దేవుళ్లతో పోలుస్తారు. దేవుడు ప్రాణం పోస్తే, వైద్యుడు ప్రాణం నిలబెడతాడు. వైద్య వృత్తిలో విలువలు పలుచబడాయి. డాక్టర్లు నైతిక విలువలు పాటించాలి. ఎక్స్‌రే, సీటీ స్కానింగ్, ఎంఆర్ఐలు రోగులకు అవసరం లేకుండా తీస్తున్నారు. చివరికి గర్భిణులకు సాధారణ ప్రసవాలు చేయడం మానేశారు. డెలివరీ సమయంలో అవసరం లేకపోయినా సిజేరియన్ చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు వైద్యులు సాధారణ ప్రసవాలు చేస్తే బాగుంటుంది. వైద్యం విషయంలో ప్రజలు ఆలోచన విధానం మారాలి. అనేక పరీక్షలు చేస్తేనే డాక్టరు తమను సరిగ్గా చూసినట్లు ప్రజలు అపోహపడుతున్నారు. అలాంటి వారికి వైద్యులే అవగాహన కల్పించాలి. వైద్యులు తమ వద్దకు వచ్చిన పేషెంట్లను చిరునవ్వుతో పలకరించాలి. పేద రోగులపై ఆర్థిక భారం పడకుండా చూసుకోవాలి. రాష్ట్రంలో ఉన్న వైద్యులంతా తమ సర్టిఫికెట్లను ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌లో రెన్యువల్ చేసుకోవాలి. నూతన కౌన్సిల్ దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఏపీఎంసీకి మరో నలుగురు ఎక్స్ అఫీషియో మెంబర్లు, 13 ఎలక్టెడ్ మెంబర్లను ఎన్నుకోవాల్సి ఉంది. మొత్తం 23 మంది సభ్యులు ఏపీఎంసీలో ఉంటారు. మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక జరగాల్సి ఉంది' అని మంత్రి సత్యకుమార్ అన్నారు. ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్‌కు(ఎఫ్ఎంజీలకు) రిజిస్ట్రేషన్‌కు సమస్యలున్నాయి. గ్రాడ్యుయేట్స్ విషయంలో ఎన్ఎంసీ నిబంధనలు అమలు చేయాలి. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల్ని ఏపీఎంసీ కచ్చితంగా అమలు చేయాలి' అని మంత్రి అన్నారు.

### ఆంధ్రకు జగన్ ఒక పర్యాటక అతిథి: మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): 'ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 10 నెలల పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోంది. అలాంటి ఆంధ్రప్రదేశ్‌కు మాజీ ముఖ్యమంత్రి జగన్ ఒక పర్యాటక అతిథిలా వచ్చి వెళుతున్నారు' అని మంత్రి సవిత అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో మంగళవారం ఆమె ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో తప్పు చేసిన వారికి భయం పట్టుకుంది. ఆ భయంతో కొందరు బాత్‌రూంలలో జారి పడుతున్నారు. మరికొందరు ఆస్పత్రులకు, ముంబయికి పారిపోతున్నారు. అవినీతికి పాల్పడినవారి విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది. అవినీతికి పాల్పడినవారు ఎక్కడున్నా బయటకు తీస్తాం. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వైసీపీ మాజీ మంత్రుల అవినీతి చిట్టా బయటకు వస్తుంది. దోచుకున్న సొమ్మును రికవరీ చేసి, ప్రజలకు అంకితం చేస్తాం. జగన్ పార్టీ పని అయిపోయింది. కాంగ్రెస్ పిలుస్తుందా..! లేక మనమే జంప్ అవుదామా? అని జగన్ ఆలోచిస్తున్నారు' అని మంత్రి సవిత విమర్శించారు.

# హైదరాబాద్‌లో విదేశీ యువతిపై అత్యాచారం

- నిందితుడు అస్లాంను అరెస్టుచేసిన పోలీసులు

హైదరాబాద్‌సిటీ/పహాడీషరీఫ్/సరూర్ నగర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను చూద్దామని హైదరాబాద్‌కు వచ్చిన విదేశీ యువతిపై ఓ కారు డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. మీర్‌పేట ప్రాంతానికి చెందిన యువకుడు ఇటలీలో ఉన్నత చదువులు చదువుతున్నాడు. అతనికి గత ఏడాది జర్మనీకి చెందిన యువతి, యువకుడితో స్నేహం ఏర్పడింది. మీర్‌పేట యువకుడు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల గురించి తరచూ తన స్నేహితులతో చెప్పుండేవాడు. దాంతో వారు హైదరాబాద్ వస్తామని చెప్పేవారు. ఈ నేపథ్యంలో జర్మనీ యువతి, యువకుడు గత నెల 4న హైదరాబాద్ వచ్చారు. మీర్‌పేటలోని స్నేహితుడి ఇంట్లో ఉంటూ పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. సోమవారం రంజాన్ రోజున స్థానికంగా కూరగాయల సంత చూద్దామని జర్మనీ యువతి, యువకుడు సాయంత్రం 6:30 సమయంలో బయటకు వచ్చారు. అదే సమయంలో మహ్మద్ అబ్దుల్ అస్లాం అనే వ్యక్తి ఐదుగురు మైనర్లతో ఎకారుకు బయల్దేరాడు. రోడ్డుమీద ఉన్న విదేశీయులిద్దర్నీ చూసి కారు ఆపాడు. అస్లాంకు గతంలో దుబాయ్‌లో కారు డ్రైవర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో ఇంగ్లిష్‌లో మాట్లాడి పరిచయం చేసుకున్నాడు. వారు దగ్గరలోని కూరగాయల సంతకు వెళ్లాలని చెప్పడంతో తీసుకెళ్తానని కారెక్కించుకున్నాడు. కొద్దిదూరం వెళ్లగానే కారులో పెట్రోల్ పోయించి కొన్ని ముఖ్యమైన ప్రదేశాలు చూపిస్తానంటూ నమ్మించి మామిడిపల్లివైపు తీసుకెళ్లాడు. అక్కడ అందరికీ ఫొటోలు తీస్తానని చెప్పి కారులోంచి దింపాడు. ఫొటోలు తీసిన తర్వాత జర్మనీ యువకుడితో సెల్ఫీలు దిగండి... తాను ఇప్పుడే వస్తానంటూ మైనర్లకు చెప్పి.. ఆ యువతిని కారులో ఎక్కించుకుని కొద్ది దూరంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఆ యువతిని బెదిరించి కారులోనే అత్యాచారానికి పాల్పడ్డాడు. తిరిగి మైనర్లు ఉన్న చోటుకు వస్తున్న క్రమంలో కారును స్లో చేయగా.. ఆ యువతి కారులోంచి దూకేసి జరిగిన దారుణాన్ని తన స్నేహితుడికి చెప్పింది. వెంటనే ఇద్దరూ ఆటోలో మీర్‌పేటకు చేరుకుని స్థానిక స్నేహితుడిని కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన జరిగిన ప్రాంతం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది. డీసీపీ సునీతారెడ్డి పర్యవేక్షణలో పోలీసులు సీసీటీవీ కెమెరాల సాయంతో నిందితుడు యాకత్పురాకు చెందిన అస్లాంను గుర్తించి.. అరెస్టు చేశారు.

### అధికారి అహంకారం

# ఖరీదు 11 కోట్లు!



(మొదటి పేజీ తరువాయి)

సవరించి పెంచాలని ఓ అధికారిని కాంట్రాక్టర్ కోరారు. నిబంధనల ప్రకారం ఫీజులు పెంచితే సరిపోయేది. కానీ, 2015లో నాటి ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారి అహంకారానికి పోయారు. ఇంకేదో మనసులో పెట్టుకొని కాంట్రాక్టర్‌తో లడాయికి దిగారు. దీంతో సదరు కాంట్రాక్టర్ న్యాయపోరాటం చేశారు. నగర స్థాయి కోర్టు నుంచి సుప్రీం కోర్టు దాకా పోరాడారు. అన్నిచోట్ల ఆర్‌అండ్‌బీ అధికారి వాదన వీగిపోయింది. ప్రభుత్వ పరువూ పోయింది. అంతేకాదు, కాంట్రాక్టర్‌కు 2015 నాటి బకాయిలను అసలు, వడ్డీలతో కలిపి చెల్లించాలని దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఫలితంగా వడ్డీలతో కలిపి రూ.8.94 కోట్లను ఈనెల 15 నాటికి చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. లేదంటే 15వ తేదీన విజయవాడలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని అమ్మకానికి పెట్టయినా సొమ్ములు సిద్ధం చేయాలని కోర్టు ఆదేశించింది. ఇక, ఈ న్యాయపోరాటంలో ఆర్‌అండ్‌బీ చేసిన ఖర్చు రూ.2.06 కోట్లపైమాటే. వెరసి మొత్తం ప్రభుత్వంపై రూ.11 కోట్ల భారం పడింది.

### విషయం ఏంటంటే

హైదరాబాద్-గుంటూరు మార్గం పూర్వం స్టేట్ హైవే-2(ఇప్పుడు ఎన్‌హెచ్-167 ఏజీ)గా ఉండేది. ఈ రోడ్డులో నాలుగు హైలెవల్ వంతెనల కాంట్రాక్టును హైదరాబాద్‌కు చెందిన కాంటెక్ సిండికేట్ ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకుంది. బిల్డ్ ఆపరేట్ ట్రాన్సిట్(బీఓటీ) విధానంలో చేపట్టింది. 2003లో ఒప్పందం చేసుకుని 2004 జూలై 12న పనులు పూర్తిచేసింది. టోల్ ఫీజుల వసూలు కాలపరిమితి 2004 నుంచి 2015 వరకు ఉండేలా ఒప్పందం కుదిరింది. టోల్ కాల వ్యవధిలో హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ ప్రకారం పెరిగిన ధరలను బట్టి టోల్ ఫీజులు పెంచాలి. ఒప్పందంలోనే ఈ అంశం ఉంది. పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని 2013లో టోల్ ఫీజులను సవరించి పెంచాలని ఆర్‌అండ్‌బీని కాంట్రాక్టు సంస్థ కోరింది. దీనికి ఆనాటి ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారి ఒకరు అంగీకరించలేదు. ఒప్పందంలోని అంశాలను చూడకుండానే విన్నపాన్ని బుట్టదాఖలు చేశారు. దీంతో నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ ఆర్బిట్రేషన్‌కు వెళ్లారు. పెరిగిన ధరల మేరకు టోల్ ఫీజులు లేకపోవడంతో తమకు భారీ నష్టం జరిగిందని, దీనిని భర్తీ చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. కాంట్రాక్టర్‌కు నష్టపరిహారం చెల్లించాలని ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును ఆర్‌అండ్‌బీ 2019లో కమర్షియల్ కోర్టులో సవాల్ చేసింది. అయినా ఫలితం దక్కలేదు. ట్రిబ్యునల్ ఉత్తర్వులు అమలు చేయాలని కమర్షియల్ కోర్టు కూడా ఆదేశాలు ఇచ్చింది. లేనిపక్షంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని(గెస్ట్ హౌజ్)ను అటాచ్ చేయాల్సి ఉంటుందని హెచ్చరించింది.

### 15 తుది గడువు!

ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుతోపాటు కమర్షియల్ కోర్టు ఆదేశాలను 2020లో ఆర్‌అండ్‌బీ హైకోర్టులో అప్పీల్ చేసింది. అయితే.. అక్కడ కూడా ఆర్‌అండ్‌బీ వాదన వీగిపోయింది. కాంట్రాక్టర్‌కు నష్టపరిహారం చెల్లించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేస్తూ.. ఆర్‌అండ్‌బీ పిటిషన్‌ను 2021, నవంబరులో డిస్మిస్ చేసింది. దీంతో గతంలో హెచ్చరించినట్లుగానే ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌ను కమర్షియల్ కోర్టు తన అటాచ్‌మెంట్ లిస్టులో చేర్చింది. కానీ, ఏ చర్యలు తీసుకోకుండా బిల్లుల చెల్లింపునకు ఆర్‌అండ్‌బీకి చివరి అవకాశం ఇచ్చింది. ఇక, ఇంత జరిగినా ఆర్‌అండ్‌బీ వెనక్కి తగ్గకపోగా.. చివరి ప్రయత్నంగా 2022లో సుప్రీంకోర్టు మెట్లెక్కింది. కానీ, అక్కడా ఓటమిని మూటకట్టుకుంది. స్థానిక కమర్షియల్ కోర్టు ఇచ్చిన ఆదేశాన్నే అనుసరించాలని పేర్కొంటూ ఆర్‌అండ్‌బీ వేసిన పిటిషన్‌ను 2024, అక్టోబరు 18న డిస్మిస్ చేసింది. దీంతో కాంట్రాక్టర్ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విజయవాడలోని స్పెషల్ కమర్షియల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు చరిత్ర, పర్యావసనాలను పరిశీలించిన కోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. కాంట్రాక్టరుకు టోల్ ఫీజు పెంచకపోవడం వల్ల జరిగిన నష్టం, అసలు, వడ్డీతో కలిపి రూ.8.94 కోట్లను చెల్లించాలని ఆర్‌అండ్‌బీని గత నెల 25న ఆదేశించింది. లేనిపక్షంలో సీపీసీలోని సెక్షన్ 21, రూల్ 64(1) కింద విజయవాడలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌ను ఏప్రిల్ 15న అమ్మకానికి పెట్టాల్సి ఉంటుందని హెచ్చరించింది. అంటే, ఏప్రిల్ 15లోగా కాంట్రాక్టర్‌కు ఆర్‌అంబీ 8.94 కోట్లు చెల్లించాలి. లేనిపక్షంలో ఈ నెల 15న గెస్ట్‌హౌజ్ కమర్షియల్ కోర్టు నియంత్రణలోకి వెళ్తుంది. ఆ భవనాన్ని కోర్టు అమ్మకానికి పెట్టి, వచ్చిన డబ్బును కాంట్రాక్టర్‌కు చెల్లిస్తుంది.

### ఆర్‌అండ్‌బీలో ఇదే చర్చ

ఈ పరిణామం ఆర్‌అండ్‌బీ అధికారులను విస్మయానికి గురిచేసింది. 2013లో ఓ అధికారి చేసిన పొరపాటుకు ఇప్పుడు రూ.కోట్ల భారం మోయాల్సి వస్తోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోర్టు తీర్పు విషయాన్ని ఇప్పటికే ఆర్‌అండ్‌బీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారని తెలిసింది. ఇప్పుడు హైకోర్టులకు వెళ్లే అవకాశం కూడా లేకపోవడంతో ఈ నెల 15లోపు డబ్బులైనా కట్టాలి. లేదంటే అతిథి గృహాన్నయినా వదులుకోవాల్సిందేనని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇకనైనా అధికారులు తమ సొంత పంతాలు, పట్టింపులు, అహంకారాలకు పోకుండా చట్టం, నిబంధనలు, ఒప్పందాల ప్రకారం నడుచుకుంటే మేలని ఆర్‌అండ్‌బీ వర్గాలు సూచిస్తున్నాయి.

## యువకుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన మహిళ

- తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని ఆరోపణ
- బాధితుడికి తీవ్ర గాయాలు.. జీజీహెచ్‌కు తరలింపు

క్రోసూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న ఆగ్రహంతో యువకుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిందో మహిళ. తీవ్రంగా గాయ పడిన యువకుడు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందన గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తమ్మిశెట్టి చిరంజీవి అనే యువకుడు కొంత కాలంగా తనపై తప్పుడు ప్రచారం, అసభ్యకరంగా ప్రవర్తించటం వంటివి చేస్తున్నాడని గ్రామానికి చెందిన దేవళ్ల లక్ష్మి అనే మహిళ ఆరోపిస్తూ వస్తోంది. ఈ క్రమంలో పలుమార్లు గ్రామస్థుల సమక్షంలో పంచాయితీ కూడా నడిచింది. గ్రామ పెద్దలు యువకుడిని మందలించారు కూడా. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం కూలీలను తీసుకు వెళ్లే ట్రాక్టర్‌పై కూర్చొని ఉన్న చిరంజీవిపై లక్ష్మి వెనుక నుంచి దాడి చేసి పెట్రోల్ పోసి నిప్పంటించింది. వెంటనే గమనించిన స్థానికులు మంటలను ఆర్పేశారు. తీవ్రంగా గాయపడిన అతడిని సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. కొంత కాలంగా తన పైనా, తన సోదరి పైనా చిరంజీవి తప్పుడు ప్రచారం చేస్తున్నాడని లక్ష్మి క్రోసూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనపై లక్ష్మి పెట్రోల్ పోసి నిప్పంటించిందని, తనను చంపటానికి ప్రయత్నించిందని చిరంజీవి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


తీవ్రంగా గాయ పడిన తమ్మిశెట్టి చిరంజీవి

## బర్డ్‌ఫ్లూతో రెండేళ్ల చిన్నారి మృతి

- వారం క్రితం చికిత్స పొందుతూ మృత్యువాత
- నరసరావుపేట పట్టణంలో ఘటన




గుంటూరు మెడికల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వైరస్ మళ్లీ కలకలం రేపింది. ఉమ్మడి గుంటూరు జిల్లా నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూ (ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా/హెచ్5ఎన్1) మరణం నమోదైంది. పట్టణంలోని బాలయ్య నగర్‌కు చెందిన పెండ్యాల జ్యోతి అనే రెండేళ్ల చిన్నారి బర్డ్‌ఫ్లూతో చనిపోయినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు మంగళవారం ధ్రువీకరించారు. గత నెలలో చిన్నారి అనారోగ్యానికి గురికావడంతో కుటుంబసభ్యులు ఆమెను చికిత్స కోసం మంగళగిరిలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. ఆ చిన్నారి అక్కడ చికిత్స పొందుతూ గత వారం ప్రాణాలు విడిచింది. అయితే బర్డ్‌ఫ్లూ లక్షణాలుగా అనుమానించిన వైద్యులు చిన్నారి శాంపిల్స్‌ను పుణెలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. ఈ పరీక్షల్లో జ్యోతికి బర్డ్‌ఫ్లూ పాజిటివ్‌గా నిర్ధారణైనట్టు వైద్యాధికారులు తెలిపారు.

## బాలికను చంపిన వ్యక్తికి ఉరిశిక్ష



- చోడవరం కోర్టు సంచలన తీర్పు
- సోదరి కుమార్తెను బీరు సీసాతో గొంతు కోసిన ఉన్మాది
- అక్క, బావ మందలించారనే కోపంతోనే ఘాతుకం

చోడవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వరుసకు మేనకోడలైన ఏడేళ్ల చిన్నారిని కిరాతకంగా బీరు సీసాతో గొంతు కోసి చంపిన వ్యక్తికి ఉరిశిక్ష విధిస్తూ అనకాపల్లి జిల్లా చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి కె.రత్నకుమార్ మంగళవారం సంచలన తీర్పు చెప్పారు. చోడవరం కోర్టు చరిత్రలోనే ఉరిశిక్ష విధించిన మొదటి కేసు ఇది. జిల్లాలోని దేవరాపల్లికి చెందిన వేపాడ మురుగన్, ధనలక్ష్మి దంపతుల కుమార్తె దివ్య(7) స్థానిక కాన్వెంట్‌లో రెండో తరగతి విద్యార్థిని. వీరి కుటుంబం స్థానికంగా చిన్న హోటల్ నిర్వహిస్తోంది. ధనలక్ష్మికి ప్రకాశం జిల్లా చీమకుర్తి ప్రాంతానికి చెందిన సుబ్బాచారి గుణశేఖర్ వరుసకు తమ్ముడు అవుతాడు. చీమకుర్తి ప్రాంతంలో గుణశేఖర్ గొడవలు పడుతుండడంతో అతడి తల్లి దేవరాపల్లిలో ఉన్న ధనలక్ష్మి వద్దకు అతడిని పంపించారు. దేవరాపల్లిలోనూ గుణశేఖర్ సక్రమంగా ఉండకపోవడంతో అతడిని ధనలక్ష్మి, మురుగన్ మందలించారు. దీంతో వారిపైనే గుణశేఖర్ కక్షగట్టాడు. 2015 డిసెంబరు 23వ తేదీ సాయంత్రం దివ్య స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన సమయంలో ఆమె తల్లిదండ్రులు ఇంట్లో లేరు. దీంతో గ్రామసమీపాన రైవాడ రిజర్వాయర్ వెనుకనున్న బిళ్లల కొండ ప్రాంతానికి దివ్యను గుణశేఖర్ తీసుకెళ్లి పగిలిన బీరు సీసాతో గొంతు కోసి చంపేశాడు. ఈ తీర్పు కిరాతకులకు హెచ్చరికలా ఉందని ధనలక్ష్మి పేర్కొన్నారు.

### చిన్నారులపై నేరాలకు మరణశిక్షలు

- గత ఎనిమిది నెలల్లోనే 97 కేసుల్లో కఠిన శిక్షల తీర్పులు
- పోలీసులకు డీజీపీ గుప్తా అభినందన

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): 'బాలికను దారుణంగా హత్య చేసిన వ్యక్తికి మరణశిక్ష. అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి పాతికేళ్ల జైలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారికి 20 ఏళ్లు, పదేళ్లు, ఏడేళ్లు ఇలా వరుస శిక్షలు పడుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 97 కేసుల్లో బాధ్యులకు శిక్షలు పడ్డాయి' అని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో గుణశేఖర్ సుబ్బాచారికి కోర్టు మరణ శిక్ష విధించిన సందర్భంగా కేసును దర్యాప్తు చేసిన పోలీసుల్ని డీజీపీ అభినందించారు. రాష్ట్రంలో చిన్నారులు, మహిళలపై నేరాలకు సంబంధించిన కేసుల్లో బాధ్యులు తప్పించుకోకుండా శిక్ష పడేలాఅన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేరం చేసిన వ్యక్తులను అరెస్టు చేయడమేగాక దర్యాప్తులోసాంకేతికతను వినియోగించి, సాక్ష్యాధారాలు సమర్థవంతంగా సేకరించి మానవ మృగాల్ని బయట లేకుండా జైళ్లకు పరిమితం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇటువంటి కేసుల్లో గడిచిన ఎనిమిది నెలల్లో ఏకంగా 97 మందికి కఠిన శిక్షలు పడేలా చేశామన్నారు. విజయనగరం నుంచి అన్నమయ్య జిల్లా వరకూ ఈ శిక్షలు పడ్డాయని, మరిన్ని జిల్లాల్లోనూ ఈ ఒరవడి మొదలైందని తెలిపారు.

## ఆ కండలన్నీ బిల్డప్పేనా..!

### స్టెరాయిడ్స్ వాడి బాడీ పెంచుతున్న యువత



- అనబాలిక్ డ్రగ్స్ విచ్చలవిడిగా వాడకం
- విజయవాడలో రహస్యంగా అమ్మకాలు
- ఆరోగ్యానికి ప్రమాదమని నిపుణుల హెచ్చరిక

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

నెలల తరబడి వ్యాయామం చేసినా పెరగని శరీర సౌష్ఠవం జిమ్‌లకు వెళ్లిన కొద్ది రోజులకే పెరిగిపోతోంది..! ఏళ్ల తరబడి చెమటోడ్చినా రాని సిక్స్ ప్యాక్.. నెలల వ్యవధిలోనే సాకారమవుతోంది..! దీనికి కారణం ఏమిటబ్బా అంటే అనబాలిక్ డ్రగ్స్ వాడకమే..! చెమటోడ్చి సహజసిద్ధంగా పెంచాల్సిన కండల కోసం కొందరు అనబాలిక్‌ను ఎంచుకుంటున్నారు. ఈ స్టెరాయిడ్లను రహస్యంగా ఉపయోగిస్తూ అసహజసిద్ధంగా కండలు పెంచుతూ.. తాము పెద్ద బాడీ బిల్డర్లమంటూ బిల్డప్ ఇస్తున్నారు. ఈ రోజుల్లో యువతకు ఫిట్‌నెస్‌పై అవగాహన పెరిగింది. డిగ్రీ చదువుతుండగానే ఎక్కువమంది జిమ్‌లకు వెళ్తున్నారు. అలాగే ప్రముఖులకు బౌన్సర్లుగా వ్యవహరించాలనుకునే వారు కూడా బాడీ బిల్డింగ్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. సిక్స్ ప్యాక్‌ల కోసం కొందరు, బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొనేందుకు మరికొందరు.. జిమ్‌ల్లో గడుపుతున్నారు. అయితే.. గంటలకొద్దీ జిమ్‌ల్లో చెమటోడ్చి బాడీ పెంచితే ఎలాంటి సమస్యా లేదు కానీ.. కొంతమంది మాత్రం అడ్డదారులు తొక్కుతున్నారు. విజయవాడ నగరంలో కొంతమంది అనబాలిక్ డ్రగ్స్‌ను వినియోగించి అతనికాలంలోనే కండలు పెంచుకుంటున్నారు. నగర యువతకు కొంతమంది అనబాలిక్ డ్రగ్స్‌ను రహస్యంగా విక్రయిస్తున్నారని తెలిసింది. ఇటీవలే ఔషధ నియంత్రణ మండలి అధికారులు, కమిషనరేట్‌లోని ఈగల్ టీం పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఆరోగ్యం కోసం వ్యాయామం అవసరమని వైద్యులు చెబుతుంటే.. తక్కువ రోజుల్లో ఎక్కువ కండలు పెంచుకోవడానికి అనబాలిక్ ఉందని జిమ్‌ల్లో కోచ్‌లు చెబుతున్నట్టు గుర్తించారు.

#### ఆరోగ్యంపై దుష్ప్రభావం: అనిల్‌కుమార్

జిమ్‌లకు వెళ్లే యువత త్వరగా బాడీ పెరగడానికి, సిక్స్‌ప్యాక్‌లు రావడానికి అనబాలిక్ డ్రగ్స్‌ను ఉపయోగిస్తున్నారని ఔషధ నియంత్రణ మండలి సహాయ సంచాలకుడు అనిల్ కుమార్ చెప్పారు. వయస్సు మీద పడినా బాడీ మాత్రం అలాగే ఉండడానికి కొంతమంది వాటిని వాడుతున్నారన్నారు. ఈ డ్రగ్స్ వాడడం వల్ల ఆరోగ్యం పాడైపోతుందని, ఇతర దుష్ప్రభావాలు కూడా ఉంటాయని హెచ్చరించారు. ఈ తరహా డ్రగ్స్ వాడకం వల్ల 30 ఏళ్లకే బ్లడ్ క్యాన్సర్, షుగర్, బీపీ వంటి సమస్యలు వస్తాయన్నారు. సంసార జీవితానికి కూడా పనికిరాకుండా పోతారని చెప్పారు.



#### ఢిల్లీ, పంజాబ్ నుంచి...

జిమ్‌ల్లో వ్యాయామం చేసే వారికి విక్రయిస్తున్న అనబాలిక్ డ్రగ్స్ దాదాపు 40 రకాల వరకు ఉన్నాయి. ఈ ఔషధాలను స్టెరాయిడ్స్‌గా వ్యవహరిస్తారు. వీటిని ఎక్కువగా ఢిల్లీ, పంజాబ్ ప్రాంతాల్లో తయారు చేస్తున్నట్టు ఔషధ నియంత్రణ మండలి అధికారులు గుర్తించారు. కొంతమంది అడ్డదారిలో డబ్బులు సంపాదించడం కోసం అక్కడి నుంచి ఈ ఔషధాలను విజయవాడకు తీసుకొస్తున్నట్టు సమాచారం అందింది. అత్యంత పరిచయస్తుల సిఫారసులతో వచ్చిన వారికి ఈ అనబాలిక్ డ్రగ్స్‌ను విక్రయిస్తున్నారు. దీనిపై ఔషధ నియంత్రణ మండలి అధికారులు పక్కాగా సమాచారం సేకరించారు. కొద్దిరోజుల క్రితం జరిగిన దాడుల్లో టెస్టోస్టెరాన్, స్టాంజోలోన్, ఇంజక్షన్లు, ప్రొటీన్ పౌడర్లు స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఉత్తరాది నుంచి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నట్టు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. అక్కడి నుంచి రూ.400-500లకు కొనుగోలు చేసిన పౌడర్లు, ఇంజక్షన్లను ఇక్కడ రూ.4-5వేలకు విక్రయిస్తున్నారు. అయితే ఈ అనబాలిక్ డ్రగ్స్‌ను ఎలాంటి ఫార్ములా లేకుండా తయారు చేస్తున్నారని ఔషధ నియంత్రణ మండలి అధికారులు తెలిపారు.

## కాకాణి నేరానికి పాల్పడ్డారు

- క్వార్ట్జ్ అక్రమాల కేసులో ఎస్సీ,ఎస్టీ చట్టం సెక్షన్లు
- దర్యాప్తునకు ఆయన సహకరించడం లేదు
- హైకోర్టుకు నివేదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్
- అరెస్టు నుంచి రక్షణ కోరిన కాకాణి న్యాయవాది



అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నేరానికి పాల్పడ్డారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ మంగళవారం హైకోర్టుకు నివేదించారు. నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టంలోని సెక్షన్లు చేర్చారని వివరించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లిఖార్జునరావు, ఆ అదనపు సెక్షన్ల వివరాలను మెమో రూపంలో కోర్టు ముందు ఉంచాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించారు. పిటిషన్‌లో వాదనలు వినిపించేందుకు వీలుగా ఆ వివరాలను పిటిషనర్‌కు అందజేయాలని ఆదేశిస్తూ విచారణను ఏప్రిల్ 3కు వాయిదా వేశారు. ఈ దశలో సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి స్పందిస్తూ, పిటిషనర్‌కు అరెస్ట్ నుండి రక్షణ కల్పించాలని అభ్యర్థించారు. తమ పిటిషన్‌ను నిరర్థకం చేసేందుకు ప్రాసిక్యూషన్ ప్రయత్నిస్తుందని విమర్శించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ... పిటిషనర్ దర్యాప్తునకు సహకరించడం లేదని, నోటీసులు ఇవ్వడానికి వెళ్తే ఇంటికి తాళం వేసి ఉందన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ... ప్రస్తుత ముఖ్యమంత్రి విషయంలో మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తే మీడియాకు ఎక్కి తనను అప్పట్లో విమర్శించారని గుర్తు చేశారు. ఎస్సీ-ఎస్టీ సెక్షన్ల కింద కేసు నమోదైనప్పుడు సంబంధిత ప్రత్యేక కోర్టు ముందు మాత్రమే బెయిల్ పిటిషన్లు దాఖలు చేసుకోవాలని ఇదే కోర్టులోని ఓ న్యాయమూర్తి ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చారన్నారు. పిటిషనర్‌పై ఎస్సీ-ఎస్టీ చట్టంలోని సెక్షన్లు చేర్చిన నేపథ్యంలో ఈ కోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపవచ్చా? లేదా? అనే విషయంలో వాదనలు వినిపించాలని సీనియర్ న్యాయవాదికి సూచించారు. ఈ విషయంలో సంతృప్తి చెందకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేనని స్పష్టంచేశారు. వైసీపీ హయాంలో నెల్లూరుజిల్లా పొదలకూరు మండలం వరదాపురం గ్రామపరిధిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అక్రమంగా క్వార్ట్జ్ ఖనిజాన్ని తవ్వి తరలించారని ఆ జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలాజీనాయక్ ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా ఈ ఏడాది ఫిబ్రవరి 16న పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కాకాణి పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు కేసును కొట్టివేయాలన్న కాకాణి వేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణను కూడా న్యాయమూర్తి గురువారానికి వాయిదా వేశారు.

### అట్రాసిటీ కేసు

- గిరిజనులను బెదిరించారనే ఫిర్యాదు మేరకే!
- మరింత బిగుసుకున్న క్వార్ట్జ్ కేసు

నెల్లూరు క్రైం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదయ్యింది. ఇప్పటికే నమోదైన క్వార్ట్జ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ పోలీసులు రెండుసార్లు నోటీసులు ఇచ్చారు. అయితే ఆయన విచారణకు హాజరుకాలేదు. ఈ క్రమంలో పొదలకూరు మండలం మహమ్మదాపురంలోని రుస్తుం మైన్స్‌లో జెలిటిన్ స్టిక్స్ పేల్చే క్రమంలో గిరిజనులు అడ్డుకోవడంతో వారిని కాకాణి బెదిరించారన్న ఫిర్యాదుపై క్వార్ట్జ్ కేసులోనే అట్రాసిటీ కేసు కూడా యాడ్ చేస్తూ.. మంగళవారం కేసు నమోదు చేశారు. మరోవైపు హైదరాబాద్‌లోఉన్న కాకాణి గురువారం నెల్లూరు వస్తారని ప్రచారం జరుగుతోంది. దీనిపై తమకు ఎలాంటి సమాచరం లేదని పోలీసులు చెబుతున్నారు. కాకాణిపై అట్రాసిటీ కేసు కూడా నమోదైన నేపథ్యంలో ఆయనకు మళ్లీ నోటీసు ఇస్తారా.. లేదా నెల్లూరు చేరుకోగానే అరెస్టు చేస్తారా? అన్న ఉత్కంఠ నెలకొంది.

### సీఐడీ కస్టడీకి వంశీ అనుచరుడు రంగా

- 3 రోజులు అనుమతిచ్చిన విజయవాడ కోర్టు
- టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో విచారణ

విజయవాడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వల్లభనేని వంశీ అనుచరుడు, ప్రధాన నిందితుడు ఓలుపల్లి మోహన రంగారావు అలియాస్ రంగాను మూడు రోజుల పాటు సీఐడీ కస్టడీకి ఇస్తూ విజయవాడ మూడో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు అనుమతి ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రంగా విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. దాడికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించడానికి రంగాను పది రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని సీఐడీ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఇరువర్గాల వాదనలను విన్న న్యాయస్థానం బుధవారం నుంచి మూడు రోజుల పాటు కస్టడీకి అనుమతి ఇచ్చింది. కాగా, టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాది ముదునూరి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన కేసులో నలుగురు నిందితులు వెలినేని శివరామకృష్ణప్రసాద్, నిమ్మ చలపతి, గంటా వీర్రాజు, వేల్పూరి వంశీబాబుల బెయిల్‌పై విజయవాడ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించాల్సి ఉంది. న్యాయాధికారి హిమబిందు సెలవులో ఉండడంతో తీర్పును బుధవారానికి వాయిదా వేశారు. ఇప్పటికే ఈ కేసులో ఏ1గా ఉన్న వల్లభనేని వంశీ బెయిల్‌ను కోర్టు తిరస్కరించింది.

#### భూకబ్జా కేసు రేపటికి వాయిదా

గన్నవరంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న స్థలాన్ని వంశీ అనుచరులు బెదిరించి లాక్కున్నారని నమోదైన కేసు విచారణను మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వంశీ తనకు బెయిల్ మంజూరు చేయాలని ఇప్పటికే పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదనలు జరుగుతున్నాయి. కేసులో ఫిర్యాదిగా ఉన్న సుంకర సీతామహాలక్ష్మి తరఫున వాదనలు వినిపించడానికి తనను అనుమతించాలని సీనియర్ కౌన్సిల్ కిలారు బెనర్జీ కోర్టులో మంగళవారం వకాల్తా దాఖలు చేశారు.

### సత్తెనపల్లి కోర్టుకు నందిగం



సత్తెనపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణకు బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్ మంగళవారం హాజరయ్యారు. అమరావతి పోలీసు స్టేషన్‌లో గతంలో నమోదైన కేసులో బెయిల్ గడువు ముగియటంతో ఆయన కోర్టుకు హాజరయ్యారు. అయితే సమన్లు వచ్చిన తర్వాత హాజరవ్వాలని పేర్కొంటూ విచారణను కోర్టు వాయిదా వేసిందని సురేశ్ తరఫు న్యాయవాది సుబ్బారెడ్డి తెలిపారు.

## విచారణకు హాజరవ్వాల్సిందే

- గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ ప్రభావతికి సుప్రీం ఆదేశం
- 7, 8 తేదీల్లో దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకండి
- విచారణకు సహకరిస్తామంటేనే మధ్యంతర రక్షణ కల్పించాం
- రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో ధర్మాసనం
- సుప్రీంకోర్టు చెప్పినా విచారణకు ప్రభావతి సహకరించడంలేదు
- కోర్టులో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఈనెల 7, 8 తేదీల్లో దర్యాప్తు అధికారి ఎదుట విచారణకు హాజరు కావాలని గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతిని సుప్రీంకోర్టు ఆదేశించింది. గత వైసీపీ హయాంలో అప్పటి ఎంపీగా ఉన్న తనను సీఐడీ కస్టడీలో తీవ్రంగా వేధించారంటూ గుంటూరులోని నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో రఘురామ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో నమోదైన కేసులో డాక్టర్ ప్రభావతి ఏ5గా ఉన్నారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆమె హైకోర్టును ఆశ్రయించగా నిరాశ ఎదురైంది. హైకోర్టు తీర్పును ప్రభావతి జనవరి 22న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ మంగళవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ప్రభావతి తరఫున సీనియర్ న్యాయవాది మాధవి దివన్ వాదనలు వినిపిస్తూ... రఘురామకు వైద్యం చేసే సమయంలో ముగ్గురు వైద్యులు అక్కడ ఉన్నారని చెప్పారు. పిటిషనర్ కుమారుడు మానసిక సమస్యతో బాధ పడుతున్నాడని, కావున బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు ఆదేశించినా ప్రభావతి విచారణకు సహకరించడం లేదన్నారు. దీనికి ప్రభావతి తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక్కసారి మాత్రమే విచారణకు పిలిచారని చెప్పారు. సిద్ధార్థ లూథ్రా స్పందిస్తూ, ప్రభావతికి ఎప్పుడు నోటీసులు పంపినా ఆమె అందుబాటులో లేరని చెబుతున్నారని తెలిపారు. ఏదో ఒకసాకు చూపి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. "దర్యాప్తునకు సహకరిస్తానని చెబితేనే న్యాయస్థానం ప్రభావతికి జనవరి 31న మధ్యంతర రక్షణ కల్పించింది. ఇప్పుడు ఆమె సహకరిస్తున్నారా? లేదా? అనే సమస్య ఉత్పన్నమైంది. ఏప్రిల్ 7, 8 తేదీల్లో ప్రభావతి విచారణకు హాజరుకావాలి" అని ధర్మాసనం ఆదేశించింది.

### వాళ్లిద్దరినీ ఇంటివద్దే విచారించండి

- సీఐడీ అధికారులకు హైకోర్టు ఆదేశం
- పిటిషనర్ల వయసు 60 ఏళ్లు పైబడిందన్న ధర్మాసనం
- మద్యం కుంభకోణం కేసులో స్వల్ప ఊరట

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో శార్వాణి ఆల్కో బ్రూ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు ఇ.చంద్రారెడ్డి, ఠాకూర్ కాళీ మహేశ్వర్ సింగ్‌లను న్యాయవాది సమక్షంలో వారి ఇంటి వద్దే విచారించాలని సీఐడీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్లు ఇరువురూ 60 ఏళ్లకు పైబడినవారని ధర్మాసనం గుర్తు చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం వ్యవహారంలో సాక్షులుగా తమ ముందు హాజరుకావాలని సీఐడీ అధికారులు నోటీసుల ఇచ్చారని, ఆన్‌లైన్ విచారణకు తాము చేసిన వినతిని తోసిపుచ్చడంతోపాటు అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని చంద్రారెడ్డి, మహేశ్వర్ సింగ్ మంగళవారం అత్యవసరంగా హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యాన్ని న్యాయమూర్తి లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించారు.

### సజ్జల భార్గవ్‌రెడ్డి ముందస్తు బెయిల్‌పై తీర్పు రిజర్వ్

- మరికొందరి పిటిషన్లపైనా ముగిసిన వాదనలు



అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో వైసీపీ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ సజ్జల భార్గవ్‌రెడ్డి, సింగిరెడ్డి అర్జున్‌రెడ్డి, మరికొందరు వైసీపీ సానుభూతిపరులు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. మంగళవారం ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పలువురు మంత్రులు, వారి కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాలలో అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టేలా వైసీపీ కార్యకర్తలను, సానుభూతిపరులను ప్రోత్సహించారనే ఆరోపణలతో రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో తమపై నమోదైన కేసులలో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సజ్జల భార్గవ్‌రెడ్డి, సింగిరెడ్డి అర్జున్‌రెడ్డి తదితరులు హైకోర్టులో పిటిషన్లు వేసిన విషయం తెలిసిందే.

### సంజయ్‌కు సుప్రీం నోటీసులు

- ఏసీబీ కేసులో ధర్మాసనం జారీ
- నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక విభాగంలో అవినీతి ఆరోపణలపై ఏసీబీ కేసులో ఆంధ్రప్రదేశ్ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆ కేసులో ఏపీ హైకోర్టు సంజయ్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు తీర్పును గత నెల 5న ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ అమానుల్లా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నిందితుడు బెయిల్‌పై ఉంటే కేసును ప్రభావితం చేసే అవకాశముందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌కు కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా సంజయ్‌కు సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. నాలుగు వారాల్లో ఆ నోటీసులకు సమాధానం చెప్పాలని ఆదేశించింది. ఈ కేసు మరోసారి మే 6న విచారణకు వచ్చే అవకాశముంది. కాగా, సంజయ్ అవినీతిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రభుత్వానికి రెండు వేర్వేరు నివేదికలు సమర్పించింది. అందులో పలు అంశాలు పేర్కొంది. అగ్నిమాపక శాఖలో నిరభ్యంతర పత్రాలు (ఎన్వోసీలు) ఆన్‌లైన్‌లో జారీ చేసేందుకు అగ్ని-ఎన్వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కాంట్రాక్టును సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు సంజయ్ అప్పగించారు. ఎలాంటి పనులూ జరగకపోయినా ఆ సంస్థకు రూ.59.93 లక్షల బిల్లులు చెల్లించేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టంపై సీఐడీ తరఫున దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల నిర్వహణ కాంట్రాక్టును క్రిత్వాప్ టెక్నాలజీస్‌కు ఇచ్చి, రూ.1.19 కోట్లు చెల్లించారు. సదస్సులు మొత్తం సీఐడీ అధికారులే నిర్వహించారు. క్రిత్వాప్ సంస్థ అసలు సదస్సులే నిర్వహించకపోయినా బిల్లుల పేరిట దోచేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.